# పాడనా తెనుగు పాట

పి.సుశీల చిత్రగీతాల వ్యాఖ్య



డా॥ కంపల్లె రవిచంద్రన్

Creative Links
PUBLICATIONS

# పాడనా తెనుగు పాట

## శ్రీమతి పి. సుశీల ఏకగళ గీతాలపై వ్యాఖ్య


రచన

**డా॥ కంపల్లె రవిచంద్రన్**



సంపాదకుడు

**మాటూరి సూరిబాబు**

క్రియేటివ్ లింక్స్ పబ్లికేషన్స్

హైదరాబాద్.

# పాడనా తెనుగు పాట

**శ్రీమతి పి. సుశీల ఏకగళ గీతాలపై వ్యాఖ్య**

**PAADANA TENUGU PAATA**

by Dr. Kampalle Ravichandran

**© రచయిత**

ప్రథమ ముద్రణ : జనవరి, **2018**

ప్రతులు : **1000**

వెల : **రూ. 200 / -**

ప్రచురణ :

**క్రియేటివ్ లింక్స్ పబ్లికేషన్స్**

1-8-725/ఎ/1, 103సి, బాలాజీ భాగ్యనగర్ అపార్ట్‌మెంట్స్,

నల్లకుంట, హైదరాబాద్ - 500044.

ఫోన్స్ : 98480 65658, 8885446222, 98485 06964

E-mail : creativelinkspublications@yahoo.com

రచయిత చిరునామా :

**డా॥ కంపల్లె రవిచంద్రన్**

3-1-55/1 , 1వ అంతస్తు,

4వ క్రాస్ (ఎడమ),

విద్యానగర్, తిరుపతి-2,

ఫోన్ : 9848720478.

ముఖచిత్ర రూపకల్పన : పెమ్మరాజు రవికిశోర్

ఈ పుస్తకం లభించే చోట్లు :

**క్రియేటివ్ లింక్స్**

**నవ తెలంగాణ బుక్ హౌస్** (అన్ని పట్టణ శాఖల్లో)

**నవచేతన పబ్లిషింగ్ హౌస్** (అన్ని పట్టణ శాఖల్లో)

**విశాలాంధ్ర బుక్ హౌస్** (అన్ని పట్టణ శాఖల్లో)

**నవోదయ బుక్ హౌస్**, కాచిగూడ, హైదరాబాద్

**తెలుగు బుక్ హౌస్**, కాచిగూడ, హైదరాబాద్

*హెచ్చరిక :* ఈ పుస్తకంలో ఏ భాగాన్ని కూడా ప్రచురణ కర్త నుండి ముందుగా రాతమూలకంగా అనుమతి పొందకుండా ఏ రూపంగా వాడుకున్నా, కాపీరైట్ చట్టరీత్యా నేరం.

# అంకితం



పెండ్యాల నాగేశ్వరరావు

**6.4.1917 - 30.8.1984**



నాడు విరిసిన అనురాగానికి ...

నేడు మురిసిన అనుబంధానికి ...

మేలిమి గురుతు యీ పాటల ప్రయాణం

# దీని వెనుక.....

ఎందరోసాహితీవేత్తలు, స్వరసారథులు, గాయనీగాయకులు సుదీర్ఘమైన తెలుగు చలనచిత్రసంగీతచరిత్రను సుసంపన్నం చేశారు. ఒకప్పుడు తమ పాటలు తామే పాడుకున్న "సింగింగ్ స్టార్స్" ప్రేక్షకుల హృదయాల్ని సుమధుర సంగీతశ్రోతస్వినిలో పూలపడవల్లాగా సాగిపోయేలా చేశారు.

తెలుగు సినీస్వర్ణయుగంగా చెప్పుకునే 1950,1960 దశకాల్లో ఎం.ఎస్.రామారావు, ఘంటసాల, ఏ.ఎం.రాజా, మాధవపెద్ది, పిఠాపురం, పి.బి.శ్రీనివాస్, రావుబాలసరస్వతీదేవి, లీల, జిక్కి, పి.సుశీల, ఎస్.జానకి, జమునారాణి, యస్.పి.బాలసుబ్రహ్మణ్యంలాంటివారి ప్రవేశంతో నేపథ్యగానం కొత్తపుంతలు తొక్కింది. తెరమీది పాత్రలే పాడుతున్నాయా? అని భ్రమింపజేసే లాగా సరికొత్త ప్రక్రియ ప్రత్యేకతను సంతరించుకుంది.

పి.సుశీల సుమారు ఆరు దశాబ్దాల పైబడిన కాలంలో తన స్వరముద్రను వేసిన వైనం ఓ మరపురానిచరిత్ర! నాటిరోజుల్లో ఆమె పాడిన పాటలు వింటుండే చెవుల్లో అమృతం పోసినట్లు ఉంటుంది. ఒకప్పుడు ఆవిడ పాటలేని తెలుగు సినిమా లేదు. ఆవిడ పాడ(లే)ని పాటంటూ లేదు. ఆనంద, విషాదాలు, భక్తి, శృంగారాలు, విరహం, వేదన, అల్లరి, అలరింపు, జోల- ఇలా అన్నిరసాలనూ అవలీలగా ఆవిష్కరించిన ఆ గళం పేరే పి.సుశీల! దక్షిణభారతదేశంలో మాత్రమే కాదు యావద్భారతదేశం ఆమె పాటల్లో పరవశించింది. ప్రణతులు అర్పించింది.

తెలుగు చలనచిత్రరంగానికి సంబంధించిన వివిధవిభాగాల్లో విశేషమైన సేవలందించిన విశిష్టవ్యక్తుల కృషిని ఉత్తమవిలువలతో పుస్తకరూపంలో వెలుగులోకి తీసుకురావాలన్న ధ్యేయంతో గత పుష్కరకాలంగా పుస్తకప్రచురణ యజ్ఞంలో "నేను సైతం..." అంటూ పాల్గొంటున్న మా **క్రియేటివ్‌లింక్స్ ప్రచురణ సంస్థ** ఇప్పుడు సుశీల పాడిన కొన్ని వైవిధ్యభరితమైన పాటల గురించిన పుస్తకంతో మీ ముందుకొచ్చింది.

మహాగాయని సుశీల గాత్రవైదుష్యాన్ని అక్షరాక్షరంలోనూ కళ్లకు కట్టించిన డా॥ కంపల్లె రవిచంద్రన్ కృషి అభినందనీయం. మా కలయికలో వచ్చిన 'జ్ఞాపకాలు, స్వరలహరి' పాఠకులను ఎంతగా ఆకర్షించాయో ఈ వేళ కొత్తగా చెప్పనక్కరలేదు. ఈ పుస్తకం వెలుగు చూడటంలో నాకు అండగా నిలిచిన ఆత్మీయులు సర్వశ్రీ పెమ్మరాజు రవికిశోర్, వి.బాబూరావు, ఎస్.వి.నాగభూషణం, నిత్యసాయి, వై.శివరాంప్రసాద్, గెడా రంగారావు, వేణుగోపాల్...వీరందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

అలాగే పుస్తకం ఆసాంతం చదివి తమ అమూల్యమైన అభిప్రాయాలు తెలిపిన సర్వశ్రీ యస్.పి.బాలసుబ్రహ్మణ్యంగారికి, భువనచంద్రగారికి, చింతికింది శ్రీనివాసరావుగారికి నా నమస్సులు తెలియజేసుకుంటున్నాను.

సదా మీ ప్రోత్సాహాన్ని ఆశిస్తూ, వినమ్రపూర్వక నమస్సులతో...

**మాటూరి సూరిబాబు,**

ప్రచురణకర్త

# తెలుగు కోకిలమ్మా..! వెలుగుల వందనమమ్మా..!!

- డా॥ కంపల్లె రవిచంద్రన్

వసంతం వెల్లువెత్తగానే కోయిలమ్మ గొంతు సవరిస్తుంది. మావిచివుళ్లు తినగానే తియ్యనిగానం వినిపిస్తుంది. ఋతువునుబట్టే కోకిల గళం. సమయాన్నిబట్టే కోకిలస్వరం. మరి, కాలానికి అతీతంగా కాంతులు ప్రసరించే నాదకోకిల – ఆరు ఋతువులనూ ఆమనిగా మార్చగల గానకోకిల ఈ ప్రపంచాన ఎక్కడన్నా ఉందా? సందర్భం ఏదైనా స్వచ్ఛమైన స్వరతంత్రులతో ప్రకృతిని సైతం పరవశింపజేయగల కోకిల మరెక్కడన్నా ఉంటుందా? లేకేం..! ఉంది. ఎక్కడో కాదు. మనచెంతనే ఉంది. మన ఆంధ్రావనిలోనే ప్రభవించి, మన తోటలోనుంచి ప్రపంచ ఉద్యానవనంవరకూ ప్రకాశించగల అమృతగానాన్ని కురిపిస్తోంది. ఆమె మన తెల్లకోయిలమ్మ. ఆమె మన గారాల గాయనీమణి సుశీల. గానానికి గంధర్వులు గొప్పంటారు. గానగాంధర్వం అంటూ ప్రశంసిస్తుంటారు. అలాంటి గంధర్వులే అచ్చెరువొందే శ్రుతిలయానుబంధం, రాగతాళసమ్మేళనం మన సుశీల గళం. ఆమె గానానికి గంధర్వులూ "సాహో!" అనవలసిందే. "భళిరా భళీ!" అని పలకవలసిందే. పదేపదే పలవరించవలసిందే. నోటిమీద వేలేసుకుని అసాంతం ఆమె పాటను వారంతా ఆస్వాదించవలసిందే. అందుకే, ఆ పాటలతల్లి గొప్పతనాన్ని నోరు నొవ్వంగ కీర్తించడానికే, నేనిదంతా రాసింది...

"అంతకుముందు కలరో, లేరో ఆ తర్వాతను కానరారు". నాదృష్టిలో సినీగీతసామ్రాజ్యంలో పి.సుశీల గారికి ఈ మాట చెల్లుతుంది. పదులు, వందలు కాదు వేలపాటలు... సుస్వరాల సుందరసురుచిరగీతాలు. వాటన్నింటినీ గుర్తు చేసుకుంటుంటే ఎవరికైనా మహదానందమే! కానీసాధ్యమా..? కొండను అద్దంలోనే చూపించాలి మరి. ఈ పుస్తకంలో నేను చేసిందదే. ఆ గానకోకిల ఆలపించిన గీతాల్లో కొన్నింటిని మాత్రమే మీ ముందుంచుతున్నాను. వాటి ప్రాముఖ్యతను నా ధీశక్తి కొలది వ్యాఖ్యానించాను. ఇవే గొప్పవనీ కాదు, మిగిలినవి, ఇందులో ప్రస్తావించనివి తక్కువనీ కాదు. అమ్మవారిని అర్చించడానికి నాకు అందుబాటులో ఉన్న కొన్నిపువ్వులనే కోసుకువచ్చాను. రానున్నకాలంలో ఆమె దయతో మరిన్ని పుష్పాల్ని దండగాగ్రుచ్చి ఆ తల్లి పాదాలను అలంకరిస్తానేమో! అంతా నా అభిమానపాఠకులైన మీ దీవెన, మీ దయ!

ఇక ఈ పుస్తకం మీచేతుల్లోకిరావడానికి ప్రధానకారకులైన కొంతమంది మంచిమనుషులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెల్పడం నా కనీసధర్మం, బాధ్యత కూడా!

ఈ పుస్తకానికి ప్రోత్సాహకరమైన పలుకులు పల్కిన **శ్రీ ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం** (ప్రఖ్యాత సినీగాయకులు) గారు, కిరీటం లాంటి ముందుమాట రాసిన ప్రఖ్యాత సినీ గీతరచయిత **శ్రీ భువనచంద్ర** గారు, ఆత్మీయంగా నన్ను ఆశీర్వదించిన ప్రసిద్ధ కథ, నవలారచయిత **శ్రీ చింతకింది శ్రీనివాసరావుగారు,** అడిగిన పాటల పాఠాలు అడిగినట్లు అందించిన **శ్రీ టి.శ్యామ్‌నారాయణ** గారు, నోట్లో మాట నోట్లో వుండగానే సుశీల పాటల పల్లవుల వివరాలు అందించిన **శ్రీ గెడా రంగారావు** గారు, ఇంకా నా ఆత్మీయమిత్రులు **శ్రీ వై.శివరామ ప్రసాద్, శ్రీ పులగం చిన్నారాయణ, శ్రీ ఆచారం షణ్ముఖాచారి, శ్రీ పురాణం వెంకటరమణ, డా॥ పైడిపాల,** నా సతీమణి **శ్రీమతి వి.ఉమారాణి** గార్లకు నా కృతజ్ఞతలు.

ఇక ఈ పుస్తకం ఏ సుముహూర్తంలో మొదలెట్టానో గానీ అనుక్షణం “ఎప్పుడు పూర్తి చేస్తావు” అని వెంటబడి, పాటల డి.వి.డి.లు సమకూర్చి నాతో ఈ పని పూర్తి చేయించిన **శ్రీ పంచకర్ల రమేష్** గార్కి ప్రత్యేక ధన్యవాదాలు.

నేను ఏ పని చేసినా ముందుగా చెప్పి, ఆశీస్సులను పొందే మా **వి.ఏ.కె. రంగారావు** గారికి నా ధన్యవాదాలు.

ఈ వ్యాఖ్యానంలో **శ్రీ చంద్రబోస్, శ్రీ మాధవ్ శింగరాజు, డా॥వెనిగళ్ల రాంబాబు** గార్ల వ్యాఖ్య ఎడనెడ సహకరించింది. వారికి కృతజ్ఞతలు.


నా **“జ్ఞాపకాలు”** పుస్తకంతో ప్రారంభమైన **క్రియేటివ్‌లింక్స్** ప్రచురణ సంస్థ దినదినప్రవర్ధమానమై అశేష పాఠకుల అభిమానం పొందడం నాకు సంతోషాన్ని కలిగించే విషయం. ఇన్నేళ్ల తర్వాత మళ్లీ నా పుస్తకాన్ని వెలువరిస్తున్న **ఎం.సూరిబాబు** గారికి నా ధన్యవాదాలు.

హేవలంబి ఆశ్వయుజ పూర్ణిమ,
గురువారం (05.10.2017)

(కంపెల్ల రవిచంద్రన్)

# 'రవి కాంచిన 'స్వర పుష్పాలు'

– భువనచంద్ర, సుప్రసిద్ధ సినీగీతరచయిత



పాఠకులకి నమస్కారం....

ఈ అద్భుతసృష్టికి కర్త, కర్మ, క్రియ కూడా డా॥ కంపల్లె రవిచంద్రన్ గారే. వీరికి సంగీతం అంటే ప్రాణం 'సినిమా' మరోప్రాణం. జర్నలిజం మహాప్రాణం. ఒక్కటి నిజం....'తిన గలిగిన వాడే.....తినిపించగలడు'. తాను ఆస్వాదించిన మధురానందాన్ని ఇతరులకు పంచాలనుకునేవాడే నిజమైన 'మానవుడు'. ఈమాట ఎందుకంటే, 'మాధవుడి' భాష "మానవత్వమే!" ఆ మానవత్వం లేనివాడు సంగీతాన్నీ, కళనీ ఆస్వాదించలేరని షేక్స్‌పియర్ ఆంటోనితోటి అంటాడు. క్యాజువస్ గురించి చెబుతూ.

ఆ మానవత నిండుగా ఉన్నందువల్లే సంగీతమనే 'భగవంతునిభాష'ని ఆరోప్రాణంగా కాక ఆరుప్రాణాల్లోనూ నిలుపుకోగలిగినందువల్లనే డా॥**కంపల్లె రవిచంద్రన్** యీ అద్భుతమైన పుస్తకాన్ని మనముందుకు తీసుకురాగలిగారు.

చి॥రవిచంద్రన్ తమిళ, సంస్కృత,ఆంగ్లభాషల్లో నిష్ణాతుడేగాక 'తెలుగు' వెలుగుని గుండెలనిండుగా నింపుకున్నవాడు. ఆమనితో అడవంతా పుష్పించినట్టు ఆయనదృష్టికి ఏపాటవచ్చినా ఆపాట విశ్లేషణతో పరిమళిస్తుంది. ఈపుస్తకం ఆ పరిమళాలకి నిలువెత్తుసాక్ష్యం. 'సినిమాపాట' అనగానే 'ఎందరోమహానుభావులు' గుర్తుకొస్తారు. నిర్మాతలు, దర్శకులు, నటీనటులు, గాయకగాయనీమణులూ ఇలా..కానీ అందరికంటే ఎక్కువ ప్రాచుర్యం పొందేది నటులూ, గాయకులే. నటులకన్నా కూడా ఎక్కువ ప్రజాదరణ పొందేది నిస్సందేహంగా గాయకులూ, గాయనీమణులే.

ఓ అద్భుతమైనపాట వింటే, మనకి గుర్తుండేది గాయని/గాయకుడి పేరేగానీ ఆ సినిమాపేరూ, దర్శకనిర్మాతలపేర్లు, రచయితలపేర్లూ, ఏవీ గుర్తుండవు.

భారతదేశాన్ని సంగీతపరంగా రెండుభాగాలుగా విభజిస్తే అఖండదీపాల్లాంటి ఇద్దరు, ఆణిముత్యాల్లాంటి ఇద్దరు స్వరకాయ ప్రవేశం చెయ్యగల 'వాణిమత్యాలు'

ఇద్దరు కనబడతారు. 'పైవాడు' గొప్ప సమవర్తి. అందుకే ఆ ఉత్తర భారత దేశానికి లతా మంగేష్కర్‌ని యిస్తే, ఈ దక్షిణ భారత దేశానికి పి.సుశీల అనబడే 'గానమోహిని'ని ఇచ్చాడు. అటువైపు ఎందరు అద్భుతమైన సంగీతదర్శకులూ, రచయితల్నీ ఇచ్చాడో, ఇటువైపూ ఏమాత్రం లెక్కకితగ్గకుండా అంతమంది సుశిక్షితుల్నీ, రచనాసంపన్నుల్నీ ఇచ్చాడు. ఒక్కటిమాత్రం నిజం-

రవిచంద్రన్‌లా 'విశ్లేషించగల' ధీమంతుణ్ణి మాత్రం అక్కడికి ఇవ్వలా. మనకి, అంటే, తెలుగువారికి మాత్రమే ఇచ్చాడు. "అసలీ పుస్తకంలో ఏముందీ?" ఈ ప్రశ్న యీ పుస్తకాన్ని చూసిన వెంటనే నాలోనేను వేసుకున్న ప్రశ్న. చదివాక తెలిసింది ఏముందో. చదవకముందు పి.సుశీలగారిని ఎంతో గౌరవించా, అభిమానించా, వారిని సరస్వతిలా ఆరాధించాను.

ఈ పుస్తకం చదివాక తెలిసింది. ఆమె అసలు స్వరూపం. గుళ్లో పూజలందుకునే బుల్లిసరస్వతి బొమ్మకాదు సుశీల అంటే, పాటపాటకీ ఎదుగుతూ 'ఇంతింతై వటుడింతై' అని ఆకాశాన్ని అవలీలగా ఆక్రమించిన విశ్వమహాసరస్వతని! ఆ స్వరరూపదర్శనాన్ని చేయించినవాడు చి॥ రవిచంద్రన్. కంపల్లె,

ఇందులో సుశీల ప్రతిభాపాటవాల గురించేకాదు, ఆవిడలోని ఔన్నత్యం గురించి మాత్రమేకాదు రాగాల గురించి, వాద్యవిశేషాలగురించి, గాత్రాల గురించి, గాత్రధర్మాల గురించి, రచయితల గురించి, వారు రచించిన గీతాలగురించి, సంగీతదర్శకుల గురించి, వారి స్వరాలకూర్పు గురించీ, వాయించిన వాద్యకళాకారుల నేర్పు గురించీ, అద్భుతంగా, సమర్థంగా, అనితరసాధ్యంగా విశ్లేషించారు రవిచంద్రన్. కేవలం సుశీల ఆత్మదర్శనమే కాదు, పైన ఉదాహరించిన వారందరి స్వరాత్మలనీ దర్శింపచేశారు.

ఒకరి ప్రతిభగురించి వ్రాయాలంటేనే పదాలు చాలనంతటి మహారచయితలు ఇరవైముగ్గురు గురించి పొగడడానికి ఆదిశేషుడికైనా సాధ్యంకాని సంగీతదర్శకులు పాతికమంది గురించీ అద్భుతంగా వివరించారు. విశ్లేషించారు.

రవిచంద్రన్‌గారి విశ్లేషణ 'ప్రోజ్'లా కాదు...తీయని మధుర మంజులమైన 'పొయిట్రీ'గా సాగింది. ఈ విశ్లేషణలు చదివాక ఏ పాట ఏరాగంలో కూర్చబడిందో పాఠకులకు ఇట్టే అవగతమౌతుంది. ఒక అత్యంతసమర్థుడైన శిల్పి చెక్కినశిల్పంలా మనకు దర్శనమిస్తుందీ పుస్తకం. అంతేకాదు ఆసక్తిరేపే రెఫరెన్స్‌బుక్ కూడా యిది.

పి.సుశీలగారిపై వీరికున్న అభిమానం చెప్పనలవి కాదు. ఆ అభిమానం సహేతుకమైనదని యీ పుస్తకాన్ని అధ్యయనం చేశాక మనకు అవగతమౌతుంది.

మనమధ్యలో సంచరిస్తూ, మనలని తన గానంతో అలరిస్తూ,

మామూలుమనిషిలా కనిపించే (అంటే సామాన్యురాలిగా) భ్రమింపజేసే అసామాన్యురాలైన పి.సుశీలగారి గురించి మనకు తెలిసింది చాలా తక్కువని యీపుస్తకం చదివాక మనకే అర్థమవుతుంది. తెలియడం అంటే ఆమె జీవితాన్ని గురించి కాదు– గానకౌశల్యాన్ని గురించి!

వారి విశ్లేషణ చూడండి –

1. ఒక స్వచ్ఛత...గంభీరత...ఆత్మవిశ్వాసం తొణికిసలాడే గళం శ్రీమతి సుశీలగారిది.

- వారి 'స్వరవ్యక్తిత్వం' గురించి మూడుముక్కల్లో చెప్పడం రవిచంద్రన్ గారికే చెల్లింది.

2. కవిభావన, స్వరకర్త ప్రతిభ, నటీమణుల హావభావాలూ అన్నీ ఆమె స్వరంలో ప్రతిఫలిస్తాయని అద్భుతంగా వివరించారు.

- నటీనటులు కెమేరాముందు నటిస్తే గాయనీగాయకులు కెమెరాముందు తమస్వరాలతో నటింప చెయ్యాలన్న 'రఫీ'గారి మాట ఎంత నిజమో, సుశీలగారి ఏపాట విన్నా మనకర్థమవుతుంది.

3. సుశీలగారి స్వరాలు "నిత్యయవ్వనులు చేసే అమృతస్నానాలు...ఆకాశవీథుల్లో ఎగిరే స్వరహంస"లు.

- ఎంతటి భావుకత... అంతేకాదు, ఎంత హృద్యమైన 'భావచిత్రాలను' మనకళ్లముందు నిలిపారీ రచయిత!!

4. 'అలిగినవేళనే చూడాలి' అనే పాటగురించి విశ్లేషిస్తూ – 'శుద్ధస్ఫటికనాదంలా' రవంతదోషంలేని వేణుగాన రవళిలా ఆపాట వినిపిస్తుందంటారు.

- ఎంత సత్యం!

5. 'జననీ శివకామినీ' పాట గురించి రాస్తూ, 'వాణిపలుకుల్లా, శుకవాణి కిసలయ సొబగుల్లాగా, సుశీల స్వరం పలికిన విధానం, ఒక భక్తిపారవశ్యప్రాకారం, సంగీతశాస్త్ర స్వరమధురిమల సాకారం" అంటారు. ఆమె పాట 'సీతాకోకచిలుక పులకరింత' అంటారు.

- ఎంత అద్భుతమైన భావచిత్రమిదీ!

6. "ఆమె 'స్వరకాయప్రవేశం అద్భుతం. సామవేదజనిత సంగీతానికి ఎన్నెన్ని సొబగులూ, సోయగాలూ, ప్రయోగాలూ, రసాత్మకధోరణులూ, చిత్రవిచిత్ర బాణీవిన్యాసాలూ వున్నాయో – అవన్నీ అవలీలగా అలవరచుకున్న గాయనీమణి మన సుశీల" అంటారు.

7. పాడేటప్పుడు సుశీల “పదాలరాణి పంచమకోకిలై పాడుతోందా” అనిపిస్తుంది. అంతేకాదు, “స్వరాలవాణి విరించి రాణి కల్యాణభరిత నాదోపాసన చేస్తోందా” అనిపిస్తుంది అంటారు.

8. “ఆమె గాత్రంలో ఓ రమణీయ లయ, రసికత, హృదయతంత్రులను మీటే రాగతరంగాలూ పలుకుతాయి” అంటారీ రచయిత.

* * *

ఇక పెండ్యాల మీద అనంతమైన అభిమానమూ ప్రేమా వున్నాయి యీ చిరంజీవికి.

వారి గురించీ, వారి స్వరకల్పన గురించీ చెబుతూ – “శ్రుతిలయలే ఆయన తల్లిదండ్రులు...అదొక స్వర సాగరమేధస్సు. నిత్యం అలలరవళితో సుస్వరనాట్యం చేస్తూ, లోతైన సంగీత రత్నాకరాన్ని మదిలో దాచుకున్న అసమాన ప్రతిభాశాలి పెండ్యాల” అంటారు. అంతేకాదు...“నాదాత్మ ఆయన స్వరకల్పనలో దృఢంగా దర్శనమిస్తుంది. శ్రవణేంద్రియాలకు దర్శనమిచ్చే స్వరకల్పన అది” అని, మన పెండ్యాలగారిని "Madan Mohan of South India" అని కీర్తిస్తారు. ఎంత సహజమైన పోలిక అదీ! సుశీలగారి స్వరానికి మెరుగులుదిద్దిన స్వరశిల్పి పెండ్యాలగారని తెలిసిన విషయమేగదా!

అలాగే పనసతీపి, తేనెల సోయగాలూ స్పష్టంగా కనిపించేది ‘పింగళి నాగేంద్రరావు’ రచనల్లోనే నని స్పష్టీకరిస్తారు. లలితసంగీత నిర్వచనానికి నిలువెత్తు స్వరసంతకం ‘శ్రీసాలూరి రాజేశ్వరరావుగారి’దనీ, ఆయన స్వరకల్పన వింటే ‘లతలకు మారాకులు అల్లుతున్నట్టూ, లవలీవల్లికలకు చిగురులు పొదుగుతున్నట్టూ వుంటుందంటారు. ‘భావకవితాచక్రవర్తి’ అని దేవులపల్లిని కీర్తిస్తారు. అంతేకాదు ‘సరస్వతీ స్టోర్స్’ రూపంలో అమూల్య రత్నాలను భద్రపరిచి మనకందిస్తున్న ప్రముఖవిమర్శకులూ, నాట్యకళాకోవిదులూ, మల్లాదిరామకృష్ణశాస్త్రిగారి మానసపుత్రులూ, నిష్పక్షపాతంగా, నిర్మొహమాటంగా సత్యాన్ని వచించే ‘శ్రీ వి.ఎ.కె.రంగారావు’ గురించి చెబుతూ,– ‘‘సినీసంగీతప్రియులందరూ కృతజ్ఞతాపుష్పాలతో రంగారావుగారికి నిత్యపూజచెయ్యాలి” అంటారు.

రచయితకి భాషపట్ల మక్కువ, సమర్థతేకాదు, తాను రచిస్తున్న రచనపట్ల నిబద్ధత కూడా వుండాలి. ఈ వంద ‘గీతాకోకచిలుకల’ (ఈపదం గురుశ్రీ వేటూరిగారిది) గురించీ, వీటిని రచించిన రచయితలు, స్వరపరిచిన సంగీతదర్శకులూ, నటించిన నటీమణులు గురించీ అత్యంతప్రేమతో, వినయంతో,

గౌరవంతో విశ్లేషించడమేగాక, వారి వ్యక్తిత్వాలకు నీరాజనం పట్టారు రవిచంద్రన్‌గారు.

ఎంతో శ్రమకోర్చి సరైనగీతాలను ఎన్నుకోవడం ఒక ఎత్తయితే, వాటి విశేషాలను, మాధుర్యాన్నీ, సమగ్రంగా వివరించడం, విశ్లేషించడం మరోఎత్తు.

ఈ పాటల పూదోటలో విహరిస్తూ నన్ను నేను మరిచిపోయా. చిననాటి జ్ఞాపకాల నీడల్లో నీడగా ఒదిగిపోయా. ఒక్కొక్క పాటనీ వింటూ, నటించిన నటుల్నీ, స్వరపరిచిన సంగీతదర్శకుల్నీ, రాసిన రచయితల్నీ మళ్లీమళ్లీ తలుచుకుంటూ పులకించిపోయా.

ఒక్కటిమాత్రం స్పష్టంగా చెప్పగలను...ఇదో అమూల్యమైన కానుక. ఒక గానసరస్వతికి మరో సరస్వతీభక్తుడు అత్యంతప్రేమతో, గౌరవంతో అర్పించిన స్వరపుష్పమాల. ఓ స్వర రాణి పాదాలకుపూసిన స్వరపారాణి ఇది. చిః రవిచంద్రన్ మరిన్ని రచనలు చేయాలనీ, తద్వారా చలనచిత్రపరిశ్రమను సుసంపన్నం చేయాలనీ మనఃస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను.

ఈ **'పాడనా తెనుగుపాట'** అనే పుస్తకాన్ని చదవండి, చదివి పదిమందికి, 'కొని చదవమని' చెప్పండి. పుట్టినరోజులకి, పెళ్లిరోజులకి, ఇతర శుభకార్యాలకు యీ పుస్తకాన్ని కొని ప్రేమగా ఇతరులకు బహూకరించండి. ఎందుకంటే, ఇదో అమూల్యమైన కానుక.

నా మొదటి పాట ఎస్.పి.బి.పాడితే నేను రాసిన మొదటి డూయెట్ "మాయింటి మహరాజు" పాడింది ఎస్.పి.బి., సుశీల...ఆ పాటకిప్పుడు ముప్పై ఏళ్లవయసు. ఇన్నేళ్ల పయనంలోనూ నాటికీ నేటికీ అదే ఆప్యాయతతో, అదే మూర్తీభవించిన మంచితనంతో అలాగే ఉన్న అమ్మ సుశీలమ్మకు పాదాభివందనాలతో, మా సుశీలమ్మకిచ్చిన యీ ఆనంద కర్పూరనీరాజనం నిత్యమై, సత్యమై, అమరమై చిః రవిచంద్రన్‌కి ఆశీస్సులు అందిస్తుందనీ, అందించాలనీ సంగీతసాహిత్య సమలంకృతయైన శర్వాణిని ప్రార్థిస్తూ, ఇంత గొప్పరచనకు ముందుమాట వ్రాసే భాగ్యాన్నిచ్చిన **రవిచంద్రన్‌**కి కృతజ్ఞతలు తెలుపుకుంటూ...

నమస్సులతో...

**మీ**

**భువనచంద్ర**

# నీవుండేదా కొండపై...!

- డా॥ చింతకింది శ్రీనివాసరావు
సుప్రసిద్ధ కథ, నవలారచయిత
సెల్ : 8897147067



ఉపనయనమో,వివాహమో, తీర్థయాత్రో - ఇలా ఏదో ఒక శుభకార్యానికి అమ్మానాన్నలతో కలిసి చిన్ననాడు రిక్షామీద బయలు దేరి వెళ్లడం... బస్సుస్టాండులో దిగి బస్సుకోసం ఎదురుచూడటం. చుక్క తెగిరాలినట్టుగా వచ్చిన బస్సులో కిటికీ పక్కసీటు సంపాదించుకుని కూర్చుండిపోవడం... బస్సు తొందరగా బయలుదేరాలని వేయిదేవుళ్లకు మొక్కుకోవడం... బండిలోకి డ్రయివర్ అడ్డసుడిగా దూరిపోయి స్టీరింగ్ ముందు కూర్చుంటే పోయిన ప్రాణమేదో వచ్చినట్టుగా సంబరపడటం... ఇవన్నీ మనలో చాలామందికి చెందిన బంగారు బాల్యపుగుర్తులు. చిన్ననాటి చిహ్నాలు. అయితే, ఇంకా బాగా గుర్తుకు తెచ్చుకుంటే గనక నలభైయ్యేభై ఏళ్ల కిందటి పిల్లలకి వీటన్నింటికీ తోడుగా మరో గొప్ప సంగతీ బస్సుస్టాండులో అనుభవంలోకి వచ్చేది. అదే సినిమా పాటలపుస్తకం. మట్టినేల మీద షావుకారు కూర్చుని అమ్ముకునే ఆ పాటల పుస్తకాలు తెగ ఊరిస్తుండేవి. అమ్మనో నాన్ననో బతిమలాడి, నాలుగుపైసలు సంపాదించుకుని, వాటిలో యిష్టమైన పుస్తకం కొనుక్కుని, బస్సులో బైఠాయించి, ప్రకృతిని చూస్తూ పాటలు పాడేసుకునే వైనం మనలో చాలామందికి అనుభవైకవేద్యమే.

నా దగ్గర "పవిత్రబంధం..." పాటల పుస్తకం ఉందంటూ నేస్తం హరిగాడు గర్రాగా గొప్పలు చెబితే, నేను "విచిత్రబంధం..." పాటలు తెచ్చుకున్నాన్రా..! అని గిరిగాడు గిరిగీసుకు నిలబడి మరీఫోజులు కొట్టేవాడు. 'గౌరి సగం... శివుడు సగం... అర్ధనారీశ్వరమే అఖిల జగం...' హరిబాబు ఇనప గొంతేసుకుని కాకరబీకరగా పాడేవాడు. గిరికుమారుడేం తక్కువకాదు. 'చిక్కావు చేతిలో చిలకమ్మా... నువ్వు ఎక్కడికీ పోలేవు ఆగవమ్మా...' అని తగులుకునీవాడు. అలాంటప్పుడే యమతెలివైన కొందరు కుర్రనాగన్నలు 'శివశంకరీ... శివానందలహరి...', "జగదేకవీరునికథ" సినిమాలో పాట మొదలెట్టేసేవారు. ఎన్టీఆర్‌లా ఫీలయిపోయేవారు. పాటల పుస్తకాన్ని పట్టిపట్టి చూసినప్పటికీ 'దనిస... మపదనిస... సరిమగ రిమపని దనిస...' స్వరాలు పాడలేక శోషవచ్చి పడిపోయేంతగా అయిపోయేవారు. ఆ బాధలు పైకి కనబడకూడదన్నట్టుగా, 'అయినదేమో అయినదీ...' అంటూ వెంటవెంటనే

పాటమార్చేసేవారు. ఇదండీ! ఒకనాటి మేటి చిన్నవయసు ముచ్చట. చెప్పొచ్చేదేంటంటే, సినిమాలు మనజీవితంతో అంతగా ముడిపడిపోయాయి. వాటిల్లో పాటలయితే మరీను. మన బతుకుల గతుకుల్లోనే ఆ గీతాలకు పునాదులున్నాయి. మన మనుగడలోని మహాసందర్భాల్లోనూ ఆ పాటలకు పెద్దపీటలున్నాయి. అసలు సినిమాపాటలన్నీ మనకోసమే పుట్టాయేమోననే మాయావాస్తవికతలో కొట్టుమిట్టాడేవాళ్లం.

నిజమే, ఒకప్పటి సినిమాలు, పాటలు అంత అద్భుతంగా ఉండేవి. అంతలా మనల్ని హత్తుకునేవి. దీనర్థం ఇప్పుడొస్తున్న చిత్రాల్లో సరుకు లేదని కాదు. సరుకు తగ్గుతోందన్న మాటా లేకపోలేదు. ఏది ఏమైనా సినిమాపాటతో తెలుగుజనం తమ వర్తనను పెనవేసుకున్నారు. పల్లవీచరణాలే పంచప్రాణాలుగా జీవించారు. ప్రతీఅడుగులోనూ ఆ పాటనే పాడుకుని పరవశించారు. పదుగురినీ పరవశింపజేశారు. ఉనికిని పండించుకున్నారు.

మంగళహారతి అనగానే, 'శ్రీలలితా శివజ్యోతీ సర్వకామదా...' ఇప్పటికీ చాలా మంది పడతులు పాడుతుంటారు. నాకు తెలిసి నా చిన్ననాడు పెళ్లిసంబంధాలెన్నో సినిమాపాటలవల్ల కుదిరిన దాఖలాలూ లేకపోలేదు. 'రాధకు నీవేర ప్రాణం...' పాట పాడి కృష్ణుడనే పెళ్లికొడుకును మెప్పించిన యువతులుండేవారు. 'శరణం... నీ దివ్యచరణం...' అంటూ పెళ్లిచూపులప్పుడు పాడినవారు, 'శ్రీరామనామాలు శతకోటి... ఒక్కొక్కపేరూ బహుతీపి...' వంటివీ గానంచేసి సంబంధాలు ఖాయం చేసుకున్న ఆడపిల్లలు నాకెందరో తెలుసును. 'అనురాగము విరిసేనా... ఓ రేరాజా...' పాట అప్పటి పెళ్లిచూపుల వేళ సూపర్‌హిట్ సాంగ్‌గా నాకెంతో ఎరుక. సినిమాపాటకి అంతశక్తి నాటి కాలాన ఉండేది. అందుకే, అమృతోపమానమైన ఆ గీతాలు ఇప్పటికీ ఎక్కడైనా వినిపిస్తే మనం మనలోకి వెళ్లిపోతుంటాం. అలాంటి గీతాలు ఏ తెరమీదయినా కనిపిస్తే కరిగి సుఖాన ఒరిగిపోతాం.

సినీగీతాలు, పాటల పుస్తకాల స్థాయి దాటిపోయి ఎప్పుడో గ్రంథాల వరకూ వెళ్లిపోయాయి. ఎంఫిల్. మెట్లెక్కి డిగ్రీలు పుచ్చేసుకున్నాయి. పీహెచ్‌డీల పరవళ్లు తొక్కి డాక్టరేటు పట్టాలూ పొందాయి. నవ్విన నాపచేన్లన్నీ ఆ రకంగా పండాయి. విమర్శకుల నోళ్లనూ పండించాయి. ఒకనాడు తెలుగు సినీపాట 'లొల్లాయి పదం' అన్నవారే దాన్ని నెత్తిమీద పెట్టుకునే దాకా ఎదిగింది వ్యవహారం. అకవులు, కుకవులే సినిమాపాటలు రాస్తారనే మాట పోయింది. మహాకవిత్వమంతా ఆ పాటల్లోనే ఉందన్న భోగట్టా ముదిరింది. తాంబూలాలు నోట నమలుతూ తననాలు పలికేవారు, ఉయ్యాలబల్లల మీద ఊగుతూ ఊసుపోని రాగాలే సంప్రదాయభోగాలని చెప్పేవారు సైతం సినిమాపాటని

ఆత్మికభావనతో హత్తుకోవాల్సి వచ్చింది. నెత్తికెత్తుకోవాల్సి వచ్చింది. చాదస్తాలన్నీ విడిచి తాము కూడా అలాంటి పాటలు నాలుగో అయిదో పాడితే పోలా...! అన్నంతవరకూ కథ సాగింది. కచేరీల మీద కచేరీలు చేసేవారూ రెండోమూడో సినిమా పాటలు పాడితేనే జనం గుర్తించేదాకా పరిస్థితి పెరిగిపోయింది. దీన్నిబట్టి సినీమాధ్యమం శక్తి ఎంతటిదో ఇట్టే అంచనా కట్టవచ్చును. 'పాట'లీపుత్రపు వీరులందరూ, సినీ పాటలీపుత్రం చేరనిదే సఫలత లేదన్న దాకా స్థితిగతులు చేరాయి.

అంతటి గొప్పతనం తెలుగుచిత్రాలకు పట్టడానికి, తెలుగు చిత్రగీతాలు సర్వాభరణభూషితమై తళతళ లాడటానికి ఒకరూ ఇద్దరూ కాదు. ఎందరో మహనీయులు దోహదపడ్డారు. గీతరచనా ధురంధరులు, స్వరరచనా ధురీణులు, గంధర్వగాయకమూర్తులు, గాయనీశిరోమణులు... ఇలా ఎందరెందరో తమ మేధను పాటపరం చేసి పునీతులయ్యారు. ఆ అందరిలోనూ తెలుగునాట అగ్రేసర పీఠానికి చేరిన కొందరిలో మన తెలుగు తెల్లకోకిలమ్మ **పి.సుశీల** తప్పక చేరుతుందని ఢంకా భజాయించి, మురళి మ్రోయించి, వాయులీనాన్ని పలికించి మరీ చెప్పవచ్చు.

సుశీల పాటవింటే ఎలా ఉంటుంది? అని మీరెరినయినా అడగండి. తిరుపతి లడ్డూ తిన్నట్టుంటుంది. అమ్మ కొంగుతో ముఖం తుడుచుకున్నట్టుంటుంది. మామిడితోరణాల మండపంలో కల్యాణరాగం ఆలకించినట్టుంటుంది... వంటి సమాధానాలు రాకపోతే ఒట్టు. అలా ఉంటుంది ఆమె యమకం, ఆ గమకం. ఆమె పాట వీనులకువిందు చేస్తుందనాలా?, ఆత్మను స్నానం చేయిస్తుందనాలా?, అలౌకికానుభూతిలో ముంచి జన్మకోసార్థకత నిస్తుందనాలా? ఏమనాలి?, ఏమో...! ఏమనాలో...! బహుశా, ఇవన్నీ కలిపి అనాలేమో...!! అంత గొప్పది ఆ తల్లి స్వరం. ఆమె తెలుగునాట పుట్టడమే మనమంతా చేసుకున్న అదృష్టం.

ఇలాంటి అదృష్టాన్ని పదేపదే సంగీతప్రియులకు జ్ఞప్తికి తెచ్చి (అంటే వాళ్లంతా మతిమరుపులన్నది కాదు నా ఉద్దేశ్యం. కాస్త బిజీబిజీగా, ఇంకాస్త గజీబిజీగా తిరుగుతున్న కాలం కదా ఇది. అందుకని...) వారిని పంచదారకడలిలో ముంచి తేల్చేవారు అరుదుగా ఉంటారు. అలాంటి వారిలో విశాఖ మహాపట్నాన ఒకనాడు నాకు కనిపించింది 'భరాగో'గా ప్రసిద్ధమైన సుప్రసిద్ధ రచయిత భమిడిపాటి రామగోపాలం. చిన్నప్పుడు తాను సంపాదించిన పాటల పుస్తకాలను అపురూపంగా దాచుకుని ఆయన ఎంతగా మురిసిపోయేవారో, తాదాత్మ్యం చెందుతూ ఆ పాటల్ని పాడుతూ మరెంతగా ఊగిపోయేవారో చూసినవాణ్ణి నేను. "నూటపదహార్లు..." పేరిట ఆయన పాత తెలుగుసినిమా పాటలను పుస్తకంగా తీసుకురావడమే కాదు. ఆ పాటలను కాసెట్లకెక్కించి

అందరికీ కానుక చేశారు. భరాగో పని విధానం చాలా గొప్పది. పాటల ఎంపిక మొదలు అర్థవివరణ వరకూ చాలా జాగ్రత్తలు తీసుకునేవారు. సందర్భోచితంగా వ్యాఖ్యలను జోడించి పాటల పుస్తకాన్ని గొప్పగా మలిచేవారు.

నూట పదహార్లకోసం శ్రమిస్తున్నప్పుడు భరాగోకు ఉడతాభక్తిగా నేనూ కొంత సాయం చేశాను. తన్మూలంగా శ్రద్ధాభక్తులతో ఆయన చేస్తున్న ఆ మహత్కార్యాన్ని శ్రద్ధగా గమనించే అవకాశం కలిగింది. ఆ రోజులన్నీ నా జీవితంలో చాలా గొప్పవి. అయితే, ఆయన గతించాక మళ్లీ అలాంటి మనిషి తెలుగుసినీగీతానికి దొరుకుతాడా...? మన పాట ప్రతిష్ఠ పెంచేలా రచనలు చేస్తాడా...? తెలుగు సినీగీతగోవిందాన్ని జనం ముందుకు జాగరూకతతో తీసుకువస్తాడా...? అనే అనుమానం మాత్రం కలిగేది. మ్యూజికాలజిస్టుల పేరిట తెలుగురాష్ట్రాల్లో తయారైన కొందరిని చూశాక, వారి చేష్టలు పరికించాక యీ అనుమానం ఇంకొంచెం ఎక్కువగా నన్ను వేధించేది. సరిగ్గా అలాంటి సమయంలోనే **కంపల్లె రవిచంద్రన్** పలు పత్రికల్లో సినీగీతాక్షరాలుగా కనబడినప్పుడు నా సందేహాలు తీరాయి. ధైర్యం వచ్చింది. తెలుగుపాటను ప్రేమించే మావంటి వారికి, సాహిత్య వ్యవసాయం చేసస్తూ అలసిపోయే మాబోటివారికి సాంత్వన అందించగల విమలశీలఘనవిశాల గీతపరిశోధకుడు దొరికాడని అనిపించింది.

ఇప్పుడు మీ చేతుల్లో ఉన్న యీ పుస్తకం నా దగ్గరికి చేరినప్పుడు నిలువెల్లా పులకించిపోయాను. ఆముఖం రాయడానికి ముందే నా ముఖం విప్పారింది. మరోసారి పసందైన పాటల విందులు తెలుగువారికి అందుతున్నందుకు అవధిలేని సంతసం కలిగింది. అందులోనూ 'కంపల్లె' ఈమారు అక్షరీకరించింది సామాన్యమైన విషయం కాదు. మన తెనుగుతోట పాటల కోయిల సుశీల గానవిలాసం, స్వరవికాసం తదితరాలకు సంబంధించింది. 'ప్రస్తావన' రాయడంకంటే ముందుగా పుస్తకంలోని చాలాపాటలు నా గళంబలం మేరకు పాడుకుని మురిసిపోయాను. ఇందులోని ప్రతీ పుటనూ చదివిచదివి సంతోషాల సంద్రమయ్యాను. 'చింతకింది'ని నిశ్చింతకిందినయ్యాను. మరో భరాగో మనకు దక్కాడన్న ఆనందం అంబరమంటింది. ఎలాంటి పాటలున్నాయండీ ఈ గ్రంథంలో. సుశీల జీవితంలోనే చెరగనిముద్ర వేసిన, ఆమెను తెలుగువారి ఇళ్లల్లో గానసరస్వతిని చేసిన పాటలివి.

1954 సంవత్సరంలో విడుదలైన "సంఘం" సినిమాలో సుశీల గానం చేసిన పాట దగ్గర మొదలు పెట్టుకుంటే... 1986లో తెలుగువారిని మురిపించిన "స్వాతిముత్యం" సినిమాలో 'వటపత్రశాయికి వరహాల లాలి...' వరకూ పెక్కుసంఖ్యలో కమనీయగీతాలు ఈ గ్రంథంలో చోటుచేసుకున్నాయి. 'బాలనురా మదనా...' అంటూ ఈ పుస్తకంలో

సుశీల తీసిన రాగాలు అన్నీ ఇన్నీకావు. తెలుగుపాటకు ఇందులో చందనచర్చలు చేసిందామె. 'పిలువకురా అలుగకురా..' అని భయభక్తులను ప్రదర్శిస్తూనే 'సుందరాంగా అందుకోరా...' అని కవ్వించింది. 'తెలియని ఆనందం... నాలో కలిగినదీ ఉదయం...' అని మురిసి మురిపాలు ఒలికించింది. 'పాలకడలిపై శేషతల్పమున' పవళించిన స్వామిని కొలచింది. 'సీతారాముల కల్యాణం చూతమురారండీ...!' అని స్వాగతం పలికింది. 'సఖియా వివరించవే...' అంటూ సినీ సంగీతశోభను సొంతం వివరించింది. 'వినపించనిరాగాలను వినిపించింది. కనిపించని అందాలను కళ్లకు కట్టింది. 'మానూ మాకును కాను... రాయీ రప్పను కానే కాను..' అని దీనంగా పాడుతూనే, 'మీరజాలగలడా నా యానతి...' అని దీర్ఘాలూ తీసింది. నిదురించేతోటలోకి పాటను తీసుకువచ్చింది. కొమ్మలేకుండానే గోరింటను పూయించింది. ఒక్కటి కాదు. సుశీల స్వరతంత్రులు ప్రాణతంత్రులై రాగాలమాలికలను మన మెడలో విరిదండలుగా అలంకరిస్తాయి.

ఇక్కడే కంపల్లె రవిచంద్రన్ గొప్పతనాన్ని కూడా మనం చెప్పుకోవాలి. సినిమాప్రపంచం చాలా చిత్రమైంది. ఎంతమంచిపాటయినా, మరెంతమంచి సాహిత్యమైనా ఆ సినిమా హిట్, ఫట్‌ల పైనే హెచ్చుగా ఆధారపడి ఉంటుంది. చక్కనిగీతమైనా సినిమా గనక మూణ్ణాళ్లు ఆడకపోతే ప్రేక్షకుల చెవి చేరనిస్థితి. ఆ రకంగా ఆణిముత్యాల వంటి అద్భుతగీతాలెన్నో చరిత్రలో నిలవవలసినంతగా నిలువలేదు. ఇంతేకాకుండా కాలదోషం సహా రకరకాల కారణాలవల్ల కూడా కొన్ని పాటలు సినిమా అభిమానుల మస్తిష్కాలనుంచి అన్యాయంగా దూరమైపోయాయి. ఈ విషయాన్ని గ్రహించే అనుకుంటాను కంపల్లె అలాంటి చెవిమరుగైన కొన్ని అనర్ఘరత్నాలని చెప్పదగ్గపాటలను కూడా ఈ సుశీల గీతగుచ్ఛంలో చేర్చగలిగాడు. వస్తుతః వాటికున్న ప్రతిభ ఆధారంగానే అవి ఈ గ్రంథంలో వన్నెకు వచ్చాయని అనిపిస్తుంది. ఈ గీతాలఎంపికలో కంపల్లె తీసుకున్న శ్రద్ధ మెచ్చదగింది. వాళ్లకిష్టమైన పాటల్నే ప్రజలకిష్టమైన పాటలుగా తలచి కొందరు పుస్తకాల్లోకి వాటిని చేర్చేస్తుంటారు. ఇదెలాంటిదంటే, 'తన కలిమి ఇంద్రభోగము... తనలేమి సకలలోక దారిద్ర్యము...' వంటిదన్నమాట. తను నచ్చుకున్నదే అందరూ నచ్చుకోవాలన్న పెడధోరణికి పెద్దరూపమిది. కంపల్లె అలాంటివాడు కాదు. జనం మెచ్చిన, సమాజానికి నచ్చిన, విలువలతో కూడిన పాటల్నే తీసుకున్నాడు. సుశీల సైతం సంబరపడేలా వీటిని గుదిగుచ్చాడు. యుగళగీతాలు కాకుండా ఆమె ఒక్కరే పాడిన పాటల మీదనే దృష్టి పెట్టాడు. సుశీల స్వరవిన్యాసంతో పాటుగా గీతకారుల పదలాలిత్యమూ, స్వరరచయితల బాణీల బరువు, పరువు అన్నీ సాకల్యంగా చర్చించాడు. పాటల అనుపానులు, వాటికి సంబంధించి కొందరికి తెలిసిన కొన్ని వివరాలూ, ఎవరికీ తెలియని అతనికి మాత్రమే

తెలిసిన మరికొన్ని విశేషాలు అందించాడు. గీతాలను బహుచక్కగా విశ్లేషించాడు. ఒక్కో పాటకూ ఆయన రాసిన వివరణ ఒక్కో అనల్పార్థరచనగా మనకి అందివస్తుంది. పాటలకు ఏ రాగపు మట్లు కట్టారో, మరే రాగపు ఛాయల్లో అవి సాగిపోయాయోననే విషయమూ విపులీకరించాడు. మరోవైపు, అందమైనభాషను సందర్భోచితంగా చిందులాడించి ఉర్రూతలూగించాడు. మరొకచోట కంపల్లె అంటాడు కదా. "గగనవాణికి ఘడియ గడవదు... తెలుగు చెవికి పూటగడవదు... ఎప్పుడో తెలుసా? సుశీల పాట వినకపోతే..." అని. వేరొక చోటయితే "పదాల మర్మం, స్వరాల ధర్మం, నాభి, రస, హృదయ, కంఠ, నాసాదులనుంచి ప్రభవించే గీతం..." ఇలా చాలామంచి మాటలే వినియోగించాడు. అతనికి ఉన్న ప్రాచీనసాహిత్యపు పునాది ఇందుకు చక్కగా వినియోగించబడిందని నిస్సందేహంగా చెప్పవచ్చు. అంతేకాదు, 'స్వర'కాయ ప్రవేశం... వంటి ప్రయోగాలనూ ప్రయోగించాడు.

సుశీల పాటల పూదోటగా చెప్పదగ్గ ఈ పుస్తకంలో రసాలూరు రాజేశ్వరుని స్వరచతురత, పెండ్యాల సంగీత సుకుమార సుగంధ మరందాలు, ఆదినారాయణుని విశ్వరూపం, కోదండపాణి బాణీల బలం, మామ మహదేవన్ సహా మరెందరివో రాగతాళాల మేళవింపులు – నవరోజ్‌లుగా, మాల్కౌస్‌లుగా, భాగేశ్రీలుగా, నటభైరవులుగా ఇంకా అనేక సుస్వరపుష్పాలుగా చదువరికి చేరువవుతాయి.

కంపల్లె రచనల్లో ఈ సుశీల (పాడనా తెనుగుపాట) గీతగ్రంథం కచ్చితంగా కలికితురాయే. నేనింకా ఇలా రాసుకుంటూ వెళితే ఇదో పెద్ద పరిశోధనాగ్రంథమే అవుతుంది. మమకారదోషం అంటుతుందేమోనన్న భయంతో నా కలాన్ని ఇప్పుడిలా ఈ చివరిమాటలతో ఆపదలుచుకున్నాను. ఇందుకు కూడా సుశీల పాడిన 'నీవుండేదాకొండపై...' పాటనే వినియోగంలోకి తెచ్చుకుంటున్నాను. అవును. దేవుళ్లలో చాలామంది కొండలమీదనే ఉంటారు. తిరుమల వెంకన్నదీ అదేతీరు. ఆయనను నిత్యం అక్షరాలతో సేవించుకునేందుకు కంపల్లె కూడా ప్రస్తుతం తిరుమల మీదనే ఉన్నాడు. అలాంటి కంపల్లె రాసిన ఈ పుస్తకాన్ని చదువుతుంటే – బస్సుస్టాండులో మంచిపాటల పుస్తకాన్ని దక్కించుకుని, అమ్మానాన్నల చిటికెనవేలు పట్టుకుని, టూరిస్టు సర్వీసులో తిరుపతి తీర్థయాత్రకు బయలుదేరినట్టుంది. కొండపై కొలువున్న భగవంతుణ్ణి కొలుచుకునేందుకు వెళుతున్న బాల్యం జ్ఞాపకానికి వస్తోంది. డా॥ కంపల్లె రవిచంద్రన్‌కు అభినందనలు!!

# నిదురించే తోటలోకి పాట ఒకటి వచ్చింది...

– డా॥ కంపల్లె రవిచంద్రన్

**పాటనా తెనుగుపాట... పరవశనై... నే పరవశనై... ఎంత పరవశం ఆ పాటలో... ఎంత పరవశం ఆ గళంలో... ఎంత పరవశం ఆమె పెదాలను తాకి వచ్చే తియ్యతియ్యటి తెలుగుపదాల్లో... పాడనా తెలుగుపాట...**

## పి.సుశీల...

ఆమె తెలుగువారి అదృష్టం. ఆమె తెలుగు ఆడపిల్లలు కలలు కనే గళం.. ఆమె తెలుగువారికి ప్రతిరోజూ చెవినపడి కాసేపు సాంత్వనం కలిగించి గుండెలకు కాస్త చల్లదనం పూసేచందనం... ఆమె పాటలో ఒక జాతిసంస్కారం ఉంది. అది మనది.

* * *

ఎందరో కళాకారులకు జన్మనిచ్చిన విజయనగరమే సుశీల స్వస్థలం. అక్కడ సంగీత, సాహిత్యాలకు నిలయమైన ఒక సంప్రదాయ కుటుంబంలో పులపాక సుశీల జన్మించారు (1935). ఆమె తండ్రి పి.ముకుందరావు, తల్లి శేషావతారం. ముకుందరావు వృత్తిరీత్యా పేరున్న న్యాయవాదే అయినా ప్రవృత్తిరీత్యా కళాకారుడు. శాస్త్రీయసంగీతమంటే ఎనలేని అభిమానం. స్వయంగా వీణావిద్వాంసులు కూడా. తల్లిదండ్రులిద్దరూ సంగీతారాధకులే కావడంవల్ల తండ్రి క్రమశిక్షణ, తల్లి ప్రోత్సాహం సుశీలకు సంగీతంపట్ల అభిమానం, అభినివేశం కలగటానికి దోహదం చేశాయి.

తమ కుమార్తె శాస్త్రీయసంగీతంలో ఎం.ఎస్. సుబ్బులక్ష్మిలా పేరు తెచ్చుకోవాలని ముకుందరావు దంపతులు కలలు కనేవారు. అయితే సుశీల మాత్రం శాస్త్రీయసంగీతంకంటే కూడా లలితసంగీతం, సినీ సంగీతం అంటేనే ఇష్టపడేవారు. “పెద్దవాళ్ల బలవంతం మీద శాస్త్రీయసంగీతం నేర్చుకున్నా, నా దృష్టి మాత్రం ఎప్పుడూ సినిమాపాటల మీదే ఉండేది. హిందీలో లతామంగేష్కర్, తెలుగులో పి.భానుమతి, ఎస్.వరలక్ష్మి, పి.లీల, జిక్కీ గార్లు పాడిన పాటలను పాడుకునేదాన్ని” అంటారు సుశీల.

సుశీల ద్వారం భావనారాయణ వద్ద శాస్త్రీయసంగీతం అభ్యసించారు. విజయనగరం మహారాజా కళాశాలలో గాత్రంలో డిప్లొమో పూర్తి చేశారు. ఎన్నో కచేరీలు చేశారు. చిత్తూరు రామవిలాససభ నిర్వహించిన సంగీత ఉత్సవాల్లో ఆమె అద్భుతంగా పాడి, తంబూరాను ప్రథమ బాహుమతిగా అందుకున్నారు. హైదరాబాద్, విజయవాడ, చెన్నైలలో అనేక సంగీతకచేరీలు కూడా చేశారు. తండ్రి ప్రోత్సాహంతోనే సుశీల మద్రాసుమ్యూజిక్ అకాడెమీలో కోర్సు చేసేందుకు వెళ్లారు. ఆ సమయంలో అకాడెమీ

అధినేత ముసిరి సుబ్రహ్మణ్యం అయ్యర్ సుశీలలోని సంగీతప్రావీణ్యాన్ని గుర్తించి బాగా ప్రోత్సహించారు. అయితే ఆమెకు మాత్రం సినిమా పాటలంటేనే మోజు, ఇష్టం ఉండేవి.

సుశీల మొదట చిన్నపిల్లల కార్యక్రమాల్లో (బాలానందం) పాటలు పాడేవారు. బందాకనక లింగేశ్వరరావు, న్యాపతి రాఘవరావు (రేడియో అన్నయ్య) మాధవపెద్దిసత్యంగార్లు ఈమెను రేడియోలో బాగా ప్రోత్సహించేవారు. ఒక రోజు సుశీల రేడియోస్టేషన్‌లో ఉండే సమయంలో ప్రముఖ సంగీత దర్శకులు పెండ్యాల న్యాపతి రాఘవరావుకు టెలిఫోన్ చేసి "పాడే అమ్మాయిలుంటే ఓ పదిమందిని పంపమని" కోరారు. ఆ పదిమందిలో సుశీల కూడా ఒకరు. పెండ్యాల అప్పుడు కె.ఎస్.ప్రకాశరావు నిర్మిస్తున్న "కన్నతల్లి" చిత్రానికి సంగీతదర్శకులుగా పని చేస్తున్నారు.

అలా "కన్నతల్లి"లో మొదటి మారుగా కొందరు ముత్తయిదువులు పాడే పాటకోసం బృందగానంలో కొన్ని బిట్స్ పాడే అవకాశం పొందారామె. వాటిని విన్న పెండ్యాల... ఆమె గాత్రానికి ముగ్ధులై అదే చిత్రంకోసం... ఓ పద్యం పాడించి... అది కూడా బాగుందని ఆనందించి... ఎ.ఎం. రాజాతో కలిపి... 'ఎందుకో పిలిచావెందుకో...' అనే యుగళగీతం పాడించారు. సుశీల ఆ విధంగా వెండితెరకు పెండ్యాల ద్వారా పరిచయం అయ్యారు. ఆ పాట రికార్డింగ్‌కు వచ్చిన సౌండ్ ఇంజనీర్ నాగరాజన్... సుశీల గొంతు విని... ఏ.వి.ఎం. చెట్టియార్‌కు "ఓ అద్భుతమైన వాయిస్ వచ్చింది..." అని చెప్పారు. వెంటనే చెట్టియార్ ఆమెను పిలిపించి, పాట విని, మూడు సంవత్సరాల కాంట్రాక్టు రాయించేసుకున్నారు. ఏ.వి.ఎం.లో నిబంధనలు కాస్త కఠినంగా ఉండేవి. ఆమె ఏ.వి.ఎం.కు తప్ప బయటకంపెనీలకు పాడకూడదు. ఒకవేళ పాడినా, ఆ కంపెనీ నుంచి తీసుకునే పారితోషికంలో సగం ఏ.వి.ఎం సంస్థకు ఇచ్చేయాలి. ఈ ఒప్పందానికి కట్టుబడే ఆమె ఉద్యోగంలో చేరారు. ఆ మూడేళ్ల కాంట్రాక్టు పూర్తి కాగానే సుశీల విజృంభించారు. తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో తిరుగులేని గళనాయకి అయ్యారు. ఏ.వి.ఎం.లో ఉండేటప్పుడే 'చండీరాణి', "చంద్రహారం" వంటి చిత్రాల్లో కొన్ని కోరస్‌లు పాడారు సుశీల.

## అనురాగము విరిసేనా...

అన్నపూర్ణాసంస్థలో పాడే అవకాశం రావడం సుశీల గళ జీవితానికో పెద్ద మలుపుగా చెప్పుకోవచ్చు. అరవై సంవత్సరాల క్రితం అన్నపూర్ణ సంస్థ ప్రారంభించబడి, కె.వి.రెడ్డి దర్శకత్వంలో "దొంగరాముడు" చిత్రనిర్మాణానికి సన్నాహాలు జరుపుకుంటున్న తరుణమది. కథానాయిక సావిత్రికి నేపథ్యగాయనిగా అప్పటికే మంచిపేరులో ఉన్న జిక్కీని ఎంపికచేసి, పెండ్యాల స్వరసారథ్యంలో పాటలు రికార్డ్ చేసేశారు. కథానాయకుని చెల్లెలు పాత్రధారిణి

జమునకు గాయనికోసం దుక్కిపాటి మధుసూదనరావు వెతుకుతున్నారు. ఆయన, కె.వి.రెడ్డి ఒకరోజు ఏ.వి.ఎం. స్టూడియోకు వెళ్లినప్పుడు రికార్డింగ్ థియేటర్ దగ్గర నిలబడివుంటే ఒక కొత్తగొంతుక వినిపించి వారిని ఎంతగానో ఆకర్షించింది. ఆ గాత్రం సుశీలదని తెలిసింది. అప్పుడే జమునపాత్రకు సుశీలను నేపథ్యగాయనిగా నిర్ణయించారు. సౌండ్ఇంజనీర్ కృష్ణయ్యర్ దగ్గర సుశీల అడ్రస్ తీసుకుని, ఆమెను పిలిపించి పాట పాడించుకుని విని సంతృప్తి చెందారు. అలా సుశీలచేత 'దొంగరాముడు'లో మూడు పాటలు పాడించారు. "దొంగరాముడు" అఖిలాంధ్ర ప్రేక్షకుల హృదయాన్ని దోచుకున్నాడు. దీంతో  గాయనిగా సుశీలకు బంగారుభవిష్యత్తు వచ్చినట్టయ్యింది. తెరపై జమున చూపించిన సిగ్ధత్వాన్ని, తన కంఠంలో అంతే సున్నితంగా ఒలికించారు సుశీల.

## బృందావనమది అందరిది...

'విజయా' సంస్థలోకి సుశీల అడుగుపెట్టడం కూడా యాదృచ్ఛికంగానే జరిగింది. అదెలాగంటే– 'అనురాగము విరిసేనా' పాట రికార్డింగ్ సమయంలో వాహినిలో ఒక తమాషా సంఘటన జరిగింది. సుశీల పాట పాడి వెళ్లిపోయిన తర్వాత దుక్కిపాటి, కె.వి.రెడ్డి ఆ పాటలను వింటున్నారు. ఆ సమయంలో పక్కన "మిస్సమ్మ" షూటింగ్ జరుగుతోంది. షూటింగ్ అయిపోగానే ఎల్.వి.ప్రసాద్, చక్రపాణిలు ఇంటికి వెళ్లిపోతూ ఆ పాట విని అంతకు నాలుగురోజుల క్రితం అక్కడ లతామంగేష్కర్ పాడి వెళ్లిన ఒక పాటను ట్రాన్స్‌పోజ్ చేస్తున్నారేమోననుకుని లోపలికి వచ్చారు. కానీ అక్కడ దుక్కిపాటి, కె.వి.రెడ్డిలను చూసి ఆశ్చర్యపోయి "ఏమిటి మీరిక్కడున్నారు?" అని అడిగితే, "ఇది మా సినిమాలో పాటే. పి.సుశీల అని కొత్త అమ్మాయి పాడింది" అని చెప్పగానే మరింత ఆశ్చర్యపోయారు.

ఆ తర్వాత చక్రపాణి "మిస్సమ్మ" (1955) లో 'బృందావనమది అందరిది' అనే పాటను ఏ.ఎం.రాజాతో కలిపి సుశీలచేత పాడించారు. "మిస్సమ్మ"లో కూడా జమునకే ప్లేబాక్ పాడారు పి.సుశీల. 'విజయా'లో ప్రవేశించాక సుశీలకు విజయాలే గానీ పరాజయాలు లేవు.

"మాయాబజార్"లో పి.సుశీల పాడిన 'అహ నా పెళ్లంట' పాట ఆమె గళవైవిధ్యానికో కొలికిపూస. "మాయాబజార్"లో హాస్యరసం ప్రధానపాత్రధారులతోనేకాక ఉపపాత్రధారులతోనూ పండినట్లు, మరే చిత్రంలోనూ, ఆద్యంతం హాస్య చిత్రాలనుకొనే వాటిలోనూ పండలేదు. అంతటి చిత్రంలోనే తలమానికం మాయాశశిరేఖ పెళ్లినాటి ఉదయం తన పరిచారికలను గగ్గోలు పెట్టిస్తూ, పాదపీఠాలను పగలగొట్టేస్తూ హాహాకారాలను చిందించేస్తూ పాడిన 'అహ నా పెళ్లి యంట' పాట. సుశీల ఏ

జంకూగొంకూ లేకుండా పాడిన హాస్యగీతాలలో ఇదే ప్రథమశ్రేణికి చెందిందంటే ఆశ్చర్యం లేదు. మధ్యలో ఘంటసాల ఎస్.వి.రంగారావుకు గొంతు కలపడం, వెంటనే సరిచేసుకుని సుశీలవడం ఈ పాటకు పింగళి, కె.వి.రెడ్డి, ఘంటసాల పెట్టిన అలంకారాలు. ఈ 'అహనా పెళ్లంట' పాటే సుశీలకు శాశ్వతమైనకీర్తిని సంపాదించే అనేక గీతాలను పాడటానికి అవకాశద్వారాలను తెరిచింది.

## మహానటి సావిత్రికి పి.సుశీల పాట

"దొంగరాముడు"లో ద్వితీయ కథానాయికకు పాడుతున్న సమయంలోనే సుశీల గాత్రం పీలగా ఉంటుందనీ, నూతిలోనుండి పాడినట్లు వినిపిస్తుందనీ పరిశ్రమలో అందరూ నిరుత్సాహపరిచినా అన్నపూర్ణా సంస్థ అధైర్యపడలేదు. తీరా "దొంగరాముడు" విడుదలై ఘనవిజయం సాధించిన తర్వాత అలా నిరుత్సాహపరచిన పెద్దలే వారివారి చిత్రాల్లో సుశీలే పాడాలని ఎగబడ్డారు. అన్నపూర్ణసంస్థ చరిత్రకూ సుశీల సినీజీవితానికీ వయసు ఒకటే. సుశీల మొట్టమొదటిసారిగా కథానాయిక పాత్రకు పాడింది కూడా 'అన్నపూర్ణా' వారి "తోడికోడళ్లు" (1957) లోనే తెలుగు, తమిళభాషల్లో నిర్మించిన ఆ చిత్రానికి నాయిక (సావిత్రి) పాటలన్నీ రెండు భాషల్లోనూ సుశీలే పాడారు. రెండుభాషల్లోనూ ఆ చిత్రం ఘనవిజయం సాధించింది. సుశీల ప్రాచుర్యం కూడా ఎంతగానో ఇనుమడించింది.

తాను తొలిసారిగా కథానాయికకు పాడిన పాటలు సావిత్రికే కావడంవల్లనేమో సావిత్రి అంటే సుశీలకు చెప్పలేనంత అభిమానం. సావిత్రికి కూడా సుశీల అంటే పంచప్రాణాలు. తను కథానాయికగా నటించాలంటే తనకు సుశీల వాయిసే కావాలని సావిత్రి నిర్మాతలను ఒప్పించిన సందర్భాలెన్నో ఉన్నాయి.

"తోడికోడళ్లు" తర్వాత ఏ.వి.ఎం. నుంచి బయటికొచ్చేసి జైత్రయాత్ర ప్రారంభించారు సుశీల. పెండ్యాల, కె.వి.మహదేవన్, ఆదినారాయణరావు, అశ్వత్థామ, సాలూరి రాజేశ్వరరావు, మాస్టర్ వేణు, విశ్వనాథన్– రామ్మూర్తి, సుసర్ల దక్షిణామూర్తి, ఘంటసాల, జి.కె.వెంకటేష్, టి.చలపతిరావు, రమేష్ నాయుడు, చక్రవర్తి, సత్యం వంటి సంగీతదర్శకులందరి దగ్గర కొన్నివేల పాటలు పాడారామె. ఎన్నని చెప్పుకోవాలి? ఏవని చెప్పుకోవాలి? ఒకప్పుడు పి.సుశీల పాటలేని తెలుగుచిత్రం ఉండేదికాదు. ఆమె పేరు తెలీని ఆంధ్రుడూ ఉండడు. ఏడు దశాబ్దాలుగా సుశీల తెలుగులోనే గాక వివిధ భాషల్లో పాడిన పాటలు ఎన్నని లెక్కగడితే ఆమె రికార్డ్‌ను అధిగమించిన గాయని మనదేశంలో ఒక్క లతామంగేష్కర్ మాత్రమే. అందుకేనేమో సుశీలను అందరూ 'దక్షిణభారతదేశపు లతామంగేష్కర్'గా అభివర్ణిస్తుంటారు.

## ఏమని పాడెదనో... ఎన్నని పాడెదనో...

సుశీల గాత్రమాధుర్యాన్ని కొలవడానికి ఏ పాటను తూకపురాయిగా తీసుకోవాలో నిర్ణయించడం అసాధ్యం. ఏ పాట కాపాటే సాటి కాబట్టి. 'పాలకడలిపై శేషతల్పమున' (చెంచులక్ష్మి), 'నీవుండేదా కొండపై' (భాగ్యరేఖ), 'సఖియా వివరించవే' (నర్తనశాల), 'పాడమని నన్నడగవలెనా' (డా॥ చక్రవర్తి), 'సన్నగవీచే చల్లగాలికి' (గుండమ్మకథ), 'ఇది మల్లెల వేళయని' (సుఖదుఃఖాలు) 'గోదారి గట్టుంది' (మూగమనసులు), 'నడిరేయి గడిచేనే' (జయసింహ) 'నేను నేనే సుమా' (మోహినీ భస్మాసుర), 'పిలువకురా' (సువర్ణసుందరి), 'ఏమని పాడెదనో' (భార్యభర్తలు), 'అందాల పసిపాప' (చిట్టిచెల్లెలు)... ఇలా ఎన్ని, ఎన్నన్ని, ఈ జాబితాకు అంతంటూ ఉంటుందా! ఎన్ని చెప్పుకున్నా ఒక్కటి మాత్రం నిజం– సుశీల కంఠంలాంటి మాధుర్యం కల్గిన కంఠం మరొకటి లేదు. రాదు. ఎన్ని తరాలు మారినా, అంతరాలు పెరిగినా మాధుర్యానికి శాశ్వతచిరునామా సుశీల కంఠమే.

ప్రతిభ ఉండాలే కానీ కంఠంలో ఎంత వైవిధ్యం చూపించవచ్చో, ఎలా విలక్షణత సాధించవచ్చో నిరూపించారు సుశీల. జానపదగీతాలు (పాండవులు పాండవులు తుమ్మెదా), టీజింగ్ సాంగ్స్ (ఎప్పుడూ మీ పాఠాలంటే ఎలాగండీ సార్). భక్తిగీతాలు (జననీశివకామిని), లాలిపాటలు (వటపత్ర శాయికి వరహాల లాలి) శోకగీతాలు (మనసా... కవ్వించకే నన్నిలా), యిలా నవరసాలు సుశీల కంఠంలో పలికి తేనెచినుకులు కురిసాయి. తెలుగులో శాస్త్రీయ జావళీలు వంద, వీణపాటలు ఎనభై, తల్లులు పిల్లలకు పాడే జోలపాటలు నూట ఇరవై భక్తిపాటలు ఏడువందలు, విషాద గీతాలు మూడువందలు పాడారు సుశీల. ఈ రికార్డు మరే యితర భాషలో కూడా ఏ యితర గాయనీమణికీ లేదు. తెలుగులో సుమారు తొమ్మిదివేల పాటలు పాడారు సుశీల.

యుగళగీతాల విషయానికి వస్తే... ఆ విశ్లేషణకే ఒక ప్రత్యేకసంచిక తేవాల్సి ఉంటుందేమో! ఘంటసాల, టి.ఎం. సౌందరరాజన్, ఏ.ఎం.రాజా, పి.బి.శ్రీనివాస్, బాలమురళీకృష్ణ, ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం, జేసుదాసు, రామకృష్ణ, పిఠాపురం, మాధవపెద్దిసత్యం, జి.ఆనంద్ వంటి గాయకులతో పాడిన వేల యుగళగీతాలు గుర్తుకు వస్తాయి. ఘంటసాలతో కలిసి పి.సుశీల ఆలపించిన యుగళ గీతాలు నేటికీ నిత్యనూతనాలై అలరారుతున్నాయి. ఆడియో డి.వి.డి.ల అమ్మకంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన పాటల డి.వి.డి.లే నేటికీ బాగా అమ్ముడుపోతున్నాయి.

ఘంటసాల మరణించిన సమయంలో మాలతీచందూర్ "ఘంటసాల మరణంతో గానకోకిల సుశీల గళం కూడా మూగబోయింది" అని రాశారు – అంటే సుశీలకు ధీటుగా పాడగలిగే గాయకులు కరవయ్యారని మాలతీ చందూర్ అభిప్రాయం.

ఒక ప్రక్క సినిమాలో గొప్ప గాయనిగా అలరారుతూనే సుశీల మరోపక్క సంగీత కచేరీలు కూడా చేశారు. అయితే ఈ సవ్యసాచిత్వం ఎక్కువకాలం కొనసాగించలేక పోయారామె. సినిమాపాటల రికార్డింగ్‌లతో క్షణకాలం తీరికుండేది కాదు. దాంతో క్రమంగా శాస్త్రీయ సంగీతానికి దూరమయ్యారు. అయితేనేం తన శాస్త్రీయవిద్వత్తునంతా సినిమా పాటల్లో గుప్పించారామె. సుశీల సినిమాల్లో పాడిన శాస్త్రీయగీతాలు వేటికవే రసజ్ఞసంచికలు.

## సుశీలకు నచ్చిన పాట

ఎందరో సంగీతఅభిమానులను మీకు నచ్చినపాట ఏది అంటే సుశీల పాటే చెప్తుంటారు. అలా ఎందరో అభిమానిస్తున్న సుశీలకూ అభిమాన గీతాలున్నాయి. ఆ విషయమే ఆమె దగ్గర ప్రస్తావిస్తే... "ఎన్నో పాటలు నాకిష్టమైనవి ఉన్నాయి. నా మనసుకు బాగా నచ్చిన గీతాల్లో 'న తుమ్ బేవఫా హై... న హమ్ బేవఫా హై... మగర్ క్యాకరే అప్‌ని రాహే జుదాహై' (నువ్వు విశ్వాసహీనుడివి కావు, నేనూ విశ్వాసహీనురాలిని కాను... కానీ ఏం చేయగలం? మన మార్గాలే వేరయినప్పుడు) అంటూ సాగే గీతం అంటే నాకెంతో ఇష్టం. ఆ పాట వినగానే అవ్యక్త ఆనందానుభూతి కలుగుతుందని" చెబుతారు సుశీల.

ఇక తన పాటల్లో తన కిష్టమైన పాటగా "చక్రవాకం" చిత్రంలోని "వీణలో నా... తీగలోనా... ఎక్కడున్నదీ రాగం" ను చెబుతారు ఆమె. సంగీతంలో క్లిష్టమైనరాగాల్లో చక్రవాక రాగం ఒకటి. కె.వి. మహాదేవన్ ఆ పాటను ఆ రాగంలో సమకూర్చారు.

## మనసు పరిమళించెనే...

ప్రతివ్యక్తి జీవితంలోనూ మరచిపోలేని మధురసంఘటనలు ఎన్నో వుంటాయి. అలాగే గాయని సుశీల జీవితంలోనూ ఉన్నాయి. "చిన్నతనం నుంచి తాను విపరీతంగా అభిమానించే గాయని భారతరత్న లతామంగేష్కర్ ఒక రోజు స్వయంగా తన ఇంటికి వచ్చి ఆతిథ్యం స్వీకరించిన సంఘటనను ఎన్నటికీ మరచిపోలేనని" సుశీల అంటారు.

చేదు అనుభవాల విషయానికి వస్తే – "మావారి మరణమే నాకు పెద్ద చేదుఅనుభవం" అంటారామె.

"రాజారమేష్" చిత్రంలో రామకృష్ణ, ఎస్.జానకి పాడిన "నెల్లూరు నెరజాణ పాటను వారితో పాడించినట్లు తెలీనికారణంగా నేనూ పాడాను. ఈ విషయం జ్ఞాపకమొచ్చినప్పుడల్లా బాధపడుతుంటాను" అని ఆవేదనగా చెప్పారు.

తనలోని మహాగాయనిని సైతం మరపించి, మంచిమనసును మన కనులముందు సాక్షాత్కరింపజేసే వ్యక్తిత్వం సుశీలది.

## మధురం... మధురం... ఈ సమయం

పి.సుశీలకు అవార్డులు తీసుకోవడం కొత్త కాదు. తన సుదీర్ఘచిత్రజీవితంలో ఐదు పర్యాయాలు జాతీయ అవార్డులు (ఉత్తమగాయని) అందుకున్నారు. 1969లో "ఉయిరన్ద మనిదన్" (తమిళం) అనే చిత్రంలో ఆమె పాడిన పాటకు మొదటిసారి జాతీయబహుమతి వచ్చింది. ఆ తరువాత "సవాలే సమాలి" (తమిళం; 1971), "సిరిసిరిమువ్వ" (తెలుగు; 1977), "మేఘసందేశం" (తెలుగు; 1982), "ఎమ్మెల్యే ఏడుకొండలు" (తెలుగు 1983) చిత్రాలలో పాటలకుగాను జాతీయఉత్తమ గాయని అవార్డులు అందుకున్నారు. 1978–79 సంవత్సరానికి తమిళనాడు ప్రభుత్వం ఆమెను 'కలైమామణి' అవార్డుతో సత్కరించింది. ఆంధ్రవిశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ (కళాప్రపూర్ణ) తో సత్కరించింది. అలాగే 1977, 1978, 1982, 1984, 1989 లలో ఆమెకు మన రాష్ట్రప్రభుత్వం ఉత్తమగాయనిగా సత్కరించింది. కేరళ ప్రభుత్వం ఇచ్చిన పురస్కారాలు కూడా ఎన్నో ఉన్నాయి. ప్రాంతీయంగా ఆమె పొందిన అవార్డులకూ, బిరుదులకూ లెక్కే లేదు. ఆమె సంగీతరజతోత్సవం సందర్భంగా హైదరాబాదులోని నిజాం కాలేజిగ్రౌండ్స్‌లో పెద్ద సభ జరిపి సుశీలను ఘనంగా సన్మానించారు. 'సంగీతసరస్వతి' బిరుదును ప్రదానం చేశారు. ఆ మధ్య ఒక ప్రైవేటు టి.వి ఛానెల్ వారు సుశీల జీవిత స్వర్ణోత్సవవేడుకలను కూడా నిర్వహించారు.

కొన్ని అవార్డులు ఉంటాయి. వాటిని కనుక సాధించగలిగితే, ఆ సాధించినవ్యక్తికి కీర్తిప్రతిష్ఠలు వస్తాయి. కొందరు ఉంటారు. వాళ్లకి ఏదన్నా అవార్డు ఇస్తే, ఆ అవార్డుకే ప్రతిష్ఠ పెరిగిపోయినట్లు అనిపిస్తుంది. 2002 సంవత్సరానికి గాను, తెలుగు సినిమారంగానికి సంబంధించి అత్యుత్తమపురస్కారమైన 'రఘుపతి వెంకయ్య అవార్డు' సుశీలకు ఇవ్వడంవల్ల ఆమె కీర్తి పెరగడమే కాదు, ఆ అవార్డు ప్రతిష్ఠ కూడా ఇనుమడించిందనే చెప్పవచ్చు.

## ఈనాటి ఈ బంధమేనాటిదో!

పి.సుశీలది ప్రేమ వివాహం. విజయనగరం వారే అయిన గోదావరిరాజు గారి రెండవ కుమారుడైన డా॥ రాజా రామమోహనరావును ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. మోహనరావు మద్రాసులో జి.సి.ఐ.ఎమ్ చదువుతున్న సమయంలో పరిచయమయ్యారు. పరిచయమే ప్రణయంగా పల్లవించడంతో, కుటుంబసభ్యుల అనుమతితో ఆయననే వివాహం చేసుకున్నారు సుశీల.

సుశీల అంటే మోహనరావుకు చెప్పలేని అభిమానం. పైపెచ్చు కళాభిమాని కూడా. ఎంతటి విలువైన బంగారు పళ్లానికైనా గోడ చేరువ కావాలన్నట్లు ఎంతటి కళాకారులకైనా

ప్రోత్సాహం తప్పనిసరి. మోహనరావు సుశీలను కంటికిరెప్పలా చూసుకునేవారు. "ఆయన ప్రోత్సాహంవల్లే నేను యిన్నేళ్లు పరిశ్రమలో నిలబడగలిగాను" అంటారు సుశీల. సుశీల భర్త 1990లో మరణించారు. హైబ్లడ్ ప్రెషర్, హార్ట్‌ట్రబుల్‌తో బాధపడుతున్న భర్తను అమెరికాలో ఓపెన్‌హార్ట్ సర్జరీ చేయించడం కోసం, తన కుమారుణ్ణి (జయకృష్ణ) వెంటబెట్టుకుని వెళ్లారామె. గుండె ఆపరేషన్లలో ప్రపంచ ప్రసిద్ధిచెందిన డాక్టర్ జాన్సన్ మోహనరావుకు ఆపరేషన్ చేశారు. విజయం సాధించారు. కానీ ఆపరేషన్ జరిగిన ఆరవనాడే మోహనరావు కన్నుమూశారు. సంగీతంపై మక్కువతో 1957లో తనను పరిణయమాడి, రికార్డింగ్‌సమయాల్లో సైతం పాడటంలో తగిన సూచనలిచ్చిన తన జీవిత భాగస్వామి శాశ్వతనిష్క్రమణను ఆమె భరించలేకపోయారు.

మిల్వాకీ నగరంలోని విద్యుత్ స్మశానవాటికలోనే ఆయన అంత్యక్రియలు జరిగాయి. సుశీల పతి చితాభస్మంతో మద్రాసుకు తిరిగి వచ్చారు. భర్తృవియోగం తర్వాత కొంతకాలం పలుకైనా పలుకలేదు ఈ గానకోకిల. తర్వాత నెమ్మదిగా కోలుకున్నారు. ప్రస్తుతం తన కుమారుడు, కోడలు, (మేనకోడలినే కోడలిని చేసుకున్నారు) మనవరాలితో కలసి జీవిస్తున్నారు.

రాజసులోచన, అంజలీదేవి, దేవిక షావుకారు జానకి, కృష్ణకుమారి వంటి ఆ తరంవారి దగ్గరనుంచి మధ్యతరం శ్రీదేవి, జయప్రద, విజయశాంతి, ఆ తర్వాతి తరం రోజా, మీనా వరకు హీరోయిన్లందరికీ సుశీల పాడారు.

## అందుకే...

పి.సుశీల ఏడు దశాబ్దాల నుంచీ అంతే మధురంగా పాడుతూ వస్తున్నారు. నేటికీ పాడుతున్నారు. ఇక ముందు కూడా పాడుతారు. ఈ దుష్టవ్యాపారప్రపంచంలో మనమనుభవిస్తున్న వెతలు, వేదనలు, అలసటల నుంచి మనల్ని సేదదీర్చి మన హృదయాలమీద ఇంత పన్నీటిజల్లుల్ని చిలకరించడం కోసం మన మానసాకాశంలో ఈ కోకిల అలా ఎగురుతూ గానం చేస్తూనే ఉంటుంది. ఒక్క మనమే కాదు, మన తర్వాత తరాల వాళ్లూ, ఆ తరువాత తరాలవాళ్లూ, ఇంకా ఆ తర్వాత వాళ్లూ... ఇలా అనేకానేక తరాల దాకా ఆమె అందించిన ఈ మధుర రసానందాల్ని అలా ఆస్వాదిస్తూనే ఉంటారు.

**అందుకే ఆమె పి.సుశీల.**

**నైటింగేల్ ఆఫ్ ది సౌత్.**

**(22.02.2004 నాటి ఆంధ్రజ్యోతి ఆదివారం సంచిక నుండి)**

# ఏ పుటలో ఏ పాట...

1. భారతవీరకుమారిని నేనె ..................సంఘం (1954) ....................... 1

2. బాలనురా మదనా ... .................... మిస్సమ్మ (1955)........................ 3

3. అనురాగము విరిసేనా..................... దొంగరాముడు (1955) ................ 5

4. నడిరేయి గడిచేనే చెలియా ................ జయసింహ (1955) .................... 7

5. ఆనందం అర్ణవమైతే ..................... కన్యాశుల్కము (1955)............... 11

6. చందన చర్చిత ... ....................... తెనాలి రామకృష్ణ (1956)........... 14

7. పిలువకురా అలుగకురా ................. సువర్ణసుందరి (1957) .............. 17

8. నీవుండేదా కొండపై నా స్వామి ......... భాగ్యరేఖ (1957) .................... 20

9. సుందరంగా అందుకోరా ................ భూకైలాస్ (1958)..................... 22

10. పాలకడలిపై శేషతల్పమున ............ చెంచులక్ష్మి (1958).................. 25

11. తెలియని ఆనందం...................... మాంగల్యబలం (1959)............ 27

12. ఒకసారి ఆగుమా ఓ చందమామా........బండరాముడు (1959) .............. 29

13. సంగీత సాహిత్యలీల... ................. రాజామలయసింహ (1959)........ 31

14. చెంగు చెంగునా గంతులు వేయండీ... నమ్మినబంటు (1960)............... 35

15. జయ జయ జయ జయ శారదా....... మహాకవి కాళిదాసు (1960)......... 37

16. కవికోకిల తీయనిపలుకులలో ... ....... చివరకు మిగిలేది (1960)........... 39

17. సీతారాముల కల్యాణం ................. సీతారామకళ్యాణము (1961)........ 42

18. ఏమని పాడెదనో ఈవేళ................. భార్యాభర్తలు (1961)................ 46

19. మేలిమి బంగరు ......................... కలిసి వుంటే కలదు సుఖం (1961) .. 49

20. మదన సుందర నా దొరా ............... గులేబకావళికథ (1962) ............ 51

21. నీ చెలిమి నేడె కోరితినీ ... .............. ఆరాధన (1962) ...................... 53

22. మధురమైన గురుదీవెన ................ స్వర్ణమంజరి (1962) ................ 55

23. మహాదేవ శంభో ... ..................... భీష్మ (1962).......................... 58

24. అలిగిన వేళనె చూడాలి ... .............. గుండమ్మ కథ (1962)............... 59

25. సన్నగ వీచే చల్లగాలికి ... .............. గుండమ్మ కథ (1962)................ 61
26. నీకై వేచితినయ్యా ... ................... శ్రీకృష్ణార్జునయుద్ధం (1963) .. ..... 63
27. జననీ శివకామినీ ... ..................... నర్తనశాల (1963)..................... 64
28. సఖియా వివరించవే ................... నర్తనశాల (1963)..................... 66
29. వినిపించని రాగాలే ...................... చదువుకున్న అమ్మాయిలు (1963) .. 68
30. ప్రభు గిరిధారీ శౌరీ ..................... పరువు ప్రతిష్ఠ (1963) ............... 70
31. పూలు విరిసెను తేనె కురిసెను ......... పునర్జన్మ (1963) ...................... 72
32. దాచాలంటే దాగదులే .................. లక్షాధికారి (1963).................... 74
33. ఎందుదాగిఉన్నావో బృందావిహారీ ..... పూజాఫలం (1964) .................. 76
34. దూరానా నీలిమేఘాలూ ... ............ గుడిగంటలు (1964) ................ 77
35. గోదారి గట్టుంది ... ..................... మూగమనసులు (1964) ............. 79
36. మానూ మాకును కాను ... ............ మూగమనసులు (1964) ............. 81
37. నగుమోము చూపించవా గోపాలా ... అమరశిల్పి జక్కన్న (1964) .......... 83
38. పాడమని నన్నడగ తగునా ... .......... డాక్టర్ చక్రవర్తి (1964) ............... 85
39. నీవులేక వీణ పలుకలే నన్నది .... ..... డాక్టర్ చక్రవర్తి (1964) ............... 88
40. గోరొంక కెందుకో .... .................. దాగుడుమూతలు (1964)............ 91
41. ముత్యాల చెమ్మచెక్క ..................... బొబ్బిలియుద్ధం (1964) ............. 92
42. నిను చేర మనసాయెరా ................. బొబ్బిలియుద్ధం (1964) ............. 94
43. మల్లెపూవులు విరిసెరా .................. ఇల్లాలు (1965) ....................... 96
44. మనసునేదో కవ్విస్తూంది................. ఇల్లాలు (1965) ....................... 98
45. ఉంగరాల జుట్టూవాడు.................. ఉయ్యాల-జంపాల (1965)........ 100
46. రివ్వునసాగే రెపరెపలాడే ................ మంగమ్మ శపథం (1965)......... 101
47. పిల్లనగ్రోవిగ మారితిరా ................. కీలుబొమ్మలు (1965) ............. 103
48. ఏమిటో ఎందుకో........................ చంద్రహాస (1965).................. 105
49. తాకినచోట ఎంతో చల్లదనం........... వీరాభిమన్యు (1965) ............... 107

50. జయపాండురంగ ప్రభో విఠలా ......... సతీ సక్కుబాయి (1965)............ 109
51. కొమ్మల్లో పాలపిట్ట ...................... పిడుగురాముడు (1966)......... 112
52. నీలమోహనా రా రా.................... డాక్టర్ ఆనంద్ (1966) ............. 114
53. పెరుగుతున్నది హృదయమూ......... డాక్టర్ ఆనంద్ (1966)................ 116
54. సోగ్గాడే చిన్నినాయనా .................. ఆస్తిపరులు (1966) ................... 118
55. మీరజాలగలడా ........................ శ్రీకృష్ణతులాభారం (1966)........... 120
56. కనరానిదేవుడే కనిపించినాడే........... రంగులరాట్నం (1966) ............. 123
57. అమ్మకడుపు చల్లగా .................... సాక్షి (1967) .......................... 125
58. ఏమివ్వగలదానరా నాస్వామీ .......... వసంతసేన (1967) ................... 127
59. జీవము నీవే కదా దేవా................ భక్త ప్రహ్లాద (1967).................. 129
60. ఇది మల్లెల వేళయనీ... ............... సుఖదుఃఖాలు (1968) ............... 132
61. మనసే అందాల బృందావనం ........ మంచికుటుంబం (1968) ........... .135
62. వగకాడ బిగువేలరా .................... తిక్కశంకరయ్య (1968)............... 137
63. ఎందుకీ సందెగాలి..................... ఉండమ్మా..బొట్టుపెడతా (1968)....... 140
64. అడుగడుగున గుడి ఉంది.............. ఉండమ్మా..బొట్టుపెడతా (1968) ... ..142
65. వేణుగాన లోలుని గన ................. రెండుకుటుంబాల కథ (1970)........145
66. జగమే రామమయం.................... కథానాయిక మొల్ల (1970)........... 147
67. నీధర్మం నీ సంఘం .................... కోడలు దిద్దిన కాపురం (1970) ..... 151
68. మహాబలిపురం మహాబలిపురం ...... బాలరాజు కథ (1970) ............... 155
69. పాడెద నీనామమే గోపాలా ............ అమాయకురాలు (1971)........... .158
70. ఆలయమేలా అర్చనలేలా .............. సతీ అనసూయ (1971) ............. 160
71. ఎన్నిజన్మల ఎన్నినోముల .............. సతీ అనసూయ (1971) ............. 162
72. ఊరికే కొలను నీరు .................... సంపూర్ణరామాయణం (1972)....... 164
73. మాటలకందని భావాలు ............... నీతి నిజాయితీ (1972) .............. 167
74. తిరుమల మందిర సుందర... ........ మేనకోడలు (1972).................. 168

75. ఈనాడే బాబూ నీ పుట్టినరోజు... ..... తాత-మనవడు (1973) ............. 170

76. మీ నగుమోము నా కనులారా... ..... బడిపంతులు (1973) ................ 172

77. నీ మది చల్లగా ........................ ధనమా? దైవమా? (1973) ........ .. 174

78. శ్రీరామ నామాలు శతకోటి ........... మీనా (1973) ......................... 177

79. ఈ వీణకు శ్రుతిలేదు ................. దేశోద్ధారకులు (1973) ............... 179

80. సరిసరీ వగలు తెలిసెర గడసరీ ....... భక్త తుకారాం (1973) ............... 181

81. మల్లెపందిరి నీడలోన ................. మాయదారి మల్లిగాడు (1973).. .... 184

82. వీణలోనా తీగలోనా .................... చక్రవాకం (1974) .................... 186

83. వస్తాడు నారాజు యీ రోజు ........... అల్లూరి సీతారామరాజు(1974)........ 189

84. రాధకు నీవేర ప్రాణం ................. తులాభారం (1974) ................ 193

85. దీపానికి కిరణం ఆభరణం ............ చదువు-సంస్కారం (1974) ........ .. 194

86. ముత్యమంతా పసుపు... ................ ముత్యాలముగ్గు (1975) ............. 196

87. నిదురించే తోటలోకి.... ................ ముత్యాలముగ్గు (1975) ............. 198

88. మ్రోగింది వీణా ........................... జమిందారుగారి అమ్మాయి(1975) ...... 200

89. స్వరములు ఏడైనా రాగాలెన్నో... ..... తూర్పు-పడమర (1976) ............ 202

90. తెల్లవారకముందే పల్లె లేచింది.... .... ముత్యాలపల్లకి (1976)............... 205

91. పాడనా తెనుగుపాట.... ................ అమెరికా అమ్మాయి (1976) ........ 208

92. ఆకాశపందిరిలో ... ..................... శ్రీరాజేశ్వరీవిలాస్ కాఫీక్లబ్(1976) .... 210

93. ఏ తల్లి నినుగన్నదో ..................... దానవీరశూరకర్ణ (1977) ............. 212

94. ఎవరు నేర్పేరమ్మ ఈ కొమ్మకూ ... .... ఈనాటిబంధం ఏనాటిదో (1977)..... 215

95. రాయినైనా కాకపోతిని.... ............... గోరంతదీపం (1978) ............... 217

96. జోరుమీదున్నావు తుమ్మెదా.... ......... శివరంజని (1978) ................... 219

97. గోరింటపూచింది కొమ్మలేకుండా.... .. గోరింటాకు (1979) .................... 221

98. ఆకులో ఆకునై పూవులోపూవునై..... ... మేఘసందేశం (1982) ................ 224

99. నిన్నటిదాకా శిలనైన.... ................ మేఘసందేశం (1982) ................ 226

100. వటపత్రశాయికి వరహాల లాలి ...... స్వాతిముత్యం (1986) ................. 229

# సంఘం (1954)

❖ తోలేటి ❖ ఆర్.సుదర్శనం

ఆ..ఆ..ఆ..

లల్లలాల్ల లలల్లాల లాల్ల లాల్ల లాల్ల..లల్ల..

భారతవీరకుమారిని నేనె నారీ రతనము నేనె

భారతనారీ అభ్యుదయానికి నాయకురాలిని నేనె ||భారత||

స్వార్థముతో ... కులమతభేదముతో

సతతము పోరే భరతావనిలో శాంతిజ్యోతి వెలిగిస్తా ||సతతము||

కర్షకసౌఖ్యం...కర్షకసౌఖ్యం కార్మికశ్రేయం ||కర్షక||

కలిగే మార్గం చూపిస్తా ||కలిగే||

రాణీ రుద్రమ మల్లమదేవి రెడ్డినాగమ్మ నేనే ||రాణీ||

రణతిక్కనభార్యా సతిమాంచాల

తిక్కన భార్యా సతి మాంచాల

శౌర్యధైర్యములు నావే ||శౌర్య|| ||భారత||

ఓహో... ఓహో...ఓహో...



చక్కని కథాంశం, సందేశం, ప్రతివారూ ఇది నా కథ, నా పాట అనుకునే చిత్రాలు నిర్మించి పేరు తెచ్చుకున్న సంస్థ ఏ.వి.యమ్. "జీవితం" చిత్రంతో జైత్రయాత్ర ప్రారంభించిన ఏ.వి.ఎమ్ తీసిన మరోచిత్రం "సంఘం". రెంటిలోనూ వన్నెలచిలుక వైజయంతిమాలే కథానాయిక.

ఆమెపై చిత్రీకరించబడ్డ పాటే ఇది. పాట ప్రారంభమే ఒక చక్కని ఆలాపన... 'లల్లలాల్లలా' అంటూ సాగి, పాటలోని భావం దేశభక్తి, ఉత్తేజం, చైతన్యం అని మూడుపాయలుగా మారి మళ్లీ ఒక స్వరప్రవంతిలా ప్రవహిస్తుంది. వైజయంతిమాల గుర్రంపై స్వారీచేస్తూ తనను రాణీ రుద్రమగా, మల్లమదేవిగా భావించుకుంటూ గుఋ్ఱపుడెక్కల నిక్వణంలో, తల ఎగరేస్తూ, జాతిని మేల్కొల్పుతూ సాగే యీ పాటలో



తోలేటి

సుశీల గాత్రంలో ఒక స్వచ్ఛత, గంభీరత, ఆత్మవిశ్వాసం ప్రతిఫలించి, పాట వింటుంటే శ్రోతలు రోమాంచితులౌతారు. ఎనలేని స్ఫూర్తిని పొందుతారు. అప్పటికి భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడు సంవత్సరాలైంది. దేశభక్తిగీతాలు పుంఖానుపుంఖాలుగా ప్రజలనోళ్లలో నానుతున్నాయి. ఇక కావాల్సింది కార్మిక, కర్షక సంక్షేమం. ఈ రెంటిమీద దృష్టి నిలపాల్సిన బాధ్యతను యీ పాట మరోసారి మహిళా తేజోమూర్తులను స్మరిస్తూ గుర్తు చేసింది.

స్వరకర్త ఆర్.సుదర్శనం, టంగుటూరి సూర్యకుమారి పాడిన 'మా తెనుగుతల్లికి మల్లెపూదండ' లాంటి పాటలకు అజరామర వరసలు చేసిన ప్రతిభాశాలి. ఆయన యీ పాటను మోహన, బిలహరి రాగాల మిశ్రమంలో స్వరపరచినా సుశీల పాడిన విధం చూస్తే కదనకుతూహలరాగంలోని వీరరసం, సైనిక కవాతులోని పోరాటపటిమ, యుద్ధానికి సన్నద్ధమైనవేళ నగారా మ్రోగినట్లు అనుభూతి కలుగుతుంది. ఈ మూడురాగాలు ధీర శంకరాభరణ జన్యరాగాలే కాబట్టి యీ పాట శంకరాభరణరాగంగా చెప్పవచ్చు. 'చెంగుచెంగున' (నమ్మినబంటు', 1960) పాటలో కూడా ఇవే ధోరణులు, పోకడలు కన్పిస్తాయి.

సుశీల పాడిన అనేక దేశభక్తిగీతాలలో యీ పాటొక చక్కని ప్రేరణగీతంగా చెప్పుకోవచ్చు. పాట చిత్రీకరణ చూస్తే, తురంగం చెంగుచెంగున దూకుతోందా? పాట చెంగుచెంగున సాగుతోందా? అటు కవిభావన, స్వరకర్త ప్రతిభ, నటి హావభావాలూ అన్నీ ఒక్క సుశీల గాత్రంలోనే ఇమిడిపోయాయా? అనే సందేహం కలుగక మానదు. అరవైమూడుఏళ్లు దాటినా నాటి ప్రేక్షకుల హృదయాల్లో గ్లామర్‌క్వీన్ అంటే వైజయంతిమాలే అని స్థిరపడిపోవడానికి బాగా దోహదం చేసిందీ యీ పాటే. ఇప్పటికీ యీ పాటను పూర్తిగా పాడుకునే అభిమానులెందరో!

# మిస్సమ్మ (1955)

❖ పింగళి ❖ యస్.రాజేశ్వరరావు

బాలనురా మదనా ॥బాల॥
విరితూపులు వేయకురా మదనా ॥బాలనురా॥

నిలచినచోటనె-నిలువగనీయక... ॥నిలచిన॥
వలపులు కురియునురా-తీయని
తలపులు విరియునురా-మదనా ॥బాలనురా॥

చిలుకల వలె గోర్వంకల వలెనూ...
కులుకగ తోచునురా తనువున
పులకలు కలుగునురా మదనా ॥బాలనురా॥

చిలిపికోయిలలు చిత్తములోనే... ॥చిలిపి॥
కలకల కూయునురా మనసును
కలవర పరచునురా-మదనా ॥బాలనురా॥

ఆ మంజుల గళం ఒక్కసారి “షడ్జమం” పలికితే సకారం ఓంకారమై, నిరాకారం సాకారమౌతుంది.

“రిషభాన్ని” పలికితే రిక్కలన్నీ నేలపై వాలినట్లు లయాత్మక ధ్వనులన్నీ వినిపిస్తాయి.

“గాంధారం” పలికితే గాంగేయ నిక్వణాలు గాదిలి గాలితో జతకలిపి గాయని జన్మ ధన్యం అవుతుంది.

“మధ్యమం” పలికితే మధుత్రయాలు (తేనె, పంచదార, నెయ్యి) గొంతులో ప్రవహించినట్లు అన్పిస్తుంది.

‘‘పంచమం’’ పలికిస్తే జలతారుపట్టు గళతంత్రులు పట్టుతేనెను గ్రోలి పలికినట్లుంటుంది.

“దైవతం” ఆ గొంతులో ధ్వనిస్తే దశమినాటి వెన్నెలలు ధవళ దయారస కాంతులతో చిలికినట్లుంటుంది.

“నిషాదం” ఆ గాత్రంలో జనిస్తే నిష్కర్షగా, నిర్మలంగా నిష్పారతీరాలలో నినదిస్తుంది.

ఇవన్నీ కలగలిసిన మాధుర్య గాత్రధారిణి సుశీల. అందుకు తార్కాణం యీ పాట. సంపూర్ణమేళకర్త రాగం అయిన ‘ఖరహరప్రియ’ సోయగాలు, శోభలు సుశీల గాత్రంలో



పింగళి

పైన చెప్పిన విధంగా పలికాయి. ఈ పాటకు జమున అభినయం, పసుమర్తి నృత్యం, పింగళి శుకపాళి కలం నుండి జాలువారిన పదాలు, సాలూరి సుస్వరాలు, సుశీల గాత్రంలో రాగపరీమళాలు ప్రయాణం చేసిన తీరు శ్లాఘనీయం. జావళీగీతాలకు సమోన్నతస్థాయిని తన గొంతులో సుశీల పలికిన విధానం చిరస్మరణీయం. వీణ, మృదంగరవళితో ప్రారంభమైన పాటలో 'నిలువగ నీయక...' తర్వాత వచ్చే ఆ ఆలాపన.. 'గోర్వంకలవలెనూ'.... తర్వాత 'ఓంకార ప్రయోగం, 'చిలిపికోయిలలు'.. తర్వాత ఏకార ఆలాపన...పాట ముగింపులో 'మదనా'.. ఈ విధంగా అకార, ఓంకార, ఏకార ఆలాపనలు పరిపుష్టంగా పలికిన తీరు చూస్తే స్వరకర్త ప్రతిభ, గాయని విశేష ప్రజ్ఞాపాటవాలు 'జావళీ'కి నిర్వచనంలా తెలియవస్తాయి.

లబ్ధప్రతిష్ఠులందరూ ఒక చోట కలిస్తే పాట ఇలాగే నిత్యనూతనంగా, జనరంజకంగా ఉంటుందనడానికి ఉదాహరణ ఈ జావళీ. సుస్వరాలకు స్పందించే ప్రతిశ్రోత మనసారా విని ఆనందించదగ్గ పాటల్లో ఇదొకటి.

సాహిత్యపరంగా చూస్తే, ''చిలుకలు గోరింకలు'' భావనను నిర్దుష్టంగా, హృద్యంగమంగా అందించిన ఏకైక సినీకవి పింగళి. ఆదర్శవంతమైన జంటను చిలుక గోరింకల జంటతో పోలుస్తూ ఎందరో కవులు పాటలు రాశారు. కానీ, చిలుకలు– గోరింకలు వేర్వేరు జంటలు. లోకంలో ప్రాచుర్యంలో ఉన్న యీ భ్రమను, అపోహను తొలగిస్తూ "చిలుకల వలె గోర్వంకల వలెనూ..." అంటూ వేటిపాటికి వాటిని వేరుచేసి చూపారీ పాటలో.

ప్రాస లక్షణం పకడ్బందీగా ఉన్న యీ గీతం చిత్రంలో సన్నివేశపరంగా చాలా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పాటతోనే పంతులమ్మ పాఠం పాఠశాల నుండీ ఇంటి దాకా వస్తుంది.

ఏ సుముహూర్తంలో సుశీల జమునకు ప్లేబాక్ పాడారో గానీ ఆ తరంలో ఆమె గాత్రం జమునకు సరిగ్గా సరిపోయింది.

# దొంగరాముడు (1955)

❖ సీనియర్ సముద్రాల ❖ పెండ్యాల

**ఆ..... ఆ....ఆ....ఆ....**
**అనురాగము విరిసేనా ఓ రేరాజా...**
**అనుతాపము తీరేనా!**
**వినువీధినేలే రాజువే**
**నిరుపేద చెలిపై మనసౌనా? ॥అనురాగము॥**

**నిలచేవు మొయిలు మాటున**
**పిలిచేవూ కనులగీటునా! ॥నిలిచేవు॥**
**పులకించు నాదు డెందము**
**ఏనాటి ప్రేమాబంధమో! ఓ రేరాజా**
**అనురాగము విరిసేనా...**
**మునుసాగే మోహాలేమో**
**వెనుకాడే సందేహాలేమో ॥మునుసాగే॥**
**నీ మనసేమో తేటగా**
**తెనిగించవయ్యా మహరాజా! ఓ రేరాజా..**
**అనురాగము విరిసేనా...**
**వినువీధినేలే రాజువే**
**నిరుపేదచెలిపై మనసౌనా**
**అనురాగము విరిసేనా...**

సాహిత్యానికి తగిన సంగీత వైభవం కలిగిన పెండ్యాల చిత్రం 'అన్నపూర్ణ' వారి "దొంగరాముడు". అశేష అభిమానుల హృదయాల్ని ఒక్కుమ్మడిగా దొంగిలించిన చిత్రమిది. సుతిమెత్తని సుస్పష్టగాత్రంలో ఏ పాటనైనా, ఎలాంటి పాటనైనా, ఎంతటి పాటనైనా అవలీలగా పాడేయగల సుశీలకు, సినీరంగప్రవేశపు తొలిరోజుల్లో గాయనిగా బంగారు భవిష్యత్తును ఇచ్చిన పాట ఇది. పారిజాతసుమాలను, పొగడపూలను, మల్లెలను కలగలిపి అల్లిన సుమహారంలా ఉంటుందీ పాట. పదకర్త, స్వరకర్త, స్వనదాత కలిసిన త్రివేణీ మంజుల సంగీత సౌరభాలు గుబాళిస్తుంటాయి ఈ పాటలో.

సీ॥సముద్రాల లేఖిని యీ చిత్రంలో యీ కథాగీతాన్ని ఎంతో ఔచిత్యవంతంగా రాసి ఏకకాలంలో రెండు లక్ష్యాలు సాధించింది. కథానాయిక (జమున), నాయకుణ్ణి (జగ్గయ్య) దృష్టిలో పెట్టుకుని అన్యాపదేశంగా చంద్రుణ్ణి ఉద్దేశించి పాడే పాట ఇది. కథానాయిక నిరుపేద. నాయకుడేమో సంపన్నుడు, విద్యాధికుడు. అందువల్ల తనపట్ల అతని దృష్టి ఏమిటో, ఎలాంటిదో తనకు తెలీదు. కానీ తనస్థాయి ఏమిటో తనకు తెలుసు. ఇలాంటిస్థితిలో తను గభాలున తన ప్రేమభావాల్ని వ్యక్తీకరించేస్తే, అతడు ప్రతికూలమైతే, అభాసుపాలవుతానేమోననే భయాందోళన. ఈ మీమాంస భావాన్ని అటు జమున ముఖతః, ఇటు సుశీల గాత్రం ద్వారా చాలా చక్కగా ఆవిష్కరించారు సముద్రాల. ఆ డోలాయమానస్థితిని, మానసిక అనిశ్చితిని జమున చాలా పరిణతితో తెరపై ప్రదర్శించారు. జమునకు ఉన్న 'పన్ను మీద పన్ను' యీ పాటలో ఓ ప్రత్యేకాకర్షణ. ఇది ఆ తర్వాత ఆమెకు చాలా సినిమాల్లో అదనపు యోగ్యతైంది.

పెండ్యాల ఏనాడూ హోలెడు ఆర్కెస్ట్రాతో బోలెడు రొదచేసే వాద్య మహాసభలు ఏర్పాటు చేసి రికార్డింగులు చేయలేదు. శబ్దాడంబరం గాక నాదాత్మ ఆయన స్వరకల్పనలో ధ్రువంగా దర్శనమిచ్చేది. శ్రవణేంద్రియానికి దర్శనమిచ్చే ఆలాపన అది. రవమది...రాగమది. పొగడపూలమాలను గుర్తుచేసే యీ సుకుమార సురభిళ గేయపంక్తులకు హిందూస్తానీ తోడి, నటభైరవి రాగాల మిశ్రమంలో పెండ్యాల స్వరాభిషేకం చేశారు. సుశీల తనవంతుగా తాను యీ పాటకు పంచామృత గాత్రాభిషేకం చేసినట్లుంటుంది. ఇది నిజమో కాదో ఒకసారి 'ఓ రేరాజా...', ' నిరుపేద చెలిపై మనసౌనా?' అన్న పంక్తులను మననం చేసుకోండి. సుశీల గాత్రధర్మాలు పారిజాతాల గుబాళింపుల్ని ఇస్తాయి. ఓ విధంగా చెప్పాలంటే సుశీలకు స్వరప్రియత్వమే కాదు, అక్షరప్రియత్వం, సాహిత్యాభిలాష మెండుగా ఉన్నందువల్ల పదాలలోని రమ్యత, రసికతలను అవలీలగా ఔపోసన చేయగల ధీశాలి అయ్యారు. జాలితో కూడిన కరుణరసాన్ని, నిస్సహాయతతో కూడిన నిర్లిప్తతలను యీ పాటలో చాలా అద్భుతంగా పలికించారామె.

సుశీల గళంలో స్వరసౌకుమార్యధోరణులు బాగా విన్పిస్తాయి. అది ఏ రసమైనా సరే. ఆకాశంలోని చందమామకు, నేలమీది చెలియపై ప్రేమ కలగడం, మేఘాల చాటున నిలవటం, కనుగీటుతో పిలవడం, మనసు పులకించడం వంటి భావాల్ని ఆమె పలికిన తీరు ఎంతో హృద్యంగా, లలితంగా ఉంటుంది.

సుశీల పదిహేనురోజులు రిహార్సల్సు చేసారీ పాటకు. ఎంతటి పాటనైనా మంచినీళ్లు తాగినంత తేలికగా పాడే ఆమె, ఒక్క పెండ్యాల సంగీతంలో మాత్రం 'తిరుమల తిరుపతి వేంకటేశ్వరా' (ఎస్.వరలక్ష్మితో కలసి, 'మహామంత్రి తిమ్మరుసు', 'మీరజాలగలడా' 'శ్రీకృష్ణ తులాభారం') పాటలకు చాలా శ్రమించారు. అందుకే అవి క్లాసిక్స్ అయ్యాయి. గాయనీగాయకుల ప్రతిభలకు వన్నెతెచ్చిన యిలాంటి పాటలెన్నో నలుపు-తెలుపు చిత్రాల స్వర్ణయుగానికి ప్రతీకలుగా, ప్రమాణాలుగా నిలిచిపోయాయి.

# జయసింహ (1955)

❖ జూనియర్ సముద్రాల ❖ టి.వి.రాజు

నడిరేయి గడిచేనే చెలియా
రాడాయెనే సామి నా సామి
రాడాయెనే సామి నేడూ ॥నడిరేయి॥
ఎదురూతెన్నులూ చూచి చూచి
ఓ చెలియా వానికై వేచి వేచి నేడూ ॥నడిరేయి॥

నడిరేయి గడిచేనే...
గగనాన నెలరేడు దిగజారిపోయె
సిగలోని విరులన్ని వసివాడిపోయె! ॥గగనాన॥
దిగులాయెనే.. దిగులాయెనే...
మది వగలే మిగులాయే
మగరాయ డేవాడ మసలేనో నేడూ ॥నడిరేయి॥

గడపా పడిగాపు పడియుండలేనే!
గడియొక్క యుగమూగ గడూపగలేనే ॥గడపా॥
ఎడబాటుతో... ఎడబాటుతో...
గమరిస రిసనిసదప గమరిగమ... ఎడబాటుతో
సాసా పనిద సాసా మనిదప రిగమద మనిదపా
పనిదస నిరీస్సనిద స్సానిదపనీదపమ ఎడబాటుతో
సా..నీ..దా..సా..సనిదపమ
నీ..దా..పా..నీద నిదపమగ
మాపమగమగమ పాదప మపమస
దానిద పదపద నినిసని ససనిద పపదపమప
ఎడబాటుతో యీ సడిలేని రేయి
కదలేని కన్నీరై నిలువాగ లేనే ॥నడిరేయి॥

"పిచ్చిపుల్లయ్య", "తోడుదొంగలు" వంటి ప్రయోగాత్మక చిత్రాలు తీసి చేతులు కాల్చుకున్న 'నేషనల్ ఆర్టు థియేటర్సు' వారు జానపదాలవైపు దారిమళ్లి "జయసింహ"





జూనియర్ సముద్రాల

నిర్మించి జాక్‌పాక్ కొట్టారు. సినిమా టైటిల్స్‌లోనూ, పాటల పుస్తకంలోనూ యీ పాట రచన జూనియర్ సముద్రాల అని ఉంది. అయితే యీ పాట అర్థం, అందం పానగల్ పార్కులో కూర్చుని వి.ఏ.కె.రంగారావుకు మల్లాదివారే చెప్పారట. ఆ పాట వారి రచనేనని వి.ఏ.కె.తో వెంపటిసత్యం అన్నారట. దీన్నిబట్టి యీ జావళీ మల్లాదివారి కలం నుండీ వెలువడి జూ॥సముద్రాల పేరుతో చెలామణీలోకి వచ్చి ఉంటుంది. అలాగని ఆ తండ్రీకొడుకుల పేరుతో వచ్చిన ప్రతిపాటా మల్లాదివారే రాసుంటారనుకోవడం పొరబాటు. పోకడను బట్టి నిర్ణయించుకోవాలి.

మన సినిమాలలో అప్పట్లో దజనుపాటలతో పాటు ఒకటో రెండో డాన్సులు విధిగా ఉండేవి. అవన్నీ డాన్సులు కాకపోయినా ఆ పేరుతో చెలామణీ అయిన అంగవిన్యాసాలు. ఈ అంగవిన్యాసాలు మొదట్లో, అంటే 1940–1950 ప్రాంతాల్లో చక్కగా మంచి పదాలకు శాస్త్రీయమైన అభినయాలుగా ఉండేవి. ఇంకా వీటిముందు వచ్చిన సినిమాలలో, అంటే 1935–1939 మధ్య నాట్యాలు పూర్తిగా (అప్పట్లో) బొంబాయి మార్కు మిడతల గంతులుగానే ఉండేవి.

ఆ తర్వాత వచ్చిన చిత్రాలలో ముఖ్యంగా 'వాహినీ' వారి సమర్పణలో ఉన్న జావళీలు వినటానికీ, చూడడానికీ చాలా మనోహరంగా ఉండేవి. "భక్తపోతన"లోని 'ఇది మంచి సమయము రారా', "స్వర్గసీమ" లోని 'హాయి సఖి' మొదలైనవి వింటే మరి వదలలేనట్టుగా

ఉంటాయి. ఆ పాటల మాధుర్యానికి చాలావరకు కారకులు సంగీతదర్శకుడు నాగయ్య, రచయిత సీనియర్ సముద్రాల. ఆ తర్వాత సంవత్సరాలలో ఫక్తు జావళీలన్నా, శాస్త్రీయాభినయమన్నా మోజు తగ్గినా అడపాదడపా మంచి నృత్యాలు కనబడుతూనే ఉండేవి.

ఇటువంటి శాఖకు చెందిన పాటే యీ 'నడిరేయిగడిచేనే చెలియా'. టి.వి.రాజు యీ పాటకు మంచి వరస అమర్చటమే కాకుండా, నృత్యానికి అనువైనటువంటి శబ్దాలు యీ పాటలో ఇమిడ్చారు. "బేగడ" రాగంలో పాలమీగడలా కమ్మగా, సుశీల తన కమ్మనికంఠం నుండీ కుమ్మరించిన మోహనగానం వినగా 'నడిరేయి గడిచేను' అనే పాట పల్లవి 'అబద్ధమని' పిస్తుంది. ఎందుకంటే యీ పాట వింటుంటే నడిరేయెంతకీ గడవనే గడవదు. తీయనితలపు విడువదు. నిముషం కూడా నడవదు. 'ఏరువాక' తో బొంబాయికి సాగిపోయిన వహీదారెహమాన్‌పై చిత్రీకరించిన పాట యిది. ఆరుపదులకాలం దాటిపోయినా ఏదో కొత్తదనం కొట్టొచ్చినట్లు కన్పించి హృదయానందం కలిగించే పాట ఇది. శాస్త్రీయ సంగీతకచేరీల స్థాయిలో చలనచిత్రగీతాలను కూడా స్వరపరచి దాన్ని నాట్యరీతులకు అనువుగా మలచి గాత్రవిన్యాసాల్ని చేయవచ్చునని నిరూపించిన పాటల్లో ఇదొకటి.

'సిగలోని విరులన్ని వసివాడిపోయె.. దిగులాయెనే...' అంటూ ఏఏ.. అనే ఆలాపన తర్వాత 'నేడు...' అనే చోట పలికిన విరుపులు, 'ఎడబాటుతో... ఓ..' అంటూ చేసే ఆలాపనలు వెనువెంటనే...పలికే ఖరహరప్రియ స్వరాల సముచ్ఛయం గమరిస...నిసనిసగప... గపనిసమ సా...సా...నిస.. అంటూ పలికిన సుందర స్వరాలన్నీ నట్టువాంగంతో పోటీపడి పలికాయి సుశీల గాత్రంలో.

ఈ పాటను స్వరాలతో సహా పాడి మెప్పించాలని ఔత్సాహిక గాయనీమణులు ప్రయత్నించడం నేటికీ పాటలపోటీల్లో చూస్తూనే ఉన్నాం. కారణం పాటలో ఒక క్రొత్తదనం. ఆ గాత్రంలో ఒక స్వచ్ఛత.

కొన్నిపాటలు వింటుంటే ఆ గాయని పరిణితులు, స్థాయీబేధాలు తెలుస్తుంటాయి. కొన్ని మనసును సున్నితంగా స్పృశించి తెలీని హాయిని, ఆనందాన్ని కలిగిస్తాయి. ఒకే రాగంలో స్వరపరచినా ఎంత వైవిధ్యం, ఎంత నేర్పరితనం అనిపించి రాగానుభవంతో హృదయం రసప్లావితం అవుతుంది.

రాగంతో పాడుకోవడానికే కాకుండా, భావంతో ఆడుకోవడానికి అనువైన పద్ధతిలో ఉందీ జావళీ. సుశీల కంఠం మెత్తని మామిడిచివుళ్లు మెసవి మత్తెక్కిన కోయిల కంఠంలా శ్రోతలను ముగ్ధుల్ని చేస్తుంది. 'గడపా పడిగాపు పడియుండలేనే'... అన్న పంక్తి ఎంత మండుటెండలో విన్నా మంచి వెన్నెలనే తలపిస్తుంది.

# కన్యాశుల్కము (1955)

❖ శ్రీశ్రీ ❖ ఘంటసాల

ఆనందం అర్ణవమైతే
అనురాగం అంబరమైతే ॥ఆనందం॥

అనురాగపుటంచులు చూస్తాం!
ఆనందపులోతులు తీస్తాం! ॥ఆనందం॥

ఆనందం....
నీ కంకణ నిక్వాణంలో
నా జీవన నిర్వాణంలో...
నీ మదిలో డోలలు తూగి
నా హృదిలో జ్వాలలు రేగి...
నీ తలపున రేకులు పూస్తే
నా వలపున బాకులు దూస్తే... ॥నీ తలపున॥
మరణానికి ప్రాణం పోస్తాం
స్వర్గానికి నిచ్చెన వేస్తాం ॥ఆనందం॥

ఆ ...
హసనానికి రాణివి నీవై
వ్యసనానికి బానిస నేనై
విషమించిన మదీయఖేదం
కుసుమించిన త్వదీయమోదం
ఆ....
విషవాయువులై ప్రసరిస్తే
విరితేనియలై ప్రవహిస్తే ॥విష॥
ప్రపంచమును పరిహసిస్తాం
భవిష్యమును పరిపాలిస్తాం ॥ప్రపంచము॥ ॥ఆనందం॥

కథాపరంగా మేజువాణికి తగని పాట ఇది. సినిమానాటికే ఇది శ్రీశ్రీ స్వతంత్ర రచనగా ప్రసిద్ధం. (కొద్దిమార్పులతో 'మరదలుపెళ్లి' లో వినవచ్చింది కూడా) ఈ శ్రీశ్రీ



‘అద్వైతం’ ఖండిక సాధారణ ప్రేక్షకులకు ఏమాత్రమూ అర్థం కాదు. పైగా ఆ వస్తువుకీ, మేజువాణికీ చుక్కెదురు. లోతులకెళ్లి పరిశీలిస్తే, మధురవాణి పాత్ర ఉదాత్తతను తగ్గించిందీ పాట. వేదిక కింద చదలవాడ ప్రభృతులు చప్పట్లు కొట్టడం, సావిత్రి వారితో పాటు చప్పట్లు కొట్టడం ఇవన్నీ మామూలుగా గ్రామాల్లో కన్పించే చౌకబారు రికార్డింగ్‌ట్రూపు పాటల సన్నివేశాల్ని తలపింపచేయడం బాధాకరం. ఆ మధ్య వచ్చిన ‘బావలు సయ్యా’ పాటలాగా ఉంటుందీ పాట. ఉండవచ్చు తప్పులేదు ఆ పాత్ర అలాంటి పరిధిలో ఉంటే. కానీ ‘మధురవాణి’ పాత్ర ఒక మణిపూస. నాటకంలో కూడా రామప్పంతులు ఆమెతో మేజువాణీ పెట్టిస్తానంటాడే గానీ అలా చేయడు. ఇది సినిమా కదా, ఓ వేళ సావిత్రి గ్లామర్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ పాట చిత్రీకరించినా పాత్రస్థాయిని తక్కువచేయడం ఏమాత్రం బాగులేదు. పైగా యీ సన్నివేశగీతంలో సంగీతదర్శకుడైన ఘంటసాల విజయనగరం సానుల సంగీతాన్ని విన్పించి ఉంటే సమయోచితంగా ఉండేది.

ఈ లోపాలన్నీ పక్కకు పెడితే... యీ పాటలో మధురవాణినే సవాలు చేయగల్గిన రూప, వచో, నటనాభినయ మాధురులు సావిత్రివి అని ఇట్టే తెలుస్తుంది. రంగస్థలంపై ఎందరో ఆ వేషాన్ని వేసారు కానీ సావిత్రే మధురవాణి. ఇందులో ఆమె అభినయం, ఆంగిక, నాట్యభంగిమలు, కవ్వింపులు, హొయలు, వయ్యారాలు, నయగారాలు, కళ్లతో, పెదవులతో చూపిన కదలికలు అన్నీ నభూతోనభవిష్యతి.

ఈపాటను విన్నాక ఇది ఏరాగమో చెప్పటం దుస్సాహసమే అయినా ఘంటసాల స్వరకల్పనాచాతుర్యానికి యీ పాట ఒక నిదర్శనం. ఒక క్రమాలంకారంతో మొదలైన పల్లవిని, తదుపరి చరణాలను మోహన, కల్యాణి రాగాలను కలుపుకుంటూ అర్ణవాన్ని, అంబరాన్ని ఆరోహణ, అవరోహణ క్రమాలను చక్కగా స్వరపరిచారు. నాదం ధ్వనించగానే



ఘంటసాల



శ్రీశ్రీ

పాదం పాదం నర్తిస్తుందనటానికి యీ పాటలోని సుశీల గాత్రం, సావిత్రి అభినయమే నిదర్శనాలు.

ఇంకా చిత్రమేమంటే 'మధురవాణి' సుశీలే. మృదుమంజుల గాత్రంతో ఆమె అటు పాత్రలో పరకాయప్రవేశంచేసి ఆలపించారు. పాట మధ్యలో తీసిన ఆలాపనలు రసప్రవాహంలో, స్వరగంగలా వినిపిస్తాయి. ప్రతిపదంలోనూ సుశీల గాత్రంలోని మధురిమలు సావిత్రి నటనతో పోటీపడి అటు నటిగా సావిత్రి, ఇటు గాయనిగా సుశీల ఉత్తరోత్తర మేటికళాకారిణులుగా దశాబ్దాల కాలం కొనసాగేలా చేసాయి. సావిత్రికి సుశీల గాత్రదానం చేయగా విజయవంతమైన మొట్టమొదటి పాట ఇది.

పాట మొదట విలంబితంగా మొదలై పల్లవి, చరణాలలో అందుకున్న వేగం అటు నాట్యానికి, ఇటు గానానికి జుగల్‌బందిగా సాగాయి. పాట మధ్యలో సావిత్రి చప్పట్లు కొడుతూ రసికజనాన్ని రెచ్చగొట్టడం... తదనుగుణంగా సుశీల గొంతు కలపడం... తెరపై వీక్షించడం ఒక మధురానుభూతి. మొదట్లో చాలా పీలగా ఉండే సుశీల గాత్రం క్రమంగా గాంభీర్యత సంతరించుకోవడం యీ పాటలో మనం గమనించవచ్చు.

# తెనాలి రామకృష్ణ (1956)

❖ జయదేవకవి ❖ విశ్వనాథన్ - రామమూర్తి

హరి రిహ ముగ్ధ వధూనికరే
విలాసిని విలసతి కేళిపరే
చందన చర్చిత నీలకళేబర పీతవసన వనమాలీ
కేళి చలన్మణి కుండల మండిత గండయుగ స్మితశాలీ
హరిరిహ ముగ్ధవధూనికరే విలాసిని విలసతి కేళిపరే
కాపి విలాస విలోల విలోచన ఖేలన జనిత మనోజం ॥కాపి॥
ధ్యాయతి ముగ్ధవధూరధికం మధుసూదన వదన సరోజమ్ ॥ధ్యాయతి॥
శ్లిష్యతి కామపి చుంబతి కామపి రమయతి కామపి రామాం ॥శ్లిష్య॥
పశ్యతి సస్మిత చారుతరా మపరా మనుగచ్ఛతి వామామ్
హరిరిహ ముగ్ధవధూనికరే! విలాసిని విలసతి కేళిపరే..,
చందనచర్చిత నీలకళేబర పీతవసన వనమాలీ



శ్రీకృష్ణుని మీద జయదేవుడు గీతగోవింద రచన గావించి దాదాపు ఎనిమిదివందల ముప్ఫై సంవత్సరాలు కావస్తోంది. ఈ ఎనిమిది శతాబ్దాలలో భారతదేశమంతా ప్రాకి, కృష్ణమాధుర్యాన్ని అందరికీ ప్రాంతీయసంగీతం ద్వారా పంచిన యీ మహత్కావ్యం ఆసేతుహిమాచలం అనునిత్యం, అనుక్షణం స్మరింపబడుతూనో, పఠింపబడుతూనో, గాన శ్రవణాలు చేయబడుతూనో ఉంది.

అష్టపదులలో యే అందమున్నదో, యే గుండెనైనా తీయగా కోయగలిగే యే

పదునున్నదో యిదమిద్దమని తేల్చడం కష్టం. కానీ భారతదేశంలో ఎన్నో ప్రాంతాలలో ఇవి ఆటలకు పాటలు. పలురకాల సంగీతాల పేటలు. పూజలకు పునశ్చరణలు. శృంగార నాయికలకు రసోదాహరణలు. వాత్సాయనునికి భాష్యాలు.



రామమూర్తి - విశ్వనాథన్

వివిధ బంధాలకు క్లుప్తమూ, గుప్తమూ అయిన బొమ్మలు. ప్రకృతీ పురుష నిరంతర ఖేలకు నిరుపమదర్పణాలు. భక్తికి ప్రేరణలు, రక్తికి పేటికలుగా వరలుతున్నాయని చెప్పడం సులభం.

తెలుగులో “భక్తజయదేవ” (1960) లో వినిపించబడ్డ అష్టపదులే (ప్రళయ పయోధిజలే, ప్రియే చారుశీలే, ధీరసమీరే, యారమితా వనమాలినా, ఎస్.రాజేశ్వరరావు– ఘంటసాల, సుశీల), “విప్రనారాయణ”లోని ‘సావిరహె తవదీనా’ (ఎస్.రాజేశ్వరరావు – భానుమతి) తో పాటు అన్ని తరగతుల శ్రోతలనూ సినిమా పాటగా ఆకర్షించిన అష్టపది “తెనాలిరామకృష్ణ”లోని ఈ అష్టపది.

దీన్ని జయదేవుడు రచించినట్లుగా కాకుండా పల్లవిలోని చివరి భాగాన్ని పల్లవిగా చేసి విలంబిత ధోరణిలో స్వరపరచడం విశ్వనాథన్–రామ్మూర్తిల ప్రతిభకు నిదర్శనం. మొత్తం ఎనిమిది పదాలలో మూడింటినే తీసుకుని స్వరపరిచారు. జగన్మోహనంగా మోహనరాగంలో స్వరపరచిన యీ పాట విని స్వర్గంలోని జయదేవుడు సైతం ముగ్ధుడై ఉంటాడు.

క్లిష్టసంస్కృతపదాల అష్టపదిని సుశీల తన ఇష్టపదిగా చేసుకుని తెలుగుపాటగా ప్రాచుర్యంలోకి తెచ్చారు. ఆమె సుమకోమలంగా ఆమని కోయిల సమానంగా పాడారీ అష్టపదిని. మధ్యలో ఆలాపనలు, శబ్ద ఉచ్చారణలు పులుగడిగిన ముత్యాల్లా కాంతులు వెదజల్లుతుంటాయి. ‘ధ్యాయతి ముగ్ధ వధూరధికం...’ అని మళ్లీ పాడడంలోని మాధుర్యం ఎవరికి వారు అనుభవించి తీరాల్సిందే. ఈ పాట వింటుంటే పాతగుర్తులతో పరవళ్లు తొక్కుతుంది మనసు.

“జగన్నాటకం” సినిమాలో కూడా పై పాటంత అందంగానే సుశీల ‘ధీరసమీరే’ (అశ్వత్థామ సంగీతం) పాడారు. కానీ ఆ సినిమా బాగా ఆడకపోవడం చేత దీని గురించి చాలామందికి తెలీదు.



# సువర్ణసుందరి (1957)

❖ సీనియర్ సముద్రాల ❖ పి.ఆదినారాయణరావు

**పిలువకురా....**
**అలుగకురా....**
**నలుగురిలో నను ఓ రాజా**
**పలుచన సలుపకురా ॥పిలువకురా॥**
**పిలువకురా...**
**మనసున బాళీ మరువను లేరా**
**చలమున మోడీ సలుపకు రాజా**
**సమయము కాదుర నిను దరిచేర ॥సమయము॥**
**కరుణను నన్నీవేళ మన్నించరా రాజా ॥కరుణను॥**
**పిలువకురా...**
**ఏలినవారి కొలువుర సామి...**
**మది నీరూపె మెదలిన కాని**
**ఓయన లేనురా కదలగలేరా ॥ఓయన॥**
**కరుణను నన్నీవేళ మన్నించర రాజా ॥కరుణను॥ ॥పిలువకురా॥**

ఆదినారాయణరావు పేరు తలచుకోగానే ఆంధ్రప్రజానీకానికి జ్ఞాపకం వచ్చేది రెండు పాటలు. 'రాజశేఖరా', 'పిలువకురా'! తెలుగుదేశంలో సినిమాపాటకు చలామణీ ఉన్నంతకాలం యీ పాటలు నిత్యం ఆకాశవీధుల్లో ఎగిరే స్వరహంసలు. పాడేవారినీ, వినేవారినీ నిత్యయవ్వనులను చేసే అమృతస్నానాలు. ఆ పాటల్లో ఒక్కొక్క వంపు మంచి పాటలలోని మరువరాని మలుపు. ఒక్కొక్క సంగతి ఆ గాయకులకు చిరకీర్తినార్జించే సంగీత గతి.

రెండుభాషల్లో తయారైన చిత్రాలూ, డబ్బింగ్ చేయబడ్డ చిత్రాలూ, తమిళంలోనే తయారైన "అడుత్త వీట్టు ప్పెణ్" (1959), హిందీలోనే తీయబడ్డ 'పూలోంకీ సేజ్' (1964) లెక్కవేసుకుంటే మొత్తం ముప్పైచిత్రాలకు సంగీతదర్శకత్వం వహించి ఉంటారాయన. రాసిలో పెద్ద సంఖ్యేమీకాదు, నిజమే, కానీ యీ ముప్పైచిత్రాలలో కనీసం ఒక పదిహేను పాటలు పదికాలాలపాటు నిలిచేపాటలు. పాడినవారికీ, రాసినవారికీ అనన్యప్రచారం తెచ్చిన పాటలు. ఆ గాయనీగాయకులు తీయగా ఆ రాగాలు తీయగా, హాయిగా విని "ఇది హాయి కదా!" అని అనుకోదగ్గ పాటలు.

అంజలీ పిక్చర్స్ వారింట సువర్ణరాసులు కురిపించిన చిత్రం "సువర్ణసుందరి". ఈ చిత్రంలోని పాటలన్నీ ప్రజాదరణ పొందాయి. ఇవే పాటలు తమిళ, హిందీభాషల్లోనూ భారతదేశం ఆపాదమస్తకాన్నీ అలరించాయి. సృజించినవారికి బిరుదులూ, బహుమానాలూ, సన్మానాలు ఆర్జించాయి. హిందీభాషలో ఇదే ఆదినారాయణరావు మొదటి చిత్రం కావడం గమనార్హం.

ఆదినారాయణరావు చేసిన సంగీతానికి మూడుభాషల్లో ఇంత పేరూ ప్రతిష్ఠా రావడంతో కొందరు చెవులు కుట్టుకున్నారు. ఏముందా సంగీతంలో, అన్నీ హిందూస్థానీ వరవడులే కదా అని కొందరు స్థూలంగా తేలికపరిస్తే, మరికొందరు – 'పిలువకురా' పాటకు ఆధారం "ఝంఆ" (1953) లో వసంత్‌దేశాయి చేసిన 'మిలన్ హో కైసే' అనుసరణ కాదా అన్న బరువైన అభియోగమూ చేశారు.

'పిలువకురా', 'మిలన్ హో కైసే' రాగచ్ఛాయలు దగ్గరగానే ఉండవచ్చు. అందులో ఒకటో అరో రాగాలూ కలవవచ్చు. కానీ యీ కారణం చేత ఈ తెలుగుపాటలో సృజనాత్మక నైపుణ్యం లేదూ అంటే అది తర్కానికి నిలిచే మాటకాదు. ఆదినారాయణరావు వరసలు అంతా అలాగే వుంటే, అవి హిందీరంగంలో అంత సంచలనం కలిగించి అంతమంది ప్రశంసలకు నోచుకునేవి కావు.

హిందూస్థానీ రాగాలను కొత్తపద్ధతులలో అంటే అంతకుముందే ఆంధ్రదేశంలో జొన్నవిత్తుల శేషగిరిరావు, సి.ఎస్.ఆర్. ఆంజనేయులు, కె.రఘురామయ్య, తుంగల చలపతిరావు యిత్యాది గంధర్వగాయకుల పాటలతో కొట్టినపిండైన పద్ధతుల్ని కాకుండా, సమకాలీన హిందుస్థానీ గాయక వాద్య వాదకశ్రేష్ఠుల మెళకువలను గమనించి, లలితం గావించి, సామాన్య సినిమాపాటల శ్రోతలను ముగ్ధులను గావించటంలోనే కాక సంగీతంలో కొంత అభిరుచి ఉన్నవారినీ మెప్పించడం ఆదినారాయణరావుకు 'వెన్న'తో బెట్టిన విద్య.

సినిమాపరిశ్రమలో ప్రవేశించక పూర్వమే ఆదినారాయణరావుకు సంగీత గ్రంథ పరిచయం ఉంది. ఆ రోజుల్లో సాలూరు, విజయనగరాలలో జరిగే సంగీతసభలూ, వినపడే రికార్డులూ ఆయన విన్నవీ, కొన్నవీ, కర్ణాకర్ణిగా విని జీర్ణించుకున్న తరువాత కాకినాడలో నాటకాలకు, స్టేజి నాట్యాలకు సంగీతం సమకూర్చిన అనుభవమూ ఉంది. అప్పటికే తాను రచనలో కూడా అంతో ఇంతో వేలుపెట్టడంతో సాహిత్యభావం, సంగీత రాగం జోడించడంలో నేర్పు తనలో క్రమేపీ వృద్ధిజెంది 1957 కి సొంత చిత్రనిర్మాణం ఇచ్చిన స్వేచ్ఛతో స్టేజినాటకాలు, నాట్యాలు బాగా ఎరిగిన కూచిపూడినాట్య నిష్ణాతుడైన దర్శకుని (వేదాంతం రాఘవయ్య) ప్రోత్సాహంతో 'సువర్ణసుందరి"లో పక్వానికి వచ్చి బంగారుపళ్లు పండించింది.

నిశితంగా, నిష్పక్షపాతంగా ఆలోచిస్తే బహుళ ప్రజాదరణే ప్రాణమైన సినిమా కళలో ఇతరుల సాయం, ముందే చేయబడ్డ వరసల ప్రమేయం లేకుండా పాటలు చేయడం కష్టం. కొన్నిచోట్ల భావసామ్యం తెలుస్తుంది. కొన్నిచోట్ల రూపసామ్యం కనిపిస్తుంది. అంతమాత్రాన మునిగిందీ లేదు, తేలిందీలేదు.

"బాలరాజు" (1948), "స్వప్నసుందరి" (1950) చిత్రాలనుకలిపి కథ తయారు చేసిన "సువర్ణసుందరి"లో యీ పాట సన్నివేశం చాలా చిత్రంగా ఉంటుంది. సుందరి తన ప్రియుడికి ఒక పిల్లనగ్రోవిని ఇస్తుంది. ఆమెను చూడాలనుకున్నప్పుడు ఆ మురళి మ్రోగిస్తే చాలు, ఆమె అతని కళ్లెదుట సాక్షాత్కరిస్తుంది. ఆవిషయం అతనికి చెప్పి, దేవలోకం చేరుకుంటుంది సుందరి. ఆమె అటు వెళ్లగానే అతను ఇటు మురళి వాయిస్తాడు. అది దేవేంద్రుడు కొలువుతీరే సమయం. నాట్యం చేయడానికి ఉపక్రమిస్తూంటే సుందరికి ప్రియుడి వేణుగానం విన్పిస్తుంది. అటు అతని దగ్గరకు వెంటనే వెళ్లలేక, ఇటు దేవరాజు పసిగట్టేస్తాడేమోననే భయంతో ఒకపక్క దిక్కుతోచక ప్రియుణ్ణి ' పిలువకురా...అలుగకురా' అని అభ్యర్థించే సన్నివేశమిది.

ఈ పాటను మాల్కోస్ రాగంలో స్వరపరుస్తూ వయొలిన్, వీణ, ఫ్లూటు, మృదంగాలను సుమకోమలంగా వినిపించారు ఆదినారాయణరావు. వేణువు బిట్స్‌ను కథానాయకుడి కోసం, వీణ, మృదంగం వాద్యాల బిట్స్‌ను తక్కిన నర్తకీమణుల కోసం విభజించి స్వర నిర్వహణ చేశారు. సీనియర్ సముద్రాల లలితపద శబ్దాల చాతుర్యం పల్లవిలో మరల మరల పలికే 'ల' కార పదాల ప్రయోగం లవలీవల్లికలా కన్పిస్తుంది. అందాలదీవి అంజలీదేవి నృత్యం చేస్తూ అటు ఇంద్రసభనేకాదు, భూలోకవాసుల్ని కూడా అలరింపజేశారు.

ఇక సుశీల ఈ పాటను పతాకస్థాయిలో తీసుకెళ్లిన విధానం అద్వితీయం. నృత్య, సంగీత రీతుల్ని ముగ్ధమోహనంగా ప్రతిపదంలో ఆమె పలికించారు. ఈ పాటను ఆలాపనలతో స్వరాలతో, సహా నేటికీ ఎంతోమంది పాడుకుని మురిసిపోతుంటారు. ఈపాటలో సుశీల గాత్రం వింటే ప్రతి రసికుడికీ, పిలవొద్దని బతిమాలినా పిలవాలనే అనిపిస్తుంది. ఆమెకు తొలినాళ్లలో బాగా పేరుతెచ్చినపాట ఇది. అప్పటివరకూ అంజలీదేవికి జిక్కీ గాత్రదానం చేసేవారు. ఈ పాట సాధించిన చారిత్రాత్మకవిజయం అంజలీదేవి కూడా సుశీల చేతే ప్లేబాక్ పాడించుకోవడం దరిమిలా ప్రారంభించారు.

ఈ పాటకూ, 'హాయిహాయిగా ఆమనిసాగే' అనే రాగమాలికకు ఉన్న రంజకశక్తి వల్లే విజయావారి "మాయాబజార్" ప్రభంజనాన్ని తట్టుకుని "సువర్ణసుందరి" నిలబడి ఘనవిజయం సాధించింది. కథాపరంగా ఎన్నోమజిలీలున్న యీ చిత్రం ప్రేక్షకులకు విసుగు తెప్పించకుండా యీ పాట చక్కగా కాపాడింది.

# భాగ్యరేఖ (1957)

❖ దేవులపల్లి ❖ పెండ్యాల

నీవుండేదా కొండపై నా స్వామి...
నేనుండేదీ నేలపై
ఏలీల సేవింతునో.. ఏ పూల పూజింతునో!
శ్రీపారిజాత సుమాలెన్నో పూచె
ఈ పేదరాలి మనస్సెంతో వేచె ॥శ్రీపారిజాత॥
నీపాదసేవా మహాభాగ్యమీవా
నాపైని దయజూపవా...నా స్వామీ! ॥నీవుండే॥

దూరాననైనా కనే భాగ్యమీవా
నీరూపునాలో సదా నిల్పనీవా?
ఏడుకొండలపైన వీడైన స్వామీ
నాపైని దయజూపవా... నా స్వామీ! ॥నీవుండే॥

తెలుగువారి ఇలువేల్పు శ్రీవేంకటేశ్వరస్వామి. ఆయనపై వచ్చిన సినీగీతాలలో యీ పాటొక ఆణిముత్యం. భక్తిగీతాలు రాయడంలో సిద్ధహస్తులైన దేవులపల్లి కృష్ణశాస్త్రిగారిదీ



రచన. ఎంతో చక్కటి ఊహను, ఇంత ప్రశాంతంగా, ఇంత సుబోధకంగా రాయగలిగిన వారెందరో ఉండరు. వాళ్లలో కృష్ణశాస్త్రి అగ్రగణ్యులు. ఆ సలలితరచన సుధ ప్రతిచరణంలోనూ పరిమళిస్తుంటుంది. ప్రతిపదంలోనూ ప్రకాశిస్తూ ఉంటుంది.

భక్తిగీతాల రచనలో మల్లాది రామకృష్ణశాస్త్రి, దేవులపల్లి కృష్ణశాస్త్రి పేర్కొనవలసినవారు. వీరిద్దరి భక్తిగీతాలు హృదయాన్ని కదిలించగలవు. రాయిలో గల రాముణ్ణే రంజించగలవు. సంగీతంలో ఇద్దరికీ యితోధిక అభినివేశం ఉన్నది కనుక వారి పాటలలో సంగీతం ముందు చేయబడిందా? సాహిత్యం ముందు రాయబడిందా అన్న మీమాంసనూ రేకెత్తించకమానవు. ఇన్ని పోలికలున్న వీరి భక్తికవిత్వంలో ఒక్క ముఖ్యమైన తేడా లేకపోలేదు అది ఇదీ–

రామకృష్ణుని కవితలో భగవంతునికీ, భక్తునికీ మధ్య భక్తి కన్నా బంధమే ఎక్కువ.

ప్రార్థన కన్నా ప్రణయానికే ప్రాముఖ్యత. ఆరాధన కన్నా అనురాగానిదే పైచేయి. సామీప్య సాయుజ్య కాంక్షల కన్నా చొరవా, చనువూ ఏర్పరచుకోవటమే ముఖ్యోద్దేశం.

మల్లాది భావనతో, లాలనతో కృష్ణుడిని రప్పించగలం గానీ రాముణ్ణి మెప్పించలేం. దానికి దేవులపల్లి కృష్ణశాస్త్రి రచనే ఉండాలి. కృష్ణశాస్త్రి భగవంతుని ఉద్దేశించి రాసిన ప్రతి అక్షరంలో కూడా భక్తి ప్రపత్తులు ఉట్టి పడుతుంటాయి. ఆరాధనాభావం అంతర్లీనంగా ప్రవహిస్తుంటుంది. ప్రేమకోసం ప్రాకులాడటం ఎప్పుడూ ఉండదు, కరుణకోసం అర్థించడం తప్పితే. వీరిద్దరి అన్వేషణామార్గాలలో ఇంత తేడా ఉండడానికి కారణం వారి వారి జీవితాల నిర్ణయమనిపిస్తుంది. మల్లాదివారు నిత్యసంతోషులు. వారికి తీరని కోరిక ఏదీలేదు. ఈ లోకంలో అందరినీ తనవారిగానే చూసుకోగలిగే వారికి సుఖ దుఃఖాలు అంతగా అంటవు. కృష్ణశాస్త్రి అలా కాదు ఎన్నిటినో పోగొట్టుకున్నారు. చివరికి వారికి శరణ్యమైంది జనసామాన్యమైన కవితాఝురి.

ఇంతటి రచనకు సంగీతం పెండ్యాల. బి.ఎన్.రెడ్డి, పెండ్యాల కాంబినేషన్‌లో వచ్చిన ఏకైకచిత్రం “భాగ్యరేఖ”. సాదాసీదా చిత్రమే అయినా పెండ్యాల మూలంగా యీ చిత్రం ఆరుదశాబ్దాలు పూర్తయినా ఇంకా గుర్తుండిపోయింది. అందుకు కారణం యీ భక్తిపాటే. లలితమైన కాపీ రాగాన్ని ఎంచుకుని ప్రతి అక్షరాన్ని స్వరంగా మలచి రసార్చన చేశారు పెండ్యాల. అందుకే యీ పాటను గృహిణులు పూజామందిరాల్లో, పేరంటాలల్లో నేటికీ పాడుకుంటూనే ఉన్నారు.

ఇదే చిత్రంలో ‘నీ సిగ్గేసింగారమే....’ అని ఏ.ఎం.రాజా పాడిందీ, సుశీల పాడిన ఈ పాటా రెండూ ఒకే కొమ్మ (ట్యూను)కు పూచిన రెండు బంగారుపూవులు.

సుశీల కంఠం ఎప్పటినుంచో ఏ.వి.ఎం. వారి చిత్రాలలో వింటున్నా, అప్పటినుంచీ అందులోని మాధుర్యం మనల్ని ఆకర్షించినా ఆ కళాప్రతిపత్తి అంటే ఒక విధమైన భక్తిభావం శ్రోతలలో ఏర్పడింది యీ పాట విన్న తరువాతే. మనలో ఇంతటి భావాన్ని పెంపొందింపచేయడానికి కారణం ఆ రచనలో, ఆ వరసలో, ఆ పాడడంలో ఉన్న అసమానమైన, అనుపమానమైన అందం. ఈ స్వర సుమమాల సుశీల కంఠంలో వేయివెన్నెల సొబగులు విరజిమ్మి, గంధర్వగానమంటే ఏమిటో చవిచూపింది. సుశీల కంఠం అద్వితీయమైంది. ఆమె పాడిన పాటల్లో నూటికి తొంభై ఎనిమిది చాలా హాయిగా ఉంటాయి. ఆ మిగిలిన రెండూ మరింత హాయిగా ఉంటాయి. పాట సాహిత్యం నచ్చినా, నచ్చకపోయినా సరే ఆ కంఠమాధుర్యానికి దాసోహమ్మనాల్సిందే. అటువంటి తేనెవాకలో తేలియాడించిన పాటల్లో ఇదొకటి.

# భూకైలాస్ (1958)

❖ సీనియర్ సముద్రాల ❖ ఆర్.సుదర్శనం, ఆర్.గోవర్ధనం

**సుందరాంగా అందుకోరా...**
**సౌందర్య మాధుర్య మందారము**
**అందలేనీ పొందలేనీ**
**ఆనందలోకాలు చూపింతురా ॥సుందరాంగా॥**

**కేలూ కేల గొని, మేనూ లేకముగ**
**ఏకాంత సీమలలో**
**మది, సంతాపమారగ**
**సంతోషమూరగ**
**చెంత చేర రారా ॥కేలూ॥ ॥సుందరాంగా॥**

**యోగము చేదు విరాగము చేదు**
**అనురాగమే మధురం**
**చాలు సాధన విడవోయి వేదన**
**సంతోషాబ్ధికి పోదమూ ॥చాలు॥**
**అట బంగారు రంగారు మీనాలమై**
**చవులూరించు క్రొందేనె జుర్రాడుదాం ॥ఆట॥**
**తేలాడుదాం ఓలాడుదాం**
**ముదమార తమిమీర ఈదాడుదాం ॥తేలాడు॥ ॥సుందరాంగా॥**

**ఓం నమశ్శివాయ... ఓం నమశ్శివాయ...**

సినీ గీతరచయితలలో సీనియర్ సముద్రాల ఎంతటివారో ఈనాడు ప్రత్యేకించి పరిచయం చేయనక్కరలేదు. సనాతన సంప్రదాయ వైష్ణవుడైనా, కేశవ భక్తుడైనా, శివాంశ సంభూతుడిగా సాహితీలోకాన్ని శివకేశవాత్మజుడై రాసిన అసంఖ్యాక భక్తిగీతాలు తెలుగు చలనచిత్ర రంగాన్ని విజయపథంలోకి తీసుకువెళ్లాయి. తన పాటలతో భక్తి మొదలు నవరసాలను రసభరితమూ, సుగంధభరితమూ చేసి, ప్రత్యేకించి శృంగార రసాన్ని సృజనాత్మకంగా అందించిన కవితాచార్యులు సముద్రాల. లంకాధినేత రావణుని దీక్షాభంగం నిమిత్తం ఇంద్రుడు పంపిన అప్సరస అందచందాలు, హావభావాలు,

శృంగారవిన్యాసాలు, తేనెపలుకులు, ఆటలు, పాటలు.. ఈ పాటలో ఆ మహాకవి పొందుపరచిన తీరు అమోఘం. మనసు చెక్కుచెదరని రావణుడు ఒకవైపు శివపంచాక్షరి మంత్రోచ్చారణ చేస్తుంటే, మరోవైపు అప్సరస తన కోకిల గానంతో, కేకి నాట్యంతో కవ్విస్తూ కవ్విస్తూనే విఫల మనోరథయై, చివరకు ఆ మహామంత్రాన్నే తాను కూడా స్మరిస్తూ అంతర్థానమైపోతుంది.



ఆర్.సుదర్శనం

ఏ.వి.ఎం.సంస్థ ఆస్థాన సంగీతదర్శకులైన ఆర్.సుదర్శనం, ఆర్.గోవర్ధనం. వీరిరువురూ అభేరి రాగంలో అతి చక్కగా యీ పాటను స్వరపరిచారు. వారి స్వర విధానం సన్నివేశాన్ని కళ్లెదుట సాక్షాత్కరింపజేస్తుంది. ఈ పాటలో సంగీత ధర్మం కంటే పాత్రగతమైన మనోధర్మమే అధికం.

సుశీల ఈ శృంగార గీతంలో ఉన్న అనేక పోకడలు, స్థాయీభేదాలూ, జానుతెనుగు, జాణ తెలుగుపదాలను అతి సుకుమారంగా గొంతులో పలికి శబ్దాలకు పరిమళమద్దారు. ఆమె గాత్రంలో పాట సాగుతుంటే సమాంతరంగా ఘంటసాల గాత్రంలోనుండి శివపంచాక్షరి విన్పిస్తుంటుంది. ఈ గాత్రం, ఆ గాత్రంలోని స్థాయిలలో సుశీల స్వర సంకలనాలలో ఒక మాధుర్యం, ఘంటసాల గాత్రంలో ఒక భక్తిభావం.... కలగలిసి పాటకు ఒక విలక్షణతత్త్వాన్ని అందించాయి.

ఈ పాటకు నాటి ప్రఖ్యాత హిందీ నృత్యతార హెలెన్ అభినయం సువర్ణానికి సువాసన, ప్రేక్షకులకు ప్రత్యేకాకర్షణ. పేరుకు శృంగార గీతమే అయినా, బహిరంగంగా వేదికల మీద కూడా బిడియం ఏమాత్రమూ లేకుండా పాడుకునేంత ఉదాత్తంగా ఉంటుందీ పాట.

సినిమా చరిత్రపరంగా కూడా "భూకైలాస్" చిత్రానికి ఓ ప్రాధాన్యత ఉంది. ఈ చిత్రంతోనే ఆంధ్రానర్గీస్ జమునకు, అగ్రనాయకులిద్దరితో విభేదాలు పరాకాష్ఠకు చేరాయి. ఆమెతో తామిక నటించబోమని బాహాటంగానే ప్రకటించారు. జమున కూడా ఏమాత్రం తగ్గలేదు. ఆసమయంలోనే జగ్గయ్య, రమణమూర్తి, హరనాథ్ మొదలగువారితో సినిమాలు చేస్తూ వచ్చారు. కొంతకాలానికి ఆ ఇద్దరు హీరోలే చెట్టు దిగిరాక తప్పలేదు. "గులేబకావళి"తో ఒకరు, "గుండమ్మకథ"తో మరొకరు జమున సరసన కథానాయకులుగా నటించి మళ్లీ ప్రేక్షకులకు కనువిందు చేశారు.



# చెంచులక్ష్మి (1958)

❖ వి.సదాశివబ్రహ్మం ❖ ఎస్.రాజేశ్వరరావు

పాలకడలిపై శేషతల్పమున
పవళించేవా దేవా ॥పాల॥

బాలుని నను దయపాలించుటకై
కనుపించేవ మహానుభావా ॥బాలుని॥ ॥పాల॥

అలకలు అల్లల నాడుచు ముసరగ ॥అల॥
నెలనవ్వులు తులకించే మోము ॥నెల॥
తెలికన్నుల కరుణారసవృష్టి ॥తెలి॥
తిలకించిన మై పులకించె స్వామి ॥పాల॥

ఆదిలక్ష్మి నీ పాదములొత్తగ
వేదమంత్రములు విరించి చదువ ॥ఆది॥
నారదాది మునిముఖ్యులు చేరి... ॥నారదాది॥
మోదమలర నిను గానము సేయగ ॥పాల॥

కొన్ని పాటలు వింటుంటే ఇంత చక్కని పాటలలోని ఘనత ఎవరికి దక్కాలి? అనే సందేహం వస్తుంది. అయితే ఆ పాటలో పాలుపంచుకున్న మహానుభావులందరూ ఎంతో వినయంతో "మాదేముందండీ, అంతా ఆ మహానుభావుల చలువే" అంటూ ఘనతనంతా మిగతావారికే ఆపాదిస్తుంటారు, అలా ప్రతిఒక్కరూ ప్రక్కకి తప్పుకుంటుంటారు. మరి అలాంటి పాటలకు న్యాయనిర్ణేతలు శ్రోతలే.. ఇలా ప్రేక్షకశ్రోతల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయిన గీతాలు వేనవేలు. అలాంటి కోవకు చెందిందే యీ భక్తిగీతం.

అక్షరాన్నీ, పదాన్నీ వెరసి భావాన్నీ ఎలా పలకాలో సుశీలకు తెలుసు. అక్షర కూనలకు స్వరాల తేనెలను ఏ పాళ్లలో పట్టించాలో రాజేశ్వరరావుకు తెలుసు. సందర్భానికి తగిన సాహితీసంపదను ఇవ్వడం సదాశివబ్రహ్మానికి వెన్నతోబెట్టినవిద్య. ఇలా ముగ్గురు మహనీయుల కృషి నుండి వెలువడ్డ యీ పాట విజయవంతమై అరవై వసంతాలు పూర్తి చేసుకుంటున్నా ప్రాతఃస్మరణీయ గీతంగానే నిలిచిపోయింది.

సుశీల పాడిన యీ పాటలో విశేషమేమంటే, పదాల తర్వాత వచ్చే నేపథ్యసంగీతాన్ని కూడా ఆమె గాత్రంతోనే అనుసంధానం చేసి పాడుకోవడం. ఉదాహరణకు, 'తెలికన్నుల



వి.సదాశివబ్రహ్మం

కరుణారసవృష్టీ...,' 'నారదాది మునిముఖ్యులు చేరీ..' తర్వాత వచ్చే సంగీతాన్ని పరిశీలించండి... ఇక్కడ వాయిద్య పరికరం గొప్పదా? సుశీల గాత్రం గొప్పదా? అంటే నిస్సందేహంగా సుశీల గాత్రమే అతి మధురం అని అంటారు.

పసిపాపడైన ప్రహ్లాదునికి చేతిగిన్నెలోని పాలలో పరంధాముడు కన్పించే అపూర్వ సన్నివేశానికి, యమన్ రాగచ్ఛాయలలో అపురూపమైన స్వరరచన చేశారు (ర)సాలూరు రాజేశ్వరరావు. ఈ రాగం ఆయన పేటెంట్ అండ్ ఫేవరేట్.

ఈ పాటంటే ప్రఖ్యాత గాయకులు ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యానికి పంచప్రాణాలు. ఈ పాటను బాల్యంలో తాను ప్రాక్టీసు చేశానని, ఒక టేప్‌రికార్డర్ ద్వారా తన కంఠాన్ని మొదటిసారిగా విన్నది యీ పాటతోనేనని 'పాడుతా తీయగా' కార్యక్రమాల్లో ఈ పాట ప్రస్తావన వచ్చినపుడల్లా చెబుతుంటారు. ఒకనాటి ప్రఖ్యాతనటి పుష్పవల్లి లీలావతిగా ఆమె కుమారుడు బాబ్జీ ప్రహ్లాదుడుగా నటించారిందులో. నిజజీవితంలో తల్లీకొడుకులైన వీరు వెండితెరపై కూడా తల్లీకొడుకులుగా కన్పించడం కాకతాళీయం.

నాదప్రియుడైన శ్రీమహావిష్ణువు పవళించి ఉన్నవేళ, ఆదిలక్ష్మి, బ్రహ్మ, నారదాది మహర్షులు అందరూ వైకుంఠంలో పాలకడలి చెంత ఉండి, సుశీల గానంతో పరవశించినట్లుగా అన్పిస్తుందీ పాట వింటే.

తెలుగింటి లోగిళ్లలో ముత్యాలముగ్గు ఎలాగో, తెలుగువారికి సుశీలపాట అదే స్థాయి ముఖద్వార మంగళతోరణం.

# మాంగల్యబలం (1959)

❖ శ్రీశ్రీ ❖ మాస్టర్ వేణు

తెలియని ఆనందం
నాలో కలిగినదీ ఉదయం
పరవశమై పాడే హృదయం ॥తెలియని॥

కలకలలాడెను వసంతవనము
మైమరపించెను మలయానిలము ॥కలకల॥
తీయని ఊహల ఊయలలూగి
తేలే మానసము – ఏమో ॥తెలియని॥

రోజూ పూచే రోజాపూలు
ఒలికించినవీ నవరాగాలు... ॥రోజూ॥
పరిచయమైన కోయిల పాటే
కురిసే అనురాగం – ఏమో ॥తెలియని॥

అరుణకిరణముల గిలిగింతలలో
కరగిన తెలిమంచు తెరలే తరలి ॥అరుణ॥
ఎరుగని వింతలు ఎదుటే నిలచి
వెలుగే వికసించే–ఏమో ॥తెలియని॥



ఒకోరోజు ఏ శుభ ముహూర్తంలో మొదలవుతుందో తెలీదు. అలా మొదలైన రోజు తెలియని ఆనందమేదో కూని రాగాలు తీయిస్తుంటుంది. ఏవేవో కొత్తభావాలు, లలితలావణ్యమైన అనుభూతులు, సుందరశబ్దాలు, రమణీయ స్వరాలు గళ, హృదయ తంత్రులను మీటుతూ ఉంటాయి. ఇక ఆరోజంతా తెలియని ఆనందమే! అలాంటి కోవకు చెందిందే సుశీల అతి సౌకుమార్యంగా పాడిన యీ భావగీతం.

మామూలు మనుషులకే కాదు, అగ్నికణాల వేడి, అర్క కిరణాలవాడి కలిగిన పదాలతో నిత్యం సతమతమైపోయే మహాకవులకు కూడా పైన చెప్పిన నాలుగుమాటలూ వర్తిస్తాయి. అలాంటి శుభతరుణంలో శ్రీశ్రీ కలం నుంచి జాలువారిన తుషార శీతల, అరుణ కిరణాల నులివెచ్చని భావగీతమిది.

రోజూ పుష్పించే పూలయినా, నిత్యం పరిచయమున్న కోయిల గానమైనా, ఎపుడూ వింటున్న సుశీల గాత్రమైనా తరచిచూసే కొలదీ ఏదో నవ్యత, ఆనందం మదిలో మెదలుతుంటాయి. అదే శుభముహూర్తమంటే. ఇలాంటి శుభసంకల్ప స్వర రవళులు కవి గాయకులకు చిరపరిచయమే.

దేశ్, తిలక్ కామోద్ రాగాలలో మాస్టర్ వేణు యీ పాటకు నవనవోన్మేషమైన వరస కట్టారు. ఇప్పటికీ యీ పాట సుశీల, మాస్టర్ వేణు, అన్నపూర్ణ సంస్థ ఆల్‌టైమ్ హిట్స్‌లో ఒకటిగా నిలిచిపోయింది.

ఈ పాటలో 'రోజూపూచే రోజాపూలు' చరణంలో 'ఒలికించినవీ నవరాగాలు' తర్వాత సుశీల చేసిన ఆలాపన మనసును భర్మడోలికల్లో తేలియాడిస్తుంది.

ఈపాటను దుక్కిపాటి మధుసూదనరావు, ఆదుర్తి మొదట ఊటీలో చిత్రీకరిద్దామనుకున్నారు. ఆర్టిస్టులు, టెక్నీషియన్లు అందరూ ఎంతో కోలాహలంగా పెళ్లికి వెళ్లినట్టు 20.04.1958న ఊటీకి తరలివెళ్లారు. తెలుగు చిత్రాల షూటింగ్ ఊటీలో జరగడం ఇదే మొదలు. ఐదురోజుల పాటు నిర్విఘ్నంగా షూటింగ్ జరిగింది. ఈ ఐదురోజుల్లో 'వాడినపూలే' పాట, ఒకటిన్నర దృశ్యం పూర్తయ్యింది. ఇంతలో అనుకోకుండా వర్షాలు పడి షూటింగ్ ఆగిపోయింది. దాంతో షూటింగ్‌కు ప్యాకప్ చెప్పి, మళ్లీ సెప్టెంబరులో ఊటీ వద్దామనుకున్నారు. అయితే చిత్రకథానాయిక తాను అప్పటికి గర్భవతినని, సెప్టెంబరు నాటికి నెలలు నిండి పూర్ణ గర్భమొస్తుందని దర్శక నిర్మాతలకు సమాచారమందించింది.

ఇక చేసేదీ, చేయగలిగిందీ ఏమీ లేక ఊటీ షెడ్యూల్‌లో ప్లాన్ చేసిన వర్క్‌లో తప్పనిసరిగా అవుట్‌డోర్‌లో చిత్రీకరించాల్సిన దృశ్యాల్ని మాత్రం తిరుమలలో ప్లాన్ చేసి, మిగిలిన దృశ్యాల చిత్రీకరణ కోసం వాహినీ స్టూడియోలో సెట్స్ వేశారు. ఒకవైపు నెలలు నిండుతున్న కారణంగా సావిత్రిపై చిత్రీకరించాల్సిన సన్నివేశాలను ముందుగా పూర్తి చేయాల్సివచ్చింది. అలా సావిత్రిపై అవుట్‌డోర్‌లో చిత్రీకరించాల్సి ఉన్న యీ పాటను వాహినీస్టూడియోలో వేసిన సెట్టులోనే చిత్రీకరించి తిరుమలక్షేత్రంలో చిత్రీకరించిన దృశ్యాలతో కలిపారు. ఈ పాటలో అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు, కలియుగ



మాస్టర్ వేణు

ప్రత్యక్షదైవమైన శ్రీ వేంకటేశ్వరుని సామ్రాజ్యం తిరుమల ఎంతో ఆహ్లాదంగా కనిపిస్తుంది, అదంతా ఒక స్వర్ణయుగం.

ఈ పాటను సుశీల పాడిన తీరు గమనిస్తే, కళ్లుమూసుకుని వింటే ఇదొక సినిమాపాటగా గాక, ఒక లలిత భక్తిగీతంగా అనిపిస్తుంది. ఒక భక్తురాలు, తిరుమలలోని పవిత్ర వాతావరణానికి తన్మయురాలై పాడుకుంటున్నట్టుగా ఉంటుంది.

పాత్ర మనోభావాలకు గాయకురాలు పొందిన అనుభూతులనే గాత్రంలో పలికించారు సుశీల.

తమ తొలిచిత్రం "దొంగరాముడు"లో 'అనురాగము విరిసేనా' పాడినప్పటినుండీ సుశీల గాత్రమంటే పరవశించిపోయే దుక్కిపాటి, మళ్లీ "తోడికోడళ్లు" లో కూడా అలాంటి పాటే ప్లాన్ చేశారు. కానీ కథాపరంగా సాధ్యం కాదు గనుక అప్పటికి మిన్నకుండి, తమ మూడోచిత్రం, "మాంగల్యబలం"లో యీ పాటద్వారా ఆ ముచ్చట తీర్చుకున్నారు. అయితే "దొంగరాముడు"లో 'విరిసిన అనురాగం' మలిసంజ వెన్నెలైతే, "మాంగల్యబలం"లో 'కురిసిన అనురాగం' తొలిసంజ వెలుగు.

# బండరాముడు (1959)

❖ ఆత్రేయ ❖ సుసర్ల దక్షిణామూర్తి, ప్రసాదరావు

సాగిపోయే ఓ చందమామా.. ఆగుమా...
ఒకసారి ఆగుమా... ఒకసారి ఆగుమా ఓ చందమామా
మనసార నామాట ఆలించిపొమ్మా ॥ఒకసారి॥
ఒకసారి ఆగుమా.. ఓ చందమామా...
నీలిమబ్బుల తెరచాటుమాటున
మాటిమాటికి యిటు దాగనేల..... ॥నీలి॥
ఎందుకో చనలేవు సూటిగ ॥ఎందుకో॥
ఎదలోన నీవైన యోచించుకొమ్మా ॥ఒకసారి॥
ఒకసారి ఆగుమా.. ఓ చందమామా...
పరులసొమ్మును హరియించువాడె
పగటిపూటను యిలు వీడ లేడోయ్ ॥పరుల॥
మంచిగా మనవోయి జాబిలి ॥మంచి॥
మలినమ్ము యికనైన తొలగించుకొమ్మా ॥ఒకసారి॥
ఒకసారి ఆగుమా.. ఓ చందమామా...
మారేనా నీ మనసు ఓ చందమామా ॥మారేనా॥ ॥ఒకసారి॥
ఓ చందమామా... ఓ చందమామా...



ఆత్రేయ

చందమామ గురించి ఎన్నిపాటలు రాసినా ఇంకా ఎన్నో మిగిలినట్లే ఉంటాయి. చంద్రుడికి ఉన్న కళలు పదహారు అయినా ఒక్కొక్కకళలో వేలాదిపాటలు వస్తుంటాయి. 'కళ'కు అంతం లేదుగా? భాషకు అవధి లేదుగా? అలాంటప్పుడే యిలాంటి పాటలు వస్తుంటాయి. పాత్రలభావాలను ప్రతిబింబించడంలో యీ పాటలోని చరణాలు చక్కగా



సుసర్ల దక్షిణామూర్తి

అమరాయి. దొంగతనాలు చేసేవారు పగటిపూట కనిపించరని కథానాయకుణ్ణి (అతడు దొంగ కాబట్టి) ఉద్దేశించి అన్యాపదేశంగా చెప్పడం రచయిత ప్రతిభ.

సుసర్ల, ప్రసాదరావుల సంయుక్త స్వరకల్పనలో ఇదొక చిలిపి చందమామ గీతమైనా అంతర్లీనంగా ఉద్బోధగీతమిది. ద్విజావంతిరాగ మిశ్రమ ప్రయోగాలతో స్వరపరచిన పాట. వాద్యపరికరాలపై చేసిన సున్నితప్రయోగాలు యీ పాటకు జవజీవాలు.

ఈ పాటలో కవి భావాలను, కథానాయిక సావిత్రి హావభావాలను సుశీల అందిపుచ్చుకున్నతీరులో చక్కని మాధుర్యం ప్రధానంగా విన్పిస్తుంది. 'ఆగుమా...' 'చందమామా...', 'ఆలించిపొమ్మా...' ఈ మూడు చోట్ల చివరగా పలికిన 'మ' అక్షరమార్దవం...చివరగా చిరుగమకం లలితంగా పలికించారామె. పదవిభజన, స్వరవిభజన రెండింటి మధ్యలో ఊపిరి తీసుకోవడం ఎంతో కోమలంగా, అవలీలగా జరిగినట్లు సుకుమారంగా పలికాయి. కథానాయకుడికి ఇచ్చే సలహాతో 'ఇకనైనా మారుమా' అనే ప్రయోగంలో మరొక విలక్షణత స్పష్టంగా విన్పిస్తాయి. ఇన్ని ప్రతిభలు ఏకకాలంలో చూపిన సుశీల గళ పరీమళం తెలుగుపాటను పునీతం చేసిందని చెప్పుకోవచ్చు.

## రాజామలయసింహ (1959)

❖ అనిసెట్టి ❖ విశ్వనాథన్-రామమూర్తి

సంగీత సాహిత్య లీల–అదె
జగముల నూగించు సమ్మోహడోల ॥సంగీత॥

సంగీత సాహిత్యలీల...
పలురంగులా ఇంద్ర చా ..పం – అదె
బంగరు సంజెలేదీ ... పం ॥పలు॥
ఈ సృష్టి చిత్రాల మించునులే – మా
ఊహలవెంతో చిత్రమ్ములే ॥సంగీత॥

సంగీత సాహిత్యలీల...
మధురమ్మో కోయిలగానం
వయ్యారీ మయూరీ విన్నాణం ॥మధురమ్మో॥
ఈ సృష్టి శోభా లాస్యమునే – మర
పించునులే మా నాట్యమ్మే
సంగీత సాహిత్యలీల...
సంగీత సాహిత్యలీల...
అతి సుందరం సుకుమారం – మా
కళయే జీవనసారం
నవ స్వప్నలోకాల మార్గములే – మా
కళ ఈ ఇలలో స్వర్గమ్ములే ॥సంగీత॥

సంగీత సాహిత్యలీల...
సంగీత సాహిత్యలీల...

సంగీతమపి సాహిత్యం – సరస్వత్యాస్తనద్వయం
ఏకమాపాత మధురం – అన్యధాలోచనామృతం....

అక్కడ వరకు చెప్పిన ఆ పదాలకు మరింత సొబగులు దిద్దేందుకు కవులు, గాయకులు, నాట్యకోవిదులు, చిత్రకారులు మరింత ముందుకువెళ్లి ఆ క్షీరధారలను

గ్రోలి ఆ పాతమధురాలను అద్వితీయంగా మలచి రసహృదయులను మరింత ఆలోచింపచేశారు.

ఈపాటలో అనిశెట్టి సంగీత సాహిత్యాలు ప్రపంచాన్ని ఆనందడోలికలలో ఊగించి నిరతిశయ సుఖసంతోషాల్ని అందిస్తుందని కలాన్ని కదిపారు. సంగీత సాహిత్యాలు పలు రంగుల ఇంద్రధనుస్సుగా బంగరు సంధ్యాదీపంగా, కోయిల గానంగా, మయూరి నాట్యంగా చెప్తూ యీ సృష్టి అంతా నాట్యం-లాస్యంగా అభివర్ణించారు. ఇక్కడ



అనిసెట్టి

ఇంద్రధనుస్సులోని సప్తవర్ణాలను సంగీతంలోని 'సనిదపమగరి' సప్తస్వరాలను అనుసంధానం చేయడం కవిసమయంగా ఎంతో ఔచిత్యంగా ఉంది.

సి.ఆర్.సుబ్బరామన్ మరణం తర్వాత తెలుగు సినీసంగీతంలో మృదుత్వం కొరవడింది. ఆ లోటును పూరించిన వారు సుబ్బరామన్ శిష్యద్వయం విశ్వనాథన్ రామమూర్తి. వీళ్లను దక్షిణాది శంకర్‌జైషన్లని అంటుండేవారు. అంతటి ప్రతిభావంతులీ దక్షిణభారతసంగీతపు కవలలు.

సుబ్బురామన్ హఠాత్తుగా చనిపోవడంతో అతను సంగీతం చేస్తున్న అయిదారు సినిమాలకు చివరి పనులు- కొన్ని పాటలూ, రీ-రికార్డింగూ -విశ్వనాథన్-రామమూర్తి పూర్తిచేయడం వల్ల వారు సంగీతదర్శకులయ్యారు. "చండీరాణి" (1953) రికార్డులపై సంగీతదర్శకులుగా లేటు సుబ్బరామన్, విశ్వనాథన్ అనే ఉంటుంది. రామమూర్తి పేరుండదు. ఇద్దరు కలిసి పనిచేయాలని ఏ దివ్యముహూర్తంలో అనుకున్నారో గానీ వారు పట్టిందంతా బంగారం, స్వరం కట్టిందంతా సింగారం అయింది. గురువును మించిన శిష్యులై వీరిరువురూ ఆయన పేరు నిలబెట్టారు. వీరి సంగీతంలో పాలపొంగులా పొంగే నవయౌవనం ఉరకలేస్తూ ఉంటుంది. బాణీలలో నిత్యనూతనమైన ధోరణులూ, సరళ తరళ సరళులూ ధ్వనిస్తూ ఉంటాయి. వాద్య ప్రయోగాలలో వీరికి వీరే సాటి.

ఈ సంగీతదర్శక ద్వయ సంగీతాన్ని తెలుగువారికధికంగా విన్పింపజేసిన ఘనత



రాజసులోచన, రంజన్

దర్శకనిర్మాత బి.ఎస్.రంగాకే దక్కుతుంది. ఈయన నిర్మించిన అనేక చిత్రాలను సంగీత సింహాసనమెక్కించిందీ యీ జంట సంగీతదర్శకులే.

బి.ఎస్.రంగా నిర్మించిన ఎన్నో చిత్రాల్లో ఒకటి "రాజామలయసింహ". చిత్రంలోని సంగీతం యీ చిత్రంలాగే విచిత్రమైన పోకడలు పోయింది. ముఖ్యంగా యీ సుశీలపాట సింధుభైరవి, భీంప్లాస్ రాగాల గొలుసులతో సమ్మోహడోలయై జగాలనూపింది. చిత్రంలో ఇదొక నాట్య ప్రధాన గీతం. రాజసులోచన అందెవేసిన నర్తకి. అందుకు జతగా స్వరాలతో సవాల్ చేసిన సుశీల, అందెల సవ్వడిని గొంతులో పలికిన శుభగాత్రి. పాట వింటుంటే సంగీతసాహిత్యాలు, నాట్యం అన్నీ గొప్పవనే భావనను తన ప్రతిభతో పలికించిన ఆమె గళ మాధురీగరిమ సుస్పష్టంగా విన్పిస్తుంది. కవి పదాలకు నృత్యపాదాలు కదులుతాయి. ఇవి రెండూ జరగాలంటే గానం సహకరించాలి. ఇక్కడ సరిగ్గా ఇదే జరిగింది. నాట్యం చేస్తూ సంగీత సాహితీ వైభవాల ఘనత చెప్పాలంటే సుమధుర గాత్రం కూడా చిందులు వేయాలి. నాదం ఝుమ్మంటేనే పాదం 'సై' అంటుంది. నాదం నాభి రస కంఠ హృదయ నాసాదుల నుండీ రావాలి. ఈపాటలో సుశీల గొంతు అలాగే సవరించింది. రవళించింది.

చిత్రాలు ఆర్థికంగా ఘోర పరాజయం పొందినా, కాలక్రమేణా తెరమరుగైనా పాటలు చిరస్థాయిగా నిలచిపోతాయి. ఆకోవలోకి చెందిందే ఈపాట. పాట మధ్యలో సుశీల గాత్రంలో పలికిన ఆలాపనలు, రాజసులోచన చరణ మంజీరనాదాలకు పోటీగా సుస్వర గాత్ర పోహళింపులు పొటమరించినట్లు విన్పిస్తాయి. ఇలాంటి పాటలు వింటుంటే కళావిపంచి, కరుణించి మనపై కరుణ రసావిష్కరణ చేసినట్లు అన్పిస్తుంది.

# నమ్మినబంటు (1960)

❖ కొసరాజు ❖ ఎస్.రాజేశ్వరరావు

చెంగు చెంగునా ॥చెంగు॥
గంతులు వేయండీ
ఓ – జాతి వన్నె బుజ్జాయిల్లారా
నోరులేని తువ్వాయిల్లారా ॥చెంగుచెంగునా॥

రంగు రంగుల ఓపరాలతో – రంకెలు వేసే రోజెపుడో
చెక చెక మంటూ అంగలు వేసీ – చేలను దున్నే అదనెపుడో
కూలిపోయినా సంసారానికి – గోగాకింతా పెట్టేదెపుడో
ఆశలన్ని మీమీద బెట్టుకుని
తిరిగే మా వెతలణగే దెపుడో ॥చెంగు చెంగునా॥

పంచభక్ష్యపరమాన్నం తెమ్మని
బంతిని గూర్చుని అలగరుగా
పట్టుపరుపులను వేయించండని – పట్టుబట్టి వేధించరుగా
గుప్పెడు గడ్డితో – గ్రుక్కెడు నీళ్లతో
తృప్తి చెంది తలలూగిస్తారూ – జాలిలేని నరపశువుల కన్నా
మీరే మేలనిపిస్తారూ ॥చెంగు చెంగునా॥

పగలనకుండా రేయనకుండా – పరోపకారం చేస్తారూ
వెన్నుగాచి మీ యజమానులపై – విశ్వాసం జూపిస్తారూ
తెలుగుతల్లికి ముద్దుబిడ్డలు – సంపదబెంచే జాతిరత్నములు
॥తెలుగు॥

మా ఇలవేల్పులు మీరు లేనిదే
మానవజాతికి బ్రతుకే లేదు ॥చెంగు చెంగున॥

'శంభూ ఫిలింస్' పతాకంపై యార్లగడ్డ వెంకన్న చౌదరి నిర్మించిన చిత్రం "నమ్మినబంటు". సుంకర సత్యనారాయణది కథ. విజయా "షావుకారు", సారథీ "రోజులుమారాయి" తర్వాత అచ్చమైన తెలుగుతనం, కర్షక జీవితం, పల్లెవాతావరణం కన్పించిన యీ చిత్రానికి ఆదుర్తి సుబ్బారావు దర్శకుడు. ఆయన దర్శకత్వంలో అంతకు ముందు కనిపించని వేగం, కొత్తదనం, పటుత్వం ఇందులో కన్పిస్తాయి. ఇందులో ఎడ్లు

చేసిన ఫీట్లు గురించి ప్రేక్షకులు నేటికీ గొప్పగా చెప్పుకుంటారు. ఈ చిత్రానికి ఆ ఏడాది ఉత్తమ ప్రాంతీయచిత్రంగా రాష్ట్రపతి రజత పతకం లభించింది. అయితే అదే సంవత్సరం "శాంతినివాసం" విడుదలై గట్టిపోటీ ఇవ్వడంతో పెద్దగా కమర్షియల్ సక్సెస్ కాలేదు. స్పెయిన్‌లో జరిగిన అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో యీ చిత్రాన్ని ప్రదర్శించారు. చిత్ర విజయాన్ని పురస్కరించుకుని ఎడ్లబొమ్మలతో పాటు 'మేటి నటీనటులకంటే మిన్నగా నటించిన 'రాముడు-లక్ష్మణుడు' అని రాసిన ఓ కరపత్రం విడుదల చేశారు నిర్మాతలు. అది చూసి కోపమొచ్చిన కొందరు నటీనటులు తమను విదేశాలకు ఆహ్వానించినపుడు "మీ హీరోలున్నారు కదా .. వాటినే తీసుకువెళ్లండి" అన్నారట. దీన్ని పెద్ద జోక్‌గా చెప్పుకునేవారారోజుల్లో.

ఈ చిత్రంలో విజయవంతమైన అనేకపాటల్లో ఈపాటొకటి.

పాటల పందిరికి నాలుగు మూలస్తంభాలుంటాయి. 1.సందర్భానికనుగుణంగా పాట రాసే రచయిత 2. దాన్ని స్వరపరచే స్వరకర్త 3.ఆ భావాల్ని, వాటి స్వర, రాగ, తాళ, లయ గతులను గొంతులో పలికించే గాయనీగాయకులు. చివరగా చిత్రీకరించే దర్శకులు. ఈ ప్రయత్నంలో శ్రోతలకు చిరకాలం వినిపించేది సుస్వర గానసౌందర్యమే. మిగతావన్నీ కనిపించి హృదయాన్ని రంజింప జేస్తాయనడంలో సందేహం లేదు.

ఈ పాటలో గాయని గాత్రంలోని మాధుర్యం, అటు పాత్రధారిణి అభినయ కౌశల్యం, రచయిత కొసరాజు గోమాతకు ఇచ్చిన పూజ్యనీయ గౌరవం, స్వరకర్త రాజేశ్వరరావు చివరగా అన్నింటినీ మేళవించి గోమాతకు గీతాంజలి సమర్పించినట్లుంటుంది. పాటంతా పరిశీలిస్తే తేటతెనుగు జానపదాలలో గోమాత గొప్పదనం తెలుస్తుంది. ఈ రకమైన పాటలకు కొసరాజు పెట్టిందిపేరు. ఆయన తను పుట్టిన ప్రాంత స్థానిక మాండలికాల్ని యీ పాటలో ఎంతో నాజూకుగా వినియోగించుకున్నారు. దీనికి కారణం ఆయన వ్యవసాయ కుటుంబ వాతావరణంలో నుండీ రావడమే. 'ఓపరాలు', 'గోగాకు' వంటి గ్రామ్యపదాలు యీ పాటలో పసందుగా కన్పిస్తాయి. గోవుల మీద ఎంతోప్రేమతో పాటరాసినా, ఆ కామధేనువుల గురించి ఇంకా ఎంతో చెప్పాల్సి వుందనే "గోవులగోపన్న" చిత్రంలో 'వినరా వినరా నరుడా' పాట తన తిర్యక్‌ను రాసి పక్షపాతాన్ని చాటుకున్నారాయన.

ఈ పాటను అప్పట్లో ఓ రాజకీయపార్టీ, తమ ప్రచారగీతంగా వాడుకోవడం విశేషం. ఈపాట ట్యూన్ చేస్తున్నప్పుడే రాజేశ్వరరావుకు, నిర్మాణసంస్థకు విభేదాలు రావడంతో ఆయన తప్పుకుంటే ఆ తర్వాత మిగిలిన కొన్నిపాటలకు మాస్టర్ వేణు సంగీతమందించారు.

ఈపాటలోని పదాలు సుశీల గాత్రంలో మేళవించగానే వినే శ్రోతలకు రోమాంచితమై, భావలోకాలకు వెళ్లి మనసు కాసేపు నిశ్శబ్దమై పోతుంది. ఇలాంటి పదహారణాల అతిచక్కని అచ్చతెలుగుపాటలు ఆమె గాత్రంలో ఊపిరిపోసుకున్నవి ఎన్నో... ఎన్నెన్నో....

# మహాకవి కాళిదాసు (1960)

❖ పింగళి ❖ పెండ్యాల

జయ జయ జయ జయ శారదా
జయ కళా విశారదా ॥జయ॥

నవవీణా సారణివై
అవతరించినావుగా ॥నవ॥
జయ జయ జయ జయ శారదా....
రాగసుధారసమయమై సాగెను ప్రియగానమూ ॥రాగ॥
మధురగాన వాహినిలో ॥మధుర॥
లీనమాయె నాట్యమూ ॥జయ॥

ఆ... ఆ.....ఆ...
ఘలుఘల్లన నాట్యముతో
ఝులురుఝుల్లనె నా మదీ ॥ఘలు॥
ఆ...ఆ....ఆ...
మదిని నీదు పూజలతో... ॥మదిని॥
నాదు జన్మధన్యమూ ॥నాదు॥ ॥జయ॥

నవవీణా సారణివై
అవతరించినావుగా
జయ జయ జయ జయ
జయ జయ జయ జయ
జయ జయ జయ జయ
ఆ....

సాత్త్వికాభినేత్రి జూనియర్ శ్రీరంజని తన భర్త కె.నాగుమణిని నిర్మాతను చేస్తూ, గానగంధర్వ పి.సూరిబాబు సహనిర్మాతగా నిర్మించిన మహత్తర చారిత్రక చిత్రం సారణి వారి “మహాకవి కాళిదాసు”. ఈచిత్రం 1960లో ద్వితీయ ఉత్తమ చిత్రంగా కేంద్రప్రభుత్వం నుండి రజతపతకాన్ని పొందింది.

పాట రచయిత పింగళి నాగేంద్రరావు ఎంతో చమత్కారం, చాకచక్యం ప్రదర్శించి

చిత్రనిర్మాణసంస్థ పేరైన 'సారణి' అనే పదాన్ని పాటలో వజ్రసమానంగా పొదిగారు. ఈ గీతమొక చక్కటి శారదాస్తుతి. ఇందులో శారద నవవీణల లోని స్వర సముచ్ఛయాలన్నింటిని ఒకే ప్రవాహంలా పలికించగలదని భావన. అతి గొప్పపదాలు గల అతి చిన్నపాట. ఈనాటికీ శరన్నవరాత్రులలో పేరంటాళ్లు పాడుకునే మంగళహారతి పాటగా పరంపరగా వస్తూనే ఉందీ పాట.

ఈ గీతం సుశీల గాత్రంలో రాగసుధా రసభరితమై, ఒక ప్రియరాగంలా, మధురగాన వాహినిలా నర్తించే రాజసులోచన కనువిందైన నాట్యంతో కలగలిసి, నాట్యపదగతులకు గాత్రస్వరజతులు అల్లుకుపోయాయా? అనే సందేహం కలుగక మానదు. పాట చివరలో 'నాదుజన్మ ధన్యము' అన్న ముగింపుతో శ్రోతల జన్మలు ధన్యత పొందాయని పిస్తుంది. రెండోచరణం ప్రారంభంలో ఒక గాంధర్వ ఆలాపన వినిపిస్తుంది. ఇక్కడ స్వరకర్త పెండ్యాల పరీక్షలో సుశీల నూటికి నూరుశాతం విజయం సాధించినట్లే. ఇది సరస్వతీమాతకు అర్పించిన స్వరాంజలి. తనువు, మనసు ఒక ఆర్తిని పొంది తన్మయమైపోయే ప్రశాంతగీత మిది.

స్వరకర్త పెండ్యాలకు తల్లిదండ్రులెవరు? అనే ప్రశ్న వస్తే సంగీతజ్ఞులు ఆయన తల్లిదండ్రులు శ్రుతిలయలే అని నిర్మొహమాటంగా చెబుతారు, ఇన్ని శుభలక్షణాలు సుసంపన్నంగా ఉన్న యీ పాట వింటే. ఎందుకంటే ఇలాంటి సహస్రాధిక గీతాలను మధువంతంగా సమర్పించిన ఘనత ఆయనది. వారికున్న అపార స్వరజ్ఞానంలో మనం కొన్ని మాత్రమే అందుకున్నామనిపిస్తుంది. అదొక స్వరసాగర మేధస్సు. నిత్యం అలల రవళితో సుస్వరనాట్యం చేస్తూ... లోతైన సంగీత రత్నాకరాన్ని మదిలో దాచుకున్న అసమాన ప్రతిభాశాలి పెండ్యాల. ఆయన బాణీ అంటే గాయనీగాయకులకు శ్రుతి చిహ్నం, మనకు 'స్మృతి' లయగా మిగిలిపోయింది.

అక్కినేని నాగేశ్వరరావుకు యీ చిత్రమంటే ఎంతో ఇష్టం. ఈ చిత్రనిర్మాతలు చిత్రం తాలూకా పంపిణీ హక్కుల్ని అట్లూరి పుండరీకాక్షయ్యకు విక్రయించేసినా, అక్కినేని ఆ హక్కుల్ని తిరిగికొన్నారు. ఈ చిత్రానికి గాను అక్కినేని 1996 లో మధ్యప్రదేశ్ ప్రభుత్వంనుండి 'కాళిదాసు కౌస్తుభ' అవార్డు నందుకున్నారు. తనకు దాదా సాహెబ్‌ఫాల్కే అవార్డు వచ్చినా పొందని ఆనందం యీ అవార్డు వచ్చినపుడు కలిగిందని అక్కినేని జీవితాంతం చెప్పుకునేవారు.

గోఖలే కళాదర్శకత్వం, అన్నయ్య సినీ ఫోటోగ్రఫీ ఈ చిత్రంలోని పాటలకు మరింత వన్నె తెచ్చాయి.


# చివరకు మిగిలేది (1960)

❖ మల్లాది ❖ అశ్వత్థామ

కవికోకిల తీయనిపలుకులలో... ॥మూడుసార్లు॥
చెలువారు నవరసాలూ
కవిరాజహంస నడకలలో ॥కవిరాజ॥
కులికే వయ్యారాలూ
కలవోయీ యీ లేమ నగుమోములో ॥మూడుసార్లు॥

కనుల విందు వెన్నెలలో ॥కనుల॥
కానరాని వాడి
విరిసీవిరియని పూలలో అలముకునే హాయి
మెలమెల్లని గాలిలో వినిపించే ఆలాపన ॥మెలమెల్లని॥
మేనుమరచు పరవశాన అనిపించే ఆవేదన ॥మేను॥ ॥కలవోయీ॥
తన జీవితమే ఘనవిజయంగా చేసికొనే తెలివి
తెలివిగా యీ లోకంలో మెలగ గలననే తీవీ
తీవిగా తలచినది కొనసాగించే సాధన ॥తీవి॥
మాటపడని మొగమాటం మరియాదగ చెలగాటం ॥మాట॥

॥కలవోయీ–మూడుసార్లు॥



అశ్వత్థామ, మల్లాది

మన చిత్రాలలో పియానో ముందు కూర్చుని పాడేపాటలు చాలా వున్నా, నిజంగా పియానోని సక్రమంగా ఉపయోగించి తయారుచేయబడ్డ పాటలు చాలా తక్కువ. ఒకానొకప్పుడు సెట్లువేసే ప్రతికళాదర్శకునికీ ప్రతి ఇంటి సెట్టులోనూ ఒక పియానో పెట్టడం అలవాటుగా ఉండేది. ఇతరత్రా ఆధునికతను సెట్టులో ప్రతిబింబింపజేయగల పుష్టిలేక పియానో

తోచేస్తే సరిపోతుందని  కొందరు కళాదర్శకులు సరిపెట్టుకునేవారు.

ఇక దర్శకుల సంగతంటారా! నాయకి గాని నాయకుడు గాని పాడుతున్నప్పుడు వేరు వేరు కోణాలనుంచి చిత్రించడం శ్రమ. పియానో అందుబాటులో ఉంటే పాడుతూ దానిమీద వేళ్లు వేయవచ్చును. ఆ రెండోవ్యక్తి పియానో మీద వయ్యారంగా చేరబడవచ్చును. ఈ విధంగా ఆలోచించి యీ సులభమార్గాన్ని అవలంబించినవారు కొందరు దర్శకులు.

ఏకారణాల చేతనైతేనేం పియానోలు ఆకాలంలో ముమ్మరంగా స్క్రీనుమీద దర్శనమిస్తుండేవి. ఇందులో  ఔచితీభంగం తప్ప మరేమీ పెద్దతప్పు లేదని సరిపెట్టుకోవచ్చు. పియానో వాయించుతున్నట్లు సినిమాలో కనబడుతుండగా వెనక వినబడే పాటలో కూడా తగుమాత్రంగా ఆ వాయిద్యం వినిపించితే బాగుండేది. కానీ ఆ శ్రద్ధ తీసుకున్న దర్శకులను చేతి వ్రేళ్లమీద లెక్క కట్టవచ్చు.

"బ్రతుకుతెరువు" (1953)లో 'అందమె ఆనందం' ఎంత జనాదరణ పొందిందో అందరికీ తెలిసిన విషయమేగదా! అది నాగేశ్వరరావు పియానో వాయిస్తూ పాడతారని కూడా చాలామందికి జ్ఞాపకం ఉండే ఉంటుంది. కానీ ఆపాటలో వినపడిన పియానో యెంత? జాగ్రత్తగా వింటే చాలా తక్కువ. ఆపాట మాధుర్య రసవాహినిలో పడి ఆ సంగతి చాలా మంది గుర్తించలేదు కానీ లేకపోతే ఎంతో వెలితిగా ఉండేది.

హిందీసినిమాలలో ఇలా కాదు. పియానో పాటంటూ ఉంటే, దీనికి ప్రత్యేక ప్రాముఖ్యతనిచ్చి వరసలు సృష్టిస్తారు. అటువంటి శ్రద్ధాసక్తులతో చేయబడ్డ పాటల్లో ఎన్నదగింది– "మిట్టీ మే సోనా" చిత్రంలో ఆశా పాడిన "పూఛో న హమే యిక్ దిల్కేలియే' అన్నది. అందమూ, ఆనందమూ, ఆహ్లాదమూ మూడూ కలిసి మూర్తీభవించినవా అని భ్రమ కలిగించగలదీ పాట.

ఎన్నో సంవత్సరాలకు ముందు సి.రామచంద్ర చేసిన కృతులు ఇలాంటి పాటలకు తలమానికాల్లాంటివి రెండున్నాయి. అవి "ఖజానా" లోని 'అగర్ తుమ్ న ఆతే', "పహ్లీ ఝలక్" లోని 'జమానాసే నిరాలా హమ్' రెండూ లతా పాడినవే. ఈ రెండింటినీ వరవడిగా పెట్టుకుని తయారుకాబడ్డ పాటలు ఒక డజను వరకూ వచ్చి ఉంటాయి కానీ యేమిటి లాభం! ఒక్కదానికి కూడా మాతృకలందున్న ఆ జంత్ర స్వరసమ్మేళనా నైపుణ్యంలో పదోవంతైనా లేదు. 'అగర్ తుమ్ న ఆతే' అన్నది "బ్రతుకుతెరువు"లో 'ఏదో మత్తుమందు చల్లి' అన్న పాటగా వికృతరూపం ధరించి వినబడింది. ఆ దృశ్యంలో కూడా నాయిక సావిత్రి పియానోని అడపాదడపా వాడుతూ నొక్కుతుంది. కానీ పాటలో దీని ప్రభావం శూన్యం.

అయితే తెలుగు సంగీతదర్శకులెవరూ యీ వాయిద్యాన్ని చెప్పుకోదగ్గట్టుగా ఉపయోగించలేదా అన్న ప్రశ్న రావచ్చును. ఉపయోగించారు. భానుమతి నటించిన "అపూర్వసహోదరులు" చాలా మందికి గుర్తుండే ఉంటుంది. ఆ గుర్తున్న వాళ్లందరికీ

భానుమతి పియానో వాయిస్తున్నట్లు అభినయిస్తూ బీంప్లాస్‌లో పాడిన 'నిజమో మాయో' అనేపాట తెలిసే ఉంటుంది. ఈ పాటకు సంగీతదర్శకులైన సాలూరి రాజేశ్వరరావు పియానోను ఒక క్రమమైన పద్ధతిలో ఉపయోగించుకుని చక్కనిపాటను తయారుచేశారు.

అయితే తెలుగులో రెండు మంచి పియానోపాట లొచ్చాయి. రెండూ సుశీల పాడినవే. అశ్వత్థామ కృతులు భాష తెలీనివారి చేతకూడా భేషనిపించుకునేటట్టు ఉన్నాయి. మొదటిది "ధర్మమేజయం"లోని 'ఆనందమే లేదా', రెండోది "చివరకు మిగిలేది" లో మల్లాది సాహిత్యానికి అశ్వత్థామ సంగీతం వెన్నెలవెలుగుల జిలుగు పెట్టగా సుశీల కంఠం దానికి తొలివలపుల వన్నెల వలువలు తోడురాగా సిద్ధించిన ఈ 'కవికోకిల' అనే కల్యాణిరాగ గీతం. ఈ రెండుపాటల లోను మరి ఏ వాయిద్యం ద్వారా అసాధ్యమేమో అన్పించే విధంగా అపూర్వ స్వరకల్పనా విశేషాలు పియానో మీద వినిపించారు.

పాట ప్రారంభం ఒక సాకీ... కవికోకిల తీయని పలుకులలో చెలువారు నవరసాలు...', 'కవిరాజహంస నడకలలో కులికే వయారాలు...' ఎంత చక్కని తీయని పదాలు – ఈ పాటలో పాత్రకు ఒక సానుకూలధోరణి (తెలివిగా, ఠీవిగా, కొనసాగించే సాధన) అతిశయం అన్నీ కలిసి ఉంటాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని పాట రచయిత మల్లాది అతి చక్కని లోతైన పదాలను లలితంగా అందించారు.

పాట సాకీతో మొదలౌతుంది. కవి భావనను సుశీల ఎంతో తీయగా ముఖ్యంగా 'తీ...యగా' అనే చోట చిన్న దీర్ఘంలోనే మన హృదయాలను ఇట్టే ఆకర్షిస్తుంది. ఓపికగా, నిశితంగా పరిశీలించాలే గానీ యీ పాటలోని ప్రతి శబ్దంలోను తేటదనం, స్వరంలోని మాధుర్యం సుశీల గాత్రంలో సమ్మోహనంగా పలుకుతుంటే కల్యాణిరాగానికి ఇన్ని సోయగాలు, స్వరపరీమళాలు ఉన్నాయా? అన్పిస్తుంది. 'కలవోయీ యీ లేమ నగుమోములో...' అనే చోట ఆమె గాత్రం పరవళ్లు తొక్కుతూ సాగుతుంది. పాట మధ్యలో అకార ఆలాపనలు.. పాట ముగింపులో యీ 'నగుమోములు..' అనే చోట ఎంతటి గాత్ర పరిజ్ఞానమో అన్పిస్తుంది. పాత్ర మనసును ప్రతిపదంలో ప్రతిబింబించటం సుశీలకున్న అరుదైన ప్రజ్ఞగా యీ పాటలో సుస్పష్టంగా వినిపిస్తుంది. కవి ప్రస్తావించిన హంసనడకల హొయలన్నీ ఆమె గొంతులో వయ్యార స్వరాలుగా విన్పిస్తాయి. అతిశయంతో పాత్ర చూపే హావభావాలన్నీ తెలివిగా, ఠీవిగా ఆకళింపు చేసుకున్న తీరుతెన్నులు మీరూ ఒకసారి పరిశీలించండి. 'తీయని పలుకులలో' అనే చోట పలుకులలో తర్వాత సాగిన ఓ ఆలాపనలో రాగజీవాలన్నీ పొందికగా, తీగలా సాగి వీణారవంలా హృదయానికి తగులుతాయనడంలో సందేహం లేదు. ఈ పాట వింటుంటే నరనరాల్లో తన్మయత్వ అనుభూతులు కలుగుతాయి. పాటలోని ప్రౌఢ సంగతులు సుశీల గాత్రంలో మరోసారి వినండి.

# సీతారామకల్యాణము (1961)

❖ సీనియర్ సముద్రాల ❖ గాలి పెంచల నరసింహారావు

పల్లవి : సీతారాముల కల్యాణం చూతము రారండి!
శ్రీ సీతారాముల కల్యాణం చూతము రారండి!
చూచువారలకు చూడముచ్చటట
పుణ్యపురుషులకు ధన్య భాగ్యమట
భక్తి, యుక్తులకు ముక్తి ప్రదమట... ॥భక్తి॥
సురలును, మునులును చూడ వత్తురట ॥కల్యాణము॥
దుర్జనకోటిని దర్పమడంచగ
సజ్జనకోటిని సంరక్షింపగ
ధారుణి శాంతిని స్థాపన చేయగ ॥ధారుణి॥
నరుడై పుట్టిన పురుషోత్తముని ॥కల్యాణము॥
దశరథరాజు సుతుడై వెలసి
కౌశికు యాగము రక్షణ జేసి ॥దశ॥
జనకుని సభలో హరువిలు విరచి .... ॥జనకుని॥
జానకి మనసు గెలిచిన రాముని ॥కల్యాణము॥
సిరికల్యాణపు బొట్టునుపెట్టి
బృందం : బొట్టును పెట్టి
మణిబాసికమును నుదుటను గట్టి
బృందం : నుదుటను గట్టి
పారాణిని పాదాలకు బెట్టి ... ॥పారాణి॥
పెళ్లికూతురై వెలసిన సీతా ॥కల్యాణము॥
సంపగి నూనెను కురులను దువ్వి
బృందం : కురులను దువ్వి.....
సొంపుగ కస్తూరి నామము దీర్చి
బృందం : నామము దీర్చి
చెంప జవాది చుక్కను బెట్టి... ॥చెంప॥
పెండ్లికొడుకై వెలసిన రాముని

కల్యాణము చూతము రారండి ॥శ్రీ సీతా॥

జానకి దోసిట కెంపుల ప్రోవై

బృందం : కెంపుల ప్రోవై

రామునిదోసిట నీలపు రాశై

బృందం : నీలపు రాశై

ఆణిముత్యములు తలంబ్రాలుగా ....॥ఆణి॥

బృందం : ఆ..... ఆ..... ఆ....

శిరముల మెరసిన సీతారాముల

కల్యాణము చూతము రారండి



ఈ అక్షరాలు చూడగానే పాట పాడేస్తున్నారా... అదే యీ పాటలోని గొప్పతనం. అపురూపమైన సంగీత సాహిత్యాలకు అద్దినటువంటి కల్యాణతిలకం "సీతారామకల్యాణం" చిత్రంలోని యీ కల్యాణగీతం. ఈపాట వినిపించని శ్రీరామనవమి పందిళ్లు లేవు. ఈ పాట విన్పించకపోతే తెలుగునాట పెళ్లిపందిళ్లలో సందళ్లు లేవు. సినిమా పుట్టినప్పటినుంచి ఇప్పటివరకూ ఎన్నో పాటలు వచ్చి ఉంటాయి. వాటిలో ఎన్ని పాటలు మనకు గుర్తుంటాయి! కానీ చాలామందికి ఎప్పుడో చిన్ననాడు మనసుకు దగ్గరగా వచ్చిన పాటల్లో యీ పాట చాలా ప్రముఖమైంది. సీతారాముల కల్యాణం చూసే భాగ్యం నాడు ఎందరికి దక్కిందో .. కానీ తెలుగువారు మాత్రం యీ పాటతో ఆ దివ్యకల్యాణాన్ని తమ ఆత్మ చక్షువులతో దర్శిస్తూనే ఉన్నారు. తమ పంచేద్రియాలతో అనుభూతి చెందుతూనే ఉన్నారు. తెలుగుపాటల్లో ఇంతకుమించిన టైమ్‌మిషన్ పాట మరొకటి లేదు. ఎప్పుడు విన్నా సరే టైమ్‌మిషన్ ఎక్కినట్టై మిథిలానగరం చేరుకుని ఆ కల్యాణాన్ని చూస్తున్న భావన కలుగుతుంది.

ఆహ్లాదకరమైన సంగీతం, అద్భుతమైన వాద్యాల మేళవింపు, చక్కని సాహిత్యపు గుబాళింపు, గాయనీమణి స్వరమాధుర్యం, నటీనటుల ముగ్ధత్వం... అన్నీ కలిసి యీ పాటను అజరామరం చేశాయి. వైదిక వివాహం ఇలా జరుగుతుంది అని లోకానికి చాటింది సీతారాముల కల్యాణమే. అప్పటివాళ్లు ఆ కల్యాణాన్ని చూసి ముగ్ధులైపోయారని

ఇతిహాసాలు చెబుతున్నాయి. ఆ వైభవాన్నిచూసే అవకాశం లేని యీ తరాలవారికి ఆ అదృష్టాన్ని తన పాట ద్వారా కలిగించిన మహనీయుడు సీనియర్ సముద్రాల. 'సిరి కల్యాణపు బొట్టునుపెట్టి...', 'మణిబాసికమును నుదుటనుగట్టి....', 'పారాణిని పాదాలకు బెట్టి...' పెళ్లికూతురు సిద్ధం కాలేదట... సముద్రాల ఏమంటారంటే 'సీత వెలిసింది' అంటారు. ఇది వారికున్న పురాణాల అవగాహనకు పరాకాష్ఠ. నిజమే కదా, సీత సహజాత కాదు అయోనిజ, జనకుని ఇంట వెలసింది.. ఈ 'వెలసింది' అన్న ఒకేమాట మనల్ని సీత జన్మవృత్తాంతం దగ్గరకు తీసుకు వెళ్తుంది. ఇక రాముడేం తక్కువ తిన్నాడా? 'సంపంగి నూనెతో కురులను దువ్వి, సొంపుగ కస్తూరి నామము దీర్చి, చెంప జవ్వాది చుక్కను పెట్టి' ఆయన కూడా వెలిశాడు. ఇక్కడ శ్రీమహావిష్ణువు ధరించిన రామావతారం సూచితం. ఇంత మార్మికంగా ఉంటుందీపాట. సీతాదేవి, శ్రీరామచంద్రుల లావణ్యరూపాల్ని కళ్లముందు నిలపడం సముద్రాలకే చెల్లింది. 'శ్రీరామకర్ణామృతం' లోని 'జానక్యాః కమలామలాంజలి పుటే యాః పద్మరాగాయితా' (1-83) తీసుకుని 'జానకి దోసిట కెంపుల ప్రోవై, రాముని దోసిట నీలపురాశై అని సీతారాముల శిరసుల మీద ఆణిముత్యాలుగా మెరిసిన తలంబ్రాలను వర్ణించారు సముద్రాల. ఈ పాటను వింటున్నా, తెరపై చూస్తున్నా ఆ కల్యాణం జరిగే చోటికే వెళ్లిపోవాలని, స్వయంగా దర్శించాలని మనసు ఉవ్విళ్లూరుతుంది.

ఎంతమంది ఎన్ని పెళ్లిపాటలు రాసినా, యీ పాటలాగ ఎవరూ రాయలేరు, రాయలేరు. అసలా ప్రయత్నం చేయడం కూడా అనవసరం. ఎందుకంటే అది అసాధ్యం! 'రామయ్యా వస్తావయ్యా' పాటుంది. ఆ హిందీ పాటలో తెలుగుపదాన్ని ఎందుకు పెట్టారు? ఎందుకంటే అక్కడ మరే పదమూ ఇమడలేదు, ఏది పెట్టినా అంతగా పొసగదు. కనుక! అందువల్లే ఆమాటను అలాగే ఉంచేశారు. ఈ పెళ్లిపాటా అంతే. అది ఉన్నదే అత్యున్నతమైన స్థానంలో. దాన్ని దాటి వెళ్లడం ఎవరికి సాధ్యం! ఒకవేళ ప్రయత్నించినా అది సాహసమే అవుతుంది. అందుకేనేమో .... ఆ సాహసాన్ని ఇంతవరకూ ఎవరూ చేయలేదు. వెయ్యేళ్లు గడిచినా దీన్ని మించినపాట మరొకటి పుట్టదు.

ఈ పాట వింటే నాటితరాల వారికి తమ పెళ్లిరోజులు గుర్తొస్తాయి. ఈనాటి వారికి అంత అంగరంగ వైభవంగా పెళ్లి చేసుకోవాలని అన్పిస్తుంది. ఎక్కడ పెళ్లిజరిగినా యీ పాట ఉండాల్సిందే! యీ పాట సి.డి. వేయని పెళ్లి మనమెప్పుడైనా చూశామా? చూసే అవకాశమే లేదు. భోజనానంతరం తాంబూలసేవనం లేకుంటే ఎంత వెలితిగా ఉంటుందో...ఎంత ఖర్చుపెట్టి ఘనంగా పెళ్లి చేసినా, ఈపాట పందిరిలో వినిపించకపోతే

ఆ లోటు కొట్టొచ్చినట్టు కన్పిస్తుంది. ఒక్క పెళ్లిపందిళ్లలోనే కాదూ, మనకూ మనసు బాగోలేనప్పుడు ఒక్కసారి ఈ పాట వింటే, మనచుట్టూ ఉన్న వాతావరణం ఒక్కసారిగా ఆనాటి మిథిలకు వెళ్లిపోయి ఆహ్లాదకరంగా మారిపోతుంది. ఓ రకంగా చెప్పాలంటే ఇది పాటకాదు, భావచిత్రం. హైందవ వివాహవ్యవస్థ పదిలంగా ఉన్నంతకాలం యీ పాట సజీవంగా ఉంటుంది. పెళ్లిజరిగే ప్రతి ముంగిట్లోనూ వినిపిస్తూనే ఉంటుంది.



సీనియర్ సముద్రాల

అయితే మన దురదృష్టం చిత్రం నిడివి దృష్ట్యా యీ పాటలో 'చూచు వారలకు చూడముచ్చటట' అనే పంక్తి దగ్గరనుండి జానకి మనసు గెలిచిన రాముని' అనే పంక్తి వరకు అంటే మొదటి చరణమంతా తీసేశారు. అయితే అప్పట్లో రికార్డులు ముందుగా వచ్చేసేవి. అందుచేత చిత్రంలో యీ చరణం ఉండకపోయినా కనీసం రికార్డు ద్వారా అయినా మనం వినే భాగ్యం కలిగింది.

ఇక యీ పాటకు సంపూర్ణ విజయశోభలను ఇవ్వడంలో సుశీల గాత్ర ప్రతిభ చాలా ముఖ్యమైంది. పదాలను తేనెలో ముంచి తీసినట్లుగా ఎంత మాధుర్యం... పాట మొత్తాన్ని ఆకళింపు చేసుకుని ప్రతి పదానికి 'సిరికల్యాణపు బొట్టు', 'మణిబాసికపు కట్టు', 'పారాణిపెట్టు' అన్నట్లు గాత్రంలో ముస్తాబు చేసిన పెళ్లిపాట ఇది. పదాలలోని పరిమళం సంపంగి నూనె, కస్తూరి నామంతో తీర్చిదిద్దినట్లు ఆమె గాత్రం పలికింది.

ఈపాట మధ్యమావతిరాగంలో కూర్చబడింది. అయితే పాట చివరలో వచ్చే వాద్యసంగీతం ఆనందభైరవి.

ఈపాటకు పుంసామోహనరూపాయ అన్నట్లు హరనాథ్, అపరంజి బొమ్మ గీతాంజలి సీతారాములుగా నటించి వాళ్లను వాళ్లు చరితార్థులను చేసుకోవడమే గాక, తెరపై చూచి మనల్ని కూడా ధన్యుల్ని చేశారు. వాళ్లను చూస్తుంటే నిజంగా సీతారాములేనేమో అన్నంతగా మురిసిపోయారానాడు పల్లెప్రజలు.

# భార్యాభర్తలు (1961)

❖ శ్రీశ్రీ ❖ యస్.రాజేశ్వరరావు

ఏమని పాడెదనో ఈవేళ ॥ఏమని॥
మానసవీణ మౌనముగా
నిదురించిన వేళ
ఏమని పాడెదనో ఈ వేళ
జగమే మరచి
హృదయ విపంచి ॥జగమే॥
గారడిగా వినువీథి చరించి ॥గారడిగా॥
కలతనిదురలో కాంచిన కలలే
గాలిమేడలై కూలిన వేళ ॥ఏమని॥
వనసీమలలో హాయిగ ఆడే ॥వనసీమ॥
రాచిలుకా నిను రాణిని చేసే ॥ రా చిలుకా॥
పసిడితీగెలా పంజర మిదిగో
పలుకవేమని పిలిచేవేళ ॥ఏమని॥



"సర్వశ్చమే, శ్లోకశ్చమే, శ్రావ్యశ్చమే, శ్రుతిశ్చమే.... అని తైత్తరీయోపనిషత్తు. "నాకు మంచి స్వరాన్ని, సుస్పష్టమైన శ్లోక పఠనాన్ని, శ్రావ్యమైన అధ్యయనాన్ని, శ్రుతిపక్వమైన పలుకును, ఆ వేదమాత ప్రసాదించుగాక!" అని దీని సారాంశం. వేదమాత వీటన్నింటినీ సుశీలకు వరప్రసాదంగా ఇచ్చిందనటానికి అనేకానేక ప్రక్రియలను ఉదాహరణలుగా చెప్పవచ్చు. అందుకే ఆమె పాడిన పాటలను ఆణిముత్యాలంటారు. కానీ నిజానికి అవి "వాణి" ముత్యాలని చెప్పుకోవచ్చు.

చిత్రసన్నివేశంలో నాయిక మానసిక సంఘర్షణకు సహానుభూతి చెంది, దాన్నంతా రెండే రెండు చరణాల్లో అందించారు శ్రీశ్రీ. ఆర్తిని కమనీయంగా పలికించే రాగాన్ని ఎంచుకున్న (ర)సాలూరు రాజేశ్వరరావు ప్రతిభ అనన్యసామాన్యం.



యస్.రాజేశ్వరరావు

గాన గమనాన్ని పరిశీలిస్తే గమకాలను శ్రుతిపక్వంగా, పదాలను స్పష్టంగా అచ్చతెనుగు నుడికారంలోని వయ్యారంలా అన్నీ సమపాళ్లలో కుదిరిన 'వీణ' పాటగా దీన్ని చెప్పుకోవచ్చు. చరణంలోని మొదటిపదాలను తొలిసారి, మలిసారి పలకడంలో జాలువారు స్వరపదవిన్యాసం ఒకసారి వినండి (జగమే మరచి... చరించి), రెండవ వాక్యాన్ని తరచిచూస్తే 'కలతనిదురలో కాంచిన కలలే....' అనే చోట గమనం తారాస్థాయికి చేరి... వెంటనే 'గాలిమేడలై కూలిన వేళ....' అనేచోట మళ్లీ మంద్రస్థాయికి చేరుకోవటం... ఈ రెండూ స్వరకర్త సంగీతరచనాచాతుర్యానికి ప్రతీకలు. దాన్ని అందిపుచ్చుకున్న సుశీల గాత్రంలోని ఆర్తి, అందులో తెలియని ఆవేదనాభరిత నిర్లిప్తత... ఏదీ ఎవరి ఘనతో చెప్పలేని గీతం. అందుకే ఎవరి ఘనతను చెప్పుకోవాలన్నా మాటలు చాలక 'ఏమని పాడెదనో....' అని పాడుకుని తృప్తి చెందాల్సి వస్తుంది.

'సింధుభైరవి' రాగంలోని ఈపాటలోని వీణ బిట్లు ప్రముఖవైణికులు చిట్టిబాబువి.

ఈ పాటకు అభినయం కృష్ణకుమారి. నిజానికి యీ పాత్రకు మొదట జమునను అనుకున్నారు. కానీ అప్పటికి అగ్రనాయకులకు, ఆమెకు మనస్తాపాల యుద్ధం జరుగుతూ ఉండడంతో, యీ పాత్ర కృష్ణకుమారిని వరించింది. ఈ చిత్రవిజయం కృష్ణకుమారిని నటిగా తారాపథానికి చేర్చి, సుమారు పదేళ్లపాటు ఆమెకు ఊపిరి సలుపుకోలేనన్ని అవకాశాల్ని తెచ్చిపెట్టింది. ఇంత గొప్ప పాత్ర 'మిస్' అయిన జమునది బాడ్‌లక్. అయితే అదే కృష్ణకుమారికి గుడ్‌లక్. అంతే, ఏది శాపమో, ఏది వరమ్మో ఎవరికీ తెలీదు!



# కలిసి వుంటే కలదు సుఖం (1961)

❖ ఆరుద్ర ❖ మాస్టర్ వేణు

మేలిమి బంగరు మెలిక తిరిగినా – విలువ తరిగేనా?
మీ దేహములో చిరు లోపములున్నా
ప్రేమ కరువగునా? ॥మేలిమి॥

సింహము కాళ్లు చిక్కుపడిననూ
శౌర్యము కొరవడునా? ॥సింహము॥
చేతలు మాటలు ఒక్కటే అయితే
త్యాగము కరువగునా? ॥మేలిమి॥

కాళ్లే లేని కమ్మని చంద్రుడు
నిరతము పయనించునే ॥కాళ్లే॥
కరములు చాపే కలువను చేరి
ముదము కలిగించునే
ముదము కలిగించునే ॥మేలిమి॥

పతి పదసేవాభాగ్యము నేనే
సతతము నోచితినీ... ॥పతిపద॥
నీ చల్లనిమదిలో సౌఖ్యము లొసగే
స్వర్గము చూచితిని,
స్వర్గము చూచితిని ॥మేలిమి॥

ఈ సినిమా "పేరు"లో ఒక సానుకూలదృక్పథం... అలాగే యీ పాట సాహిత్యంలో మరొక గొప్ప సానుకూలదృక్పథం. (Positive thinking), ఆత్మవిశ్వాసం (Self Confidence) ఉన్నాయి. ఈ రెండూ రెండు కళ్ల లాంటివని విజయానికి, అద్భుత జీవనసౌందర్యానికి సాధనాలని మనస్తత్వశాస్త్రవేత్తలు నిరంతరం చెప్తూ మనల్ని జాగృతం చేస్తున్నారు.

రచయిత ఆరుద్ర, చిత్రకథానాయకునికి ఉన్న అంగవైకల్యాన్ని ఎంతో పాజిటివ్‌గా మలచి, కథానాయిక చేత చెప్పించిన మహత్తర సందేశమిది. ఈ పాటకు మాతృక "బాగప్పిరివినై" (భాగాలపంపకం) తమిళచిత్రంలో కణ్ణదాసన్ రాసిన 'తంగత్తిలే ఒరు

కుత్తై ఇరుందాలుమ్' అనేపాట. తమిళంలో కూడా సుశీలే పాడారు. ఈ చిత్రాన్నే శ్రీసారథి స్టూడియోస్ వారు "కలసి వుంటే కలదుసుఖం" అని తెలుగులో తీసినపుడు ఈపాట భావాల్నీ, వరసనూ తీసుకున్నారు. తమిళచిత్రానికి విశ్వనాథన్-రామమూర్తి సంగీతదర్శకులైతే, తెలుగు చిత్రానికి మాస్టర్ వేణు సంగీతం.

అటు తమిళంలోనూ, ఇటు తెలుగులోనూ రెండింట్లోనూ ట్యూన్‌కు రాసినపాట ఇది. పాట సాహిత్యంలో తమిళం నుండీ తెలుగులోకి వచ్చేటప్పుడు కొన్ని మార్పులు జరిగాయి.

సాధారణంగా ఒక భాషలో ఘనవిజయం సాధించిన పాటను మరొకభాషలో దాన్ని మించి రాయడం కష్టం. అప్పటికీ ఆరుద్ర తనకున్న అశేష అనువాదగీత రచనానుభవంతో తమిళగీతంలోని గతికి తగ్గట్టు తెలుగుపదాలు పేర్చారు. సాహిత్యపరంగా ఈ చిత్రంలోని అన్ని పాటల్లోనూ ఇదే మేల్తరమైంది. పల్లవిలోని ఉపమానం వెలకట్టలేనిది. చేతలు, మాటలు అనుసంధానం అయితే అద్భుత జీవనగమనమే. చేయి ఇవ్వటం, ఇతరుల చేతిని అందుకోవడం రెండూ గొప్పపనులే. ఈ పాటలో చంద్రుడు తన చూపులతో, కిరణాలతో కలువబాలకు చేతులు అందించాడా? లేక కలువరాణి కరాలనే తానందుకున్నాడా? తెలియని చక్కని భావచిత్రాన్ని కవి అందించారు.

ఇక ఈ పాటలో బంగారుతీగ సుస్వరాలను పలికిస్తుందా? అంటే అవును, అది సాధ్యమే అన్నట్లు మాస్టర్‌వేణు ఈ పాటతో నిరూపించారు. సువర్ణ సప్తస్వరాలు మెలిక తిరిగితే అవి ఎంత శ్రావ్యంగా ఉంటాయో సుశీల తన గాత్రంలో వినిపించారు. పాట చివర్లో 'స్వర్గము చూచితిని' అని రెండుసార్లు పాడుతారు. ఇది చాలా ముఖ్యం. ఎందుకంటే ఈ ప్రపంచంలో ప్రతిపని రెండుసార్లు జరుగుతుంది. ఒకటి మానసికంగా మదిలో ఆలోచనా పద్ధతిలో, రెండోది ప్రాపంచికంగా, భౌతికంగా వస్తురూపంలో ఒక ప్రక్రియగా.

సుశీల ఈ రెండింటినీ మనోనేత్రంతో చూశారు. కవి కల్పనా చాతుర్యాన్ని, స్వరకర్త పరిణతీ పాండిత్యాన్ని అందిపుచ్చుకుని గాత్రంలో పలికించారు.

తమిళంలో బి.సరోజాదేవి, తెలుగులో సావిత్రి అభినయించిన ఈ పాట శంకరాభరణం, హరికాంభోజి రాగాలలో నడుస్తుంది. శంకరుడి ఆభరణం సర్పం, హరికి సర్పమనే పర్యాయపదమూ ఉంది. సర్పానికి కాళ్లుండవు. ఈ చిత్రంలో కథానాయకుడికీ కాళ్లుండవు. ఇది యాదృచ్ఛికం, కాకతాళీయం. చిత్రంలో పాటలకున్న జనరంజకశక్తివల్లే, ఎన్.టి.రామారావు, దివ్యాంగుడిగా నటించినా, ఆట్టే పట్టించుకోక చిత్రాన్ని విజయవంతం చేశారు ప్రేక్షకులు.

# గులేబకావళికథ (1962)

❖ సి.నారాయణరెడ్డి ❖ జోసెఫ్ & కృష్ణమూర్తి

మదన సుందర నా దొరా
ఓ మదన సుందర నా దొరా
నా మది నిన్నుగని పొంగినదిరా వన్నెదొరా
ఓ మదన సుందర నా దొరా....
చిన్నదానను నేను వన్నెకాడవు నీవు ॥చిన్న॥
నాకూ నీకూ జోడు రాకా చంద్రుల తోడు
మదన సుందర నా దొరా....
మిసిమి వెన్నెలలోన పసిడి తిన్నెలపైన ॥మిసిమి॥
రసకేళి తేలి ॥రస॥
పరవశమౌద మీ వేళ
మదన సుందర నా దొరా....
గిలిగింతలిడ యింత పులకింత లేదేమి ॥గిలిగింత॥
ఉడికించ కింక ॥ఉడికించ॥
చూడొకమారు నావంక
మదన సుందర నాదొరా....
మరులు సైపగలేను – విరహో మోపగలేను ॥మరులు॥
మగరాయడా రార – బిగి కౌగిలి చేర ॥మదన॥



సి.నారాయణరెడ్డి నవరసమయ రచనలు చదివి, ఆ మధుర రసాస్వాదనలో



లతామంగేష్కర్ నుండి జ్ఞాపికను అందుకుంటున్న సంగీత దర్శకుడు వేలూరి క్రిష్ణమూర్తి. ఘంటసాల విగ్రహావిష్కరణ సభ (1993)– పబ్లిక్ గార్డెన్స్, హైదరాబాద్

వైమరచి, తమ హృదయపీఠాలపై వారి కవితానరస్వతిని ప్రతిష్ఠించి, ప్రమోద కుసుమాలతో పూజించని రసజ్ఞులుండరు.

ప్రబంధాలలో పరిఢవిల్లిన ప్రౌఢశృంగార పరీమళాన్ని కవితానలతప్త గావించి, ఆ దివ్యగంధాన్ని చిత్రగీతాల్లో ఇగిర్చిన కవి సి.నా.రె.

"గులేబకావళికథ" సి.నా.రె మొదటిచిత్రమే అయినా, అందులోని పాటలన్నీ అశేష ప్రేక్షకుల మదులు దోచుకున్నాయి. వాటిలో అరుదైంది, అపురూపమైంది ఈ జావళీ. ఈ పాటలో ఉన్న మాటలన్నీ అతి సరళాలు. అతి మధురాలు. అతి తరళాలు. వెదకి చూచినా ఒక్క ద్విత్వాక్షరం కనబడదు. నందితిమ్మన 'పారిజాతాపహరణం' పద్యాల రచనాశైలి ఈ పాటలో కన్పిస్తుంది. ప్రతి చరణంలోను ఎనలేని శృంగార ధోరణి గిలిగింతలు పెడుతుంది.

రచనకు పోటీగా తగిన అంతస్థులో సంగీతరచన చేశారు వేలూరి కృష్ణమూర్తి (చిన్నమ్మకథ), జోసఫ్, త్రివిక్రమరావు పర్యవేక్షణలో. రెండు రాగాలను అద్వితీయంగా, అపూర్వంగా మేళవించి అద్భుతప్రయోగం చేశారు. బలహంస, కేదారగౌళ రాగాల మనోహరమైన వరస ఈ పాట.

పాడిన సుశీల కంఠంలో విలాసం, వయారం, మయూర నృత్యం చేస్తున్నట్లుంటాయి. శృంగార రసోత్ఫుల్ల నవమానినీ మానసోత్పలా హృదాంత మధువును చిలికి పాడిన పాట ఇది.

ఎన్ని దశాబ్దాలు దాటినా ఈ జావళీ పూర్ణశశిబింబ సమాన ప్రకాశితం.

తర్వాతి రోజుల్లో – ముఖ్యంగా డి.వి.ఎస్.రాజు, విఠలాచార్య, భావనారాయణ వంటి నిర్మాతలు తాము నిర్మించిన చిత్రాల్లో నారాయణరెడ్డి చేతే జావళులు రాయించుకోవడానికి ఈ పాటే ప్రేరకం.

# ఆరాధన (1962)

❖ నార్ల చిరంజీవి ❖ యస్.రాజేశ్వరరావు

నీ చెలిమి.. నేడె కోరితినీ...
ఈ క్షణమే ఆశ వీడితినీ ॥నీ చెలిమి॥

పూవువలే ప్రేమదాచితినీ
పూజకు నే నోచనైతినీ
ఈ క్షణమే ఆశ వీడితినీ ॥నీ చెలిమి॥

మనసు తెలిసిన మన్నింతువని
తీయని వూహల తేలితి నేనే ॥మనసు॥
పరుల సొమ్మయి పోయి నావని
నలిగె నా మనసే... ॥నీ చెలిమి॥

చెదరిపోయిన హృదయము లోన
పదిల పరచిన మమతలు నీకే... ॥చెదరి॥
భారమైనా దూరమైనా
బ్రతుకు నీకొరకే ॥నీ చెలిమి॥

నీ చెలిమీ....

జగపతి వారి "ఆరాధన" సావిత్రి గొప్పగా నటించిన చిత్రాలలో ఒకటి. 'ఆరాధన' అనే నాలుగు అక్షరాలకూ ఫెర్‌ఫెక్టు నిర్వచనం ఈ చిత్రం. బెంగాలీ చిత్రం "సాగరిక" ఈ చిత్రానికి ఆధారం. ఈ చిత్రంలో కథ చాలా చిన్నది. అనుకోని మలుపులు, విచిత్రమైన సన్నివేశాలు, ఆకర్షణీయమైన వేషభాషలూ ఏమీలేని చిత్రమిది. అయినా విశేష ఖ్యాతి గడించింది. కారణం అక్కినేని, సావిత్రిల నటన. వీరిద్దరి నటనా కౌశల్యంతోనే ఈ చిత్రం దృశ్యమయ కావ్యంగా రూపొందింది. ప్రేమకథలంటే నాయికానాయకుల ప్రణయ సంభాషణలు, ఆరు పాటలూ, రెండు డాన్సులు తప్పనిసరిగా ఉండాలనుకొని భ్రమపడేవారికి ఈ చిత్రం ఒక అర్థం కాని ప్రశ్నే. ఎంచేతంటే ఇందులో నాయికా నాయకుల మధ్య ఒక నృత్యంగాని, ఒక డ్యూయెట్టు గానీ లేవు. అక్కినేని, సావిత్రి జంటగా నటించిన చిత్రాల్లో వీరిద్దరి మధ్య యుగళగీతాలు లేని ఏకైకచిత్రమిది. "నేను నిన్ను ప్రేమిస్తున్నాను" అనే మూడు మాటలు ఎక్కడా, కనీసం ఒక్కసారి కూడా వాచ్యం

చేయబడవు. కేవలం తమ హావభావ విన్యాసం, ఉదాత్తమైన అభివ్యక్తి ద్వారానే అక్కినేని, సావిత్రి తమ ఆరాధనను వ్యక్తం చేయడం ఈ చిత్రంలో చూడవచ్చు. ప్రేమ స్వార్థాన్ని కోరుతుంది. అది కనిపిస్తుంది. కానీ ఆరాధనలో అది కన్పించదు.

తను విపరీతంగా ఆరాధించిన మురళీకృష్ణ (ఏ.ఎన్.ఆర్) పరుల సొమ్మయి పోతున్నాడని తెలిసింది. వెంటనే అనూరాధ (సావిత్రి) నిర్వేదంతో బాల్కనీలోకి వెళ్లింది. ఆశాకుసుమాలు రేకులు రాల్చినట్లు, నీలిమబ్బుల తునకలు విరిగి చంద్రుణ్ణి కప్పివేస్తున్నాయి. పాడుగాలికి లతలు కంపిస్తున్నాయి, ఆమె గొంతు, గుండె పగిలి, ఏడ్పే పాటగా వెలువడింది. ఆవేదన తీరడానికి ఇంతకంటే మార్గం ఏముంది కనుక? – ఇదీ సన్నివేశం.

ఈ సన్నివేశానికి చక్కటి భగ్నప్రణయగీతం రాశారు నార్ల చిరంజీవి. ఆయన రాసింది తక్కువే అయినా చలనచిత్ర సాహిత్యచరిత్రలో కూడా పేరుకు తగ్గట్టే చిరంజీవిగా నిలిచిపోయారు.

వ్యాఖ్యానం అక్కర్లేని పాటలు రాయండం ఆయన శైలి. ముచ్చటగా పల్లవి, అనుపల్లవి, రెండు చరణాల్లో సన్నివేశ గాఢతను వాచ్యం చేయడం ఈయన ప్రత్యేకత.

ఇక అక్షరాల మనసు, పదాల సొగసు తెలిసి సందర్భానుసారంగా రాగాన్ని ఎంపిక చేయడంలో సాలూరికి సాటి లేరెవరూ. ఇదొక వియోగ గీతం. శివరంజని వంటి రాగాన్ని ఎంచుకోకుండా పహాడ్ రాగంలో స్వరపరచడం ఆయన ప్రతిభకు నిదర్శనం. ప్రేక్షకులూ, శ్రోతలూ స్థాయీభావాలు, భేదాలు లేకుండా అందరూ అవలీలగా పాడుకునే వీలుగా స్వరపరచారీ పాటను.

అన్నిరాగాలూ ఆ రోజుల్లో సుశీల గాత్రాన్నే ఆశ్రయించి రాగరంజిత పరీమళాల్ని వెదజల్లాయి. పదాలలో కన్నీటి చెమరింపులు హృదయానికి తాకి, తెలిసిన మనసును మన్నించమని చేసిన వేడుకోలు అతి ఆర్ద్రంగా ఆమె గొంతులో వ్యక్తమైంది. పూవులా దాచిన ప్రేమ, పూజకు నోచుకోక దూరమైనధోరణి ఆ గాత్రంలో గుండెల్ని పిండేసేటట్టు విన్పించాయి. ఊహలలో తేలిన చెలిమి కలిమి క్షణకాలంలో దూరమైన విషాదభావనలు సుశీల గొంతులో శ్రుతిపక్వంగా పలికాయి. పాట సాహిత్యం, దానికి అమర్చిన సంగీతం, రెంటిని గాత్రంలో సమన్వయపరచి పాటను శ్రోతల గుండెల్లో నిలపటం సుశీలకున్న అనుపమాన ప్రతిభ. పహాడ్ రాగానికి వన్నెతెచ్చిన ఈ పాట నేటికీ సావిత్రి వర్ధంతి, జయంతి రోజులలో టీవీ ఛానల్స్‌లో విన్పిస్తూనే ఉంది. నవరస గళసీమ సుశీల అనడానికి ఇలాంటి పాటలెన్నెన్నో.

# స్వర్ణమంజరి (1962)

❖ సీనియర్ సముద్రాల ❖ ఆదినారాయణరావు

మధురమైన గురుదీవెనా
మరపురాని ప్రియభావనా
కనుమా! కొనుమా! రాజా!
కలలోనేని కనగాలేని
నవరాగమాలా, మధురమైన గురుదీవెనా!
ప్రియభావనా,
సరస సంగీత సాహిత్య సీమా
మాకు సరి మేమే గామా
తీయనైన నాపాట విన్నా
రాలు కరగీ నీరౌనుగా ॥కలలోనేని॥
లలిత నాట్యాల మా సాటివారు
ఇలను లేనే లేరు – ఇలను లేనే లేరు
కాలిమువ్వా ఘుల్ ఘుల్లుమనా
రసికహృదయాలు ఝుల్ ఝుల్లనూ ॥కలలోనేని॥ ॥మధుర॥

తగిధిట తగిధిట దగిధిగినగిధిట
కిటత్తానదిత్తా, దగినతా,
కిటధిత్తా కిటధిత్తా కిటధా
కిడథా కిడధా ధా
ఉదనతోం తనన తధారె ధారె ధాని
ఉదనత దీరేన ధాకిడకి దధూం తిరికిట తళాంగ్
కిడనక తిరికిట నగధేకి దనగ
ధిత్తళాంగ్ ధిత్తళాంగ్ ధాధా ఉదనతోం
తనన తధారె ధారె ధాని
ఉదనతోం తనన తధారె ధారె ధాని
తోంతోం తనన తోంతోం తనన
తోం తన తోంతన తనోంతోం తనన

**తఝ్ఝుం తఝ్ఝుం తఝ్ఝుం తఝ్ఝుం తఝ్ఝుంత**
**ఉదనతోం తనన**
**గమదనిసాగగ సానిసా**
**మదానిసా, గమదానిసా**
**సగమధాని,**
**సమగ గదమ మనిద సమగ గదమ మనిద దసని**
**మదనిస మదనిస మదనిస**
**తక తక తక తక తక తక తక తక**
**కిడధిత్తా కిడధిత్తా కిడధిత్తా ధానధా**
**తకతకతోం, తకతోం తక తక తక తద్ధిత్తోం**
**తాక్ తాక్ ధిమి – తాక్ తాక్ ధిమి – తద్ధిత్తోం**
**గిధి గినధా గిధిగినధా గిధిగినధా**
**ధా ధా ధా...**

ఆంధ్రదేశంలో, పూర్వకాలంలో నాట్యానికి ఎంత ప్రాముఖ్యత ఉండేదో, విజయనగరపు ఆనందగజపతి మొదలగు మహా రసికులపోషణలో నాట్యవృక్షం ఎన్ని కొత్త కొమ్మలు వేసి చివురించిందో అనే ఊహాలతను ప్రాకించడానికి నాడు రాయబడ్డ జావళులు, తిల్లానాలు, వేయని పందిళ్లు. ఒక్కొక్క జావళి శృంగార రసఖేలయే గాక సంగీత సాహిత్య నవరసలీలగా ఒప్పారిన ఆ రోజుల్లో, ఒక్కొక్క తిల్లాన మార్దంగిక నైపుణ్యం నిరూపించడానికి, పదలాఘవం చూపించడానికి కట్టని మండపం అయిన ఆ రోజుల్లో నృత్యసుందరి త్రిలింగదేశంలో త్రిభంగి నిలచి కళావేణువును పూరించింది.

అటువంటి జావళీలు, తిల్లానాలు, సంగీతదర్శకులు ఆదినారాయణరావుకు తెలిసినట్లు మరొకరికి తెలియవు. ఈ పరిజ్ఞానానికి తార్కాణాలు, విశిష్టమైన పద్ధతిలో రాగరచన చేసి, స్వరం కల్పించి, దరువులు చేర్పించి "అన్నదాత"లో రాగమాలికగా వినిపించిన దశావతార అష్టపది, "అనార్కలి" లోని 'రాజశేఖరా" నృత్యగీతాజగత్తుకు కలకాలం వెలుగునొసగే ఒక అఖండజ్యోతి. "సువర్ణసుందరి" లో 'ఈ వసుధ'ను నీకు సాటి దైవము' అనే తిల్లాన. ఇదే పద్ధతిలోనిదీ "స్వర్ణమంజరి" లోని హిందోళరాగ గీతం, తిల్లాన. ఈయనకు హిందోళం అంటే ప్రత్యేకాభిమానం. 'రాజశేఖరా' ఈ రాగమే. "సువర్ణసుందరి"లో 'ఈ వసుధ' వినిపించిన చోట హిందీచిత్రంలో ఒక హిందుస్థానీ తరానా (తిల్లానా) ఈ రాగంలోనే వినిపించారు. అదే కొంచెం మార్చి వేరే మాటలు

రాయించి ‘‘స్వర్ణమంజరి’’లో ప్రవేశపెట్టారు. ఆదినారాయణరావు హిందోళరాగ గీతాలు, ఇంత చక్కగా రూపొందచడానికి కొంతవరకు కారణం ఆయన కర్ణాటకరాగాన్ని తీసుకొని, హిందుస్థానీ పద్ధతిలో నేసిన కళలు.



ఆదినారాయణరావు

‘మధురమైన గురుదీవెనా, మరపురాని ప్రియభావనా’ అని చిత్తూరు వి.నాగయ్య మొదలుపెట్టగా సుశీల ‘కనుమా, కొనుమా’ అని అందుకుని శ్రోతల మనస్సును చూరగొంటారు. “సరస సంగీత సాహిత్యసీమా, మాకు సరిమేమే గామా” అని ప్రశ్నిస్తారు. నిజమే. వారి సాటి వారే. ఇంత చక్కని పాటలో ఈషణ్మాత్రలోపం రచింపబడిన స్వరం, దరువులు అపూర్వంగా ఉన్నా చివరిభాగంలో దరువులే పలుకుతున్నప్పుడు రికార్డింగ్ సరిగా లేక తేలిపోయినట్లుండడం. అయితే పాటగా ఆనందించడానికి ఇది ప్రతిబంధకం ఎంతమాత్రమూకాదు.

ఈ పాటల్ని రికార్డుగా విడుదల చేసింది కొలంబియా కంపెనీవారు. వాళ్లు ఈ పాటలో ఎత్తుగడనున్న పల్లవి పాడింది నాగయ్య అని, ఆయన నాటి ప్రఖ్యాతగాయకుడని తెలిసినా, ఆయన పేరు రికార్డుపై వేయలేదు. దానికి కారణం, ఆయన హెచ్.ఎం.వి. పాటకుడు కావడమే.

ఇక సుశీల–నాట్య, సంగీత శాస్త్రాలను రెండింటినీ గాత్రంలో పలికించారు. పాట సాహిత్యం మొత్తం, ఆమె తనకున్న ప్రతిభను చాటిచెప్పేలా చక్కగా ఇమిడిపోయారు. అయితే మామూలుగా సుశీల ఇలా చెప్పుకున్న సందర్భాలు లేవు. అలాంటి సందర్భాలే వచ్చినా తన ప్రతిభకన్నా, తనకు అలాంటి అపూర్వఅవకాశాలు ఇచ్చిన మహనీయులందరినీ అభినందించారే తప్ప తన ప్రతిభను చెప్పలేదు. కానీ తన పాటకు రాళ్లు కరగిపోతాయనడం యదార్థమే కదా!

# భీష్మ (1962)

❖ ఆరుద్ర ❖ యస్.రాజేశ్వరరావు

**మహాదేవ శంభో ॥మహా॥**
**మహేశా గిరీశా - ప్రభో దేవదేవ**
**మొరాలించి పాలించరావా ॥మహాదేవ॥**

**జటాజూటధారీ - శివా చంద్రమౌళీ**
**నిటాలాక్ష నీవే - సదా నాకు రక్ష ॥జటాజూట॥**
**ప్రతీకారశక్తి - ప్రసాదించరావా**
**ప్రసన్నమ్ము కావా - ప్రసన్నమ్ము కావా ॥మహాదేవ॥ ॥మహేశా॥**
**శివోహం శివోహం - శివోహం శివోహం ॥మహాదేవ॥**



పట్టుమని పాతికపదాలు లేవు ఈ పాటలో. ఇదొక భక్తిగీతం. ఇలాంటి చిన్నిపాట వింటున్నా, పాడుకుంటున్నా జన్మచరితార్థమౌ తుందనిపిస్తుంది. ఆరుద్ర కలం నుండి జాలువారిన ఈ భక్తిగీతం తెలుగునాట నిత్యశివరాత్రిగీతంగా ప్రచారం పొందింది.

పాటలోని సారాంశం - అంబ, భీష్ముడి పై ప్రతీకారం తీర్చుకోవాలనే ఆకాంక్ష! దీన్ని గ్రహించిన స్వరకర్త రాజేశ్వరరావు ఈ పాటకు నటభైరవి రాగాన్ని ఎంచుకుని విలక్షణంగా స్వరపరిచారు. పాత్రకు తగిన పాటను కవి అందిస్తే, ఆ పాటకు తగినరాగం సమకూరుస్తాడు సంగీతదర్శకుడు.

భక్తితో, ఆర్తితో, అనురక్తితో సుశీల గాత్రం అందుకుని, మనల్ని 'మహాభారతం' కాలంనాటికి తీసుకెళ్లిపోతుందీపాట. ఇది వినడానికి చాలా చిన్నదైనా పాడడానికి చాలా క్లిష్టమైనపాట. సుశీల, అంబ పాత్రలోకి పరకాయప్రవేశం చేసి పాడారనిపిస్తుంది. ఒక్కొక్కపదం ఆమె పలుకుతుంటే తనువంతా నాదమయుడైన మహాదేవుడు మురిసిపోయి ప్రత్యక్షమౌతాడనిపిస్తుంది. పాట చివరలో 'ప్రసాదించరావా-ప్రసన్నమ్ము కావా' అని ముగిస్తుంటే మనోలోకంలో భగవత్ సాక్షాత్కారం కలిగి హృదయం తాదాత్మ్యం పొంది తీరుతుంది.

# గుండమ్మకథ (1962)

❖ పింగళి ❖ ఘంటసాల

అలిగిన వేళనె చూడాలి
గోకుల కృష్ణుని అందాలూ ॥అలగిన॥

రుసరుసలాడే చూపులలోనే
ముసిముసినవ్వుల చందాలూ ॥అలిగిన॥

అల్లన మెల్లన నల్లపిల్లి వలె
వెన్నను దొంగిల గజ్జలు ఘల్లన
తల్లి మేలుకొని దొంగను చూసి
అల్లరిదేమని అడిగినందుకే ॥అలిగిన॥

మోహన మురళీగానము వినగా
తహతహలాడుచు తరుణులు రాగా
దృష్టి తగులునని జడిసి యశోద
తనను చాటుగా దాచినందుకే ॥అలిగిన॥



విజయావారి "గుండమ్మకథ" (1962) చిత్రంలోని అన్నిపాటలలో కెల్లా ఎన్నికైనదీ, మన్నికైనదీ ఈపాట. పింగళి సాహిత్యానికి ఘంటసాల దేశి రాగంలో స్వరకల్పన చేశారు. ఈపాట వినగానే ఒకభక్తిగీతంగానే శ్రోతల మదిలో నిలిచిపోతుంది. బాలకృష్ణుని చిలిపిపనులు ఇంటా బయటా పెద్ద తంటాలు, తగవులు తెచ్చేవే. తల్లియశోద ఈ రెండింటిని సమన్వయం చేసుకుంటూ మాతృవాత్సల్యం చూపే ఈపాట అందరికీ నచ్చడానికి ముఖ్యకారణం సులభంగా నోటికి వచ్చే వరస కావడం.

ఈ పాటలో చమత్కారం వెండితెరపై చూస్తే ఒక భక్తే కాదు ఆలుమగల మధ్యగల అనురక్తిని చెప్పకనే చెప్తుంది. కృష్ణుడు అలిగినా అందమే, చిరుకినుక చూపినా అందమే



అనే కవి భావనను అన్యాపదేశంగా భార్య, భర్తపై ప్రయోగించి గోముగా పాడడం విశేషం. సావిత్రి, ఎన్.టి.రామారావుల అభినయం ఈ పాటకొక రసస్పర్శను తెచ్చిపెట్టింది.

పింగళి రచనలో పనస తీపి, తేనెల సోయగాలు సుస్పష్టంగా కనిపిస్తాయి. కృష్ణుడు అలిగినా అందమే... చిరుకినుక చూపినా అందమే... రుసరుసలు, ముసిముసినవ్వులు చిందించినా అవన్నీ 'లీలాకృష్ణా నీలీలలేకదా?' అనేలా ముచ్చటగా అనిపిస్తాయి.

ఈపాటలో 'ల' అక్షరాన్ని ఇరవైనాలుగుసార్లు ప్రయోగించి పింగళి కలం బలం– శుకపాళి కేళీవిలాసం అనేలా లలితంగా విన్పిస్తుంది. సుశీల పాడడం వేడిమీగడ కమ్మదనాన్ని అనుభవానికి తెస్తుంది. ముఖ్యంగా చరణాలలో 'తహతహలాడుచు' అనేచోట ఆమె గొంతులోని మార్దవానికి, మాధుర్యానికి మనం తహతహ లాడవలసివస్తుంది. ఈపాట మధ్యలో, చివరలో వినిపించే నాదస్వర సంగతులు పాలవెన్నెల చల్లదనాన్ని ఆస్వాదిస్తున్నట్లుగా విన్పిస్తాయి. ఏ పాటకైనా ప్రత్యేకతనూ, విశిష్టమైన ప్రభనూ ఇచ్చేవి మూడు. రచన, వరస, పాడడం. ఈమూడింటిలోనూ అత్యంత మనోహరంగా, మధురంగా, మృదులంగా ఉంటుందీ పాట.

ఇందులోనే సుశీల గాత్రంలోని తారాస్థాయి మధురిమలు పరిశీలించండి.. 'దృష్టి తగులునని జడిసి యశోదా...' తర్వాత ఆలాపనలు... శుద్ధ స్ఫటికనాదంలా, రవంతదోషం లేని నిర్మల వేణుగాన రవళిలా సుమధురం...సుందరం. భక్తికి, పాత్రలోని అనురక్తికి, తేటతెలుగుపదాలకు, దేశ్‌రాగ స్వరాలకు నిలువెత్తు గానరూపాన్నిచ్చి సమ్మోహన దృశ్య, శ్రవణగీతికలా సుశీల గాత్రం పలికింది.

# గుండమ్మకథ (1962)

❖ పింగళి ❖ ఘంటసాల

సన్నగ వీచే చల్లగాలికి
కనులు మూసినా కలలాయే
తెల్లనివెన్నెల పానుపుపై ఆ....
కలలో వింతలు కననాయే ॥సన్నగ॥

అవి తలచిన యేమో సిగ్గాయే –
కనులు తెరచినా నీ వాయే – నే
కనులుమూసినా నీ వాయే ॥కనులు॥
నిదురించిన నా హృదయము నెవరో
కదిలించిన సడి విననాయే ॥నిదురించిన॥
కలవరపడి నే కనులు తెరువ
నా కంటిపాపలో నీవాయే
ఎచట చూచినా .... నీవాయే ॥కనులు॥
మేలుకొనిన నామదిలో ఏవో
మెల్లని పిలుపులు విననాయే ॥మేలుకొనిన॥
ఉలికిపాటుతో కలయ వెదక
నా హృదయఫలకమున నీవాయే
కనులు తెరచినా నీవాయే
కనులుమూసినా నీవే నాయే!

మానవుడు సౌందర్యరసపిపాసి, చక్కని రసాన్వేషి. నవరసాలలో పరమాత్మ విరాట్రూపాన్ని చూడాలనే తపన, ఆశ, ఆకాంక్ష, తెలియని అన్వేషణ అన్నీ వున్నవాడు. ఇది భగవద్దత్తం. ఆ అన్వేషణలో, ఆ రసాస్వాదనలో అనంతమైన అనుభూతులకు లోనై ఒక అద్వితీయ అమరానందం పొందుతాడు. దానిని పదిమందికి పంచాలనే తృష్ణతో నిరంతరం ఏదో ఒక నవ్యత కోసం సాధన చేస్తుంటాడు. దీనికి లలితకళలను ఆలంబన చేసుకుంటాడు. దీనినే, ఉపనిషత్తులు 'ఆనందం బ్రహ్మేతి వ్యజనాత్' (ఆనందమే బ్రహ్మ) అన్నాయి. అరిస్టాటిల్ 'ఆనందమే జీవిత పరమావధి' అని స్వల్పంగా ముగించాడు.



పైన చెప్పిన వివరణలు ఈపాటకు నూరుశాతం వర్తిస్తాయి. ఘంటసాల స్వరకల్పనలో, పింగళి శుకపాళి నుండి వచ్చిన పదాలలో చివరగా సుశీల గొంతులో ప్రభవించిన అనుభూతుల ఆనందపరాకాష్టగా ఈ పాటను ప్రస్తావించవచ్చు.

చెవులకు వినిపించని అతిసున్నిత నాదాలు, నిత్యం వినిపించినా ఏదో నూతనత్వాన్ని పొందిన పదాలు......, ద్వాదశ భైరవిగా పేరొందిన సింధుభైరవి రాగ సుస్వర విన్యాసాలు అన్నీ కలసిన పాట ఇది.

సాకీ ప్రస్తావనలోనే సుశీల గాత్రం లలితంగా సన్నగవీచిన తెమ్మెరలను పోలి ఉంటుంది. సాకీ పూర్తవగానే తెలియని ఆనందం చెవులకు తాకి హృదయాన్ని మీటి అర్ధ నిమీలితనేత్రాలతో ఆనందం ఆకాశంలా విస్తరించి మనసు కుదుటపడి తెలియని భావనలు కలుగుతాయి. తెలియని మౌనం ఆవరిస్తుంది. ఆ విధంగా పాటంతా హృదయాన్ని కదిలించి కనులు తెరిస్తే... ఉలికిపాటుతో మరలా హృదయాన్ని పలుకరిస్తే... అందులోనూ ఆనందమే... అదొక వింతసవ్వడి... ఆ గాత్రం ఒక వరవడి... సుస్వరాల ప్రాకారాల గుడి... అందు ప్రతీదీ సుస్వర నాదమే... మాధుర్యమే... కవి భావనలు, స్వరకర్త ప్రతిస్పందన, గాయకురాలి ప్రతిభ, అన్నీ ఒక తురీయానంద సమాధిస్థితిని పొందుతాయి. అవన్నీ మరలా శ్రోతలు పొందటం అంటే...మాటరాని మౌనంగా....మరలా విని ఆ ఆనందబ్రహ్మను కళ్లెదుట... మనసులో ఆవిష్కరించుకోవటమే.... ఎంత చెప్పినా చివరగా ఇవన్నీ 'మానస నేత్రానికి' మాత్రమే దర్శనమిచ్చే అద్భుత విషయాలు.

వెండితెరపై జమున కనువిందు చేశారీ పాటలో!

# శ్రీకృష్ణార్జున యుద్ధం (1963)

❖ పింగళి ❖ పెండ్యాల

నీకై వేచితినయ్యా ఓ ఏకాంతరామయ్యా
నీకై కాచితినయ్యా .... నీకై కాచితినయ్యా ॥నీకై॥

నీవేక్షణమున వచ్చెదవోయని ఎదురులు చూచితినయ్యా.....
ఎదురులు చూచితినయ్యా
నీవు నడతువని త్రోవ త్రోవల పూవుల పరచితినయ్యా ॥నీకై॥

చిగురాకులలో గాలి కదిలినా నీవని భ్రమసితినయ్యా...
నీవని భ్రమసితినయ్యా
చిలుక పలికినా నీ పిలుపేయని ఉలుకున కలిగితినయ్యా ॥నీకై॥

నీకు ప్రియముగా విరిసిన పూవులమాలిక లల్లితినయ్యా...
మాలిక లల్లితినయ్యా
మనసున నిలిచిన మంగళరూపము ఎన్నడు చూచెదనయ్యా ॥నీకై॥



ఎన్నో మంచి పాటలున్న ''శ్రీకృష్ణార్జునయుద్ధం''లో అత్యుత్తమమైనదీ పాట. పాట సాహిత్యం కొత్తదనం ఏమంత కాదు. ఒకచోట 'చిగురాకుల సడి విన్నను' "ప్రేమలేఖల" పాట గుర్తుకు వస్తుంది. కానీ, ఈ పాతదనం ఏమాత్రం కనబడకుండా పెండ్యాల, సుశీల దీనికి సమ్మోహనమంత్రం వేశారు. ఈపాటను పెండ్యాల తమ కిష్టమైన పీలూరాగంలో చేశారు. కాబట్టి తమ ప్రేమభావం ప్రతిసంగతిలోను తెలుస్తుంది. నిజమే మరి, కోకిలకు కంఠం ఏకాలంలో నైనా ఉంటుంది. కానీ, మధురంగా పాడేది వసంతంలోనేగా? వీరుపెట్టిన సంగతులకు పెట్టిపుట్టినదో యన్నట్టు, సుశీల తన కంఠం మాధుర్యాన్ని సువర్ణరేఖలుగా గావించారు. హాయికి పర్యాయపదం ఈ పాట.

# నర్తనశాల (1963)

❖ సీనియర్ సముద్రాల ❖ సుసర్ల దక్షిణామూర్తి

**జననీ శివకామినీ!**
**జయశుభకారిణీ, విజయరూపిణీ!** ॥జననీ॥

**అమ్మవు నీవే అఖిల జగాలకు!**
**అమ్మలగన్న అమ్మవు నీవే!**
**నీ చరణములే నమ్మితినమ్మా!**
**శరణము కోరితి అమ్మా! భవానీ!** ॥జననీ॥

**నీదరినున్నా తొలగు భయాలూ!**
**నీ దయలున్నా కలుగు జయాలూ!**
**నిరతము మాకూ నీడగ నిలచీ!**
**జయము నీయవే అమ్మా భవానీ!** ॥జననీ॥

మహాజననిని, ఆదిశక్తిని ఎంత వర్ణించినా అంతుపట్టని అనంత సాగరగర్భ మహాసంపదల్లా కవి గాయకులకు, నృత్యోపజీవులకు కల్పతరువై నిత్యం ఎంతో కొంత అందుతూనే ఉంటాయి.

మహాభారతంలోనే రమణీయమైన విరాటపర్వాన్ని సీనియర్ సముద్రాల ఒక శిఖరస్థాయి పరిధిలోకి తీసుకెళ్లి వెండితెరపై స్థిరస్మరణీయం చేశారు. ఇందులోని పాటలు, పద్యాలు సుసర్లదక్షిణామూర్తి స్వరకల్పనలో మేటిరత్నా లనిపిస్తాయి.

విరాటరాజ్య మహారాణి సుధేష్ణాదేవి ప్రాపకం కోసం దేవీ ఆలయానికి సైరంధ్రి (ద్రౌపది) చేరిన సన్నివేశంలో, పాంచాలి హృదయనివేదన, ఈపాట. అన్నీ ఆ సర్వమంగళే చూసుకుంటుందన్న భక్తిభావన ఈ పాటలో కన్పిస్తుంది. ఇందులోని ప్రాసలు, పదాల పోహళింపులు, జిలిబిలిపోకడలూ నేటికీ ప్రశంలందుకుంటూనే ఉన్నాయి. ఆ రోజుల్లో ప్రతి ఇంట్లోనూ పూజాపునస్కారాల్లో మహిళలు తప్పకుండా ఈపాట పాడుకునేవారు. పేరంటాల్లో ఇక చెప్పక్కర్లేదు. ఇలా భక్తిసందర్భాలలోనే గాక, వివాహంకాని యువతులు పెళ్లిచూపుల్లో సైతం కాబోయే అత్తగారి దగ్గర మార్కులు కొట్టేయడానికి ఈపాటను పాడేసేవారు.

ఈ భక్తిగీతం ఒక చక్కని పాలరాతిశిల్పం. పదాలకు పారిజాత తల్పాలు వేసి



స్వరాల సోయగాలు అలముకున్న సౌందర్యం ఇందులో కన్పిస్తుంది. 'జననీ – కామినీ' , 'చరణములు – శరణములు', 'దరినున్నా– దయలున్నా', 'భయాలు–జయాలు' ఎంత చక్కని పలుకుల ప్రాసలు!

ఇవన్నీ సుశీలనోట వాణి పలుకుల్లాగ, శుకవాణి కిసలయ సొబగుల్లాగ పలికిన విధానం ఒక భక్తి పారవశ్య ప్రాకారం, సంగీతశాస్త్ర స్వరమధురిమల సాకారం. నటభైరవి రాగంలో శివకామినీ తత్త్వాన్ని శుభకరంగా స్వరకర్త ఆవిష్కరించిన తీరు అపూర్వం. పాట అయ్యాక ఒక తెలియని భావాతీత అలౌకికానందం మనలో కలుగుతుంది. ఎన్నిసార్లు విన్నా మళ్లీ వినాలనిపించేంతటి నిత్య నీరాజనగీతమిది. గొంతులో భక్తిభావాల్ని అలవోకగా పలికించడం సుశీలకు వెన్నతోబెట్టిన విద్య.

# నర్తనశాల (1963)

❖ సీనియర్ సముద్రాల ❖ సుసర్ల దక్షిణామూర్తి


**సఖియా వివరించవే!**
**వగలెఱిగిన చెలునికి నా కథా!**
**సఖియా వివరించవే ॥**
**నిన్నుజూచి కనులు చెదరి**
**కన్నెమనసు కానుక జేసి!**
**మరువలేక మనసు రాక**
**విరహాన చెలికాన వేగేననీ ॥సఖియా॥**

**మల్లెపూలా మనసు దోచి**
**పిల్లగాలి వీచే వేళ!**
**చలువరేని వెలుగులోనా**
**సరసాల సరదాలు తీరేననీ ॥సఖియా॥**

దేనికైనా 'సమయం' రావాలి. వాటిని అందిపుచ్చుకోవటమే "మంచి సమయం". సందర్భాలే సమయాలు – వాటిని పలికించటమే స్వరకర్తలు, కవులు, గాయకులు



చేసేపని. శుభసంకల్పాలన్నీ శుభతరుణాలే. అలాంటి వేళలో ఈపాట పుట్టి ఉంటుందనిపిస్తుంది.




అజ్ఞాతవాసంలో విరటుని కొలువులో సైరంధ్రి వృత్తిధర్మాన్ని చూపడానికి ఈపాటను చిత్రంలో కల్పించారు. ఇదే సమయంలో అటువైపు వచ్చిన కీచకుడు, సైరంధ్రి తనపై వలపు చూపిస్తోందని ఈపాటలోని భావాల్ని బట్టి భ్రమిస్తాడు. కథనం చకచకా సాగిపోవడానికి చలనచిత్రంలో ఈపాటే కీలకం. ముఖ్యంగా చక్రవర్తులు, ఉన్నతాధికారులు సేవకులు ఎక్కడ ఏ మంచిపనిచేసినా, ఏమి పొగిడినా అవన్నీ తమకోసమేనని అన్వయించుకోవడం రివాజు. ఆ ప్రకారం ఈపాట, సైరంధ్రి (మాలిని), తనుద్దేశించే పాడుతోందనుకున్నాడు. దానికి తగ్గట్టు 'కనులు చెదరడం', 'మనసు కానుక చేయడం', 'విరహాన చెలి వేగడం', 'పిల్లగాలి', 'కలువరేని వెలుగు', 'సరసాల సరదాలు'... ఇవన్నీ మన్మథభావాలే.

ఈ పాటను చక్కని సన్నివేశగీతంగా మలచడంలో నూటికి నూరుపాళ్లూ కృతకృత్యులయ్యారు సీనియర్ సముద్రాల, స్వరకృత్యులయ్యారు సుసర్ల, శ్రుతిగాత్రలీలా వైవిధ్యంతో సఫలీకృతురాలయ్యారు సుశీల.

హిందూస్థానీ యమన్‌రాగ ధోరణిలో స్వరపరచబడ్డ ఈపాట ఆనాటినుండీ ఈనాటివరకూ పాటలపోటీలలో పాల్గొనే యువతులకు ప్రథమబహుమతి సంపాదించిపెడుతూనే ఉంది.

పాత్రలోని అంతరంగాన్ని గాత్రం ద్వారా ఆవిష్కరించిన తీరులో సుశీల, ఆ అంతరంగంలోని ఆందోళనను అభినయంలో ఆవిష్కరించిన సావిత్రి నటకౌశల్యం అద్భుతం. స్వరకాయప్రవేశం చేసి సుశీల, సైరంధ్రిగా పాత్రలో పరకాయ ప్రవేశం చేసి సావిత్రి–మహాగాయని, మహానటి బిరుదులకు మరొకరు పోటీ లేకుండా చేసుకున్నారు.

ఇప్పటికీ రేడియో, టీ.వీ.ల ద్వారా ఈపాట తరచూ వినబడుతూనే ఉంటుంది.

# చదువుకున్న అమ్మాయిలు (1963)

❖ దాశరథి ❖ ఎస్.రాజేశ్వరరావు

వినిపించని రాగాలే
కనిపించని అందాలే
అలలై మదినే కలచే
కలలో ఎవరో పిలిచే
వినిపించని రాగాలే...
తొలిచూపులు నాలోనే
వెలిగించె దీపాలే ॥తొలి॥
చిగురించిన కోరికలే
చిలికించెను తాపాలే
వలచే మనసే మనసు
వినిపించని రాగాలే...
వలపే వసంతములా
పులకించి పూచినది ॥వలపే॥
చెలరేగిన తెమ్మెరలే
గిలిగింతలు రేపినవీ
విరిసే వయసే వయసు
వినిపించని రాగాలే....
వికసించెను నా వయసే
మురిపించు ఈ సొగసే
విరితేనెల వెన్నెలలో
కొరతేదో కనిపించే
ఎదలో ఎవరో మెరిసే ॥వినిపించని॥

లలితలావణ్యమైన ఘంటసాల ఆలాపనతో మొదలయ్యే ఈ పాట వింటుంటే... మనసు ఒక ఆనందలోకాల అంచులు తాకి, వినిపించని కొత్తరాగాలు పల్లవిలో వినిపిస్తాయి. పాట వింటుంటే ఎన్నో అందాలు కళ్లెదుట కనిపిస్తాయి. వసంతంలా వయసు వికసించి విరితేనెల వెన్నెలలు సొగసుగా మురిపించినట్లుంటుంది.



పాట పూర్తిగా విన్నాక అంచులుదాటిన ఆనందం అవధులుదాటి ఒక మధురానుభూతికి లోనౌతాం.

ఈ చిత్రంలోని పాటలన్నిటికీ ఒక అంతస్తునిచ్చింది సుశీల పాడిన ఈ పాటే. ఇంత ఈపాట మధురంగా ఉండడానికి మూడే కారణాలు–దాశరథి రచన 'వలపే వసంతములా, పులకించి పూచినది. చెలరేగిన తెమ్మెరలే గిలిగింతలు రేపినవి. విరిసే వయసే వయసు...,' అందాల ప్రోవైన ఈ మాటల పొందికను గమనించి ముగ్ధులు కాని వారెవరైనా ఉంటారా? 'వలచే మనసే మనసు' అనే మాట ఆయన రసపోషణకు మరొక తార్కాణం.

రెండో కారణం సుశీల: జాగ్రత్తగా ఆమె పాడటం గమనించి వినండి. ఆ కంఠంలో ఎన్ని కొత్త అందాలు చిందులు తొక్కుతుంటాయో! ఆ విరుపుల్లో ఎన్ని మెరుపులు మురిపిస్తుంటాయో! ఆ సంగతుల్లో ఎంతభావం రంగరించబడి ఉందో! ఆ కంఠం అంత అపురూపమైంది కాబట్టే ఆమెను సుశీల అన్నారు. తమిళాంధ్రదేశాలలో అశేష ప్రజానీకం ఆరాధించారు.

మూడో కారణం: ఇంపైన వాద్యగోష్ఠితో బిలహరి రాగంలో రాజేశ్వరరావు చేసిన స్వరరచన. కొట్టవచ్చే కొత్తదనం లేకపోయినా, ఆ నిర్మాణంలో ఒక మోహనత్వం, ఒక పటిష్టత, ప్రత్యేకత ఉన్నాయిూపాటలో. సితార్ ను సున్నితంగా, సులలితంగా ఉపయోగించడం అదనపు ఆకర్షణ.

పాటలో కొసమెరుపేమిటంటే జలతారు గాత్రంలో సుశీల చేసే ఆలాపనకు, ఘంటసాల గొంతు కలిపి మరింత శ్రావ్యతను పాలలో మత్తుమందు కలిపినట్లు అందించడం. ఒకసారి ఈపాట విని చూడండి – పైన చెప్పుకున్న మాటలపై సుశీల గాత్రం చేసిన స్వర విన్యాసం.... మీరూ ఔనంటారు. హృదయంలో కూనిరాగాలు తీస్తారు. చదువురాని అమ్మాయిలు కూడా హాయిగా పాడుకునేంత సునాయాసంగా పాడారు సుశీల ఈ నవకోమల గీతాన్ని.

ఆ ఏడాదే విడుదలై చారిత్రాత్మక విజయభేరి మ్రోగించిన "లవకుశ" ధాటికి తట్టుకుని "చదువుకున్న అమ్మాయిలు" విజయం సాధించడంలో ఈపాటది కీలకపాత్ర.

# పరువు ప్రతిష్ట (1963)

❖ రాజశ్రీ ❖ పెండ్యాల

ఆ... ఆ.... ఆ...
ప్రభు! గిరిధారీ... శౌరీ రావయ్యా!
నను కరుణించి వరమూలీయా రావయా ॥ప్రభు॥

ప్రభో రావయా....
దారీ తెన్నూ తెలియని నన్ను
ఈ దరి జేర్చితి వెందులకయ్యా
ఏగతి నాకథ సాగింతువయ్యా
యదువర శుభకర దేవా ॥ప్రభు॥

ప్రభో రావయా....
కలగా చెలిమీ దూరమయేనా
కలలే నిజమై నెరవేరేనా
నీవే శరణిక ఏదెటులైనా
మురహర శ్రీధర దేవా ॥ప్రభు॥

ప్రభో రావయా....
గోవర్ధనగిరి గోటిని నిలిపీ
గోకులశోకము తీర్చిన దేవా
నీపదదాసిని కాపాడలేవా
నగధర మాధవ దేవా ॥ప్రభు॥

ప్రభు! గిరిధారీ...

ఈ పాటను పెండ్యాల పీలూరాగ పరిమళభరితం చేయగా ఆ పరిమళాన్ని కుసుమకోమలంగా తన స్వనమధురిమతో వెదజల్లారు సుశీల. పీలూరాగంలో హిందూస్థానీ భజనలు ముఖ్యంగా మీరావి, చాలా ఉంటాయి. భక్తిగీతాలకు ఈ రాగం చాలా అనువుగా ఉంటుంది. ఈపద్ధతిలోనే పెండ్యాల ఈ భజనకు వరస చేశారు.

ఈ పాటలో నిర్మల భక్తిభావం చక్కగా వ్యక్తీకరించబడ్డది. రాజశ్రీ రచనలో గానీ, పెండ్యాల వరసలో గాని అనవసరమైన నగిషీలు ఉండవు. ఈ నిరాడంబరత సన్నివేశానికి



బాగా తగి ఉంటుంది. నిరాశల నిశిలో అల్లాడుతున్న ప్రాణి భగవంతుని ఆసరా కోరేటప్పుడు భాషా బేషజానికి గాని సంగీతశాస్త్రానికి గాని ప్రాధాన్యత నివ్వదు. ఈ భక్తిరసాన్ని మొదట్లోనే ప్రదర్శించడం కోసం పెండ్యాల ఒకే సంగతిని ఆదిలోనే పెట్టారు. – "గిరిధారీ" అన్న తరువాత – అక్కడ సుశీల కంఠంలో నిండిన తీయదనానికి విలువ కట్టలేం. ఆమె గాత్రాన్ని మీరా హృదయంతోనే పోల్చాలి. సుశీలగాత్రం పెండ్యాల నాగేశ్వరరావు స్వరసారథ్యంలో పలికినంత తీయగా మరొకరికి పలకలేదనడానికి నికషోపలం ఈ గీతం.



రాజశ్రీ

# పునర్జన్మ (1963)

❖ దాశరథి ❖ టి.చలపతిరావు

పూలు విరిసెను! తేనె కురిసెను!
వలపు వాకిట పూలపల్లకి నిలిచెను!
లోకమే పులకించి నాట్యము చేసెను! అందగాడా...
మనసులోని మర్మమేదో తెలుసుకో! తెలుసుకో!
తెలుసుకొని నన్ను నీలో దాచుకో! దాచుకో..
ఓ అందగాడా నన్ను నీలో దాచుకో... దాచుకో...
వేయికన్నుల అన్ని దారుల వేచితి!
లీలగా నీరూపు నాలో చూచితి!
ఈ రేయి నీకై నిలిచిపోయిన వేళలో – అందగాడా ॥మనసు॥

ఆశతో అందియలు నిన్నే వెదకెను!
జాలిగా సారంగి నిన్నే పిలిచెను!
నా – కనులు నీకై కలవరించే వేళలో – అందగాడా ॥మనసు॥

నీవు లేనిది లోకమంతా శూన్యము!
నీవు చెంతకు చేరినపుడే స్వర్గము!
నా – కలలు నిజమై కదలివచ్చే వేళలో– అందగాడా ॥మనసు॥



ఈ చిత్రంలో కథాగమనానికి ఏవిధంగానూ తోడ్పడని పాట ఇది. కానీ ఇదే ఈ చిత్రంలోని పాటలన్నిటికీ అందమైంది. సంగీతంలోనూ, సాహిత్యంలోనూ - సన్నివేశ రీత్యా బలం అంతగా లేకపోయినా - ఇంతమంది శ్రోతలను తన ఉత్తమ స్వర-సాహిత్య స్వన సమ్మేళనచే సమ్మోహింపచేసిందీ పాట.



దాశరథి

దాశరథి రచన అంతటా ఇంత అందంగా, హుందాగా ఉంది. "వేయి కన్నుల అన్ని దారుల వేచితి లీలగా నీ రూపు నాలో చూచితి!"అన్నచోట; "ఈ రేయి నీకై నిలచిపోయిన వేళలో" అన్నచోట ఉన్న అందంతో మురిసిపోని మనసుండదు.

తాతినేని చలపతిరావు దీనికి అమర్చిన వరస చక్కని ముద్రాపద్ధతిలో - రచనకు, సన్నివేశానికి అత్యంత రమణీయమైన రంగులు వేసింది. పాటలో అక్కడక్కడా వినిపించిన హార్మోనియపు వంపుల సొంపులు సంగీతదర్శకుడు వేణువి. ఈ పాటకు ఆ విధమైన హార్మోనియం వాదన ఎంత ముఖ్యం కాకపోతే వేరే సంగీతదర్శకుని ప్రత్యేకంగా ఆహ్వానిస్తారు? ఎంత ముఖ్యమని తోచకపోతే అసలు ఆయనెందుకు అంగీకరిస్తారు?

సుశీల ఈ పాటను గంధర్వకోకిలలా, నందనాన అప్సరసలా, మానసాన రాజహంసలా పాడారు. ఆ వాద్యానుసరణలోని వంపులు ఆ కంఠానికి వింత సొగసునిచ్చాయి. ముఖ్యంగా ' ఈరేయి నీకై నిలచి పోయిన వేళలో' అన్న వాక్యం సుశీల పాడగా వింటుంటే ఊహాసుందరి కళ్ల ఎదుట సాక్షాత్కరించినట్లే ఉంటుంది. ఈ పాట ఒక్కసారి విని చూస్తే, మరొకసారి వినకుండా ఉండలేం. ఈ పాటొక సీతాకోకచిలుక పులకరింపు.

# లక్షాధికారి (1963)

❖ సి.నారాయణరెడ్డి ❖ టి.చలపతిరావు

దాచాలంటే దాగదులే
దాగుడుమూతలు సాగవులే
వలపుల సంకెల బిగిసే దాకా
వదలను వదలను వదలనులే ॥దాచాలంటే॥

నీ సన్నని మీసంలో విలాసం వన్నెలు చిలికింది
నీ నున్నని బుగ్గలపై పున్నమి వెన్నెల మెరిసింది
నీ ఓరచూపులను గని, బంగారు తూపులను కొని ॥నీ ఓర॥
మురిసిపోతానూ – పరవశించేనూ
నీ కన్నులు రమ్మని పిలిచేదాకా,
కదలను కదలను కదలనులే ॥దాచాలంటే॥

పొదలలోన వున్నా పూలగంధాలు దాగలేవు
మట్టిలోన వున్నా మణుల అందాలు మాసిపోవు
నీలోని రూపమును గని, రతనాల దీపమనుకొని ॥నీలోని॥
మదిని నిలిపేవూ – జగము మరిచేను
నీ పెదవుల నవ్వులు విరిసే దాకా
విడువను విడువను విడువనులే ॥దాచాలంటే॥

సినిమా పరిభాషలో యీ తరహా పాటలను 'టీజింగ్ సాంగ్స్' అంటారు. ఏదో పేరుకు 'టీజింగ్' అంటారు కానీ, నచ్చినవారి వెంటబడే 'ప్లీజింగ్‌సాంగ్స్' ఇవి.



నారాయణరెడ్డి రచన చాలా హృద్యంగా ఉంటుంది.

ఈ ''వదలను వదలను వదలనులే'' అనే ప్రయోగానికి ఆరోజుల్లో పాప్యులర్ అయిన 'కభినహిఁ కభినహిఁ కభినహిఁ' అనే హిందీపాటలోని మాటలు ప్రేరణ. పల్లవి చివరలోనే కాదు చరణం

చివర కూడా ఆ కొలతలోనే 'కదలను కదలను కదలనులే', 'విడువను విడువను విడువనులే' అంటూ ఆ వరసలోనే ముక్తాయింపులు ఉండడం ఈ పాట స్వర రచనలోని ప్రత్యేకాంశం.

మొదటి చరణంలో కథానాయకుని సన్నని మీసాన్ని, నున్నని బుగ్గలను కూడా వర్ణించడం ఆ పురుషపుంగవుని ఓరచూపులను బంగారు తూపులనడం ప్రబంధగంధమున్న అభివ్యక్తులు.

రెండో చరణం – కవిత్వం పొదుగుకున్న పాదాలు. నాయకుని అందమైన శీలం పట్ల నాయికకున్న నమ్మకానికి అక్షర రూపాలు.



టి.చలపతిరావు

ఈ పాటంతా గమనిస్తే, యువప్రణయం ఇంతకన్నా పొందికగా పాటలో అమరుతుందా? అన్పిస్తుంది. చలపతిరావు 'నటభైరవి' రాగంలో చేసిన వరసలో పెద్ద కొత్తదనం కొట్టొచ్చినట్లు లేకపోయినా – పాటకు తగినట్లుగా ఉరకలువేసే యువనదిలా, పరుగులుతీసే ఒంటిగిత్తలా, ఉత్సాహంతో ఊగిపోతుంది. ఈ ఊపుకే కదా యాభై ఏళ్లు పైబడినా, యీ పాటకు ఇంకా శ్రోతలు ఊగుతూనే ఉన్నారు.

సుశీల కూడా చాలా తేలికగా, చిరుగాలి కెగిరే పైట చెంగులా – హాయిగా, తీయగా పాడారు. ఆమె పాడిన వందలాది ఉడికింపుగీతాలలో ఇదొక ప్రత్యేకగీతంగా శ్రోతల మదిలో మంచిచోటు చేసుకుంది. 'సన్నని మీసంలోని విలాసాలు – ఓర చూపులలో బంగారు తూపులను చూసి మురిసిపోయి పరవశించి పోయి పాడినతీరు వింటుంటే ఒక తెలీని కవ్వింపుధోరణి మనకు కలుగుతుంది. చరణాలు చివరలో 'కదలను కదలను', 'విడువను విడువను' అనే చోట ఒక గడుసుతనం, జాణతనం గొంతులో వినవస్తాయి. పాటలోని గమకాలు, కవ్వింపుల సంగతులు, రెచ్చగొట్టేలా పలికిన అందాలు 'మరువము మరువము మరువములే' అన్నట్లుగానే ఉంటాయి.

పాత్రలు మన కళ్లెదుట కనిపించేలా పాడటం సుశీలకున్న ప్రజ్ఞ. తేటతెలుగు పదాలకు స్వరపరీమళార్చన చేసి సుగంధాన్ని వెదజల్లే రసవిద్యలో ఆమె ఘనాపాటి. జగమే మరచి, పాటలో చరించి, మరలా పంచి యిచ్చే విషయంలో సుశీలకు అగ్రతాంబూలం యిచ్చింది సినీ ప్రపంచం. అందుకే ఆమె మేటి గాయనీమణి.. అరుదైన అనర్ఘ గానరత్నం..

# పూజాఫలం (1964)

❖ సి.నారాయణరెడ్డి ❖ యస్.రాజేశ్వరరావు

ఆ...ఆ......
నిను గానక....మన జాలరా!...
ఎందుదాగి ఉన్నావో బృందావిహారీ! బృందావిహారీ!
నీ పాదధూళినై నిలువనీయ వోయీ ॥ఎందుదాగి॥

తీసిన గంధపు వాసన లారెను
అల్లిన దండల మల్లెలు వాడెను
కన్నయ్యా నీ సన్నిధి కరవై ॥కన్నయ్యా॥
గడియే యుగమై పోయెనురా ॥ఎందుదాగి॥



బి.ఎన్.రెడ్డి దర్శకత్వం వహించిన ప్రతిచిత్రంలోనూ సంగీత సాహిత్యాల మేళవింపు ఉన్నతమైనస్థాయిలో ఉంటుంది. దీనికి కారణం బి.ఎన్.కు సంగీతశాస్త్రంలో కాకపోయినా – సంగీతాచరణతో విశేషపరిచయం ఉండడం. ఈ విషయం ''పూజాఫలం'' చిత్రంలోని ప్రతిపాటా ఋజువు చేస్తుంది.

పై పాటరచన ఎంత ధవళకాంతులీనుతున్నదో, పాడిన సుశీల కంఠం కూడా అంత సరళ ప్రకాశంతో పలుకరిస్తుంటుంది. ఆ హాయితో, ఆ మృదు మంద్ర కంఠస్వరంతో పాడాలంటే ఆ పాటను సి.నారాయణరెడ్డి గారే రాయాలి. దానిని రాజేశ్వరరావే వరస చేయాలి. దానికి సుశీల కంఠమే తోడవ్వాలి. వినే అదృష్టం మన శ్రోతలదే కావాలి! ఇంతకుమించి వ్యాఖ్యానం యీ పాటకు అనవసరం.

# గుడిగంటలు (1964)

❖ ఆరుద్ర ❖ ఘంటసాల

**దూరానా – నీలిమేఘాలూ**
**నాలోనా – కొత్త భావాలూ**
**పూచేనూ – కోటి మురిపాలూ**
**తొంగి – చూచేనూ – కన్నె సరదాలూ – ॥దూరానా॥**

**ఓహో .....**
**నల్లని జడలో సింగారించగ**
**నవ్వుల పువ్వులూ – కోసితినీ – ॥నల్లని॥**
**నచ్చిన వూహల – నాగసొరానికి**
**నా జడ నాట్యము – చేసినదీ – ॥దూరానా॥**

**ఓహో... ఓహో....**
**తేనెలు తాగుతూ – గాలుల తేలుతు**
**తుమ్మెద ఝుమ్మనీ – ఆడినదీ – ॥తేనెలు॥**
**తుమ్మెద తీరున – కమ్మని నా మది**
**తుళ్ళుతు గెంతులు – వేసినదీ – ॥దూరానా॥**

పడుచుకన్య మదిలో పలకరించే భావాలు, వయారంగా ఊగే నల్లని వాలుజడ నాదస్వరానికి నాట్యం చేయటం, తుమ్మెదలాగ మది తుళ్ళుతూ గంతులు వేయటం కవిభావనలో వికసించిన పదాలు.

మరి ఇవన్నీ సుశీల గొంతులో 'స్వర' కాయప్రవేశం చేస్తే నూటికి నూరుపాళ్లూ సూపర్ హిట్ గీతమే. పాట పల్లవించగానే 'నీలిమేఘాలు', 'కొత్తభావాలు' తన గొంతులో కోటివీణలు మ్రోగినట్లుగా పలికిన తీరు మరోసారి వినండి.

తుమ్మెదలు తేనె త్రాగడం సహజం. కానీ అవి అంత తియ్యగా పాడలేవు. మరి సుశీల గొంతులో ఆ చక్కెరపలుకుల తీయదనం ఎక్కడిది? సమాధానం తెలియక ఐదున్నర దశాబ్దాలు దాటినా ఇంకా ఆస్వాదించడమే అసలు విషయం. పాట మొత్తం రెండే చరణాలు.. అన్నీ అలతి అలతి తెలుగుపదాలే. తీయని తెలుగుభాష పలికితే ఇలా ఉంటుందని చెప్పాలంటే సుశీల కిన్నెరవీణా కంఠాన్ని చెప్పుకోవచ్చు.






రచయిత కలంలో అంత బలం కనిపించదు. ఎందుకంటే అది హిందీట్యూన్‌కు రాసినపాట కాబట్టి. సాహిత్యం కూడా యీ చిత్రానికి మాతృక అయిన ''ఆలయమణి'' చిత్రంలోని 'మానాట్టం' పాటకు అనుకరణ. ఘంటసాల యీ గీతాన్ని 'పహాడి' రాగంలో స్వరపరిస్తే, "కొండంత" స్థాయిలో గీతాన్ని ఆలపించి, సుశీల యీ పాటను శిఖరస్థాయిలో నిలబెట్టారు. ఈ పాటలో ఉన్న ఒకింతలోపాల్ని ఆమె 'హోహోహో' అన్న ఆలాపన సరిజేసింది.

# మూగమనసులు (1964)

❖ దాశరథి ❖ కె.వి.మహాదేవన్

**గోదారి గట్టుంది – గట్టుమీద శెట్టుంది–**
**శెట్టు కొమ్మన పిట్టుంది**
**పిట్టమనసులో ఏముంది? ఓ...ఓ...ఓయ్..** ॥గోదారి॥

**ఒగరు ఒగరుగా పొగరుంది**
**పొగరుకు తగ్గ బిగువుంది** ॥ఒగరు॥
**తియ్య తియ్యగా సొగసుంది**
**సొగసును మించే మంచుంది** ॥తియ్య॥ ॥గోదారి॥

**యెన్నెల వుంది, యెండ వుంది**
**పువ్వూ వుంది – ముల్లుంది**
**యెన్నెల వుంది, యెండుంది**
**పువ్వూ వుంది – ముల్లుంది**
**యేది యెవ్వరికి యివ్వాలో యిడమరిసే ఆ ఇది ఉంది** ॥గోదారి॥

**పిట్ట మనసు పిసరంతైనా పెపంచమంతా దాగుంది** ॥పిట్ట॥
**అంతు దొరకని నిండు గుండెలో**
**ఎంత తోడితే అంతుంది** ॥అంతు॥ ॥గోదారి॥

ఒక కొత్తదనం, నూటికి నూరుపాళ్ల తెలుగుదనం – అందులోనూ జానపదత్వం అన్నివిధాలా సంతరించుకున్న చిత్రం “మూగమనసులు”. ఈ చిత్ర కథకులైన ఆత్రేయ, ముళ్లపూడి వెంకటరమణలు గోదావరి కెరటాల మీద చెవియొగ్గి, ఆ నదీగర్భంలో దాగి ఉన్న ప్రణయగాథలలో ఒక మనోహరమైన దానిని విని, యీ ఇతివృత్తాన్ని తయారుచేశారా అనిపిస్తుంది, ఎవరికైనా... అందుకే సాహిత్యంలోనే కాక ఏర్చికూర్చిన పాత్రలలో, ప్రతిదృశ్యంలోనూ గంభీరత గోచరిస్తుంది. ఈ చిత్రం ఆద్యంతాలలో సుడులు తిరిగిన ‘పూర్వజన్మస్మృతి’ లాంటి అభూతకల్పనను విమర్శనాత్మక దృష్ట్యా మనసులోకి తీసుకోకపోతే – ఈ అపురూపమైన కథకు అద్భుతమైన రూపకల్పన చేసిన సాంకేతిక నిపుణులూ యీ చిత్రంలో పాల్గొన్న నటీనటులూ ఎంతైనా అభినందనీయులని చెప్పితీరాలి.



ఈ చిత్రంలో ముఖ్యంగా పేర్కొనాల్సింది సంగీతం...

సుశీల కంఠంలో సర్వసాధారణంగా కనిపించని, వినిపించని “గ్లామర్” వినాలంటే, కనాలంటే – ‘గోదారి’ వినాలి. ఆమె అలా పాడాలనుకున్నప్పుడు ఆమె గాత్రవిన్యాసం ముందు తక్కిన చిల్లర “గ్లామర్” కంఠాలన్నీ బలాదూరని తెలుసుకోవాలి. ఈ అద్వితీయమైన తీయదనం మొదటి సాకీలోనూ, సాకీ వెనువెంటనే వెంటాడే ఢక్కముక్కలలోను, ఆ తర్వాత వినవచ్చే వాయులీనాల సొగసులోను అన్నిటా ఉంది. ఈపాటనే తలపోస్తూ, ఆట విడిచినా థియేటరులోనే కూచుండిపోయిన వారనేకులు ఉన్నారు అప్పట్లో.

నటభైరవి రాగంలో ‘మామ’ స్వరార్చన ఎంత గొప్పదో నేటికీ గోదారిని తలచుకోగానే ఈపాట గుర్తుకు వచ్చేస్తుంది. పాట మధ్యలో ఇంటర్ల్యూడ్స్ అన్నీ పాశ్చాత్య పోకడలు, తెలుగు జానపదాల మేలుకలయికలా మేటిగా ఉంటాయి. పాత్ర తన గుణగణాలు, తన వ్యక్తిత్వం అన్నీ పాటలో వ్యక్తీకరించేస్తుంది. అంటే ఇక్కడ సుశీల ‘గౌరి’ పాత్రను గాత్రంతో అభినయించాలి. పాటలోని ఆలాపన నుండి ముగింపులోని గుండెలోతులను ఆకళింపు చేసుకోవాలి. నూటికి నూరుశాతం ఇదే జరిగింది యీ పాటలో. అందుకే ఇది ‘ఆల్టైమ్హిట్’గా నిలిచిపోయింది.

గోదావరి నిరంతరం తరతరాలు సాగినట్లే, ఏటిగట్లు, సెట్టు కొమ్మలున్నంతకాలం తెలుగునేల మీద యీ పాట చిరంజీవి!

# మూగమనసులు (1964)

❖ ఆత్రేయ ❖ కె.వి.మహాదేవన్

మానూ మాకును కాను రాయీ రప్పను కానేకాను
మామూలు మణిసిని నేను నీ మణిసిని నేను ॥మానూ॥

నాకూ ఒక మనసున్నాదీ, నలుగురిలా ఆశున్నాది ॥నాకూ॥
కలలు కనే కళ్లున్నాయి ॥కలలు॥
అవి కలతపడితే నీళ్లున్నాయి ॥మానూ॥

పెమిదను తెచ్చీ వొత్తిని యేసీ సమురును
పోసీ బెమ సూపేవా ॥పెమిద॥
ఇంతా శేసి యెలిగించేందుకు, ఎనకముందులాడేవా ॥మానూ॥

మణిసితోటి యేళాకోళం, ఆడుకుంటే బాగుంటాది ॥మణిసి॥
మనసు తోటి ఆడకు మాఁవా ॥మనసు॥
ఇరిగిపోతే అతకదు మల్లా ॥మానూ॥

బాబూ మూవీస్ "మూగమనసులు" తెలుగునాట అప్పట్లో ఓ ప్రభంజనం.

మూగమనసుల్ని మాట్లాడించడం అంత తేలికైన పనికాదు. ఎనకజనమ బాసలు ఇనగల చెవులున్న మనసు గల మణిసి కావాల! గుండెమంటలారిపే కన్నీళ్లు చన్నీళ్లు ఏడేడులోకాలు ఎతికి తేవాల! పైటని తెరసాపగా గట్టే పడవ కళాసి గావాల!! దీనికి మణుసుల మాయలు తెలవాల! ఆ మాయలన్నీ నేర్చి మాటల్ని, పాటల్ని కూర్చిన మహామాయ ఆత్రేయ! ముళ్లపూడి ఏనాడో పెనవేసినాడు మూడుముళ్ల బంధాన్ని. ఆ బంధాన్ని నాగేస్వర్రావు, సాయిత్తిరీ సోగకళ్ల మూగవూసులో సూపి మన మనసుల్ని ఊపేసారు.

గోదావరి జీవనది – తెలుగువారి జీవితమది. యుగయుగాలుగా మన జీవితాలను ఒరుసుకు ప్రవహిస్తూ మనకు సుఖశాంతులు ప్రసాదిస్తోంది. మన కన్నీటిచుక్కలను తనలో కలుపుకుంటోంది. ఏ కన్నీటిచుక్క వెనుక ఏ కథ ఉందో ఆ చల్లనితల్లికే తెలుసు. అలా తెలిసి చెప్పిన తెలుగు కథ "మూగమనసులు".

వరదగోదావరిలా శక్తిచైతన్యాలతో ఉరకలువేస్తూ పరవళ్లు తొక్కుతూ విహరించిన గోపన్న (అక్కినేని), శాంత గోదావరిలా నిండుగా, గంభీరంగా, మౌనంగా, మోహనంగా

ఉండే 'అమ్మాయిగారు' రాధమ్మ (సావిత్రి), బాలగోదావరిలా జీవితమంతా చెంగుచెంగున గెంతులు వేసి ఆడుకున్న గౌరమ్మ (జమున)… ఈ ముగ్గురి మధుర బాధామయగాథ – "మూగమనసులు".

ఈ చిత్రంలోని ఎన్నో ముఖ్యమైన పాటల్లో యీ పాటొకటి. ఇది శోకగీతం. కనిపించే మనిషిలో కనిపించని మనసు పడే వేదనను కళ్లకు కన్పించేటట్లు ఆవిష్కరించిన ఆర్ద్రమైన ఆత్రేయ రచన ఇది. అక్షరహృదయాల మూగభాషను, అంతుపట్టని మనసులోతులను తెలిసిన అక్షరశిల్పి ఆత్రేయ. కలత చెందిన హృదయంలో తేట తెలుగు ఎంత యాసగా, నిర్మలంగా పాటగా మారిందో ఈ పాటలో చూడొచ్చు. చిత్రంలో పాత్రధారి మనోగతమంతా లలితమైనభాషలో ఒక ప్రభంజనంగా నిలిచింది. మనిషన్నా, మనిషిలోని మనసన్నా ఆత్రేయకు ఎంతో ఇష్టం. ఆయన పాటల్ని పరిశీలిస్తే ఆయన మనసుకోసం, మనసున్న మనిషికోసం ఎంత తపించిపోయారో అర్థమౌతుంది.

గౌరిది చాలా చిత్రమైన పాత్ర, కథానాయకుడు నిర్లక్ష్యం చేసిన పాత్ర. ఆ గౌరి తనకూ ఒక మనసున్నాదని, దాన్ని గుర్తించమని నిష్ఠూరమాడుతూ పాడినపాట ఇది. ఈ చిత్రానికి సంగీతం కె.వి.మహాదేవన్. సప్తస్వరాల హరివిల్లును శ్రావ్యంగా రసరంజితంచేసి తెలుగుచలనచిత్రసీమకు అందించిన మహనీయుడు ఆయన. మామను ఈ సినిమాకు సంగీతదర్శకుడిగా తీసుకున్నప్పుడు, పరిశ్రమలో "ఈ అరవాయనకు మన తెలుగుభాషా సంస్కృతుల గొప్పతనం ఏం తెలుసు?" అని చెవులు కొరుక్కున్నారు. ఆయన వాళ్లమాటల్ని సవాలుగా తీసుకుని, తెలుగు గ్రామీణ వాతావరణానికి అనుగుణమైన జానపదసంగీతాన్ని అందించి, ఈ చిత్రం ద్వారా తెలుగు సినీప్రేక్షకులకాయన వీనులవిందు గావించారు. తెలియని తెలుగుతనంలో, తెలుపరాని తీయదనంగా, గోదారి పాలనురుగు వొంపుల్లాంటి రాగాల్ని మన మనసుల్లో మ్రోగాలనీ, మన గుండెలు త్రాగాలనీ, ప్రతిపాటనీ తేనెలతేటగా చేశారు.

ఈ పాట విడిగా వింటే, వెంటనే ఆకట్టుకునే కొట్టవచ్చే బాహ్యసౌందర్యం వరసలో గాని, రచనలో గాని లేదు. కానీ, సినిమా చూస్తూ, ఆ పాత్రల సుఖదుఃఖాల్ని అనుభవిస్తూ వింటే, యీ పాట ఆ చిత్రంలో మరే పాటకూ తీసిపోదు. గానానికి సుశీల ఒక పెద్ద కోటగా ఈ మూగమనసుల బాసలు గాత్రంలో వ్యక్తీకరించారు. ఆమెగాత్రం భావానికి అనుభావమై, ఆ భావమే విన్నవాళ్లకు అనుభవం తెచ్చేటట్లు ఉంది.

# అమరశిల్పి జక్కన్న (1964)

❖ సి.నారాయణరెడ్డి ❖ ఎస్.రాజేశ్వరరావు

నగుమోము చూపించవా గోపాలా
మగువల మనసుల నుడికింతువేలా ॥నగుమోము॥

ఎదుట వెన్నెలపంట -
ఎదలో తీయని మంట
ఇక సైపలేను నీవే నా
ముద్దుల జంట - ॥నగుమోము॥

వగకాడవని నిన్నె
వలచీ వచ్చెను రాధ
మగనాలిపై యింత
బిగువూ చూపెద వేల ॥నగుమోము॥

కలువపువ్వుల శయ్య
పిలిచేను రావయ్య
నెలవంక లిడి నన్ను
అలరించవేమయ్య ॥నగుమోము॥



జావళీల పద్ధతిలో రాగరచన జరిగిన గీతమిది. విరహ, వియోగ, విషాదాల కనువైన భాగేశ్వరీ రాగాన్ని ఒక జావళీగా రూపొందించిన సాలూరి రాజేశ్వరరావు స్వరకల్పనా ప్రతిభ ఈపాటలో బాగా కన్పిస్తుంది. పాట ఎంతో కోమలంగా ఉంటుంది. రాధ మదిలోని ప్రణయభావాలను సి.నా.రె అక్షరరూపంలో అందంగా అందించారు.

'ఎదుట వెన్నెల పంట/ఎదలో తీయని మంట' అనడం విరహతీవ్రతను అక్షరాల్లో



సి.నారాయణరెడ్డి

బిగించడమే. 'కలువ పువ్వుల శయ్య/పిలిచేను రావయ్యా' అనే చివరిచరణంలో 'నెలవంకలిడి నన్ను - అలరించవేమయ్య' అనడం ప్రబంధ శృంగారాన్ని చిన్నమాటల్లో ధ్వనిప్రాయంగా అందించిన అభివ్యక్తి. కలువపూలు పిలిచేది వెన్నెల ఉన్నప్పుడే. వెన్నెలలో నాయికను కలుసుకునే శృంగారనాయకుడు ఆవిడకు అందించేవి నెలవంకలు. 'నఖక్షతాలు' (గోటినొక్కులు) అనడానికి బదులుగా గీతకర్త 'నెలవంకలు' అనే పదం ప్రయోగించి చెప్పవలసింది చాటుగా చెప్పి చలాకీగా తప్పించుకున్నారు. నిజానికి సంయోగశృంగారాన్ని అంత సుకుమారంగా ప్రకటించినప్పుడే సారస్యం.

అయితే స్థూలంగా ఇది జావళీ అని సరిపెట్టుకునేస్తున్నాం గానీ, 'కలువపూవులశయ్య పిలిచేను రావయ్య/నెలవంకలిడి నన్ను అలరించవేమయ్య' వంటివి, నిజమైన జావళీ పద్ధతిలో జరుగలేదు రచన. 'ఎదుట వెన్నెలపంట', 'ఎదలో తీయని మంట' అన్నవి భావగీతాలకోవలోకి చెందేవి.

ఈ చర్చ అటుంచితే, నాట్యాని కనువైన పదవిభజన సుశ్రావ్యంగా స్వరపరచబడి సుశీల గొంతులో ఎంతో మృదువుగా పలికింది. పల్లవి తర్వాత వచ్చిన భాగేశ్వరి స్వరాలు నిదపగరిస పాటకు రాగశోభలను పెంచాయి. చరణంలో 'ఎదుట' ... చిన్న విరామం... మళ్లీ ఎదుట అనే పదాలు సుశీల గళంలో స్వరపరీమళాలను పలుకరించేలా విన్పించాయి. సాలూరి సంగీతప్రతిభలో ఎన్నెన్నో పాటలు అందంగా అమరిపోతాయి. సాహిత్యం ఏ రకమైన దయినప్పటికీ దానిని సుమకోమలంగా మలచటంలో రాజేశ్వరరావుది ఒక విలక్షణ బాణీ. అతితక్కువ వాద్యపరికరాలతో అందంగా మలిచిన శిల్పంలా పాటను తయారుచేయడంలో ఆయనది ప్రథమచేయి. అందుకోవడంలో సుశీలది రవళించేవాయి (గొంతు).

# డాక్టర్ చక్రవర్తి (1964)

❖ ఆత్రేయ ❖ ఎస్.రాజేశ్వరరావు

పాడమని నన్నడగ తగునా
పదుగురెదుటా పాడనా ॥పాడమని॥

కృష్ణా! పదుగురెదుటా పాడనా ॥పాడమని॥

పొదలమాటున పొంచి పొంచి
ఎదను దోచిన వేణుగానము ॥పొదల॥
ఒలకబోసిన రాగసుధకు
మొలకలెత్తిన లలితగీతి.... ॥పాడమని॥

చిలిపి అల్లరి తెలిసినంతగ
వలపు తెలియని గోపకాంతలు ॥చిలిపి॥
మెచ్చులేరీ వెచ్చనీ
హృదయాల పొంగిన మధురగీతి ॥పాడమని॥

ఎవరులేనీ యమునాతటినీ
ఎక్కడో ఏకాంతమందున ॥ఎవరూ॥
నేను నీవై నీవు నేనై
పరవశించే ప్రణయగీతి... ॥పాడమని॥

నిశ్శబ్దంగా సాహితీలోకంలోకి అడుగులువేసి, అప్పటిదాకా కలగాపులగంగా ఉండే కాల్పనిక నవలాసాహిత్యంలోకి వెలుతురుగీతలా ప్రవేశించి, అటు తర్వాత విస్తరించి, ఉన్నత, మధ్యతరగతి వర్గాలలోని ఆదర్శభావాలు, ఆలోచనాసరళి, ఆకర్షణ, అలౌకికప్రేమ, ఆత్మగౌరవం, దృక్పథం, అప్పుడప్పుడూ కొంత అహంకారం, అజ్ఞానం వీటన్నింటికీ కలబోతగా ఒక వర్గం స్త్రీలను తన భాషతోనూ, పురుషుల్ని భావావేశపు వెల్లువతోనూ ముంచి, పులకింపజేసి, ఒక ఆలోచనను కల్పించి, 'కౌసల్యాదేవి హీరోయిన్‌లా బతకాలి' అన్న అనుభూతని టీనేజీ యువతుల హృదయాల్లో పల్లవింపజేసిన శక్తిమంతమైన కలం కోడూరి (ఆరికెపూడి) కౌసల్యాదేవిది.

ఈమె అర్ధశతాబ్దం క్రితం రచించిన 'చక్రభ్రమణం' నవల మొదట 'ఆంధ్రప్రభ' వారపత్రికలో ధారావాహికగా వెలువడి, 'క్రోధి' నామ సంవత్సరం నవలలపోటీలో ప్రథమ



బహుమతి గెల్చుకుంది. ఈ నవల ప్రచురించబడినంత కాలం, పాఠకులు ఆ పత్రికకోసం, ప్రతివారం ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తూండేవారు. అదే సమయంలోనే చాలామంది పాఠకులు, ఆ ధారావాహికను అన్నపూర్ణాసంస్థ సినిమాగా తీస్తే బాగుంటుందని ఆకాంక్షించారు. మరికొంతమంది చదువరులైతే ఇంకొక అడుగు ముందుకేసి, సదరు నవలలోని ఏయే పాత్రలకు ఏయే నటీనటులు సరిగ్గా సరిపోతారో, పత్రికాముఖంగానే సూచించారుకూడా. త్రిపురనేని గోపీచంద్ సలహామేరకు దుక్కిపాటి 'చక్రభ్రమణా'న్ని సినిమాగా తీయాలనుకున్నారు. నిర్మాతలు, నటీనటుల నిర్ణయాధికారాన్ని ప్రేక్షకులకే ఇవ్వడమనే ఓ సరికొత్త సంప్రదాయానికి, యీ చిత్రంతోనే అంకురార్పణ జరిగింది. కౌసల్యాదేవి, నాయికకు ప్రాధాన్యమిస్తూ రచించిన నవలను, అన్నపూర్ణాసంస్థ, ఏ.ఎన్.ఆర్. ఇమేజీని దృష్టిలో పెట్టుకుని, కథానాయకుడి ప్రాధాన్యం ఉన్న చిత్రంగా మార్చేసింది. ఆ కారణంగానే, యీ సినిమాకు "డాక్టర్ చక్రవర్తి" అని పేరు పెట్టడం జరిగింది. మాధవి, రవీంద్ర, నిర్మల, చక్రవర్తి మొదలైన ఆకులతో నీతిన్యాయపుటిరుసుతో సంఘం, లోకం అనే రెండు పట్టాలతో యధార్థ జీవనవలయంలో, కాలచక్రపరిధిలో గిరగిర తిరిగిన ఒక చిత్రం "చక్రభ్రమణం".

ఈ "డాక్టర్ చక్రవర్తి" చిత్రంలో అత్యంత జనాదరణ పొందిన పాటల్లో ఒకటి – 'పాడమని నన్నడగ తగునా'.

ఈ పాట పల్లవిలాగే.. ఒక ప్రశ్నకు సమాధానంలాగ సుశీల గొంతులో పలికినపాట. “నీకు సంగీతం వచ్చా? ఏది ఒక పాట పాడు....” అని ఎవరైనా ప్రశ్నిస్తే సమాధానంగా యీ పాటపాడి తప్పించుకునే వాళ్లెంతమందో? జనసామాన్యంలో యీ పాటపల్లవి ఒక నానుడిలా స్థిరపడిపోయింది. ఈపాట ఒక వీణపాటగా కూడా ప్రసిద్ధిపొందింది. ఇప్పటికీ యీ పాట, యీ గాత్రం శ్రోతల మనసులో ఒక అనురాగగీతంగా స్థిరపడి పోయాయనడంలో సందేహం లేదు.

ఖమాస్ రాగంలోని రాజేశ్వరరావు స్వరప్రయోగాలు ఎప్పుడూ చిరస్మరణీయాలే. ఎంత లలితంగా మునివేళ్లు హార్మోనియం మెట్లపై సాగిపోతాయో ఆయన స్వరకల్పన చేస్తుంటే... లతలకు మారాకులు అల్లుతున్నారా.... లవలీవల్లికలకు చిగురులు పొదుగుతున్నారా? అన్పిస్తుంది. ఆరోహణావరోహణలు జాలువారుతీరులు, గమకాలు, జిలుగులు పలికే రీతులు సునాయాసంగా ఆయన గొంతులో, హార్మోనియం మెట్లపై కదిలిపోతాయి. పాట పరవశాలు పోతుంది, పదాలు పులకరించిపోతాయి.

ఇలా ఎన్ని హొయలు, సింగారాలు పోయినా అన్నింటిని తన గాత్రంలో బంధించగల గాయని సుశీల. పాత్రను, పాట సాహిత్యాన్ని, సంగీతధోరణులను ముప్పేటగా గొంతులో పల్కిన యీ పాట తెలుగునాట విజయభేరీ మ్రోగించింది.

అంతేకాదు, యీ పాట ‘తెర’ స్మరణీయమూ, చిరస్మరణీయమూ కావడానికి మరో కారణం – ఈ సన్నివేశంలో కళ్లతోనే కావ్యాలు పలికించగల మహానటి సావిత్రి, తన అపూర్వ వాచకంతో అశేష అభిమానుల్ని సంపాదించుకున్న నవరసనాయిక షావుకారు జానకి పోటాపోటీగా తమ అభినయప్రభలు చూపించడం.

ఈపాట తెరపై సావిత్రి పాడుతుంటే అక్కినేని (చక్రవర్తి) ఎంతో తన్మయత్వంతో వింటూ ఉంటాడు. కానీ జానకి (నిర్మల) ఆ పాటను, సావిత్రి (మాధవి) ని ఎంత మాత్రమూ భరించలేకపోతుంది. అసహనంతో చేతిలో ఉన్న వాచీని చెవికానించుకుని చూసుకోవడం, చిరాకుతో దిక్కులు చూడడం వంటి పనులు చేస్తూంటుంది. ఇది గమనించి సావిత్రి –

‘చిలిపి అల్లరి తెలిసినంతగ...’ అనే చరణం పాడుతూ జానకిని అదోరకమైన చూపు చూస్తుంది. ఈ చరణం తనను ఉద్దేశించే పాడుతోందని గ్రహించిన జానకి కూడా సావిత్రిని మరోరకమైన చూపు చూస్తుంది. నిజంగా యీ సన్నివేశంలో యీ ఇద్దరు మహానటీమణులు ఎవరికి ఎవరూ తీసిపోకుండా సమానస్థాయిలో నటించి సన్నివేశానికి నిండుదనం తెచ్చారు.

# డాక్టర్ చక్రవర్తి (1964)

❖ ఆత్రేయ ❖ ఎస్.రాజేశ్వరరావు

నీవులేక వీణ పలుకలే నన్నది
నీవురాక రాధ నిలువలే నన్నది.... ॥నీవు॥

జాజిపూలు నీకై రోజు రోజు పూచె
చూచి చూచి పాపం సొమ్మసిల్లి పోయె
చందమామ నీకై తొంగి తొంగి చూచి ॥చంద॥
సరసను లేవని అలుకలు బోయె ॥నీవు॥

కలలనైన నిన్ను కనుల చూతమన్న
నిదుర రాని నాకు కలలు కూడ రావె
కదలలేని కాలం విరహగీతి రీతి
పరువము వృథగా బరువుగ సాగె ॥నీవు॥

తలుపులన్ని నీకై తెరచి వుంచినాను
తలపులెన్నొ మదిలో దాచి వేచినాను
తాపమింక నేను ఓపలేనుస్వామి
తరుణిని కరుణను ఏలగ రావా ॥నీవు॥

ప్రజాదరణ పొందడానికి అన్ని హంగులూ ఉన్న పాట ఇది. సినిమాపాటల రచనలో అద్వితీయదీప్తులుగా ప్రకాశించిన పది వెలుగులలో రెండు మల్లాది, ఆత్రేయ. మల్లాది వచనం రాసినా గీతంలా ఉంటుందనీ, ఆత్రేయ పాట రాసినా వాక్యంలా ఉంటుందనీ కొందరి అభిప్రాయం. ఇది ఆరోపణ కాదు. ఆ దృష్టితో చూస్తే అంటే మల్లాది రాసిన ప్రతి వాక్యంలో, ప్రతి అక్షరంలో కొందరు పాటలలోనే అరుదుగా సాధించగలిగిన అందం ఉంటుందనీ, ఆత్రేయ పాటలలో ప్రతిపాదం ఉత్తమవాక్యమంత అర్థయుక్తంగా ఉంటుందనీ, అందరూ ఏకీభవించక తప్పదు.

"డాక్టర్ చక్రవర్తి"లో ఆత్రేయ రాసినవి నాలుగు పాటలున్నాయి. మూడు సుశీలవి, ఒకటి ఘంటసాలది. ఈ నాలుగూ ఒక్కో విధమైన అభిరుచి ఉన్నవారికి నచ్చుతాయి. ఈ పాట మాత్రం ఎంతోమందిని ఇట్టే ఆకర్షించింది.

శృంగారమార్గంలో కవితను పయనింపజేయాలనుకున్న వారికి ఎన్నో వస్తువులున్నాయి. అందులో ఉత్తమోత్తమైంది, అన్నిటిని అందులో ఒక భాగంగా కలిగింది

రాధామాధవ ప్రేమతత్త్వం. అలాంటి మహనీయమైన వస్తువు జగన్మోహనం.

ఈ ఒక్కపాటలో సుశీల మరొకవ్యక్తిని పూర్తిగా అనుకరించి పాడటానికి ప్రయత్నించి చాలామట్టుకు కృతకృత్యురాలైంది. ఆ వ్యక్తి రాధ. రాజేశ్వరరావు వరస, రెండవమారు పరికిస్తే ఆత్రేయ రచన యీ రెంటిలో కూడ శాస్త్రీయపద్ధతికి దగ్గర ఉండేట్లు చేసిన ప్రయత్నం కన్పిస్తుంది. కానీ యీ ప్రయత్నం పాటను పేలవం చేయలేదు. స్థాయిని అంతగా తగ్గించలేదు. కేవలం ఆనందించే వారి సంఖ్యను ఎక్కువ చేసింది. ఈ పాట విన్నవారికి ఆనందమూ, అందాన్ని అనుభవించటంలో ఉన్న సుఖమూ విశదమౌతుంది. ఈ అనుభవాన్నే పదే పదే కోరుకునేట్లు చేస్తుంది.

ప్రకృతి పరమేశ్వరుని భావప్రకటన. కళ మానవుని మనోభావప్రకటన. ఈ రెండూ కలిస్తే జీవ, బ్రహ్మ ఐక్యస్థితే కదా! కళ అంటే అనుభూతి, ఆలోచన, ప్రయత్నాల ఐక్యత. అందుకే రెండు, రెండు కలిస్తే నాలుగు కాదు ఒక్కటే అదే ఐక్యత అంటారు. కళ ప్రయోజనం తెలిసి దాని అనుభూతులను పొంది తిరిగి పంచేవారికి అంటే ఇరువురికి మోక్షప్రాప్తి కలుగుతుందని ఆర్యోక్తి...

ఈ ప్రస్తావన ఎందుకంటే సుశీల పాటలు వింటుంటే పైన తెల్పిన భావాలు మదిలో కదులుతుంటాయి.

ఆత్రేయ కలం నుండి జాలువారిన యీ పాటలోని పదాలు హృదయాన్ని తాకుతాయి. పాటంతా అలా రాసుకుని కళ్లెదుట పెట్టుకుంటే ప్రతి అక్షరం మనల్ని పలుకరిస్తుంది. 'ఇది నాభావన', 'ఇది నా హృదయస్పందన' అని ప్రతివారూ అనుభూతులకు లోనౌతారు. మరి యీ పదాలన్నింటికి స్వరగంధాలు సాలూరి అద్దితే, అవి సుశీల గొంతులో పలికితే...

'మోహన' రాగాన్ని ఇంత అందంగా స్వరపరచవచ్చా? అని రాజేశ్వరరావు గారికి అభినందనలు చెప్పితీరాలి. వెనువెంటనే మోహనరాగం ఇంత అందంగా కూడా పలుకవచ్చా? అని వెనువెంటనే సుశీలను ప్రశంసించక తప్పదు. ఈ పాటలో సంగీత వాద్యపరికరాలు, సుశీలగొంతు సరిసమానంగా పోటీపడి "అదృశ్యకళ" అయిన సంగీతం "కళ్లెదుట" కనిపిస్తుంది. వీణపాటలకు సుశీల సరియైన మేటిగాయని. వీణారవంలోని కోమలనాదం ఆమె గళతంత్రులను తాకి స్వరపేటిక నాదపంజరమై, బయటపడే ప్రతి గమకం ఉదాత్తంగా వినిపిస్తాయి. అందుకే సుశీల పాటలు నవ్యాతినవ్యం, మనోజ్ఞం, మంజుల వీణాగానం.

ఈపాటలో విరహిణిగా సావిత్రి, చిరకాలం గుర్తుండిపోయేట్లు నటించారు. విరహానికి అభినయం ఎట్లుంటుందో, ఎలా ఉండాలో ఆమెను చూసే నేర్చుకోవాలి. ఈపాట సావిత్రి కోసమే ఆత్రేయ రాశారేమో అన్నంత గొప్పగా ఉంటుంది.



# దాగుడుమూతలు (1964)

❖ దాశరథి ❖ కె.వి.మహాదేవన్

గోరొంక కెందుకో – కొండంత అలక ॥గోరొంక॥

అలకలో యేముందొ– తెలుసుకో చిలకా ॥గోరొంక॥
కోపాలలో యేదో కొత్తర్థముందీ
గల్లంతులో యేదో గమ్మత్తు వుందీ ॥కోపాలలో॥
ఉఋములు, మెఋపులూ ఊరికే రావులే ॥ఉఋములు॥
వానజల్లు పడునులే – మనసు చల్లపడునులే ॥వాన॥ ॥గోరొంక॥

మాటేమొ పొమ్మంది – మనసేమొ రమ్మంది
మాటకు మనసుకు మధ్యన తగవుందీ ॥మాటే॥
తగవు తీరేదాక తలుపు తీయొద్దులే ॥తగవు॥
ఆదమరచి అక్కడే – హాయిగా నిదరబో ॥గోరొంక॥

కొన్ని చిత్రాలలోని పాటలు చాలా చిత్రంగా వినిపిస్తుంటాయి. ఒక సన్నివేశానికి కథానాయకుడికి ఒకపాట, ఒక రాగంలో స్వరపరచటం.. మరో సందర్భంలో సాహిత్యం మార్చుకుని అదేరాగంలో పాట గమనాన్ని కొంచెం మార్చి మరలా కథానాయికపై చిత్రీకరణ... ఇవన్నీ తెరవెనుక మంతనాలు. చివరకు ఆ రెండూ ప్రజాదరణ పొందడం...ఇదొక సమష్టి విజయం. కానీ ఎవరి ప్రతిభలు వారివే... ఆ కోవకు చెందిందే యీ పాట.

చిరుకోపం, అలుక, కినుక వంటి పదాలలో చిన్న చిన్న భేదాలున్నప్పటికీ అవి పాత్రలలో ఎలా ఒదిగిపోతాయో రచయిత యీ పాటలో చక్కగా వివరించారు. ఈ పాటంతా చిన్నిచిన్ని కోపాలకు ప్రతిరూపాలైన పదాలే. పాట అయ్యేటప్పటికి కోపాలన్నీ సమసిపోతాయి.

అందరినోటా అవలీలగా పలికేలా శంకరాభరణరాగంలో యీ పాటను మహాదేవన్ స్వరపరచారు.

ఈపాట ఇంత తియ్యగా, నిండుగా ఉండడానికి కారణం సుశీల గాత్రంలోని మధురలావణ్యం. పాట గమనం కూడా చాలా వేగంగా ఉంటుంది. ఘంటసాల గానం కొంచెం విలంబితంగా ఉంటుంది. పాటలోని పాదాలు మరోసారి సుశీల గొంతులో వింటే.. 'కోపాలలో ఏదో కొత్తర్థముంది... గమ్మత్తు ఉందీ' అనే చోట దీర్ఘాలు, గమకాలు సుస్పష్టంగా వినిపిస్తాయి. ఇలాంటి పాటలు వింటుంటే మంజులవాణి స్వరపేటికలో ఎంత కమనీయస్వరం వినిపిస్తుందో అని అనిపిస్తుంది.

# బొబ్బిలియుద్ధం (1964)

❖ ఆరుద్ర ❖ యస్.రాజేశ్వరరావు

ముత్యాల చెమ్మచెక్క రత్నాల చెమ్మచెక్క
ఓ చెలి మురిపెముగా ఆడుదమా
కల కల కిల కిల నవ్వులతో గాజులు గల గల లాడ ॥ముత్యాల॥

తళతళ తళతళ మెరిసే సొగసు
ఇంపైన సంపంగి అమ్మాయి మనసు ॥తళ॥
పరువము వేసిన పందిరిలో
బుజబుజరేకులు పూయవలె ॥పరువము॥ ॥ముత్యాల॥

ఒప్పులకుప్ప - వయ్యారిభామ
సన్నబియ్యం - చాయపప్పు
చిన్నముువ్వ - సన్నగాజు
కొబ్బరి కోరు - బెల్లప్పుచ్చు
గూట్లో రూపాయ్ - నీమొగుడు సిపాయ్
రోట్లో తవుడు - నీ మొగుడెవడు
ఘుమ ఘుమ ఘుమ ఘుమ చారడేసి మొగ్గలు
గులాబి జవ్వాది అమ్మాయి బుగ్గలు ॥ఘుమ॥
ఆడిన ఆటలు నోములయి కోరిన పెనిమిటి దొరకవలె
॥ ఆడిన॥ ॥ముత్యాల॥

ఈ చిత్రంలోని పాటలన్నీ సాహిత్య సౌరభాల్ని వెదజల్లేవే. ఆ రోజుల్లో యువతుల్ని బాగా ఆకట్టుకున్నపాట, జమున చలాకీతనాన్ని ద్విగుణీకృతం చేసిన పాట యీ 'ముత్యాల చెమ్మచెక్క'.

ఈపాటలో సాహిత్యాన్ని అధికభాగం ఆరుద్ర జానపదగేయాలనుండి తీసుకున్నారు. ఈపాట పుట్టుక వెనుక ఓ కథ ఉంది. ఈ పాటకు మొదట ట్యూన్ సిద్ధమైంది. ట్యూన్ వచ్చేసింది కానీ పదాలు పడడం లేదు. సాలూరివారు పరిస్థితినర్థం చేసుకుని చిత్ర దర్శకనిర్మాత సీతారాం కొడుకు ప్రభుతో "ప్రభుగారూ! ఆరుద్ర గారు కొంచెం కష్టపడుతున్నట్టున్నారు. విపరీతంగా సిగరెట్లు లాగించేస్తున్నారు. ట్యూను మారుస్తాను

చెప్పండి" అన్నారు ఆరుద్ర ఒప్పుకోలేదు. ఐదునిముషాల్లో సాహిత్యం వచ్చేసింది. సీతారామ్ వచ్చి పాటవిని 'రోట్లో తవుడు – నీ మొగుడెవరు' అని బాగలేదని చిరాకుపడ్డారు. అయినా ప్రభు, తండ్రితో నచ్చచెప్పి, ఈ పాటే ఆల్ టైం రికార్డ్ అవుతుందని చెప్పారు. అదే జరిగింది. ఈనాటికీ ప్రేక్షకులు "బొబ్బిలియుద్ధాన్ని" గుర్తుపెట్టుకున్న కారణాల్లో యీ పాట ఒకటి.



ఆరుద్ర

పాటంతా తెలుగింటి తియ్యనిపదాలే... నిజానికి ముత్యాల చెమ్మచెక్కలు, రత్నాల చెమ్మచెక్కలు కాలానుగుణంగా భాషలోకి వచ్చిన జానపదుల పడికట్టుపదాలు, ప్రాసల మధురిమలు. అర్థంకన్నా వాటిలో ఉన్న లయ (RAYTHM) వినేవాళ్లను కట్టిపడేస్తాయి.

సాలూరి రాజేశ్వరరావు సన్నివేశాన్ని, భాషా చమత్కారాలను అవలీలగా అందిపుచ్చుకుని 'మధ్యమావతి' రాగంలో యీ పాటను స్వరపరిచారు. గ్రామీణుల పాటలన్నీ యీ రాగంలో ఎంతో లలితంగా పలుకుతాయి. రాగం ఎంపిక చేసుకోవడంలో, పలికించడంలో సిద్ధహస్తులు సాలూరివారు.

ఎంత నిండైన పదాలు? ఎంత వయ్యారంతో పాట సాగింది. .. కల కల కిల కిల నవ్వులతో అని పాడడమే గాదు ఆ నవ్వును తన గొంతులో సుశీల పలికిన విధం మరోసారి వినండి – 'గాజులు గల గల లాడా...'లోని స్వరగతులు, జాలువారు ధ్వనులు అతిరమ్యం. 'తళతళ తళతళ', 'ఘుమ ఘుమ ఘుమ'...లోని భావప్రకటనలు గళతంత్రులను మీటి శబ్దసౌందర్యాలను ద్విగుణీకృతం చేసాయి.

పడుచుపిల్లల మదిలో కోరికలన్నీ చెంపలకు చారడేసి మొగ్గలై... బుజబుజ రేకులు విచ్చుకున్నట్లే సుశీల గాత్రం పలికింది. పాట జన్మను ధన్యం చేసింది.

# బొబ్బిలియుద్ధం (1964)

❖ శ్రీశ్రీ ❖ యస్.రాజేశ్వరరావు

నిను చేర మనసాయెరా నా స్వామి
చనువార దయసేయరా ॥నిను॥

విడిదికి రమ్మని చాల వేడితిరా ॥విడిది॥
బిడియము నీ కేలరా – దొరా ॥బిడియ॥ ॥నిను॥

సా, గరిగ సా, సరిగ సనిదమపా నిదమపా
సరసుడవని నిన్నె పదిమంది పొగడ ॥సర॥
మరిమరి కోర్కెలు విరిసెను ప్రియుడ ॥మరి॥
వయసు నీ కొరకె పలవరించెరా
తనువు నిన్ దలచి పులకరించెరా
మగువ కోర మొగమాటమేలరా
బిగువుమాని జవరాలి నేలరా
సొగసుచూచి ఎదురుకాచి నిలిచి
పగల్ రేలు దిగుల్ చెందు చెలికి ॥నిను॥



ఎల్.విజయలక్ష్మి నృత్యానికి శ్రీశ్రీ రచించిన పసందైన జావళి ఇది. ఈ జావళీ రచనకు ఎవరైతే బాగుంటుందని నిర్మాత తర్జనభర్జన పడుతుంటే సాలూరే శ్రీశ్రీ చేత రాయించమన్నారు. “రాస్తాడా?” అని సీతారామ్ సందేహపడితే రాజేశ్వరరావు “నేనే ఫోన్ చేసి కనుక్కుంటాను” అని ఫోన్ చేసి “జావళీ రాయగలరా?” అని అడిగితే శ్రీశ్రీ ‘గలను’ అని ఫోన్ పెట్టేసి ఒక్కరోజులో పాటను పూర్తిచేశారు.

ఈపాటలోని చరణంలో ‘విడిదికి రమ్మని చాల వేడితిరా! బిడియము నీకేలరా... దొరా...’ అనే పాదాల్లో ప్రాస బాగున్నా, ‘విడిదికి రమ్మన’ మని నర్తకి బుస్సీని అతని

విడిదికి వచ్చి మరీ ఒత్తిడి చేయడం, వింతగా తోస్తుంది.

తెలుగుపాటలలో ఎన్నిరకాల ప్రక్రియలో... సృష్టిలోని అందాలను సృష్టికర్త ఎనభైనాలుగులక్షల జీవరాశులకు ఇచ్చినట్లే, సామవేదజనిత సంగీతానికి ఎన్నెన్నో సొబగులు, సోయగాలు, ప్రయోగాలు, రసాత్మక ధోరణులు, చిత్ర విచిత్రబాణీ విన్యాసాలు – ఇవన్నీ అందిపుచ్చుకున్న గాయనీగాయకులలో సుశీల ఒకరు. ఆ ప్రక్రియలన్నింటినీ స్వరభరితం చేసిన మోహనగాత్రం.. మంజులశబ్దం.. వాణీనాదం... వీణారవం...సుశీలదని ఘంటాపథంగా చెప్పవచ్చును.

జావళీకి ఒక దర్జా (Dignified stage), సునిశిత శృంగార రసధోరణి (Subtle expression of sringarabhava), కవ్వింపు (Provocation), ఆకర్షణ (Attraction) ఇలా ఎన్నో హంగులుంటాయి. కవి రచనలో ఇవన్నీ పరిపూర్ణంగా వచ్చాయి. ఇంక గొంతులో పలికించేది స్వరకర్త... అందిపుచ్చుకుని పై లక్షణాలనేకాదు మరి కొన్నింటిని అందించి తన మనోధర్మ సంగీత అనుభవాలను గాయని అందిస్తేనే అక్కడ పాత్ర పాదం నర్తిస్తుంది. పాత్రకు రక్తి కలిగి పాటకు అనురక్తి శక్తి వస్తాయి. ఇవన్నీ సంపూర్ణంగా పలికిన గాయనిగా సుశీల కృతకృత్యురాలైంది.




భైరవిరాగంలోని చిట్ట స్వరసంగతులు, జాలువారు గమకాలు పాడేటపుడు సుశీల పదాలరాణి పంచమకోకిలై పాడుతోందా అని విస్తుపోతారు. స్వరాలవాణి, విరించిరాణి కల్యాణభరిత నాదోపాసన చేస్తోందా అనిపిస్తుంది. పాటలో పైన చెప్పిన వాటికి మరింత సింగారాలు పూసి శృంగార రసపోషణను ఆవిష్కరించారనిపిస్తుంది.

# ఇల్లాలు (1965)

❖ ఆత్రేయ ❖ కె.వి.మహాదేవన్

మల్లెపూవులు విరిసెరా – మంచుతెరలు కరిగెరా
నల్లనయ్యా మేలుకో – నల్లనయ్యా మేలుకో –
చల్లనయ్యా మేలుకో ॥మల్లె॥

పురిటి వెలుగున బుగ్గ పైనీ
పంటినొక్కులు కంటిరా
చిరుతనవ్వుల పెదవిపై – నా
కంటి కాటుక లంటెరా
నల్లనయ్యా మేలుకో – చల్లనయ్యా మేలుకో
చిక్కుబడిన కురులు చూచి
సిగ్గు ముంచుకు వచ్చెరా
రేయి గడిచిన హాయినంతా ॥రేయి॥
మనసు నెమరు వేసెరా
నల్లనయ్యా మేలుకో – చల్లనయ్యా మేలుకో
నీవు నిండుగ నవ్వినపుడే – నాకు నిజముగ తెల్లవారును
నా కాపురాన రేపుమాపులు ॥కాపురాన॥
కలవురా నీ చూపులోనే
మల్లెపూవులు విరిసెరా – మంచుతెరలు కరిగెరా
నల్లనయ్యా మేలుకో – చల్లనయ్యా మేలుకో
మల్లెపూవులు విరిసెరా – మంచుతెరలు కరిగెరా
నల్లనయ్యా మేలుకో – చల్లనయ్యా మేలుకో
మల్లెపూవులు విరిసెరా – మంచుతెరలు కరిగెరా

చవకబారు సంగీతపు గీతాలు మితిమీరుతున్న ప్రస్తుతపరిస్థితులలో యీ పాట వింటున్నప్పుడు కలిగే అనుభూతులు వర్ణించడం ఎలా? వేసవి మండుటెండలో వేడెక్కిన మనసూ, శరీరమూ సన్నని వానజల్లులో తడిసి పులకరించినట్లు వర్షాకాలపు వానహోరులో బంగారు సూర్యకిరణం స్పర్శతగిలినట్లు, ఎడారిదుమ్ములో మత్తెక్కించే మల్లెల సౌరభం అలుముకున్నట్లు, వణుకు పుట్టించే చలిలో ముచ్చటైన వెచ్చటి స్పర్శ సోకినట్లు రకరకాల



కె.వి..మహాదేవన్

ఊహలూ, ఊరింపులూ కలగాలని ఉంటే, యీ పాట విని చూడాల్సిందే! భారతీయమహిళ హృదయంలో భర్తపట్ల ఎటువంటి గౌరవాభిమానాలు, ప్రేమానురాగాలు, చిలిపి వలపుతలపులు స్థానం ఏర్పరచుకుని ఉంటాయో యీ గీతం వింటే సుస్పష్టంగా తెలుస్తాయి.

అల్లరి నల్లనయ్యకు మేలుకొలుపు పాడుతున్నట్లుగా, కమ్మని మనసుగల కట్టుకున్నవానినే నిద్రలేపుతున్న ఇల్లాలి కొంటెదనం గిలిగింతలు పెడుతుందీ గీతంలో. మంచుతెరలు తొలగుతూ ఉండగా, మల్లెలు విరుస్తూ ఉండగా కనిపించే దృశ్యం ఎంత సులలితంగా ఉంటుందో, ఈపాటకు కూర్చిన రాగం అంత లలితంగానూ ఉంటుంది. నింగికి నీలిమ, పైరుకు పచ్చదనం ఎంత స్వాభావికమో, సుశీల కంఠంలో పైభావాలు అంత సహజంగా పలికాయి. ఆచార్య ఆత్రేయ భావసంపద విలువ శ్రోతలకు మరోసారి గోచరమౌతుందీపాట వింటే!

## ఇల్లాలు (1965)

❖ ఆత్రేయ ❖ కె.వి.మహాదేవన్

మనసునేదో కవ్విస్తూంది
తలచుకుంటే నవ్వొస్తూంది
చెప్పుకోను వీల్లేకుంది
సిగ్గేస్తుంది, హ – హ – హ – హ
కళ్లు పలుకరించాయి
మనసు మూగబోయింది!
మనసు పలుకబోయింది!
మాట వెలికి రానంది
చెప్పుకోను వీల్లేకుంది, సిగ్గేస్తూంది హహహ...
మనసునేదో కవ్విస్తుంది
ఒడిని వున్నా – విడిచి వున్నా నిదుర
రానే రానంటుంది!
నిదురరాని హృదయమేవో కథలు
చెబుతానంటుంది!
చెప్పుకోను వీల్లేకుంది, సిగ్గేస్తుంది హహహ...
కన్నెమనసునేదో కవ్విస్తూంది –
కలవరింత మొదలెడుతుంది!
విరులపాన్పు విసుగవుతుంది!
వెన్నెలయినా – వేడవుతుంది
చెప్పుకోను వీల్లేకుంది, సిగ్గేస్తూంది హహహ!!
మనసునేదో కవ్విస్తూంది –
మొదటిరేయి నన్ను చేరి –
బుగ్గమీద ముగ్గు వేసె!
నిన్నుచూచి నేను కరిగి –
ఒరిగిపోవుట గురుతు వచ్చి!
ఒరిగిపోవుట గురుతువచ్చి –
చెప్పుకోను వీల్లేకుంది సిగ్గేస్తూంది .. హ – – హ – హ – హ

కన్నెమనసులోని కమ్మనికలలను ఎంతమందో కథలుగా అల్లారు. కావ్యాలుగా రూపొందించారు. కానీ, పూర్తిగా విప్పి చెప్పలేని చిరుసిగ్గుతో కూడిన నూతనత్వపు చిందు అలా ఉంటూనే ఉంటుంది. కనుగొనవలసిన కన్నెభావాలు ఆద్యంతాలు లేకుండా అలా పెరుగుతూనే ఉంటాయి.

సుశీల గాత్రపు సొంపు వివరించబూనుకుంటే నెమలి నాట్యం అందమైందనీ, కోకిలమ్మ పాట తీయనైందనీ చెప్పడమే అవుతుంది. వాద్యానుసరణ, రాగం కన్నెకలల వంటి మృదుత్వాన్ని సంతరించుకున్నాయి. ఆత్రేయ ప్రతిపదంలోనూ తానున్నానంటూ తొంగిచూస్తూనే ఉన్నారు.



# ఉయ్యాల - జంపాల (1965)

❖ ఆరుద్ర ❖ పెండ్యాల

ఉంగరాల జుట్టువాడు
ఊరించే కన్నులవాడు
ఒయ్యారివి నీవే ....
ఒయ్యారివి నీవేనంటూ
వియ్యమాడ వస్తాడు ॥ఉంగరాల॥

దోరవయసు చిన్నవాడు
దొరచదువులు చదివినవాడు... ॥దోర॥
దోబూచులు ఆడీ వలపు
దోచుకొని పోతాడు ॥ఉంగరాల॥

కొంటెతనపు కుర్రావాడు
కోరమీసమున్నా వాడు ॥కొంటె॥
చూపులలో ఊహలు చదివి
సొగసు కానుకిస్తాడు ॥ఉంగరాల॥

కమ్మనైన వన్నెలవాడు
కలుపుగోరు మాటలవాడు... ॥కమ్మ॥
కన్నెపిల్లమదిలో నిలచి
కాపురమే ఉంటాడు ॥ఉంగరాల॥

రాబోయే మనోహరుని కోసం కొంటెకన్నె ఊహారూపం ఇంతకన్న మనోహరంగా ఎలా ఉంటుంది? ఈ గీతాన్ని ఆలపిస్తున్న కన్నెపిల్ల కాస్త ఎక్కువగా కలలు కంటుంది కాబోలు! లేకుంటే అంత సౌందర్యమూ, అన్ని సుగుణాలూ కలవానిని కోరుతుందా? ఆమె అమాయక స్వప్నాలు ఫలింపజేయగల అతులిత సౌందర్యంగల సద్గుణమూర్తి నిజంగా ఉంటాడా? అనే అనుమానం కలుగుతుంది.

కోరుకున్న రూపంలో మనసైనవాడు ఎదుట నిలిస్తే ఎలా ఉంటుందో ఊహించుకుంటూ పాడుకుంటున్న యువతి పాట మనమెప్పుడూ వినకపోతే, గంధర్వగాయని సుశీల మధువులొలికించిన పైపాట వినాల్సిందే! రచయిత, యువతీ హృదయాన్ని సంపూర్ణంగా ఎలా ఆకళింపు చేసుకున్నారో! వరస మంచి ఊపుతో గాయని చురుకుదనంలాగానే ఉరకలు వేస్తూ ఉంటుంది.

# మంగమ్మ శపథం (1965)

❖ సినారాయణరెడ్డి ❖ టి.వి.రాజు

రివ్వునసాగే! రెపరెపలాడే
యవ్వనమేమన్నదే పదే పదే
సవ్వడి చేయుచున్నదే ॥రివ్వున॥

పైరుగాలి వోలె మనసు పరుగులు పెడుతున్నది
కోడెత్రాచువోలె వయసు కుబుసం విడుతున్నది ॥పైర॥
సొగసైనా, బిగువైనా నాదే నాదే ॥రివ్వున॥

నా పరువం సెలయేరుల నడకల వలె ఉన్నది
నా రూపం విరజాజుల నవ్వుల వలె ఉన్నది ॥నా పరువం॥
జగమంతా అగుపించెద నేనే నేనే ॥రివ్వున॥

నీలినీలి మబ్బులనే మేలిముసుగు వేతునా
తారలనే దూసిదూసి దండలుగా చేతునా ॥నీలి॥
నేనన్నది, కాలేనిది యేదీ యేదీ ॥రివ్వున॥

సందర్భాన్ని, పాత్రల మనోభావాల్ని ఒడిసిపట్టి అక్షరసంపదను పాటగా మలచడంలో సి.నా.రె సిద్ధహస్తులు. ఈపాటలో యవ్వనసోయగాలు, సొగసులు, పరువాలు, రూపలావణ్యాలు అన్నీ నావే, నావే అనే పాత్ర మనోభావాన్ని చక్కగా పలికించారు.

కథానాయిక మంగమ్మ (జమున)పై చిత్రించిన గీతమిది. సంగీత దర్శకులు ఇచ్చిన బాణీలకు రాసిన పాట ఇది. టి.వి.రాజు ఇచ్చిన పల్లవిలో మధ్యమధ్య మెత్తని తబలా చరుపులకు తగినంత కాలవ్యవధి ఉంది. ఓ రకమైన ఊపుకోసం అవలంబించే పద్ధతి అది. తరగెత్తే నురుగ వయసులో ఉరకలెత్తే పల్లెపడుచు పాడుకున్నపాట ఇది. యవ్వనం రివ్వున సాగడం, పదే పదే సవ్వడి చేయడం పడుచుదనాన్ని వ్యక్తం చేయడానికి కవి చేసిన గడుసు ప్రయోగాలు. నాయిక స్వాభిమాన ప్రవృత్తిని ద్యోతకం చేయడానికి కుబుసం విడుస్తున్న కోడెత్రాచుతో ఉపమించారు సి.నా.రె. తరువాతి కథలో ప్రతినాయకుడిలాంటి నాయకుడు చేసిన ప్రహారాలకు త్రాచులా బుసకొట్టి పగతీర్చుకుంటుంది నాయిక. ఆ అంశాన్ని, ఆమె మనోలక్షణాన్ని చక్కగా ధ్వనింపజేశారు కవి. అటు బాణీ, ఇటు వాణి సరిపాళ్లలో కుదిరిన యీ పాట జనరంజకం కావడంలో ఆశ్చర్యంలేదు. సుశీల గొంతులో పాత్ర, పాత్ర నటనలో సుశీల మమేకమైనట్లుగా కనిపించి, వినిపించే పాట ఇది.



# కీలుబొమ్మలు (1965)

❖ ఆత్రేయ ❖ ఎస్.పి.కోదండపాణి

పిల్లనగ్రోవిగ మారితిరా
నీ చల్లని చూపులు సోకినంతనే ॥పిల్లన॥

మధురిమ లేక మమతలు లేక ॥మధురిమ॥
మ్రానై యుంటిని నీ అభిమానము కంటిని ॥పిల్లన॥

నీకే తెలియక నేనై కోరక
నా దరి చేరిన నా స్వామి ॥నీకే॥
అడవిని పెరిగిన వెదురుకూనకు
హృదయము కూరిచి కదలించినావే
కన్నులనీరు కరగించినావే ॥కన్ను॥ ॥పిల్లన॥

మూగమురళిని పలికించుమురా
మురళీమోహనుడనిపించుమురా ॥మూగ॥
ఇరువురు కలసి ఈ గోకులమున ॥ఇఇరువురు॥
రాగరాగిణులై జీవింతుమురా
రసమయలోకం దీవించునురా ॥పిల్లన॥
కృష్ణా......కృష్ణా......కృష్ణా......

ఇద్దరు మహాగాయకుల్ని (ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం, జేసుదాసు), ఒక మేటి గాయని (వాణీజయరాం)ని పరిచయం చేసిన స్వరశాస్త్రనిపుణుడు కోదండపాణి. పేరుకే కోదండపాణి కానీ ఆయన చేతిలో ఎప్పుడూ ఉండేది హార్మోనియం. ఆయన మంచిగాయకుడు. బృందగానాలలోనో, సోలోగానో పాడినా పొట్టనిండుతుంది. కానీ మనసు నిండిపోయేలా సంగీతదర్శకత్వం చేయాలనే తపనతో సినీరంగానికి వచ్చారు.

అయితే కోదండపాణి సంగీతదర్శకత్వం వహించిన దరిదాపు చిత్రాలలో ముప్పాతిక మువ్వీసం స్టంటు చిత్రాలే. వాటితో పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోవడానికి రెండు అడ్డంకులు. అటువంటి చిత్రాలకు కావాల్సిన సంగీతం వెంటనే ఆకర్షించగలిగేదిగా ఉండాలి. అడపాదడపా మంచి వరసలు వాటిల్లో వినిపించినా అవి ఎవరూ గుర్తుపెట్టుకుని చెప్పరు. ఈ దొమ్మీలో ఎన్నో మంచిపాటలు నలిగిపోయాయి.



ఎస్.పి.కోదండపాణి

కోదండపాణి సంగీతం చేసిన ఎన్నో మంచిపాటల్లో “కీలుబొమ్మలు” లోని ఈపాట ఒకటి. ఈపాటలో ఆత్రేయ భావుకత్వం అంబరాన్ని చుంబించింది. ఎస్.రాజేశ్వరరావు తరువాత వీణ పాటల్ని ఆయనవలే సుశ్రావ్యంగా స్వరబద్ధం గావించగల ప్రజ్ఞాశాలి కోదండపాణే. ఇతరభాషాచిత్రాల్లోని హిట్‌సాంగ్సును అనుకరించడానికి ఆయనలోని సృజనాత్మకశక్తి అంగీకరించదు. ఆయన ఈపాటను ‘పహాడ్’ రాగంలో స్వరపరిచారు. సాహిత్యంలో పిల్లనగ్రోవి ఉన్నా, దీన్ని ఒక వీణపాటగానే చెప్పుకోవాలి. భూప్ రాగంలోని ఆరోహణస్వరాలు, బిలావస్ రాగంలోని ఆరోహణ స్వరాలు మేళవిస్తే పహాడిరాగం అవుతుంది. ఇదొక మధ్యమ శ్రుతిరాగం. ఇందులో భూప్‌లోని స్వరాలలో ఆర్తి, బిలావస్‌లోని స్వరాలు తృప్తిని కలిగిస్తాయి. పాటను కోదండపాణి శిఖరాయమానంగా స్వరపరచి తన ప్రతిభను సుశీల గొంతులో పలికించారు.

అప్పటికే చిత్రరంగంలో గానద్రష్టగా స్థిరపడిపోయిన సుశీల.. ప్రారంభ వీణలోని స్వరాలకు ధీటుగా పిల్లనగ్రోవిలా గొంతు సవరించటం రసప్రక్రియగా అనిపిస్తుంది. అడవిని పెరిగిన వెదురుకి ప్రాణం పోసిన తీరు...‘మూగమురళిని పలికించుమురా’....అన్నప్పుడు వాయులీనాలు.... రసమయ లోకంలో రాగరాగిణులను పలికించిన తీరు... చివరలో ‘కృష్ణా!’ అని ఒక సుందర భక్తిలోకంలో లీనమైన తీరు మన హృదయాల్ని రసప్లావితం చేస్తాయి.

# చంద్రహాస (1965)

❖ దాశరథి ❖ ఎస్.హనుమంతరావు

ఏమిటో ఎందుకో
ఏమిటీ కౌగిలీ ఎందుకీ ఆకలీ

చరణం.1: తలచినా చూచినా కలిగే ఈ చక్కిలిగిలి ఏమిటో ॥ఏమిటీ॥
చెఱకు విల్లెందుకో చిలిపి కళ్లెందుకో
చెంతనే వింతగా చెలియ తా నెందుకో
తారతో చంద్రుడూ చేరినా డెందుకో
పువ్వుతో తుమ్మెదా మురిసిపోయె నెందుకో ॥ఏమిటీ॥

చరణం.2: జంటగా గువ్వలూ మింటికెగిరె నెందుకో
ఒంటరి నా హృదయమూ జంట గోరెనెందుకో
కొమ్మలో కోయిలా కమ్మగ తా పలికెను
మనసులో ఎవ్వరో చిలిపిగ నను పిలిచెను ॥ఏమిటీ॥

చరణం.3: చల్లనీ గాలికే ఝల్లుమనె దేహము
మనసులో మొలిచెను తెలియని వ్యామోహము
రతిని నే నైతినా నా మన్మథుడెవ్వడో
ఎవ్వరో ఎవ్వరో నా మోహనుడెవ్వరో ॥ఏమిటీ॥

శ్రీ జైమినీభారత పురాణ ప్రసిద్ధమైన పుణ్యకథ ఇది. దీన్ని విక్రమ్ ప్రొడక్షన్స్ వారు "చంద్రహాస" పేరుతో చలనచిత్రంగా రూపొందించారు. ఈ చిత్రంలో అన్నివిధాలా మంచిపాట ఇది.

అనురాగంలోని అందాన్ని, ఆనందాన్ని అర్థం చేసుకోలేని అమాయకురాలి ఆలోచనలను ఇంత చక్కగా వెలిబుచ్చిన పాట మరొకటి లేదేమోననిపిస్తుంది. తారాచంద్రుల సల్లాపాలు, గువ్వలజంట సరాగాలు అన్నీ ముగ్ధరాలికి విస్మయానందాల్ని కలిగిస్తాయి. ప్రేమలోని ఆంతర్యాన్ని తెలుసుకోకపూర్వం కలిగే భావాలతీరు వికసించని కుసుమాలబారు వంటిది. పండని నిండుగుండెల సౌరులాంటిది. ప్రేమలో మునగని పసిదానికి చిలిపివాంఛలు చిందులు దొక్కుతున్న కళ్లలోను, అనిర్వచనీయమైన అనుభవంలో అదురుతున్న అధరాలలోను కూడా ప్రశ్నార్థకమే గోచరిస్తుంది. పాట వరసను



ఎస్.హనుమంతరావు

సృష్టిలోని సౌకుమార్యపు కుప్పలోంచి పసందు చేసినట్లున్నారు.

రాగం, వాద్యానుసరణ సురుచిరంగా, సున్నితంగా రూపొందాయి. కవి కల్పనలను మించిన అమాయకత్వంతో పాడారు సుశీల. ఏమీ ఎరుగని బేల మనస్తత్వాన్ని తన ప్రౌఢకంఠంలో ఇంత ప్రస్ఫుటంగా ఎలా పలికింప గలిగారో! ననిపిస్తుంది మనకు.

పాట అంతటా అక్కడక్కడ వినిపించే వీణారావం ప్రణయలోకాలకు స్వాగతగీతికలా ఉంటుంది.

అభినేత్రి కృష్ణకుమారి, తన అమాయకపు ముఖాభినయంతో పాటకు ఒక కొత్త అందాన్ని సంతరించి పెట్టారు. ఈ చిత్రంలోనే కృష్ణకుమారి, హరనాథ్, రాజబాబు ముగ్గురూ కలసి 'ప్రేమయే సంసారబంధం' అనేపాటను సొంతంగా పాడుకున్నారు. అలా యీ ముగ్గురినీ సినీనటగాయనీ గాయకుల జాబితాలో చేర్చుకోవచ్చు.



# వీరాభిమన్యు (1965)

❖ దాశరథి ❖ కె.వి.మహాదేవన్

తాకినచోట ఎంతో చల్లదనం
తక్కినచోట ఏదో వింత జ్వరం
పెదవులేల వణికెను, వణికెను
హృదయమేల బెదిరెను, బెదిరెను
వింత కోరిక మొలచెను, మొలచెను
ఎవరో నన్నే తలచీ, పిలిచీ కలచెనూ ॥తాకిన॥

ఏమి సుఖం – ఏమి సుఖం – ఏమని చెప్పుదునే
ఈ పులకింత – ఈ గిలిగింత – ఎన్నడు ఎరుగనులే
చెంపకు చెంప ఆనించీ – ఇంపగు కథలను చెప్పవటే
నీలో నన్నే నింపుకొనీ – నేలకు స్వర్గం దింపవటే ॥తాకిన॥

కన్యల మధ్యన ఈ వలపు – కలలో ఇలలో కలగదులే
నీలో ఏదో ఉన్నదిలే – నిజం తెలియ రాకున్నదిలే .. ॥తాకిన॥



తోటలో కలిసిన చిన్నవాడు, చిన్నారి మనసులో చెలగాటమాడుతూంటే, రాకుమారి ఉత్తర (కాంచన) జలకమాడుతుంటే, కోరమీసపు కొదమసింగం అయిన అభిమన్యుడు (శోభన్‌బాబు), ఆమె చెలికత్తె ('భీష్మ' సుజాత)ను ఆవహించి, ప్రియురాలితో సయ్యాటలాడితే, ఆమెలో కలిగిన తమకానికి అక్షర రూపం యీ పాట.

తొలివలపు అతి విచిత్రమైంది: బాధాపూరితమైంది కూడా. లోకమెరుగని ముద్దరాలికి ప్రియుని స్పర్శ సోకగానే ఏమేమో అవుతుంది, ఎలాగో ఎలాగో అనిపిస్తుంది. ఆ భావాన్ని వర్ణించడం ఎవరి తరం? కొంత వరకైనా తెలుసుకోవాలనుకుంటే సుశీల పాడిన యీ పాట వినాల్సిందే. ఆమె కంఠంలో ప్రేమ మాధుర్యాన్ని కనుగొనాలనే ఆతురతా, అర్థంకాని



భయమూ తొణికిసలాడుతుంటాయి. ప్రతి భావానికీ ప్రాణం పోసి తన గానంలో ప్రవహింపజేయగల సుశీలవంటి గాయనిని పొందగలిగినందుకు తెలుగువాళ్లూ, తమిళులూ గర్వించాలి. వాద్యానుసరణ యీ పాటలో అతిసున్నితంగా మనసును మత్తెక్కించేలా ఉంటుంది. కన్నెపిల్ల కలలన్నీ కొల్లగొట్టిన దాశరథిని మల్లెల వర్షంతో శిక్షించాలనిపిస్తుంది. మహాదేవన్ లలితమైన అభిరుచి ఈ గీతంలో ద్యోతకమౌతుంది.

ఉత్తర ప్రణయభావన లన్నింటిని ప్రోది చేసుకుని ఒక రసలోక దర్శనం చేసినట్టుంటుందీపాట. సుశీల ప్రతి పదంలోనూ, ఉత్తర ప్రతి భంగిమలోనూ వినిపిస్తూ పాట సాగుతుంది. ఈ పాటలో గాయని గాత్రం చాలా విలక్షణంగా హొయలు పోయింది. పాటకు ఇన్ని హంగులుంటాయా? అని రసజ్ఞలోకం విస్తుపోయేలా సుశీల పాడిన ఈ పాట ఒక రసగుళిక, అమృతగీతిక.

# సతీ సక్కుబాయి (1965)

❖ సీనియర్ సముద్రాల ❖ పి.ఆదినారాయణరావు

రంగా....
జయపాండురంగ ప్రభో విఠలా!
జగదాధారా! జయవిఠలా! ॥జయ॥

బృందం : పాండురంగ విఠలా!
పండరినాథ విఠలా! ॥పాండు॥

సక్కు : పాండురంగ విఠలా
పండరినాథ విఠలా!

బృందం : పాండురంగ విఠలా
పండరినాథ విఠలా! ॥పాండు॥

సక్కు : ఆ...
నీ కనులా అలరారే వెలుగే
నీ పెదవుల చెలువారే నగవే ॥నీ కనులా॥
పాప విమోచన సాధన రంగ! ॥జయ॥

బృందం : ప్రభో పాండురంగ! విభో పాండురంగ

సక్కు : పాప విమోచన సాధన రంగ! ॥జయ॥

బృందం: పాండురంగ విఠలా
పండరినాథ విఠలా ॥పాండు॥

సక్కు : శ్రీ రమణీ హృదయాంతరంగ!
మంగళకర, కరుణా తరంగ ! ॥శ్రీ రమణీ॥
ఆశ్రితదీన జనావన రంగ!

బృందం: ప్రభో పాండురంగ! విభో పాండురంగ ॥పాండు॥

సక్కు : ఆశ్రిత దీనజనావన రంగ ॥జయ॥

బృందం: పాండురంగ విఠలా
పండరినాథ విఠలా ॥పాండు॥

సక్కు : పాండురంగ విఠలా
పండరినాథ విఠలా ॥మూడుసార్లు॥



"అనార్కలి", "సువర్ణసుందరి" లాంటి సంగీతభరిత చిత్రాలు తీసి తెలుగు చలనచిత్రసీమను సుసంపన్నం చేసిన అంజలీ పిక్చర్స్ అధినేతలు బానర్ పేరుమార్చి 'చిన్ని బ్రదర్స్' పతాకం క్రింద నిర్మించిన సంగీతభరిత పౌరాణికచిత్రం "సతీ సక్కుబాయి".

తెలుగునాట అత్యంత ప్రచారం పొందిన సక్కుబాయి నాటకం ఆదినారాయణరావు నిర్మించక ముందే రెండుసార్లు వెండితెరకెక్కింది. భారతలక్ష్మీపిక్చర్స్ వారు1935లో దాసరి కోటిరత్నం సక్కుబాయిగా నిర్మించారు. 1954లో కడారు నాగభూషణం, కన్నాంబ దంపతులు ఎస్.వరలక్ష్మి సక్కుబాయిగా నిర్మించారు. సక్కుబాయి నాటకానికి, సినిమాలకు దైతాగోపాలం రచన చేశారు.

ఆదినారాయణరావు కూడా దైతా గోపాలం బాటలోనే నడిచి అధికశాతం బాణీలను ఆయననే అనుసరించారు. కొన్ని పాటలను సీనియర్ సముద్రాల చేత సరికొత్తగా రాయించారు.

ఈ కొత్త "సక్కుబాయి" చిత్రంలోని పాటలు, పద్యాలు, సంభాషణలు సముద్రాల చేతిలో పతాకస్థాయిలో ప్రభవించాయి. ఇందులో సుశీల ఎనిమిది పాటలు, ఆరు పద్యాలు పాడి చిత్రాన్ని భక్తి పారవశ్యంతో నింపేశారు.

భగవన్నామం ఏ రూపంలో పలికినా అది ఎంత రుచికరంగా ఉంటుందో? పాండురంగ నామాన్ని కీర్తిస్తూ పాడిన గీతమిది. రంగడి గుణగణాలు, ముఖ్యంగా



'మంగళకర', 'దీనజనావన' వంటి పదాలు చాలా చక్కగా ఒదిగిపోయాయీ పాటలో. రంగ శబ్దాన్ని పదేపదే పలుకుతూ ప్రతిపలుకులో భక్తి భావనలు రంగరించి నట్లుంటుందీ గీతం. ఇది దైవానికి అర్పించిన గానసుమం. ఇలాంటి గాన కదంబాలెన్నెన్నో సుశీల గొంతులో శుభకరంగా పలికాయి. ఆదినారాయణరావు స్వరకల్పనలో–సింధుభైరవి రాగంలో ఈపాట రసాత్మక విలువల్ని సంతరించుకుంది.

సుశీల సుమధురగాత్రంలో యీ పాట ఒక పారవశ్యం... చరణం మొదలవుతుండగానే ఒక చక్కని ఆలాపనతో మొదలై 'శ్రీరమణీ హృదయాంతరంగ, మంగళకర కరుణా తరంగ... వరకు సాగిన స్వరగంగా ప్రవాహం మరో సారి వినాల్సిందే. ఆ రాగాలాపన ఒక రసభూషణం అని చెప్పొచ్చు. సింధుభైరవిలోని ఆర్తిని పరిణితితో పల్కిన తీరు, 'జగదాధారా..' అనేచోట గమకాల జిలుగులు అద్వితీయం. నేటికీ దేవాలయాల్లో, భజనమందిరాలలో తప్పక పాడుకునే తప్పనిసరి గీతం.

ఈ చిత్రం తెలుగులో విడుదలైన నాలుగేళ్ల తర్వాత మరాఠీలోనికి డబ్ చేయబడింది. అక్కడి యుగకర్త జి.డి.మద్గుల్ కర్ పాటల రచన చేయగా ఆశా, మన్నాడే, లక్ష్మీశంకర్ ప్రభృతులు పాడగా 'నాచా నాచా బ్రహ్మానందీ' 'ఘన్ ఘన్ పది ఘుమకే పైంజన్' 'ఉఠ్ బా విఠలా' పాటలను ప్రేక్షకులెంతో మెచ్చుకున్నారు. మహారాష్ట్రుల కథాకమామిషుకి స్వంతమైన ఒక చిత్రం తీసి అందున్న సంగీతంతో అక్కడి ప్రజలను మెప్పించడమంటే మాటలుకాదు. ఆ చిత్రం పేరు "సఖూ ఆలీ పండర్ పురా". ఆ చిత్రానికి సంగీతదర్శకునిగా వ్యవహరించిన దత్తాదావ్ జేకర్ గాయకుల కంఠాలలో సహజమైన మరాఠీ సొగసులు పలకడంలో ఎంతో కీలకపాత్ర పోషించారు.


# పిడుగురాముడు (1966)

❖ కొసరాజు ❖ టి.వి.రాజు

ఓ... ఓ.... ఓ.... ఓ....
కొమ్మల్లో పాలపిట్టా కూత కూసిందోయ్
కమ్మంగా గున్నమావి కాపు కాసిందోయ్ ॥కొమ్మ॥
రాజా - రాజా - నా రాజా!
చిలిపిగాలి విసిరెనులే - వలపువాన కురిసెనులే - రా...జా ॥చిలిపి॥
గిలిగింతలు కలిగెనులే - ఘుమా ఘుమా లే
ఈ గాలిలో - ఈ వేళలో - ఏవేవో తలపులు
చిగురించెనులే ॥కొమ్మల్లో॥
పైరు పాట పాడిందీ
మొయిలు నాట్యమాడిందీ - రాజా ॥పైరు॥
పూలతావి మత్తుజల్లి - లాలించిందీ
పదే - పదే - అదేమిటో
నా ఒళ్లు పరవశమై పోయినదీ ॥కొమ్మల్లో॥
పక్కనెవరో పిలిచినట్టు
పైట కొంగు లాగినట్టు
ఏమేమో అనిపించును రాజా ॥పక్క॥
ఔనౌనులే - సిగ్గౌనులే
వయసున చెలరేగిన - భ్రమలివిలే ॥కొమ్మల్లో॥



కొసరాజు కసిదీర పల్లెపదుచులోని తొలివయసు కమ్మదనాన్నంతా ఈ పాటలో కూరిపెట్టారు. సహస్రాధిక గీతాలు రాసిన సినీకవుల్లో కొసరాజు ఒకరు. వాటిలో ఎన్నో పాటలు తెలుగు చలనచిత్రపరిశ్రమకు కనకాభిషేకం చేశాయనడంలో సందేహం లేదు. ఏసందర్భానికైనా తనదైన పల్లెపదాలతో లయాత్మకంగా పాటను



కొసరాజు



టి.వి.రాజు

ముస్తాబు చేసి ఇవ్వడంలో ఆయన సిద్ధహస్తులు. మాటలో పొందిక, సొంపు, తీయని ప్రాసలు, భావప్రకటన, పాత్ర మనోభావం.... ఇలా ఎన్నెన్నో పొహళింపులు దొంతరలుగా పొదిగి పాటను పరవశించేలా అందిస్తారు.

పాటలోని చిలిపి వలపు తొందరలు, పాత్ర మనోభావాలు, హృదయ నాట్యాలు, పరవశాలు అన్నీ పుష్కలంగా తన గళంలో పలికి కొత్తశోభతో అలరించేలా చేశారు సుశీల. పైరు పాట పాడటం, నెమలి నాట్యం ఆడటం, పూలు పరీమళం చల్లి లాలించడం అన్నీ మృదు మంజులగానంలా ఆ గొంతులో నినదించాయి. పాట వింటున్న శ్రోతల మదిలో అవే భావాలు కలిగి హృదయం ఆనందానికి లోనౌతుంది. అందుకే తెలుగువారికి సుశీల గాత్రం ఒక వరం. ఆమె గాత్రంలో తెలుగుపదాలన్నీ సుమదళ వికసిత పరీమళం. తెలుగుజాతిలో మమేకమై ఇంటింట తన పాటతో ఒక సుస్వర మైత్రీ బంధం పెంచుకున్న సుశీలపాట గురించి ఎంత చెప్పినా కొంతే అవుతుంది. ఆ ఆనందం పంచుకోవటం, పెంచుకోవటం అనేది నిరంతరం సాగుతూ మరికొన్ని తరాలకు కొనసాగుతుందనటంలో సందేహం లేదు.

# డాక్టర్ ఆనంద్ (1966)

❖ దేవులపల్లి ❖ కె.వి.మహాదేవన్

నీలమోహనా రా రా...
నిన్ను పిలిచె నెమలి నెరజాణ ॥నీల॥
జారు వలపు జడివాన కురిసెరా
జాజిలత మేను తడిసెరా ॥జారు॥
లతలాగే నా మనసు తడిసెరా ॥నీల॥

బృందం : ఏలాగే మతిమాలి
ఏడే నీ వనమాలి ॥ఏలాగే॥
అతడేనేమో అనుకున్నానే
అంత దవుల శ్రావణ మేఘముల గనీ ॥అతడే॥

బృందం : ప్రతి మబ్బూ ప్రభువైతే
ప్రతి కొమ్మా మురళైతే
ఏలాగే ॥ఏలాగే॥

ఆ... ఆ... ఆ... ఆ..
సారెకు దాగెద వేమీ?
నీ రూపము దాచి దాచి
ఊరించుటకా స్వామీ?
నీ కన్నులతోడు నీ కలికి నవ్వుల తోడు
నీ కోసం ఎంత వేగిపోయానో కృష్ణా, కృష్ణా, కృష్ణా
॥సారెకు॥

బృందం : అటు.. అటు...ఇటు.....ఇటు
ఆ పొగడకొమ్మ వైపు
ఈ మొగలి గుబురు వైపు
కార్తిక రాతిరిలో కటిమబ్బుంటుందా
నీలిమేఘమాకాశము విడిచి నేల నడుస్తుందా?॥కార్తిక॥
నడిచే మబ్బులకు నవ్వే పెదవుందా?
నవ్వే పెదవులకు మువ్వల మురళుందా?

**పెదవి నందితే పేద వెదుళ్లు – కదలి పాడుతాయా?**
**నడిచే మబ్బులకు నవ్వే పెదవులు**
**నవ్వే పెదవులకు మువ్వల వేణువులు!**



కొన్ని పాటలు వినగానే హృదయానికి హత్తుకుంటాయి. కానీ యీ పాట సాహిత్యం వింటున్నా, చదువుతున్నా కూడా మనసు పరవశించి పోతుంది. నీలమోహనుడిని చూడగానే నీలిరంగు నెమలి నెరజాణ అయిపోవడం అనే భావన ఎంత రమణీయం! కార్తికరాత్రులలో నల్లమబ్బులుంటాయా? నీలిమేఘం ఆకాశం విడిచి నేల మీద నడుస్తుందా? నవ్వే పెదవులకు మువ్వల మురళి ఉంటుందా? పేద వెదురులు కదలి పాడుతాయా?..... ఇలా అన్నీ వింతైన భావచిత్రాలు యీ పాటలో ఎన్నో కన్పిస్తాయి. ఇవన్నీ భావకవితాచక్రవర్తి దేవులపల్లి పదకవితా వైభవానికి 'మెచ్చు' తునకలు.

మధురప్రణయిని రాధ తన గోపికలతో, పిలుస్తున్న జారువలపుల జాజిలతల జడివాన యీ పాట.

అచ్చతెలుగు నుడికారానికి, స్వచ్ఛమైన స్వరార్చన అందించింది కె.వి.మహాదేవన్.



మొదట ఈ చిత్రానికి సంగీత దర్శకుడు టి.చలపతిరావు. ఈ చిత్రంలో ఆత్రేయ రాసిన ఒకపాట పల్లవి ట్యూన్ కట్టడానికి పనికి రాదన్నారు చలపతిరావు. "మూగమనసులు" ప్రభావంతో ఆ సమయంలో కె.వి.మహాదేవన్ హవా నడుస్తోన్న అప్పట్లో, యీ చిత్ర దర్శకుడు (వి.మధుసూదనరావు) చలపతిరావును సంగీతదర్శకుడుగా నియమించుకున్నా, పై సాకుతో తమ్మారెడ్డి కృష్ణమూర్తి (నిర్మాత) అతని స్థానంలో మహాదేవన్‌ను తీసుకున్నారు. 'మామ' దేవులపల్లి రాసిచ్చిన పల్లవికే వరస కట్టారు.

కె.వి.మహాదేవన్ – కృష్ణశాస్త్రిల కాంబినేషన్ ప్రారంభమైందీ చిత్రంతోనే. ఈపాటలో దేవులపల్లి రచన ఎంత రమ్యంగా ఉందో, వరసా అంతే సొగసుగా సమకూర్చారు మహాదేవన్. సుశీల బృందం పాడటం, అభినేత్రి కాంచన నృత్యం వాటికి తగిన అందాలే.

అప్పట్లో యీ చిత్రం పరాజయం పాలైనా, యీ పాట ఈనాటికీ వసివాడక రేడియోల్లోనో, టీ.వీ. ఛానల్సులోనో విన్పిస్తూనే ఉన్న దివ్యపారిజాతం.

# డాక్టర్ ఆనంద్ (1966)

❖ ఆత్రేయ ❖ కె.వి.మహాదేవన్

పెరుగుతున్నది హృదయమూ
తరుగుతున్నది ప్రాయమూ
నడుమ నలిగే నన్ను చూచి
నవ్వుతున్నదీ అందము ॥పెరుగుతున్నది॥

పెరుగుతున్నది హృదయమూ...
మాపు వచ్చినా మల్లె విచ్చినా
మనసు కెందుకో దిగులు
ఏ మావి పూచినా తావి వీచినా
మరులు గుండెలో రగులు ॥మాపు॥ ॥పెరుగుతున్నది॥

పెరుగుతున్నది హృదయమూ...
వానకురిసినా వరద పొంగినా
వల్లమాలిన గుబులు
ఏ జంట చూచినా జాము జామునా
కంటి నిండుగా కలలు ॥వాన॥

పువ్వుపుట్టగానే పరిమళిస్తుందనేది పాతమాటే. కొత్తమాట – పల్లవి వినగానే మంచి పాటైతే ఉల్లం పల్లవిస్తుందని. కొన్ని పాటలలో పల్లవి భేషుగ్గా ఉంటుంది. మరి కొన్నింటిలో ఒకటో రెండో చరణాలు బాగుంటాయి. అన్ని అంగాలూ బాగా ఉండే పాటలు ఎంతో అరుదు. అలా అన్ని చరణాలూ, పల్లవి ఒకదానికొకటి తీసిపోక పోటీపడినట్లుండే పాటలలో ఇదొకటి.

ఆత్రేయ పాటలు చాలామందికి విన్నవెంటనే చెవికెక్కక పోవడానికి కారణం – అవి కథతో మరీ పెనవేసుకుని ఉండడమే. సినిమాలలో ఇది ఎంతో హృద్యంగా ఉండడానికి కారణమైన పై రచనావిధానం విడిగా వినడానికి కొంత నిస్సారంగా ఉంటుందని చెప్పవచ్చును. “మూగమనసులు” చిత్రంలో వలే ఆ సన్నివేశమూ అంత అందమైందీ, మనసులో దాచుకోదగిందీ అయితే తప్ప. ఆత్రేయపాటలు కేవలం పాటలుగా అంటే గేయాలుగా వాటికవే నిలబడకపోవడానికి మరొకకారణం అవి మాత్రాఛందస్సుని



ఆశ్రయించక పోవడం. రచన మరీ వచనధోరణిలో ఉండడం. కానీ ఎలాంటి శషభిషలు దృష్టిలో పెట్టుకోకుండా కేవలం అందమైన పాటను రాయాలని కలం పడితే ఆత్రేయ నుండి ఎంతటి విశిష్టగీతం వెలువడుతుందో నిరూపిస్తుంది యీ పాట.

ఈ చిత్రానికి మొదటి సంగీతదర్శకుడు టి.చలపతిరావు. ఆత్రేయ రాసిన యీ పాటపల్లవి చూసి, కాస్తకంటే ఎక్కువే సాహిత్య పరిజ్ఞానం కలిగిన చలపతిరావు 'హార్ట్ ఎన్లార్జయ్యిందని' పల్లవేమిటి అన్నారు. చివరికి చిలికి చిలికి గాలివానై "నేనుకావాలో ఆత్రేయ కావాలో" తేల్చుకోండని చలపతిరావనగా, నిర్మాతలూ, దర్శకుడూ ( వీరందరూ అంతకు ముందే మహాదేవన్ గాలి ముమ్మరం గావడం ఒక కంట గమనిస్తూ ఉన్నవారే) ఇదే వీలని చలపతిరావును తొలగించి ఆ మహాదేవన్‌ను పిలిపించుకున్నారు. దీనికే ఆయన వరసకట్టడం జరిగింది. పాటగా చదవబడక భావాన్ని మాత్రం ఒప్పించే ఎన్నో ఆత్రేయ రచనలకు మహాదేవన్ పాట రూపమివ్వడమే గాక, ప్రజలతో ఔననిపించారు కూడా.

మరొక్కవిషయం: మహాదేవన్ ఆ మంచి పాటలు చేస్తున్నప్పుడతనికి తెలుగు ఒక్కముక్కరాదు. ప్రతిదీ, మాట, దాని అర్థం, ఆ రెండింటి మధ్యా దాగిన భావం, చెప్పించుకుని, జీర్ణించుకొని, మననం చేసుకొని, మధనపడి సృష్టించిన సుమధుర స్వరవాహినులివి.

సుశీల పాడటంతో మరింత అందగించిన పాటల్లో ఇదొకటి. కవి ప్రకటించిన భావాలను వరసా వాద్యగోష్ఠీ వెలిగించగా ఆ వెలుగులకామె కంఠం అద్దం పట్టింది. తెరపై యీ పాటకు ఆంగికం లేకుండా (వీల్‌చైర్‌కి పరిమితమై) కాంచన జోడించిన సాత్త్వికాభినయమూ మలయానిల లాలనగా తేలివచ్చిన శ్రీగంధ సుగంధం!

# ఆస్తిపరులు (1966)

❖ కొసరాజు ❖ కె.వి.మహాదేవన్

సోగ్గాడే చిన్నినాయనా–ఒక్క పిట్టనైన కొట్టలేదు సోగ్గాడూ ॥సోగ్గాడే॥
కట్టె తుపాకెత్తుకొని కట్టమీద నడుస్తూంటే
కాలుజారి పడ్డాడె సోగ్గాడూ ॥కట్టె॥
పగటివేషగాడల్లె పల్లెటూళ్లొ తిరుగుతుంటే కుక్కపిల్ల భౌ అంది
పడుచుపిల్ల ఫక్కుమంది ॥సోగ్గాడే॥
కళ్లజోడు ఏసుకోని, గళ్లకోటు తొడుక్కొని ॥కళ్ల॥
పిల్లగాలికొచ్చాడే సోగ్గాడూ ॥గళ్ల॥
చిట్టివలస వాగు కాడ పిట్ట తుర్రుమంటేను ॥చిట్టి॥
బిక్కమొగమేశాడు – చుక్కలెంక చూశాడు ॥బిక్క॥ ॥సోగ్గాడే॥
మూతిమీసం గొరుక్కోని – బోసి మొకం పెట్టుకొని
యాటకోసం వచ్చాడే సోగ్గాడూ ॥మూతి॥
బుల్లిదొర వచ్చెనని కుక్కపిల్ల ఎక్కిరిస్తే
ఎట్టిమొగం వేశాడు ఒయ్ బిక్కి బిక్కి చూశాడు ॥సోగ్గాడే॥



కొసరాజు లేకపోతే తెలుగుసినిమా పాటలకు కొన్ని మొదళ్లు దొరికేవి కావు. మరికొన్ని కొసలు కూడా దొరికేవి కావు. తెలుగుపాట ఆయనొచ్చాక ముద్దబంతిపూలు కట్టింది. మొగలిరేకు జడను చుట్టింది. పల్లె దేశమైన యీ దేశంలో పల్లెదనం లేని సినిమాలు రావడానికి వీల్లేని ఆ రోజుల్లో పల్లెపాటకు కేరాఫ్ అడ్రస్‌గా కొసరాజు అమరిపోయారు.




ఈ పాటలోని పదాలన్నీ పల్లెవాసులకు తెలుసు. పల్లెటూళ్లలో పగటివేషగాళ్లు, పిట్టలదొరలు, జీవనం కోసం రకరకాల ప్రయత్నాలు చేయడం తెలిసిన విషయమే. వీటన్నిటినీ పాటలో పొదిగి జనరంజకం చేశారు కొసరాజు.

వచనానికి, వాడుకపదాలకు అతిచక్కగా స్వరబాణీలు అందించగలిగే 'మామ' ఈపాటను చాలా హుషారుగా స్వరపరచారు. చిలిపితనంతో రెచ్చగొట్టడం, కవ్వించడం, ఉడికించడం ఇలా నానారకాలుగా ప్రతినాయకుణ్ణి ఎత్తిపొడుస్తూ ... ఎన్నెన్నో వయ్యారాలు, సొంపులు, సోయగాలూ ఉన్న యీ పాట సుశీల గాత్రంలో వినిపించగానే తెలుగువారంతా ఆ పాటను, సుశీలను తమవిగా హృదయంలో పెట్టుకున్నారు. ఈ పాటలో గేయకర్త రాసిన ఉడికింపు పదాలను ఎంతో చక్కగా, వైవిధ్యభరితంగా సుశీలగాత్రంలో మనకు వినిపిస్తాయి. రాగబద్ధంగా, శ్రుతిలయ సమన్వితంగా సంప్రదాయకీర్తనలు పాడిన ఈ గాత్రమేనా ఇలాంటి జానపదాలను పాడి రసభరితం చేసేది? అని అన్పించి ఆమెకు జేజేలు పలుకుతారందరూ... ఈ కొంటెకోణంగి పాట బాక్సాఫీసువద్ద కనకవర్షం కురిపించింది. పాట పుట్టి యాభైఏళ్లు దాటినా ఇప్పటికీ యువతరం-వేదికలమీద, టీ.వీ. ఛానల్స్‌లోనూ పాడుకునే పాటగా ప్రజాదరణ పొందింది. ఈపాటలో పడుచుపిల్ల ఫక్కుమంది అని సుశీల ఫక్కున నవ్వటం మాత్రం...పాడేవాళ్లకు కవ్వింపుగానే, ఇబ్బందిగానే మిగిలింది. ఇది సుశీల ప్రతిభకు తార్కాణంగా చెప్పవచ్చు.

వాణిశ్రీ, తర్వాత్తర్వాత కథానాయకిగా దూసుకుపోవడానికి పునాదులు వేసిందీపాట.

అక్కినేని నాగార్జున యీ పాట పల్లవినే "సోగ్గాడే చిన్నినాయన" (2016) పేరుతో సినిమాగా నిర్మించి భారీవిజయం సాధించడం అందరికీ తెలిసిందే.

# శ్రీకృష్ణతులాభారం (1966)

❖ స్థానం నరసింహారావు ❖ పెండ్యాల

మీరజాలగలడా.....
మీరజాలగలడా నా యానతి
వ్రతవిధాన మహిమన్ సత్యాపతి ॥మీర॥ (2సార్లు)

నటన సూత్రధారీ మురారి
ఎటుల దాటగలడో నా యానతి
వ్రతవిధాన మహిమన్ సత్యాపతి ॥నటన॥ ॥మీర॥

సుధా ప్రణయజలధిన్ వైదర్భికి
ఈద తావు గలదే నాతోనిక
వాదులాడ గలడా సత్యాపతి ॥సుధా॥ ॥మీర॥
మధుర మధుర మురళీగాన రసాస్వాదనమున... ఆ.. ॥మధుర॥

అధర సుధారస మదినే గ్రోలగ ॥అధర॥ ॥మీర॥



స్థానం నరసింహారావు

ఈ పాట రంగస్థలంపై స్థానం నరసింహారావును సత్యభామ పాత్రలో చిరస్థాయిగా నిలబెట్టిన పాట. ఈపాటను ఆయన రంగస్థలంమీద తనపాత్రకు తాను పాడుకుంటూ వచ్చారే తప్ప మొదట్లో రికార్డుగా ఇవ్వలేదు. దీన్ని స్థానం కంటే ముందే కపిలవాయి రామనాథశాస్త్రి రికార్డిచ్చారు.

ఈ పాటనే ''శ్రీకృష్ణతులాభారం'' (1955) చిత్రంలో ఎస్.వరలక్ష్మి రంగస్థలంపై టి.జి.కమలాదేవి గానాభినయం చేసి విశేషంగా పేరు తెచ్చుకున్నారు. డా॥డి.రామానాయుడు 'సురేష్ ప్రొడక్షన్సు' తరపున తీసిన తొలి పౌరాణిక చిత్రం " శ్రీకృష్ణతులాభారం". సత్యభామ–జమున, గాయని – సుశీల, స్వరకర్త పెండ్యాల.

పెండ్యాల నాటకరంగం నుండి వచ్చినవారు గనుక, రంగస్థలం మీద యీ పాటను ఆనాటి మహాగాయకులు ఎలా పాడారో తెలిసినవారు. అంచేత అంత పాపులర్ అయిన బాణీనే కొద్దిమార్పులతో స్వరపరచి సుశీలచే పాడించారు. ఎలాంటిపాటైనా చాలా అవలీలగా పాడేసే సుశీల యీ పాటకు చాలా శ్రమించారు. సుమారు పదమూడు టేకులు తీసుకున్నారు. అంత కష్టపడ్డారు గనుకే ఈవాళ చరిత్రలో నిలబడిపోయారు. ఈ పాత్రపోషించిన జమున తెలుగుసినిమా సత్యభామగా ఆనాటినుండీ ఈనాటివరకూ పోటీలేకుండా కొనసాగుతున్నారు. జమునకు 'సత్యభామ' పేరు వింటేనే వీరావేశమొచ్చేస్తుంది. అందుకు ప్రేరణ యీ పాటే!

మానవజన్మ పొందడం మహోత్కృష్టం. అందునా లలితకళల జ్ఞానం మరీ కష్టం. అందు సంగీతవిద్య తెలియడం ఇంకా కష్టం. అదీగాక అందరినీ రంజింపజేసే మంత్రముగ్ధ సమ్మోహితగాత్రం రావటం మరింత క్లిష్టం. ఇన్నింటిని దాటి విజయనగరం సంగీతకళాశాలలో సంగీతవిద్యనభ్యసించి, దక్షిణభారతదేశ గానకోకిలగా పేరొందిన సుశీల సుమగాత్రం గురించి ఎంత చెప్పినా అది కొంతే ...ఏదో కొరతే...

వీరసాత్రాజితి మనస్తత్వం, గుణగణాలు చదవగా విన్నాం. మరి సత్యభామకు సంగీతం వచ్చిన దాఖలాలు ఎక్కడాలేవు. మరి ఆ పాత్ర పాట పాడాల్సివస్తే ద్వాపరయుగం నుంచి కలియుగ ప్రథమపాదం వరకు ఆగాల్సివచ్చింది. పాట పాడటం కంటే ముందు స్వరకర్త పెండ్యాల నాగేశ్వరరావు గురించి రెండు మాటలు "ఆయన సంగీతదర్శకత్వంలో పాటపాడడం చక్కటి అవకాశం... ఆయన స్వరపరచినట్లు పాడి వారిని సంతోషపెట్టడం అసాధ్యం.'' రెండింటిని అవలీలగా అందుకున్న అదృష్టం కొంతమంది గాయనీగాయకులకు లభించింది. వారంతా అదృష్టవంతులే". సుశీల తొలిపాట అవకాశం పెండ్యాల ద్వారా జరగటం శుభయోగం,..

'మీరజాలగలడా...' అనే పదాలు వివిధ రీతులలో సుశీల పలికిన తీరు,' మధుర మధుర మురళీగాన రసాస్వాదనమునా..' తర్వాత వచ్చే మనోధర్మవిన్యాసం అటు పెండ్యాల, ఇటు సుశీల చేసిన అద్భుతంగా చెప్పుకోవచ్చు. 'నటన సూత్రధారీ... మురారీ...' పదాలలోని ఎత్తుగడ, స్వరమాధుర్యం పాత్ర ఔచిత్యాన్ని, ఔన్నత్యాన్ని ప్రభావితం చేసేలా ఉంటాయి.

వేదికమీద పాడే గాయనీమణులకు యీ పాట 'అసిధారావ్రతం'. సుశీలస్థాయిలో ప్రయత్నించడమే గానీ నూటికినూరుశాతం కృతకృత్యులవటం గగనకుసుమమే. అందుకే ఆమెపాడిన పాటలు కొన్ని అనితరసాధ్యం.

ఈ పాటను 'బిలహరి' రాగంలో స్వరపరచారు మదన్‌మోహన్ ఆఫ్ సౌత్ పెండ్యాల.



# రంగులరాట్నం (1967)


❖ దాశరథి ❖ ఎస్.రాజేశ్వరరావు, బి.గోపాలం

కనరానిదేవుడే కనిపించినాడే
కనిపించి అంతలో కన్ను మరుగాయె
కన్నుమరుగాయె
కనరానిదేవుడే కనిపించినాడే
అలనీలి గగనాన వెలిగె నీరూపు ॥అల॥

ఆనందభాష్పాల మునిగె నా చూపు
మనసార నిను చూడలేనైతి స్వామి
కరుణించి ఒకసారి కనిపించవేమి?
కోరస్ : ఆఆ.. ఆ... ఆ...
అందాలకన్నయ్య కనిపించగానే
బృందావనమ్మెల్ల పులకించిపోయె
యమునమ్మ కెరటాల నెలరాజు నవ్వె
నవ్వులో రాధమ్మ స్నానాలు చేసె
వలపుతో పెనవేయు పారిజాతమునై ॥వలపు॥

ఎదమీద నిదురించు అడియాసలేదు
గడ్డిలో విరబూయు కన్నె కుసుమమునై
నీచరణకమలాల నలిగిపోనీవా?
కోరస్ : ఆఆ... ఆఆ... ॥కనరాని॥

చిత్రకథానుసారం కథానాయిక తన స్నేహితురాలి పుట్టినరోజు వేడుక సందర్భంలో ఆలపించినట్లుగా చిత్రీకరింపబడ్డ యీ గీతంలో, సాహిత్యపరంగా చెప్పుకోవాలంటే మధురభక్తి భావసౌకుమార్యం వెల్లివిరిసింది. రాధామాధవతత్త్వం మధురభక్తికి పరాకాష్ఠ. ప్రియుని భావనతోనే భావప్రాప్తిని అందుకునే ఒక అపురూపమైన సున్నిత సంస్కారం యీ మధురభక్తిలో దాగి ఉంటుంది. కనులముందు కనిపించిన ఆరాధనీయమూర్తిని కూడా చూడలేక ఆనందభాష్పాలు, పలుకరించాలని తపనపడే ప్రియుడు కన్పించగానే మూగబోయే ముగ్ధభావాలు, ఏవేవో ఊహలు చెలరేగినా, వలచినవారు ఎదురుపడినప్పుడు




ఒక తన్మయీ భావానికిలోనై గడ్డిలో విరిసిన ఒక కన్నెకుసుమంలా ఆ చరణకమలాల మీద వాలిపోవడం ఈతత్త్వంలోని విచిత్ర తత్త్వం. కనరాని ప్రియుని కమనీయ దరహాసం, యమునాతరంగిణి అధరాలమీద ప్రతిఫలించడం సృష్టిలో తన ఆరాధ్యదైవాన్ని దర్శించడానికి ప్రతీకగా నిలుస్తుంది.

గగనవీథుల్లోంచి వచ్చిన గాంధర్వగాన పరీమళవీచికలకు ప్రకృతి పులకరించి కరిగిపోయి ఏడుపాయలుగా విడిపోయి, సరిగమపదని స్వరాలకు దాసోహమై పోయాయి. మంత్రమేదో చల్లి మనసుని తనవైపు మళ్లించుకుని ప్రకృతికాంత గాత్రాన్ని సవరించిన ఆ పాటకు చిరునామా సుశీల.

దాశరథి కలంనుండి జాలువారిన యీ మధురభక్తి రసగీతికలలోని పదాలను, స్వరాలను పరిశీలిస్తే... ఎంత హృదయనివేదన, ఆవేదనలో కనిపించిన దైవం కనుమరుగవ్వటం.... ఎంత లలితభావం. అక్షరాంజలిగా దైవాన్ని ఆవిష్కరించటం అంటే ఇదేనేమో? .. యమునానదీ కెరటాలలో నెలరాజు నవ్వటం... ఆ నవ్వులో రాధమ్మ స్నానాలు చేయటం వంటి భావాలను మదిలో దర్శించటం, గడ్డిలో విరబూసిన కన్నెకుసుమం అంటూ పాట చరణాలపై కవి ఒదిగిపోవటం ఒక చక్కని రసానుభూతి.

శుభకరమైన ఏకాక్షర రాగం 'శ్రీ'రాగం. అన్నివేళలా హాయిగా పాడదగ్గ రాగం. పదాలన్నింటినీ పారిజాతసుమాల పరీమళంతో పల్కి పాత్ర మనోధర్మానికి స్వరకర్తలు, గాయని చెరోపక్క నిలబడి పాటను అజరామరం చేశారు. కొన్నిపాటలు కొంతమంది కోసం పుట్టి వాటి సార్థకతను నిలుపుకుంటాయి. అలాంటి కోవకు చెందిందే యీ కుసుమ కోమల లలితపల్లవుల చందన చరణాల గీతం.

# సాక్షి (1967)

❖ ఆరుద్ర ❖ కె.వి.మహాదేవన్

అమ్మకడుపు చల్లగా
అత్తకడుపు చల్లగా
బతకరా బతకరా పచ్చగా
నీకు నేనుంటా వేయేళ్లు తోడుగా నీడగా ॥అమ్మ॥

నా మెడలో తాళిబొట్టు కట్టరా
నా నుదుట నిలువుబొట్టు పెట్టరా ॥నామెడలో॥
నీ పెదవిమీద సిరునవ్వు సెరగదురా
నా సిగపూవుల రేకైనా వాడదురా వాడదురా
బతకరా బతకరా పచ్చగా
చల్లని అయిరేణికి మొక్కరా
సన్నికల్లుమీద కాలు తొక్కరా ॥చల్లని॥
చల్లనేళ కంటనీరు వద్దురా
నా నల్లపూసలే నీకు రక్షరా రక్షరా
బతకరా బతకరా పచ్చగా
నా కొంగు నీ చెంగూ ముడివేయరా
నాచేయి నీచేయి కలపరా ॥నాకొంగు॥
ఏడడుగులు నాతో నడవరా
ఆ యముడైనా మనమద్దికి రాడురా రాడురా
బతకరా బతకరా పచ్చగా ॥అమ్మ॥



ఈపాట కలకాలం గుర్తుండిపోయే మంచిపాట. తేటతెలుగుమాటలతో, చెవికి ఇంపుగా తోచే అంత్యప్రాసలతో, హృదయాన్ని ద్రవింపజేసే విధంగా ఉంటుందీపాట. అర్భకుడైన మగడికి, ఒక

నవవధువు ధైర్యంచెప్పి, ప్రాణభయం పోగొట్టే యీ గీతం, "సాక్షి" చిత్రానికి ఓ కలికితురాయి. ఆరుద్ర మొదటినుండీ కూడా పెళ్లిపాటల స్పెషలిస్టు. ఆయన సినీ ప్రస్థానం 'చిలుకరాజా నీ పెళ్లెప్పుడయ్యా...' (బీదలపాట్లు, 1950) అని పెళ్లిప్రస్తావన గల పాటతోనే ప్రారంభమైంది. ఆ తర్వాత 'పందిట్లో పెళ్లవుతున్నది' (ప్రేమలేఖలు,1953) పాట అప్పట్లో ఆంధ్రదేశాన్ని ఓ ఊపు ఊపేసింది. ఇక ఈ పాట, యీ చిత్రాన్ని ప్రజలు ఇంకా గుర్తుపెట్టుకునేలా చేసింది. ఆ తర్వాత మళ్లీ బాపు రమణలకే 'శ్రీరస్తు శుభమస్తు' (పెళ్లిపుస్తకం, 1991, బాలు, సుశీల) పాట రాశారు ఆరుద్ర. ఈపాటకుగాను ఆయన, ఉత్తమగీత రచయితగా రాష్ట్రప్రభుత్వం నుండి నంది అవార్డునందుకున్నారు.

ఇక "సాక్షి" పాటకొస్తే – తాళిబొట్టు, నిలువుబొట్టు, అయిరేణి, సన్నికల్లు, నల్లపూసలు, కొంగుముడి, సప్తపది... ఇలా అచ్చతెనుగు వివాహ సంప్రదాయాలన్నీ ఇందులో చోటుచేసుకున్నాయి. పెళ్లిపాటలు రాస్తే ఆరుద్రే రాయాలి. నిజానికి నిజజీవితంలో ఇవేవీ లేకుండా ప్రసిద్ధ నవలారచయిత్రి కె.రామలక్ష్మిని ఆదర్శవివాహం చేసుకున్నారు ఆరుద్ర.

ఈపాటను మధ్యమావతి రాగంలో కె.వి.మహాదేవన్ వీనులవిందుగా స్వరపరిచారు. మధ్యమస్వరాలతో, గ్రహబేధాలతో పాటల్ని స్వరపరచటంలో 'మామ' సిద్ధహస్తులు. ఈపెళ్లిపాటను హృదయం ద్రవించేలా పాడిన ఘనత సుశీలదేనని సగర్వంగా చెప్పుకోవచ్చు. ప్రతిపదం ఆమె హృదయతంత్రుల నుండి గళసీమకు పయనించి శ్రావ్యంగా వినిపించాయి యీ పాటలో.

కృష్ణ, విజయనిర్మల జంటగా నటించిన తొలిచిత్రం "సాక్షి". ఈ చిత్రం షూటింగు యీ పాటతోనే ప్రారంభమైంది. నిజజీవితంలో వారిరువురి ప్రేమవివాహానికి పునాదివేసిన పాట ఇదే. అప్పటికి కొత్తదర్శకుడైనప్పటికీ ప్రతిషాట్‌ను ఎంతో డిటెయిల్డ్‌గా, శాస్త్రోక్తంగా యీ పెళ్లిపాట దృశ్యాలు తీశారు బాపు. ఆ దృశ్యం చిత్రీకరించే సందర్భంలో రాజబాబు, విజయనిర్మలతో సీరియస్‌గా– "ఇది మీసాలకృష్ణుడి (పులిదిండి) ఆలయం. చాలా పవర్‌ఫుల్ – ఇక్కడ కృష్ణకు, మీకు పెళ్లిసీన్ తీస్తున్నారు. లైఫ్‌లో కూడా మీ ఇద్దరికీ పెళ్లి జరిగితీరుతుంది!" అన్నారు. ఆ 'పుణ్యమూర్తి' మాట నిజమైంది. 24.03.1969 న వారిద్దరూ తిరుపతిలో దంపతులయ్యారు. మళ్లీ పులిదిండిలో మీసాలకృష్ణుడి సన్నిధిలో పూలదండలు మార్చుకున్నారు.

# వసంతసేన (1967)

❖ దాశరథి ❖ ఎస్.రాజేశ్వరరావు

ఏమివ్వగలదానరా? నాస్వామీ?
నా తనువు నామనసు మునుపే ఇచ్చితిరా ॥ఇంకేమివ్వ॥

హంసల నోడించు వయ్యారి నడలు
పువ్వుల కవ్వించు ముత్యాలనగవు
తలపులు చిగురించు వలపులు చిందించు
తీయని హృదయము మునుపే ఇచ్చితిరా ॥ఇంకేమివ్వ॥

కలువల మరపించు నీలాల కనులు
మధువులు కురిపించు మధురాధరములు
అద్దాల కెనయైన ముద్దుల చెక్కిళ్లు
అందాల ఈమేను మునుపే ఇచ్చితిరా ॥ఇంకేమివ్వ॥



శాస్త్రీయ ఫణితులలోనూ, జానపద సరళిలోనూ, పాశ్చాత్య ధోరణుల లోనూ, ఆటవిక మార్గాలలోను అందమైన గీతాలనెన్నో వినిపించిన నిష్ణాత రాజేశ్వరరావు. చిత్రం విజయవంతం కాకపోవడంతో గణనకు రాలేదు కాని "వసంతసేన" చిత్రంలో చక్కనిపాటలు ఒక చేతివ్రేళ్లకు సరిపడేవి ఉన్నాయి.

రాజేశ్వరరావుకు ప్రీతిపాత్రమైన రాగం కాపీ. అసలీరాగంలో పలికినట్లు శృంగార లావణ్యాలు మరే రాగానా పలకవేమో? "మల్లీశ్వరి" లోని 'పిలచిన బిగువటరా', "చరణదాసి"లోని 'మరచితివో మనోరమణా' ... ఇవన్నీ రాజేశ్వరరావు కృతులూ, ఆ రాగాశ్రితాలూ. త్యాగరాజు కీర్తన 'నీవల్ల గుణదోషమేమి', పూచ్చి శ్రీనివాసయ్యంగార్




రాసిన జావళీ 'సరసాములాడే టందుకు' పై పాటల ప్రాణదాతలు. వీటిలో ఉన్న రమ్య ప్రయోగాలన్నింటినీ రసమాలగా అమర్చిన రాజేశ్వరరావు నైపుణ్యమూ కొనియాడదగిందే.

"వసంతసేన"లోని ఒకే జావళీ 'ఏమివ్వగలదానరా'... పై పాటలంత చక్కనిదీ రచనలో, రసపోషణలో లోపం రాకుండా, శృంగారం హద్దుమీరకుండా కవిజేసిన కత్తిమీదిసాము యీ పాటలో విదితమౌతుంది. ఈ పాటలో ఒక వంక బేలతనం అన్నీ ఇచ్చితిని గదా అన్నది, ఒక ప్రక్క జాణతనం ఇంత ఇచ్చినా నీకు చాలదా? అన్నది రెండూ ధ్వనిస్తున్నాయి.

ఇందులో 'వలపులు చిందించు' అన్న మాటతో సరిచూస్తే 'తలపులు చిగురింప జేయు' అనే అర్థం, లేకపోతే 'తలపులు చిగుర్చుతున్న' (నా హృదయం) అనే అర్థం గమనించదగ్గవి. తర్వాత రెండోచరణంలో కూడా ఒక విశేష ప్రయోగముంది. ఇక్కడ 'మేను' అన్నదానికి శరీరం అని చెప్పుకుంటే పునరుక్తి దోషం వాటిల్లుతుంది. ఆదినే అనుపల్లవిలోనే 'నా తనువూ' అన్న ప్రయోగం ఉంది కదా! కాబట్టి ఇక్కడ మేనంటే జన్మనే చెప్పుకోవాలి. అర్థాలేవిధమైనా అన్నిటా అందమైన పాట.

ఈ పాటను సుశీల పాడినతీరు ఏవేళ విన్నా, ఎప్పుడువిన్నా వెచ్చని సముద్ర సైకతస్థలీ, చల్లగా వీచేగాలీ, దూరం దూరంగానే ఉంటూ స్వంతం చేసుకున్న స్నేహసంపదా, మనోప్రాంగణంలో తటిల్లతవోలె మెరిసి లోలోన మురిపాలు ప్రవహింపజేస్తాయి. అన్నివిధాల ఉత్తమమైన పాటలతో జీవితంలోని మధురానుభవాలు పెనవేసుకొనిపోవడం మన అదృష్టం.

# భక్త ప్రహ్లాద (1967)

❖ సీనియర్ సముద్రాల ❖ ఎస్.రాజేశ్వరరావు

జీవము నీవేకదా! దేవా! జీవము నీవేకదా!
బ్రోచే భారము నీదేకదా! నా భారము నీదేకదా!
జనకుడు నీపై కినుక వహించీ నను వధియింపా మదినెంచే ॥జన॥
చంపేదెవరూ సమసేదెవరూ ॥చంపే॥
సర్వము నీవే కదా స్వామీ... ॥సర్వము॥
స్వామీ...
నిన్నే గానీ పరుల నెరుంగా
రావే వరదా! బ్రోవగ రావే వరదా! వరదా!
అని మొరలిడగా కరివిభు గాచిన ॥అని॥
స్వామివి నీవుండ భయమేలనయ్యా! ॥జీవము॥

హే ప్రభో! హే ప్రభో!
లక్ష్మీవల్లభ దీనశరణ్యా! ॥లక్ష్మీ॥
కరుణాభరణా! కమల లోచన ॥కరుణా॥
కన్నుల విందువు చేయగరావే ॥కన్నుల॥
ఆశ్రిత భవబంధ నిర్మూలనా! ॥ఆశ్రిత॥
లక్ష్మీవల్లభా... లక్ష్మీవల్లభా ॥జీవము॥

నిన్నే నమ్మి నీ పదయుగళీ, సన్నుతి జేసే భక్తావళికీ
మిన్నాగుల గన భయమదియేలా, పన్నగశయనా నారాయణా ॥జీవ॥
మదిలో వెలిలో చీకటిమాపీ ॥మదిలో॥
పథము జూపే పతితపావనా! ॥పథ॥ ॥జీవము॥
భవజలధినిబడి తేలగలేని ॥భవ॥
జీవుల బ్రోచే పరమపురుషా!
నను కాపాడీ నీ బిరుదమునూ ॥నను॥
నిలుపుకొంటివా శ్రితమందారా! ॥జీవము॥
విశ్వము నిండీ వెలిగే నీవే ॥విశ్వము॥
నాలో నుండీ నన్ను కావగా



విషమును ద్రావా వెఱువగ నేలా ॥విషము॥
విషధర శయనా విశ్వపాలనా! ॥జీవము॥

భగవంతుడు ఎంత కరుణా సముద్రుడో, భక్త సులభుడో అని తెలియాలంటే ప్రతి ఒక్కరికి ఒక్కోరకమైన అనుభూతి... ఆనందం.... తన్మయం... దీనికి భక్తి ఒక చక్కటి రాజమార్గం. హృదయాన్ని, బుద్ధిని, ఆత్మానుసంధానం చేస్తూనే 'అన్యథాశరణం నాస్తి, త్వమేవశరణం మమ' అనే ఏకాగ్రచిత్తధోరణి కావాలి, రావాలి. శ్రీమద్భాగవతంలోని మధుర ఘట్టం "ప్రహ్లాద చరిత్ర". పరమభక్తుడైన ఆ పసిబాలుణ్ణి పరంధాముడు ఎన్నో రీతులలో అనుగ్రహించడం మనకు తెలుసు. ఆ ప్రహ్లాదుని భక్తితత్పరత, నిశ్చల మనోనిగ్రహం, ఆర్తి, శరణాగతి... ఇవన్నీ కవుల కలాలలో, వ్యాఖ్యాతల వాక్కులలో, కళాకారుల ప్రతిభలలో అనేక విధాలుగా సంతరించుకుని మనకు సుపరిచితాలయ్యాయి. ఆ కోవలోకే వచ్చే నిర్మలభక్తి గీతమిది.

ఆరు చరణాలున్న ఆదినారాయణుడి ఆర్తత్రాణ పరిరక్షణాగీతంగా దీన్ని చెప్పుకోవచ్చు. తెలుగు సినిమాపాటను ఒక శిఖరస్థాయిలో పలికించిన సుశీల గాత్రమాధుర్యం... భాగవతరసామృతంతో సరిసమానంగా సరితూగ గల భక్తి, హృదయనివేదనలు అన్నీ యీ పాటలో జీవం పోసుకుని నేటికీ నిత్యనూతనంగా తళతళలాడుతుంటాయి.

సాహితీ సముద్రమధనం చేసి అమృతతుల్య పదాలను పొదిగిన సీనియర్ సముద్రాల, సంగీతసాగరంలోని సుస్వరసంపదను వెలికి తీసి దామోదరుడికి సమర్పించిన ఎస్.రాజేశ్వరరావు, ఆ అమృతభాండాన్ని తన గొంతులో సుమధురంగా పలికించిన గానకోకిల సుశీల చిరస్మరణీయులే, ప్రభాత వందనాలకు సమార్హులే. ఈ చిత్రంలోని మాటలు, పాటలు... ఈరెండింట్లో ఏవి గొప్పవని చెప్పాలంటే అదొక పెద్దపరిశోధనా గ్రంథమౌతుంది.

సముద్రాల భావనా పరిధులకు సుశీల గాత్ర ప్రాకారాల తీరాలు చక్కగా న్యాయం చేకూర్చిన పాట ఇది. ఇందులో 'రావే! వరదా! బ్రోవగ రావే! వరదా!వరదా!' అని సుశీల సాకీ పద్ధతిలో ఆలపించినపుడు గజేంద్రుని హృదయాన్ని, వేదనను పలకడంలో ఎంత రోమాంచిత దైన్యభక్తి ప్రకటన? చివరగా 'నీవు, భవసాగరంలోనుండి బయటపడలేని మమ్ము రక్షించి నీ బిరుదును నిలుపుకున్నావు, శ్రితమందారా!' అనే సంపూర్ణ కృతజ్ఞతాభావంతో గీతాన్ని ముగింపుచేసిన తీరులో 'భగవంతుణ్ణి' దర్శింపజేశారు సుశీల. తన అనుపమగాత్రంతో రాగమాలికను ఒక భక్త్యానురాగ గీతంగా అందించారామె.

# సుఖదుఃఖాలు (1968)

❖ దేవులపల్లి ❖ ఎస్.పి.కోదండపాణి

ఓ......ఓ.....ఓ....
ఇది మల్లెలవేళయనీ...
ఇది వెన్నెలమాసమని
తొందరపడి ఒక కోయిల
ముందే కూసిందీ!
విందులు చేసిందీ!
కసిరే ఎండలు కాల్చుననీ,
ముసిరేవానలు ముంచుననీ
ఇక కసిరే ఎండలు కాల్చునని
మరి ముసిరే వానలు ముంచునని
ఎరుగని కోయిల ఎగిరింది ॥ఎరుగని॥
విరిగిన రెక్కల ఒరిగింది!
నేలకు ఒరిగింది ॥ఇది॥
మరిగిపోయేది మానవ హృదయం
కరుణ కరిగేది చల్లనిదైవం! ॥మరిగి॥
వాడే లతకు ఎదురైవచ్చు
వాడని వసంతమాసం
వసివాడని కుసుమ విలాసం ॥ఇది॥
ద్వారానికి తారామణి హారం!
హారతి వెన్నెల కర్పూరం ॥ద్వారానికి॥
మోసం, ద్వేషం లేని సీమలో... ॥మోసం॥
మొగసాల నిలిచె, నీ మందారం ॥ఇది॥
ఓ...ఓ... ఓ...ఓ

ఇదొక పరిణితి పొందిన కవి భావన. భావనలన్నీ చాలా లోతుగా ఉంటాయి. పైకిమాత్రం ప్రతిపదం అర్థమైనట్లుంటుంది. ఆనందాన్నిస్తుంది. కారణం పదాలన్నీ ఒకదానికొకటి పోటీపడి మళ్లీ అర్థం కానట్లుంటాయి. పామర, పండిత శ్రోతలు ఎంతో




గొప్పగా మెచ్చుకుని పాడుకున్నా...మళ్లీ వినాలనే కోరిక అలాగే ఉండిపోతుంది. కథాంశానికి ఈపాట అన్వయించుకుంటే తప్ప పాట అర్థం కాదు. ఏది ఏమైనా యీ పాటలో తెలియని అందం, ఆకర్షణ, గొప్పదనం, సాహితీవిలువలు, అభినయ మధురిమలు, గాత్రసౌందర్యాలు పుష్కలంగా ఉన్నాయి. అందుకే ఈపాట పుట్టి యాభై వసంతాలు కావస్తున్నా కోయిల, ఎండలు, వానలు, లతలు, కుసుమాలు, కరుణ, దైవం ఉన్నంతకాలం తారమణిహారంలా నిల్చిపోతుంది.

ఏమాత్రం సాహిత్యంతో పరిచయమున్న నలుగురు ఒకచోట కలిసినా ఈపాటలోని 'ద్వారానికి తారామణిహారం! హారతి వెన్నెల కర్పూరం' గురించి తర్జనభర్జనలు చేస్తుంటారు.

దేవులపల్లి కృష్ణశాస్త్రి ఎన్నోపాటలు రాశారు. అందులో యెన్నిటినని యెన్నగలం. 'మనసునమల్లెలా', 'ఇది మల్లెలవేళా', 'వెన్నెలలా వేళా!' అన్నీ అపురూపాలైన అందాల ప్రోవులే. చలనచిత్రగీతాలకు స్థిరత్వాన్ని ప్రసాదించిన మహాకవులలో వారొకరు.

ఈపాటలో అర్థం కానిది పల్లవే – 'ఇది మల్లెల వేళయనీ, ఇది వెన్నెల మాసమనీ". నిజానికి మల్లెలకు కదా మాసం, వెన్నెలకు కదా వేళ? ఇదే మరొకరు రాస్తే, అసంబద్ధం అని అనుకోవచ్చు, కానీ కృష్ణశాస్త్రి రచనలో అటువంటి లొసుగులకు తావుండునా? అని సందేహం.

మనశాస్త్రం ప్రకారం సంవత్సరానికి ఋతువులు ఆరు. వసంత, గ్రీష్మ, వర్ష, శరత్, హేమంత, శిశిర ఋతువులు. ఇందులో శరదృతువు – ఆశ్వయుజ, కార్తిక మాసాలలో ఉంటుంది. ఈ ఋతువులో మంచి వెన్నెల కాస్తుంది. బురద ఇంకుతుంది. ఈ ఆశ్వయుజ, కార్తికమాసాలను వెన్నెల మాసాలంటారు. దీన్నిబట్టి కృష్ణశాస్త్రి రచించి ఉంటారని ఊహ. మల్లెలవేళ అంటే, మల్లెలు విరిసే వేళ అనే. వెన్నెల పండబారితే గానీ మల్లెమొగ్గలు విడవు కదా? కవి ఉద్దేశం ఇదే అయివుంటుంది.

అయితే కోదండపాణి నటభైరవి రాగంలో ఈపాటను స్వరపరచినా ఎందుకనో పాటలో పాశ్చాత్య రణగొణలు కొల్లలుగా ఉంటాయి. పాశ్చాత్యధోరణి వినిపించకూడదని కాదు, ఏ 'నైట్‌క్లబ్' పాటలోనో తప్పక వినిపించాలి. కానీ, ఇటువంటి పాటలో సుతరామూ

ఆ వాసన కనా వినా రాకూడదు. ఆనాటికి రేడియోపాటలు అలా సంకరశబ్ద స్ఫోరకాలుగా లేవు. ఈ ఔచిత్యాన్ని పాటించి ఉంటే, ఆ వరుసతోనే, యీ పాట ఇంకా అందంగా ఉండేది. ఏది ఏమైనా, ఈపాట గురించి ఏమైనా అనాల్సివస్తే, ఆ "సుఖదుఃఖాలు"లో సుఖాన్నిచ్చింది యీ పాటే.

ఇలాంటి భావప్రధానమైన పాటల్ని సుశీల ఎంత బాగా పాడుతారు అంటే, 'నీవుండేదా కొండపై'... పాడిన గాయనిలా అనే పోల్చుకోగలం. ఈ పాట ఆమెనోట బహుళప్రచారం పొందింది. ఏ సందర్భానికి ఎంచుకుని పాడాలో తెలీకపోయినా వర్ధమాన గాయనీమణులు అందరూ వేదికమీద పాడి బహుమతులు పొందినవారే. ఈ పాటలోని ఆలాపనలు, పదాల చివరలో స్వర నిభాయింపులు, ప్రతిపదం స్పష్టంగా, విలంబితంగా, తారాస్థాయిల్లో సంపూర్ణ మాధురీ మధురిమలను సంతరించుకుంది. ఇప్పటికీ యీ పాటకు స్వరాభిషేకం చేస్తూనే ఉన్నారు. కావాలంటే మరోసారి వినండి... 'వేళయనీ...ఈ ఈ,' 'మా ఆఆ సమనీ' అనే చోట్ల గాత్రస్థాయిని నిలిపిన తీరు ఏవో అనుభూతులకు లోనై పాడినట్లుంటుంది. వాటిని మనకు అందించినట్లుంటుంది.

తమిళంలో విజయం సాధించిన కె.బాలచందర్ "మేజర్ చంద్రకాంత్" యీ తెలుగు చిత్రానికి మాతృక. తెలుగులో వాణిశ్రీ పాత్రను తమిళంలో జయలలిత వేశారు. అప్పటివరకూ చిన్నచిన్న హాస్యపాత్రలు ధరిస్తూ వచ్చిన వాణిశ్రీ యీ చిత్రంతో తారాపథానికి వెళ్లారు. ఈ సినిమా రషెస్ చూసే దూండీ ఆమెను "మరపురానికథ"కు తీసుకున్నారు. విశేషం ఏమంటే యీ చిత్రానికి ఎస్.వి.రంగారావు, జయలలితలు నలభైవేలరూపాయలు పారితోషికం తీసుకుంటే వాణిశ్రీకి కేవలం నాలుగువేలే ఇచ్చారు.

దేవులపల్లి గంధర్వలోకాలకు తరలి వెళ్లిపోయిన కొత్తలో వి.ఏ.కె.రంగారావు సరస్వతిస్టోర్స్ రికార్డింగ్ ఆఫీసర్ కణ్ణన్‌ను అభ్యర్థించారు. పాలగుమ్మి పద్మరాజు పాటలఎన్నిక చేయగా, డి.వి.నరసరాజు స్లీవ్‌నోట్సుతో ఒక దేవులపల్లి పాటల యల్.పి.వెలువరించమని. కానీ ఏ కారణం చేతనో అది కార్యరూపం దాల్చలేదు.

ఆ తర్వాత ఎప్పటికో, యీ సత్కార్యం 'యువచిత్ర' అధినేత కాట్రగడ్డ మురారి చేయించారు. బ్రతికుండేటప్పుడు బ్రహ్మరథం పట్టడం వ్యాపారసూత్రం. చనిపోయినా స్మరించడం సజ్జన లక్షణం. ఈ మననంతో జనించిన ఆమని లాంటి యల్.పి. కృష్ణశాస్త్రి పాటల యల్.పి. దీనికి మురారి "సుఖదుఃఖాలు" పాట "ఇది మల్లెలవేళ" అని పేరుపెట్టడం యీ పాట గొప్పతనం. ఇదలా ఉంచితే, ఒక రచయితకు ఒక నిర్మాత యీ విధంగా నీరాజనమెత్తడం యావద్భారతంలో అదే మొదలు. మురారి సొంతంగా ఎంపిక చేసిన పదకొండు పాటల్లో (మల్లీశ్వరి – 1951 – ఏకవీర –1969) తన చిత్రాల (సీతామాలక్ష్మి, గోరింటాకు)లో ఒకపాటా లేకపోవడం ఆయన నిస్వార్థచింతనకు తార్కాణం.

# మంచికుటుంబం (1968)

❖ ఆరుద్ర ❖ ఎస్.పి.కోదండపాణి

మనసే అందాల బృందావనం వేణు
మాధవుని పేరే మధురామృతం ॥మనసే॥

కమ్మని నగుమోము కాంచుటే తొలినోము
కడగంటి చూపైన కడు పావనం ॥మనసే॥

రాధను ఒక వంక లాలించునే సత్య
భామను మురిపాల తేలించునే ॥రాధను॥
మనసార నెరనమ్ము తనవారిని... ॥మనసార॥
కోటి మరులందు సుధలందు తనియించునే ॥మనసే॥

దనిసదనిని దద మదనిని దద మమగ
గమమద దదనిస గగగస
గగ మమ దనిగ... బృందావనం
మగ మగ గద నినినిదద
గమ మద సని సని నిసమగ
నిగమగ బృందావనం...
సమ గస గని దని
గగ మని దనిస
మని దమ మగ గగ స ఆ... ॥మనసే॥



మూడుభాషల్లోనూ ఒకే నాయకపాత్రను ముగ్గురు పద్మశ్రీలు నటించగా తయారైన చిత్రాలు – జెమినీసంస్థ హిందీ–తమిళభాషలలో నిర్మించిన "గృహస్థి", "మోటార్ సుందరంపిళ్ళై," మధుపిక్చర్స్ తెలుగులో నిర్మించిన "మంచికుటుంబం". ఈ మూడింటిలోనూ సలక్షణంగా విలక్షణమైన నాయకపాత్రలను భిన్నరీతులలో పోషించి, ప్రశంసలందుకున్న పద్మశ్రీలు అశోక్‌కుమార్, శివాజీగణేశన్, అక్కినేని నాగేశ్వరరావు.

ఈ చిత్రంలో అక్కినేని, షావుకారు జానకి చాలా గొప్పగా నటించారు. సాధారణంగా తెలుగు చిత్రాలను ఏమంత పట్టించుకోని "ది మెయిల్" దినపత్రిక కూడా ఆరోజుల్లో అక్కినేని, షావుకారుల నటనను కొనియాడింది. అయితే ఈ చిత్రంలో వీరితో పాటు మెచ్చుకోవాల్సింది మాస్టర్ గణేష్ నటనను కూడా. నాగేశ్వరరావు, జానకి మంచి పాత్రలలో బాగా నటిస్తే ఆనందించవలసిందే కానీ, ఆశ్చర్యపడాల్సిందేమీ లేదు కనుక.

ఈ చిత్రంలో మాస్టర్ గణేశ్ ఒక్కొక్కమాట వాళ్ల నాన్నను అడుగుతూంటే, మనసు ద్రవించిపోతుంది. ఈ అబ్బాయి, అతని అక్క వేషం ఎంతో ముద్దుగా వేసిన బేబీ శాంతికళా హైదరాబాదులో పూర్ణా కార్యనిర్వాహకులలో పనిచేసిన సెల్వరాజ్ పిల్లలు. మరొక చిత్రమైన విషయమేమిటంటే, ఆ చిత్రం చూసినవాళ్లంతా జానకినీ, నాగేశ్వరరావునూ మెచ్చుకుంటే – వాళ్లిద్దరూ మాస్టర్ గణేశ్‌ను మెచ్చుకున్నారప్పట్లో.

"మంచికుటుంబం" చిత్రంలో మహిళల్ని విశేషంగా ఆకర్షించిన రెండుపాటల్లో ప్రధానమైంది యీ పాట.

వీణకు గొంతువస్తే ఇలా ఉంటుందా? అనేలా యీ వీణపాటపై స్వరసంతకం చేశారు ఆంధ్రానైటింగేల్ సుశీల. ఆమె గానవైభవం పాత్రల స్థాయిని, నాయికల నటనాసామర్థ్యాన్ని ద్విగుణీకృతం చేశాయనడంలో సందేహం లేదు.

సగమదనిస స్వరాల హిందోళరాగంలో స్వరపరచిన యీ పాట ఆమె గాత్రంలో పల్కి తెలుగునాట ప్రభంజనమైంది. ఇది నిజానికి వీణపాటే అయినా పెళ్లికాబోయే అమ్మాయిలు పెళ్లిచూపుల్లో పాడుకుని కాబోయే భర్తలను మెప్పించిన పాట. 'పాటలు పాడడం వచ్చా?' అని అడిగితే జవాబు మాటల్లో చెప్పకుండానే ఈ పాటను అందుకునేసేవారా రోజుల్లో.

హిందోళం చాలా నిండైన రాగం. సినిమా సంగీతప్రియులకు చిరకాలపు ప్రేయసి. ఈ రాగసముద్రాన్ని క్షీరసాగరం చేసి తన నైపుణీవిశేషతో చిలికి అమృతసేచన చేశారు ఎస్పీకోదండపాణి. ఈపాట చివరలో స్వరాలను సుశీల గాత్రంలో విన్పించి కొంతసేపు వింతకాంతులతో రుచిమయం, రుచిర్మయం చేశారాయన.

కోదండపాణి అందరు హీరోల సినిమాలకూ సంగీతం చేశారు. అయితే అక్కినేనికి మాత్రం పాట చేయలేక పోయారు. "మంచికుటుంబం" లో యీ సదవకాశం వచ్చినప్పటికీ, ఇందులో అక్కినేనికి ఒక్కపాటా లేకపోవడం గమనార్హం.

కోదండపాణి అస్తమించిన తొలిరోజుల్లో ఆయన స్నేహితుడు ఎ.పూర్ణచంద్రరావు (నిర్మాత) ఒక లాంగ్‌ప్లే రికార్డు ఇప్పించి దానిపై వచ్చే రాయల్టీ శ్రీమతి సరోజినీ కోదండపాణికి అందే ఏర్పాటు చేశారు. ఆ లాంగ్‌ప్లే రికార్డు పేరేమిటో తెలుసా? 'మనసే అందాల బృందావనం'.

# తిక్క శంకరయ్య (1968)

❖ సి.నారాయణరెడ్డి ❖ టి.వి.రాజు

వగకాడ బిగువేలరా... ॥వగకాడ॥
ఈ సొగసైన చినదాని బిగికౌగిలి చేర ॥వగకాడ॥
కన్నూ సైగలు చేసి చేసి-
నా కడకొంగు నునుకేల దూసి ॥కన్నూ॥
ఆ.. ఆ..
ఎన్నో బాసలు చేసి ఏవో ఆశలు చూపి
వింత వింత గిలిగింత చేసి
మరి అంతలోనే మాయమైతివేరా ॥వగకాడ॥
అద్దరాతిరి నిదుర లేపి
చెక్కుటద్దమ్ముపై కేలు మోపి ॥అద్ద॥
ఆ... ఆ...
నవ్వులు విరబోసి
పువ్వు బాణము వేసి ॥నవ్వు॥
పొంచి పొంచి కవ్వించి బేల
నుడికించనేల చెంతజేర రారా! ॥వగకాడ॥

ద్విపాత్రాభినేతగా ఎన్.టి.రామారావు పై మోజూ, క్రేజూ ముప్పిరిగొంటున్న రోజులవి. "రాముడు-భీముడు", "అగ్గిపిడుగు", "మంగమ్మ శపథం", "గోపాలుడు-భూపాలుడు" లాంటి సాంఘిక, జానపద చిత్రాల్లో విభిన్నమైన ఉభయనాయక పాత్రల్లో ఆయన నటనావైవిధ్యాన్ని రాశిపోశారు. ఆ వరసలో వచ్చిందే డి.వి.ఎస్.రాజు నిర్మించిన "తిక్కశంకరయ్య".

కథాపుష్టిని, సంగీతదృష్టిని సమప్రమాణంలో మేళవించి చూపే అభిరుచి గల నిర్మాత డి.వి.ఎస్.రాజు.

బి.ఎన్.రెడ్డి, 'భరణీ' రామకృష్ణ, భానుమతి, కె.వి.రెడ్డి శాస్త్రీయసంగీతం విషయంలో పట్టువదలని విక్రమార్కుల్లా ఉండేవారు ఆరోజుల్లో. ఈ మాట ఎందుకనాలంటే - రోజూ మాట్లాడుకునే, పోట్లాడుకునే వచనాలే పాటల పల్లవులుగా చలామణీ అయ్యే రోజుల్లో కూడా వారు తీసే ప్రతి సినిమాలోనూ కనీసం ఒక్క సంప్రదాయసిద్ధమైన సంగీత రచనను - జావళో, పదమో, దీక్షితార్ కృతో, త్యాగయ్యకీర్తనో లేక వాటికి దగ్గరగా

ఉండి – కథకు సరిపడే మరొక కొత్త రచనో విధిగా ప్రవేశపెట్టేవారు. కానీ చాలామంది నిర్మాతలు సాంఘిక చిత్రాలలో అటువంటి వాటికి స్థానమేదీ అని తప్పించుకునేవారు. కానీ డి.వి.ఎస్.రాజు మాత్రమే పై విక్రమార్కుల జాబితాలో చేర్చాల్సినవారు. "మంగమ్మ శపథం" (అందాల నారాజ అలుకేలరా), "పిడుగురాముడు" (రారా కౌగిలి) తదితర చిత్రాలలో విధిగా ఇలాంటి శాస్త్రీయ నృత్యగీతాలు ప్రవేశపెట్టడం ఆయన సహజాభిరుచి. ఈకోవలో వచ్చిందే ఈపాట.

కొందరు కవులు సాహితీరంగంలో పేరు తెచ్చుకుని సినిమా పరిశ్రమలో ప్రవేశిస్తారు. మరికొందరు నేరుగా సినిమాలలోనే ప్రవేశిస్తారు. రెండిటా పేరు, సంపాదించుకున్నవారు చాలా కొద్దిమంది. సాహిత్యంలో కృషిచేసి సినిమాలలో ప్రవేశించగానే వారి సినిమాతత్త్వం ఎలా వున్నా, దిగజారిపోయాడురా అని పెదవి విరవడం అప్పట్లో ఒక అంటువ్యాధి. ఈ జాడ్యానికి కొంత కారణం ఆ అవకాశం మనకు రాలేదే అనే అసూయ. ఇంకొంత కారణం ఇతోధిక సాహిత్యసేవ ఇక్కడా చేయవచ్చునన్న సంగతి అలా అనేవారికి తెలీకపోవడం.

మల్లాది రామకృష్ణశాస్త్రి, వారు కథలు రాయడం మొదలుపెట్టినపుడు కూడా మణిపూసల దగ్గ కథలే రాశారు. తమకు ప్రీతిపాత్రమైన జానుతెలుగులో కొన్నికథలకు ప్రాణప్రతిష్ఠ సలిపి తెనుగుదనంలోని తియ్యదనాన్ని అందరికీ అందుబాటులోకి తెచ్చారు. సినిమాల కోసమని 'చక్కని మక్కువల చక్కిలిగింతలు' ఉంకువగా చేసికొని పాటలు చిరస్మరణీయమైనవి రాశారు. దేవులపల్లి "మల్లీశ్వరి" కి ముందే పాండితీప్రకర్షలో తలనెరిసినవారు, జగమెరిగినవారు. సామాన్య ప్రజానీకానికి వారిపేరు తెలియదానికి ఆ చిత్రం దోహదకారి అయినా వారి "ఊర్వశి", "కృష్ణపక్షం" ఎంత క్లిష్టంగా ఉంటాయో వారి సినిమా పాటలంత సుబోధకంగా ఉంటాయి. వారి కావ్యాలలో ఉన్న సాహితీ స్థాయికి యీ సినిమా పాటలు ఏమైనా తగ్గినవా అంటే అదీ లేదు. ఇంకా చెప్పాలంటే ఇవే ఒక కారణంచేత, వాటికన్నా మెరుగు. సాహిత్య సౌరభంతో నలుగురికీ అర్థమయ్యే సౌలభ్యం కూడా యీ చిత్రగీతాలలో ఉండడం. అప్పుడప్పుడూ ఛలోక్తిగా అంటుండేవారు – "మల్లీశ్వరి" వలన నా పేరు నలుగురికీ తెలిసిందని. ఇందులో నిజమెంత ఉందో సత్యమూ, సకారణమూ అయినదీ అంతే ఉంది. "ప్రబల నీరంధ్రాభ్ర జనిత గాఢ ధ్వాంత నిబిడ హేమంత రాత్రీ కుంతలములలో చుక్కేలా?" అంటే ఎవరికి అర్థమౌతుంది? "ఆ రావి, ఆ బావి, ఆ స్వామి సాక్షిగా, ఆనాటి బాసలు అన్ని కలలాయెనే!" అంటే ఎవరికి అర్థం కాదు? ఈ రెండో దానిలో అందంగానీ, అర్థంగానీ తక్కువేమైనా అయినవా?

'నాగార్జునసాగరం', 'కర్పూర వసంతరాయలు' మొదలైన కావ్యాలతో సుస్థిరకీర్తి సంపాదించుకున్న తర్వాతే సి.నారాయణరెడ్డి చిత్రరంగ ప్రవేశం చేశారు. ఎన్నో పాటలు

సినిమాలకు రాశారు. అన్నీ ఆ కావ్యాల స్థాయిలో ఉన్నవా? అనే ప్రశ్నకు సమాధానం అన్నీ ఆ స్థాయిలో ఉండగలవా? అన్నది. పరిస్థితులు గమనించితే ఇందులోని సూక్ష్మం బోధపడుతుంది. ఉదాత్తమైన నాయికానాయకులు గల ఉత్కృష్ట కావ్యాలవి. అయితే గమనించదగిందేమిటంటే ఆ కావ్యాలెంత ఉన్నతమైనవో అంతటి పాటలూ సినిమాల నియమిత పరిధిలోనే కొన్నింటిని ఆయన రాయగలగటం. ప్రతి




సందర్భాన్ని ఒడిసిపట్టి ప్రతిపాటనూ రత్నంగా తీర్చిదిద్దటానికి చక్కని శిల్పనైపుణ్యాన్ని, చిత్రీకరణతో సరిసమానంగా కలంలో పలికిస్తారు సి.నా.రె. అందువల్ల చక్కని సౌష్టవం, రూపలావణ్యం, ఆయన పాటల్లో కన్పిస్తుంది. అలాంటి శిల్పనైపుణ్యం కలిగిందే యీ జావళి. ఇందులో శృంగారం అడుగడుగునా పొంగుతుంటుంది. ఈ చక్కనిజావళీని టి.వి.రాజు షణ్ముఖప్రియలో చిక్కగా స్వరపరిచారు. ప్రతిమధ్యమరాగాలలో కల్యాణి తర్వాత స్థానం ఈ రాగానిదే. చాలా ఇంపుగా, రసాని కనుగుణంగా, కవ్వింపుగా ఉండే రాగమిది. మన తెలుగు సినీగీతాలలో ఈ రాగప్రస్తావన చాలా తక్కువేనని చెప్పవచ్చు.

ఇక సుశీల గాత్రంలో యీ పాటను వింటుంటే దృశ్యాన్ని చూసినంత పరిపూర్ణత వినిపించి, కన్పిస్తుంది. నర్తకి (జయలలిత) హావభావాలు, నాట్యరీతులలోని భంగిమలు, నట్టువాంగ సోయగాలు అన్నీ మేళవించి, ఆమె గాత్రంలో ముగ్ధమనోహరంగా విన్పిస్తాయి. చరణం తర్వాత చేసిన ఆలాపనలు, వీణారవంతో పోటీపడ్డతీరు సంపూర్ణ స్వరాలవిన్యాసం రమణీయం. నటన, నాట్యం, సంగీతం తెలిసిన జయలలిత, సంగీతం, సాహిత్యం, నాట్యరీతులు, గాత్రధర్మాలు తెలిసిన సుశీల జోడుగా, జోరుగా చేసిన రసావిష్కరణే యీ పాట. ఒకచోట సుదీర్ఘ పదాల అనంతరం కొంచెం వ్యవధి తీసుకుని మళ్లీ పల్లవికి వచ్చే గాత్రతీరుల పరిజ్ఞానం అమోఘం, అనిర్వచనీయం. జావళీ అంటే 'ఇది' అని తన ముద్రలో, బాణీలో యీ పాట నిరంతరం రసస్ఫూర్తి నిస్తుంటుంది.

ఈపాటను గమనిస్తే, మన తెలుగుచిత్రాలలో ఉండే శృంగారమంతా యీ కోవకు చెందిందే అయితే ఎంతటి భాగ్యమనిపిస్తుంది.

# ఉండమ్మా.. బొట్టుపెడతా (1968)

❖ దేవులపల్లి ❖ కె.వి.మహాదేవన్

ఎందుకీ సందెగాలి? సందెగాలి తేలి మురళి ॥ఎందుకీ॥
తొందర తొందరలాయె! విందులు విందులు చేసే! ॥ఎందుకీ॥
ఆగలేక, నాలాగే ఊగే ఈ దీపము ॥ఆగలేక॥
పరుగు పరుగునా – త్వరత్వరగా
ప్రభుని పాదముల వాలగా,
తొందర తొందర లాయె! విందులు విందులు చేసే! ॥ఎందుకీ॥
ఏనాటిదో గాని–ఆ రాధాపల్లవపాణీ!
ఏమాయెనో గాని – ఆ పిల్లనగ్రోవిని విని
ఏనాటిదో గాని– ఆ రాధాపల్లవపాణీ
ఏమాయెనో గాని – ఆ పిల్లనగ్రోవిని విని, విని, విని
ఏదీ ఆ యమున!
యమున హృదయమున గీతిక!
ఏదీ బృందావనమిక! ఏదీ విరహగోపిక... ॥ఎందుకీ॥ (2 సార్లు)



దేవులపల్లి, కె.వి.మహాదేవన్, సుశీల ల కాంబినేషన్‌లో సిద్ధించిన రాధా, మాధవ అనురాగలతకు పుష్పించిన పునీత సుమమీపాట.

శ్రీకృష్ణుని మీద గీతాలను రాయడంలో కృష్ణశాస్త్రిది అందెవేసినచేయి. ఆయన రాసే పాటలు మనకు మహాభాగవతం, దశమస్కందంలోని 'గోపికాగీతల'ను గుర్తుకు తెస్తాయి. ఈపాట ఇదేతరహాకు చెందింది. 'ఆగలేని మనసు'ను 'గాలికి ఊగే దీపం'తో ఉపమిస్తూ ఆయన రాసిన యీ పాట సినిమాకే హైలెట్. పాటను వినేవారికి, చిత్రంలో చూసేవారికి బృందావనిలోని విరహగోపికే తలపున మెదలుతుంది.

పట్టుమని పదిపంక్తులు కూడా లేని సందెగాలి పాట, అయినా ఇది మన తెలుగింటి పదహారణాల పాట. ఎన్నిసార్లు విన్నా ఏదో తెలియని హాయి. కారణం కృష్ణశాస్త్రి కమనీయ భావసౌందర్యం, మహాదేవన్ స్వరకల్పనాచాతుర్యం, తీయని పాటలకు నెలవైన మధుర గళసీమ సుశీల పాడడం. రాధామాధవులు, పిల్లనగ్రోవి, యమునాతటి, బృందావని చుట్టూ తిరిగి వచ్చే పదాలన్నీ ఆగలేక, ఉండలేక తొందరగా వీనులవిందు చేయాలని సుశీల గళం చేరితే ఆ పాట సర్వజనసమ్మోహనం కాకుండా పోతుందా? ఇలాంటి పాటలు రసమయజగతిని పరవశింపజేస్తాయి.



దేవులపల్లి

అక్షరాలకు స్వరస్పర్శ, రససిద్ధి కలిగించడంలో సుశీల మాధుర్యమే ఒక వైచిత్రిగా ఉంటుంది. పాట ప్రారంభంలో చల్లని వేణువు, సందెగాలి, 'కళాభారతి' జమున అభినయం,... 'ఆగలేక నాలాగే ఊగే ఈ దీపము' అనేచోట దీపంలోని కదలికలు గొంతులో పలికించారు సుశీల. 'పిల్లనగ్రోవిని విని విని విని' అనేచోట, 'ఏదీ ఆ యమున', 'ఏదీ విరహగోపిక' అనే చోట్ల ఎంతో వైవిధ్యగాత్రరీతులు ఆమెవి. వాటిలో ఎంతో తీయదనం.

మహాదేవన్ స్వరకల్పనా చాతుర్యం ఏమిటంటే మధ్యమ స్వరస్థానం నుంచి పాటను పలికించడం. ఇదొక విలక్షణప్రక్రియ. అలాగే గ్రహభేదాలు చేస్తూ... సాధారణ శంకరాభరణాన్ని ఎన్నో రీతులలో ఎన్నో రాగాలుగా స్వరపరచటం. ఒక్కోసారి మహాదేవన్ స్వరాలను అందిపుచ్చుకుని రాగనిర్ణయం చేయడం కష్టమైన పనిగా తోస్తుంది.

గోదావరొడ్డు పాటలు యెంత గమ్మత్తుగా పాడుతారో సుశీల, యీ పాట లాంటి వాటిని అంత పవిత్రంగానూ పాడుతారు. ఇలాంటి పాటలు సినిమాలలో అరుదుగానైనా వినవస్తుంటే సాహితీవనం నిత్యవసంతంతో అలరారకేం జేస్తుంది?

## ఉండమ్మా.. బొట్టుపెడతా (1968)

❖ దేవులపల్లి ❖ కె.వి.మహాదేవన్

అడుగడుగున గుడి ఉంది!
అందరిలో గుడి ఉంది ॥అడుగడుగున॥
ఆ గుడిలో దీపముంది!
అదియే దైవం... ॥అడుగడుగున॥
ఇల్లూ వాకిలి ఒళ్లూ మనసూ
ఈశుని కొలువనిపించాలి! ॥ఇల్లూ॥
ఎల్లవేళలా మంచుకడిగినా
మల్లెపూవులా ఉంచాలి! ॥ఎల్లవేళలా॥
దీపం మరి మరి వెలగాలి!
తెరలూ పొరలూ తొలగాలి ॥అడుగడుగున॥
అడుగడుగున గుడి ఉంది..
అందరిలో గుడి ఉంది ..
తల్లీతండ్రీ గురువు పెద్దలు
పిల్లలు కొలిచే దైవం! ॥తల్లీ॥
కల్లాకపటం తెలియని పాపలు
తల్లులు వలచే దైవం! ॥కల్లాకపటం॥
ప్రతిమనిషీ నడిచే దైవం!
ప్రతి పులుగూ ఎగిరే దైవం! ॥అడుగడుగున॥



భారతీయ చలనచిత్ర పితామహుడు దాదాసాహెబ్ ఫాల్కే అయితే, తెలుగు చలనచిత్ర పితామహుడు రఘుపతి వెంకయ్య. ఈ మహనీయులు పరస్పరం సత్సంబంధాలను కొనసాగించి, చిత్రసీమను ఎంతో బలోపేతం గావించారు. అలా మరాఠీ, తెలుగు సినిమారంగాల నడుమ ఇచ్చిపుచ్చుకునే ఒక చక్కని ఒరవడి మొదలైంది. అనంతర

కాలంలో ఇది దినదినాభివృద్ధి చెంది, ఉభయ చిత్రరంగాలనూ సుసంపన్నం చేసింది.

సంగీత, సాహిత్య, నృత్య, చిత్రలేఖనాది లలితకళాక్షేత్రాలలో మహారాష్ట్రులు చేసిన కృషి నిరుపమానమైంది. ప్రధానంగా సాహిత్యరంగంలో ప్రాతఃస్మరణీయులైన మహారాష్ట్రీయులు ఎందరెందరో ఉన్నారు. అలాంటివారిలో పండిట్ మహదేవ్‌శాస్త్రి జోషీ అశేష శేముషీ సంపన్నులు. ఆయన రచనలు పండిత పామరజన మనోరంజకాలు. వీరి రచనల్లో కరుణ రసపోషణ అధికంగా ఉంటుంది. కరుణరసం పాషాణ హృదయాలనైనా కదిలించగలిగేటంత శక్తిసంపన్నమైంది. బహుశా, యీ కారణంవల్లే, ఎంతోమంది నిర్మాతలు, జోషీ గారి పలురచనలను చలనచిత్రాలుగా రూపొందించేందుకు, అమితోత్సాహంతో ముందుకు వచ్చి ఉండవచ్చు. వీరి రచన ఆధారంగా, "థాంబ్ లక్ష్మీ కుంకు లావ్ తే" (ఆగు లక్ష్మీ! కుంకుమపెడతాను) అనే మరాఠీ చిత్రం విడుదలై, ఘన విజయాన్ని సాధించింది. ఇది తెలుసుకున్న ఆదుర్తి సుబ్బారావు ఆ చిత్రం హక్కులు కొన్నారు. ఆయన అప్పటికే "కన్నెమనసులు" (1966), "సుడిగుండాలు" (1967) చిత్రాల్ని తీసి, చేతులు కాల్చుకున్నారు. గనుక యీసారి తాను నిర్మాతగా మాత్రమే వ్యవహరించి, తన దగ్గర అసిస్టెంట్ డైరెక్టరుగా పనిచేసిన కె.విశ్వనాథ్‌ను చిత్రదర్శకుడిగా పెట్టుకున్నారు. అలా తయారైంది "ఉండమ్మా.. బొట్టుపెడతా..." చిత్రం.

ఈ సినిమాకు దేవులపల్లి కృష్ణశాస్త్రి రాసిన పాటలు జవజీవాల్ని ప్రసాదించాయి. ఆయనగాని పాటలు రాస్తే, ఇనుమును స్పర్శవేది తాకించి బంగారంగా మార్చినట్లుగా, ఎలాంటి సినిమాకైనా ఓ 'క్లాసికల్ టచ్' సహజంగా వచ్చేస్తుంది. అదే ఆయన గీతాల ఘనత. ఈ చిత్రంలోనూ ఆయన తన 'మిడాస్ టచ్' ను ప్రదర్శించి అద్భుతాన్ని చేయడం జరిగింది. సినిమాలో ఉన్న అన్నిపాటల్నీ ఆయన రచించిన కారణాన, ఈచిత్రం సప్తవర్ణ సుశోభితమైన ఇంద్రధనుస్సువలే మన హృదయాలకు ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తుంది.

2016లో 'స్వచ్ఛభారత్' ఉద్యమం ఊపందుకుంది. అయితే, దాదాపు అర్ధశతాబ్దం క్రితమే, "థాంబ్ లక్ష్మీ కుంకులావ్ తే" చిత్రం 'స్వచ్ఛత' కు అగ్రస్థానాన్ని ఇచ్చి సమాదరించింది.

ఆ స్వచ్ఛతనుంచి ప్రేరణను పొందిన కృష్ణశాస్త్రి ఆ స్వచ్ఛతాశయానికి, అద్వైత సిద్ధాంత తాత్త్వికతను జతచేసి, ఈ అద్భుతమైన గీతాన్ని రచించారు. 'స్వచ్ఛభారత్' ఉద్యమానికి యీనాడు ఓ ప్రచారగీతంలా ఉపకరించే పాట ఇది. ఈపాటలోని చరణాలు కేవలం ఆస్వాదించి వదలివేయదగినవి కావు. జీవితంలో ఆచరించి చిదానందాన్ని పొందదగ్గవి.

ఒకోరోజు ఏ శుభమూహూర్తంలో తెల్లవారుతుందో? ఏ సుందర తేజోరూపాన్ని చూస్తామో? ఏ ప్రకృతిశోభలు కళ్లకు కనిపిస్తాయో? ఏ మంజుల నాదాలు




శ్రవణేంద్రియాలకు తాకి మనస్సును రసరంజితం చేస్తాయో తెలీదు... ఆ దివ్యగాన స్వరపల్లవులు మదిలో మెరిసి ఆరోజు దివ్యానుభూతులను మిగిల్చి పవిత్ర గీతచరణాలపై శిరస్సు వంగి నమస్కరిస్తుందో ఇవన్నీ ఆ ఒక్క గీతప్రభావమే కదా! ఎంతటి రసానుభూతులవి? అవి ఎప్పుడు కల్గుతాయి? సమాధానంగా యీ పాట... యీ స్వరం... యీ గాత్రం... యీ మాధుర్యం అని ఒక చక్కని చిరునామాగా చెప్పుకోవచ్చు.

కె.వి.మహాదేవన్ స్వరపరిచయాలలో అక్షరాలు, పదాలు, ఆ స్వరాలతో భేటీ అయ్యాయా? అన్నంత శ్రావ్యంగా ఉంటుంది పాట. లలితమైన పదాలన్నీ, ఎంతో లాలిత్యంగా అలవోకగా అందరూ పాడుకునేరీతిలో అల్లుకుపోతాయి. ఈ పాట మరోసారి వినండి... అక్షరం, స్వరం ఎలా పెనవేసుకున్నాయో?

సుశీల అనుపమాన గాత్రానుభవం ఇలాంటి పాటల్లో చాలా తేటతెల్లంగా విన్పిస్తుంది. 'మంచు కరిగిన మల్లెపూవులా', 'కపటం తెలియని పసిపాపల మనసులా' నిండుగా, నిర్మలంగా ఉంటుంది. 'అదియే దైవం...' అని ముగింపులో ఒక చక్కని ఓంకారం, ప్రణవనాదం విన్పిస్తాయి. గాత్రంలోని మాధుర్యప్రభ, గుడిగంటల ధ్వని ఓంకారంలో మిళితమైనట్లు ఉంటుంది. ప్రతి ఎదలోనూ పలికే గీతంలా, ప్రతి ఒక్కరినీ ఆనందింపజేసేగీతంలా ఈపాట నేటికీ ఏదో ఒక ప్రసారసాధనంలో వింటూనే ఉన్నాం.

ఈ సినిమా విడుదలైన తొలిరోజుల్లో మహిళలు చాలామటుకు పేరంటాళ్లలో కూడా యీ పాట పాడేవారు. వివాహానంతరం సెకండ్ ఇన్నింగ్స్‌లో జమునకు విశేషమైన గ్లామర్ తెచ్చిపెట్టిన పాటల్లో ఇదొక్కటి.

# రెండుకుటుంబాల కథ (1970)

❖ దాశరథి ❖ ఘంటసాల

పల్లవి: వేణుగాన లోలుని గన వేయికనులు చాలవులే
సరస రాగమాధురిలో సకల జగము సోలునులే

చరణం1: చిన్ననాడు గోపెమ్మల చిత్తము లలరించి
మన్నుతిన్న ఆ నోటనె మిన్నులన్ని చూపించి
కాళీయుని పడగలపై లీలగా నటియించి
సురలు, నరులు మురిసిపోవ ధరణినేలు గోపాలుని ॥వేణు॥

చరణం2 : అతని పెదవి సోకినంత అమృతము కురిసేను
అతని చేయి తాకినంత బ్రతుకే విరిసేను
సుందర యమునాతటిలో బృందావనసీమలలో
కలసిమెలసి అలసి సొలసి వలపు తెలుపు వేళలలో ॥వేణు॥

అవును దాశరథి అన్నట్లు పల్లవిలోని ప్రతి అక్షరమూ సత్యమే. యుగయుగాలుగా స్మరిస్తున్నా తనివితీరని ఆ లీలామానుష విగ్రహరూపం అంతగొప్పది. బాలకృష్ణుని బాల్యలీలలు, క్రీడావినోదాలు, మనకు నిత్యవినోదాలు. ఆతని అధరాలు తాకిన వేణువు, కాలుమోపిన యమునా నదీతీరం, బృందావనం అన్నీ రమణీయాలే... భావాలకు లొంగని అనుభూతులే.

పారశీకపు అత్తరు గుబాళింపులు, గజల్ రుబాయిాల సింగారింపులు, ఊహించే ఊహలతో చికిలింత చిగురింతలు గుర్తుకువస్తాయి. దాశరథి సినిమాపాటలను తలచుకోగానే – ఆయన పద్యరచనా పాటవం కన్నా, వచనకవిత్వ పటుత్వంకన్నా కూడా చాలామంది యువతరం వారికి ఆయన సినిమాపాటల పల్లవింతలూ, పలవింతలూ బాగా పరిచయం.

దాశరథి సినిమాలకు పాటలు రాయడానికి ముందునుంచే 'పాటల' కవిగా ప్రసిద్ధులు. హైదరాబాదు, మద్రాసు ఆకాశవాణి కేంద్రాలలో ప్రయోక్తగా పనిచేస్తున్న కాలంలో చాలా పాటలు రాశారు. 1957లో 'తేనెపాటలు' పేరిట దాశరథి, సి.నారాయణరెడ్డి విడివిడిగా రాసిన పాటలు సంపుటంగా వచ్చాయి. ఘంటసాల ప్రైవేటురికార్డు ఇచ్చిన 'తలనిండ పూదండ' అనే పాట యిా తేనె పాటలు సంపుటిలోనిదే. 'ఉషాకుమారీ ముఖారవిందం', 'మాట్లాడని మల్లెమొగ్గ మాదిరిగా నడచిరా', 'భూధరమో



సాగరవెూ భూతలవెూ', 'మామిడికొమ్మా మల్లియ రెమ్మా' అనేవి రేడియోద్వారా బాగాప్రచారం పొందిన పాటల్లో కొన్ని.

సాధారణంగా సినిమారంగంలో ఒక రచయిత ఒక తరహాపాట ద్వారా బాగా ప్రచారంలోకి వస్తే అన్నీ అటువంటి పాటలే ఇచ్చి ఒక ముద్ర వేసేయడం పరిపాటి. అలాంటి 'బ్రాండ్' ఏమీ పడకపోవడం దాశరథి అదృష్టం. ఇతివృత్తంలో వైవిధ్యం ఉన్న పాటలు రాశారు. ఇప్పుడు చెప్పుకుంటున్నపాట ఆ కోవలోనిదే.

ఘంటసాల దేశ్‌రాగంలో ఈపాటను స్వరపరచిన తీరు ప్రశంసనీయం. ఇక సుశీల గాత్రంలో యీ పాట ఒక వేణుగాన సమ్మోహనంలా ఉంటుంది. గాత్రంలోని తీయదనం, మాధుర్యం, అక్షరాల్ని పలికేతీరు అన్నీ అమృతజల్లులే. సంగీతదర్శకుని స్వరరచనకు నూటికి నూరుపాళ్లూ న్యాయం చేసినట్లుంటుందీపాట.

'వేణుగాన', 'వేయికనులు' అని పదాలు పలుకుతుంటే జాలువారిన గమకాలు గాయని ప్రతిభకు నిదర్శనాలు. తర్వాత 'సుందర యమునాతటిలో...' అనే చోట గాత్ర కోమలస్థాయి సుకుమారం, కుసుమ కోమలం.... తీగె సాగిన వీణారవం. పాట విలంబితంతో మొదలై చివరగా 'కలసిమెలసి అలసి సొలసి' దగ్గర వేగవంతంగా పలకటం ఒక చక్కని రస, స్వరార్చనలుగా వినిపిస్తాయి.

స్వరకర్త ప్రతిభను ద్విగుణీకృతం చేయడంలో సుశీల గాత్రపరిణతి అనితరసాధ్యం అని చక్కగా ఋజువు చేసిన శ్రీకృష్ణగానామృతం యీ పాట.

సుప్రసిద్ధ నవలారచయిత్రి ద్వివేదుల విశాలాక్షి రచించిన 'వారధి' నవల యీ చిత్రానికి ఆధారం.

# కథానాయిక మొల్ల (1970)

❖ సి.నారాయణరెడ్డి ❖ యస్. పి.కోదండపాణి

సాకి : రఘుకులతిలకా నీ ఆనతి
రచియించితి రామాయణ సత్కృతి
ఆ కృతి వరియించిన పతివి నీవే
అతులిత కైవల్యగతివి నీవే!....

పల్లవి : జగమే రామమయం! మనసే
అగణిత తారకనామ మయం ॥జగమే॥

చరణం 1: నీల జలద రమణీయ రూపం
నిగమాంచల మందిర మణిదీపం ॥నీల॥
సుందరజానకీ వందిత చరణం ॥సుందర॥
సురముని శరణం! భవతాపహరణం! ॥జగమే॥
జగమే రామమయం

చరణం2: ఆ చిరునవ్వే అమృతపు జల్లు ॥ఆ చిరు॥
అఖిల జగములేలు ఆ చేతివిల్లు ॥అఖిల॥
అతని గానమున అలరారు కావ్యం
అన్ని యుగాలకు నవ్యాతి నవ్యం ॥జగమే॥

చరణం3: ఎవని కమల కమనీయ పదము! చూ
పించె అహల్యకు ముక్తిపదము!

బృందం: రామ్ రామ్ రామ్ రామ్
ఎవని చంద్రికా మృదులకరము అం
దించెను శబరికి దివ్య వరము

బృందం : రామ్ రామ్ రామ్ రామ్
ఎవని ఏలుబడి ఇంటికొక్క గుడి నిలిపెనో
ఎవని రాజ్యమే రామరాజ్యమై వెలసెనో!
ఆ రాముడు నా అంతరంగమున నిండగా
అహము మరచి, ఈ యిహము మరచి,
జన్మాంతర బంధము లెల్ల విడిచి

ఆ మహర్జ్యోతిలో లీనము కానా

బృందం : రామ్ రామ్ రామ్ రామ్

ఆ మహాప్రభునిలో ఐక్యము కానా

ఓ రామా! రఘురామా! కైవల్యరామా!

బృందం : రామ్ రామ్ రామ్ రామ్

రామ్ రామ్ రామ్ రామ్



తెలుగు సినిమాపాటలు వినేవాళ్లున్నంతవరకూ మనే పాటలున్న చిత్రాలు "దేవదాసు", "చిరంజీవులు" నిర్మించిన డి.ఎల్.నారాయణ ఒక చిత్రానికి దర్శకత్వం వహించాలని ఎన్నోమార్లనుకొన్నారు. కారణాంతరాల చేత ఆ చిత్రాలు వదులుకోవడమో మరొకరికి అప్పజెప్పడమో జరిగింది. "ఏకవీర" మొదట ఆయన చేయాలనుకొన్నదే. కారణాంతరాలవల్ల సి.ఎస్.రావుకిచ్చారు. 1955 ప్రాంతాల్లో "కవయిత్రి కుమ్మరిమొల్ల" చేపట్ట ప్రయత్నించారు. దానికి సంబంధించి టి.వి.ఎస్. శర్మ వేసిన ఓ లేఔట్ కూడా వెలువడింది. ఆయనే తీసి ఉంటే ఆ వేషం జమున భాగ్యమయేది. మల్లాదే రాసి వుండేవారేమో! ఎం.ఎస్.రాజే సంగీతం సమకూర్చేవారేమో!

ఆ తర్వాతెప్పుడో హాస్యనటుడు పద్మనాభం స్వీయదర్శకత్వంలో ఇంటూరి వేంకటేశ్వరరావు నవలిక "కుమ్మరిమొల్ల" ఆధారంగా "కథానాయిక మొల్ల" నిర్మించారు.

ఈచిత్రంలో రామాయణ రచన పూర్తిచేసిన తర్వాత ఆ కావ్యాన్ని శ్రీరామునికే అర్పిస్తూ భక్తి పారవశ్యంలో పాడేపాట ఇది.

రాముని ఆనతితో మొల్ల రామకథను కావ్యంగా రచించింది. ఆ కృతికన్య శ్రీరాముణ్ణే తన పతిగా వరించింది. అంటే ఆ విభునికే అంకితమైంది. కారణం రాముని వ్యక్తిత్వం భవతారణం చేసేది కాబట్టి. తారకరాముడంటే అర్థం భవజలధి నుంచి తరింపజేసేవాడు, దాటించేవాడు అని. ఆ తారణ ఫలితం మోక్షప్రాపణం. పల్లవిలో 'పిబరే రామరసం' అనే సంస్కృతవాక్యం కొలతలో 'జగమే రామమయం' అన్నారు డా॥సి.నారాయణరెడ్డి. భవబంధవిముక్తి కోసమే మొల్ల రామాయణం రచించింది కాబట్టి

ఆ రఘురామ రూపమే ఆమెకు జగమంతా సాక్షాత్కరిస్తున్నది. ఆమె అంతరంగంలో ఆ తారకనామమే నిండి ఉంది. రాముడు మేఘశ్యాముడు. ఆ రూపం వేద స్వరూపం. అతడు మహావిష్ణువే కాబట్టి నిగమ నిలయుడు. ఆ అంశాన్ని కవితామయంగా మొదటి చరణంలో సమాసీకరించారు సి.నా.రె. వేదాల అంచుల కోవెలలోని మణిదీపంగా ఆ కల్యాణరాముని రూపాన్ని విలసింపజేశారాయన. శ్రీరామపాదం సీతా సంసేవితం. సురులకూ, మునులకూ ఆశ్రయమిస్తూ భవరోగ నివారణం చేస్తుంది. ఈచరణంలో ఒక్క తెలుగుపలుకు లేకుండా సంస్కృతసమాసాలనే నిబంధించారు సి.నా.రె. రెండోచరణంలో శ్రీరాముని నెమ్మోములోని చిరునవ్వునూ, చేతిలోని కోదండాన్ని వర్ణిస్తూ రామకథను గానం చేసిన కావ్యం సార్వకాలికమని తెలియజేశారు.

శ్రీరాముణ్ణి మహాకవి వాల్మీకి "స్మితపూర్వాభిభాషి"గా చిత్రించాడు. పలుకు పలికే ముందే చిరునవ్వులొలికే స్వామి అన్నమాట. అది ఉత్తమ నాయకలక్షణం. అచ్చమైన చిరునవ్వు అమృతవర్షిణి. అందుకే అందరూ అరపొరలు లేని చిరునవ్వులు కోరుకుంటుంటారు. చిరునవ్వుతో ఆశ్రితులను అలరించిన శ్రీరామచంద్రుడు, చేత ధరించిన ధనస్సుతో సమస్త లోకాలనూ సంరక్షిస్తాడు. కోదండరాముడనే ప్రత్యేకనామానికి సార్థకత అప్పుడే కదా! అలాంటి నాయకమౌళి సంకీర్తనంతో అలరారిన కావ్యం కాబట్టి ఏ యుగంలోనైనా అభినవ్యంగానే ఉంటుందని విశ్వసించింది మొల్ల.

నిజానికి రెండు చరణాలతోనే గీతాన్ని ముగించవచ్చు. కానీ మొల్లలో కలిగిన తాదాత్మ్యాన్ని మరింత ఉదాత్తంగా చిత్రించాలని దర్శకనిర్మాత పద్మనాభం కోరగా 'మధ్యగతి' లో నుంచి 'ద్రుతగతి'లో ప్రవేశించి ఓ సుదీర్ఘచరణం రచించారు సి.నా.రె.

శ్రీరామపాదం అహల్యకు శాపవిమోచనం కలిగించింది. ఆ అభిప్రాయాన్నే "పదం" పై శ్లేషతో కమనీయపదం ముక్తిపదం చూపిందని చమత్కరించారాయన. మొదటిపదం "పాదం" రెండోపాదం "స్థానం" ఆ తరువాతి పంక్తుల్లో శబరి ఎంగిలితిన్న రామయ్య ఆమె తలనిమిరి ఆశీర్వదించిన ఘట్టాన్ని స్ఫురింపజేశారాయన. శ్రీరాముని మృదులకరమే శబరికి దివ్య వరమందించిందన్నారు. ఎవరైనా కోరుకునేది వాంఛాపూర్తినే. సంతానం కోసం, సంపదకోసం–స్థానాధిక్యం కోసం. ఆ వరం అలాంటిది కాదు. శబరి కోరుకున్నది ఐహికమైన వరం కాదు. ఆముష్మికవరం. ఆ లబ్ధి అంటే మోక్షసిద్ధి. అహల్య, శబరి ఇరువురూ కైవల్యచింతన కలవారే. కవయిత్రి మొల్ల కూడా ఆదశను చేరుకుంది. శ్రీరామ పరిపాలన తదనంతర యుగాల్లో 'రామరాజ్యం' గా పేరొందింది. ప్రతి నిలయం శ్రీరామ సమర్చనాలయంగా వెలసింది. ఆ రామునిలో లీనమైపోవాలని మొల్ల ఆకాంక్షించింది.

ఇందులో సి.నా.రె 'అహము మరచి' అని ఒక పదం వాడారు. కవయిత్రి మొల్లకు అహం ఉండేదా? 'అహం' అనేది రజోగుణం నుంచి ఉద్భవిస్తుంది. సృష్టికి రాజసం

అవసరం. కవితాసృష్టికీ అంతే. అంటే ఆ అహం సృజన సంబంధమైనదన్న మాట. ఆ అవస్థను దాటింది మొల్ల. అహమే కాదు ఇహమూ మరచింది. జన్మజన్మాంతర బంధాలనుంచి విముక్తమై ఆ శ్రీరామప్రభువులో లీనమయ్యే సమున్నతస్థితిని చేరుకుంది. ఈ పాట చివరలో పతాకస్థాయి అలౌకికానంద భావనలు ఒక అతీత ఆనందలోకాలకు నాదానుసంధానంగా తీసుకెళ్లాయి.

కోదండపాణి యీ పాటను "చక్రవాక" రాగంలో మాధురీ ప్రధానరీతిలో స్వరపరచారు. ఈ రాగాన్నే ఆయన ఎంపికచేయడంలో ఒక ప్రత్యేకత ఉంది. సంగీతశాస్త్రంలో 16వ మేళకర్త రాగం చక్రవాకం. ఉదయవేళల్లో పాడుకోవటానికి అనువైన సంపూర్ణరాగం. కరుణ, భక్తి, శాంత రసాలను పలికించటంలో ఆణిముత్యం. వేదనను పరాకాష్టలో పలికించగలిగే రమణీయరాగం. పాటలో ఒదిగిన పదాలు, వాటి ఆంతర్యాలు, అందులోని ఆర్ద్రత, ఉత్తమ భక్తికి తార్కాణంగా చెప్పవచ్చు. భక్తుని మనోరంగాన్ని, సున్నిత, వాస్తవధోరణుల్ని, విశ్వాంతరాత్మను మహాదివ్యజ్యోతిగా భావించే నిర్మల నిశ్చల భక్తితత్త్వాన్ని తెలియజేయడానికి యీ రాగం చక్కనైన స్వరపొందికలు గలది.

శ్రీరామచంద్రుని దివ్యచరిత్ర రాసిన మొల్ల హృదయాంతరంగాన్ని దివ్యచక్షువుతో చూసిన సుశీల తనను తాను మొల్లగా ఆవాహన చేసుకుంటే గానీ ఇలాంటి పాటలు పాడలేరు. ఇందులో ఆమె గాత్రంలోని సప్తస్వర సంపూర్ణ విన్యాసాల్ని భక్తిరసానికి మేళవించి తన శాస్త్ర, గాత్రశుద్ధిని సవినయంగా పొందుపరచారు. ఆవేదనతో కూడిన విన్నపాలు ఆ గొంతులో ఎంతో శ్రావ్యంగా పలికాయి. దీనిద్వారా ఒక భక్తునికి భగవంతుడిని చేరే నిర్మలమైన, బలమైన కోరికలు, ఒక తురీయావస్థలో మాటరానిమౌనం నుండి శబ్దాన్ని పలికించడం అన్నీ మనకు విశదమౌతాయి. భగవంతునిలోని సుతిమెత్తని కరుణా సాగరతత్త్వం, మొల్ల లోని భక్తి జ్ఞాన వైరాగ్య మోక్షపిపాస ఈ రెండింటిని సుశీల తన గాత్రంలో సమతౌల్యం చేసి ఆలాపించారు.

చక్రవాకరాగాన్ని కర్ణపేయంగా మలచిన స్వరకర్త అంతరంగాన్ని సుశీల నూటికి నూరుపాళ్లు పట్టుకున్నారు. ఆమె గాత్రానికి వాణిశ్రీ సాత్త్వికాభినయం సైదోడు కాగా, చిత్రీకరించిన యీ పాట విన్నాక శ్రోతలు కూడా ఒక అద్వితీయ ఆత్మదర్శనం చేసుకుని జ్యోతిస్వరూపుడైన పరమాత్మలో క్షణకాలం లీనమైపోతారనడంలో సందేహంలేదు. ఈ పాటే ఈ సినిమాకు ప్రత్యేకాభరణంగా భాసించి, ఆ సంవత్సరమే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వ స్వర్ణనందిని సాధించిపెట్టింది.

# కోడలు దిద్దిన కాపురం (1970)

❖ సి.నారాయణరెడ్డి ❖ టి.వి.రాజు

పల్లవి : నీ ధర్మం నీ సంఘం నీ దేశం నువు మరవొద్దు
జాతిని నడిపి నీతిని నిలిపిన మహనీయులనే మరవొద్దు

చరణం : సత్యం కోసం సతినే అమ్మినదెవరు?
"హరిశ్చంద్రుడు"
తండ్రిమాటకై కానల కేగినదెవరు?
"శ్రీరామచంద్రుడు"
అన్నసేవకే అంకితమైనది ఎవరన్నా-
"లక్ష్మన్నా"
పతియె దైవమని తరించిపోయిన దెవరమ్మా
"సీతమ్మ"
ఆ పుణ్యమూర్తులు చూపిన మార్గం అనుసరించుటే ధర్మం
అనుసరించుటే నీధర్మం
నీ ధర్మం మరవొద్దు ॥జాతిని॥

చరణం : చాపకూడుతో సమతను నేర్పెను నాటి పలనాటి బ్రహ్మన్న
మేడిపండులా మెరిసే సంఘం గుట్టు విప్పెను వేమన్న
వితంతువుల విధివ్రాతలు మార్చి బ్రతుకులు పండించె కందుకూరి
తెలుగుభారతిని ప్రజలభాషలో తీరిచిదిద్దెను గురజాడ
ఆ సంస్కర్తల ఆశయరంగం నీవు నిలిచిన సంఘం
నీవు నిలిచిన ఈ సంఘం
నీ సంఘం మరవొద్దు ॥జాతిని॥

చరణం : స్వతంత్రభారతి రథసారథియై సమరాన దూకె నేతాజీ
సత్యాగ్రహమే సాధనమ్ముగా స్వరాజ్యమే తెచ్చె బాపూజీ
గుండు కెదురుగా గుండె నిలిపెను ఆంధ్రకేసరి టంగుటూరి
తెలుగువారి కొక రాష్ట్రంకోరి ఆహుతి ఆయెను అమరజీవి
ఆ దేశభక్తులు వెలిసిన దేశం నీవు పుట్టిన భారతదేశం
నీవు పుట్టిన ఈ దేశం ॥నీధర్మం॥



"స్వధర్మేనిధనం శ్రేయః" ఇది గీతోక్తి. స్వధర్మనిర్వహణలో మరణమైనా మేలని దాని తాత్పర్యం. ధర్మశబ్దానికి అనేకార్థాలున్నాయి. ఆ వ్యుత్పత్త్యర్థాలను ప్రస్తావించకుండా, 'దేన్ని అనుసరిస్తే లోకానికి మంచి జరుగుతుందో అదే ధర్మం' అని చెప్పుకోవచ్చు. ధర్మాన్ని ఆచరించేది మనం జీవించే సంఘంలో. ఆ సంఘమున్నది మనదేశంలో– భారతదేశంలో.

యన్.టి.ఆర్. ఎస్టేట్ వారి "కోడలుదిద్దిన కాపురం" చిత్రంలో యన్.టి.ఆర్. దేశ, సంఘ ధర్మాలను గురించి సినారె చేత ఒక ప్రబోధాత్మక గీతం రాయించారు. ఉపాధ్యాయిని పాత్రలో సావిత్రిపైన చిత్రీకరించిన గీతమది. ఆర్థికంగా విజయం సాధించే వినోదాత్మకచిత్రం తీసినా ఏదో ఒక సందర్భాన్ని సృష్టించుకుని యన్.టి.ఆర్. సందేశాత్మకగీతాలు రాయించుకునేవారు. ఈ శ్రేణికి చెందిందే ఈపాట.

పల్లవిలోనే వ్యక్తవ్యాంశాలు మూడు– ధర్మం, సంఘం, దేశం. వీటి వివరణే చరణాల్లో ఉంటుంది. మొదటి చరణం –ఉపాధ్యాయురాలు ప్రశ్నలు వేస్తే, 'క్విజ్'లో లాగా పిల్లలు సమాధానాలు చెప్పేపద్ధతిలో ఉంటుంది. రచన చూస్తే శైలీరీత్యా వచనతుల్యమే. కానీ వస్తు ప్రధానమైంది. హరిశ్చంద్రుడు, రాముడు వంటి ధర్మప్రతినిధులైన ఐతిహాసికపాత్రల ప్రసక్తి వస్తుంది. అందువల్ల "నీ ధర్మం మరవొద్దు" అనే ప్రబోధంతో ముగుస్తుంది.

రెండోచరణంలో "సంఘం" తీసుకున్నారు కవి. వివిధకాలాల్లో తెలుగునాట సంఘసంస్కరణకు తమ బతుకులు ముడుపుకట్టిన సంఘసంస్కర్తల ఆశయాల వివరణ ఉంది.

మూడోచరణంలో 'దేశం' వర్ణ్యవస్తువు. ఇద్దరు దేశభక్తులు, తెలుగుగడ్డకు చెందిన ఇద్దరు కర్మవీరుల ప్రస్తావన యీ చరణంలో కన్పిస్తుంది.

నిజానికి "కోడలు దిద్దిన కాపురం" చక్కని కుటుంబ కథాత్మకచిత్రం. కేవలం ప్రబోధాత్మకచిత్రం కాదు. చెప్పించాలనుకుంటే యీ పాటపాడే ఉపాధ్యాయురాలి ద్వారా ఏ నీతులనైనా గుప్పింపజేయొచ్చు. కానీ ఎన్.టి.రామారావులో గుప్తంగా ఉన్న దేశాభిమానం యీ గీతరచనకు నేపథ్యమని చెప్పుకోవచ్చు.

'కర్పూర వసంతరాయలు' వంటి గేయకథాకావ్యం రాసిన డా॥సి.నారాయణరెడ్డి కలంలో ఎన్నో అనర్ఘరత్నాలు వెలువడ్డాయి. జాతిని మేల్కొలిపే ఎన్నో దేశభక్తిగీతాలు ఇదే కలం నుండి గొంతెత్తి ప్రభంజనం సృష్టించాయి. ఇక సంగీత దర్శకుడు టి.వి.రాజు గురించి చెప్పాలంటే –యన్.టి.ఆర్ సినిమా అంటే ఆయన ఎగిరెగిరి పాటలు కంపోజ్ చేస్తాడని పరిశ్రమలో ప్రతీతి. అలాంటి పాటల్లో ఇదొకటి.




'సింధుభైరవి' రాగంలో ప్రారంభమైనా మధ్య మధ్య 'హిందోళ' రాగచ్ఛాయలున్నాయి ఈ పాటలో. ముఖ్యంగా మూడో చరణంలో టి.వి.రాజు స్వరప్రతిభ బాగా కన్పిస్తుంది.


సర్వసామాన్యంగా మన జాతీయనాయకులను స్మరించేటప్పుడు ప్రప్రథమంగా గాంధీజీనే పేర్కొంటాం. అయితే ఈ చరణంలో మాత్రం మొదట నేతాజీ ప్రస్తావన ఉంటుంది. అందువల్ల ఆ మొదటి పంక్తి ఉధృతగతిలో సాగింది. యీ రకంగా అది పాట ఓజస్సుకు ఉపకరించింది. ఆ దృష్టితో 'నేతాజీ' పంక్తి పైస్థాయిలో ఉంది, మరి 'బాపూజీ' పంక్తి మంద్రానికి కింది స్థాయిలో ఉండడం వల్ల పరమశాంతానికి పట్టం కట్టినట్టయింది.

గగనవాణికి ఘడియ గడవదు, తెలుగుచెవికి పూట గడవదు. ఎపుడో తెలుసా? – సుశీల పాట వినకపోతే. ఆమె గాత్రంలో సహజంగా సంగీతాంశ ఉంది. శాస్త్రపఠనం చేసుకుని మరింత శ్రుతిపక్వం అయింది. ఆ గాత్రంలో ఒక రమణీయ లయ, రసికత, హృదయతంత్రులను మీటి ఏవో తెలియని ఆనందలోకాలలో విహరింపజేసే రాగ తరంగాలు పలుకుతాయి. పాట గాని, పద్యంగానీ అందులోని అక్షరాలు పరుగెత్తుతాయి. మెల్లగా పయనిస్తాయి. వేగంగా విజృంభిస్తాయి. గాత్రంలో మాత్రాగణాలు లాస్యం చేస్తూ రాగతాళగతులు నృత్యం చేస్తాయి. పదాల పోహళింపులు పరవళ్లు తొక్కుతాయి. అనేక రసరమ్య గీతాలకు గాత్రదానం చేసి ప్రాణం పోసి, ప్రేక్షకులకు, శ్రోతలకు హృదయానందసుధల్ని పంచిపెట్టిన ధన్యజీవి సుశీల.

# బాలరాజు కథ (1970)

❖ ఆరుద్ర ❖ కె.వి.మహాదేవన్

మహాబలిపురం మహాబలిపురం మహాబలిపురం
భారతీయ కళాజగతికిది గొప్ప గోపురం
కట్టించాడు ఈవూరు పల్లవరాజు
ఆ కథచెప్పగ వచ్చాడు బాలరాజు
ఆ కథచెప్పగ వచ్చాడు బాలరాజు ॥మహాబలిపురం॥
మహాబలిపురం మహాబలిపురం మహాబలిపురం..
కంచి రాజధానిగా పాలించాడు - యిది
మంచి రేవుపట్నంగా కట్టించాడు ॥కంచి॥
తెలుగుసీమ శిల్పుల్ని రప్పించాడు ॥తెలుగు॥
పెద్దశిలలన్నీ శిల్పాలుగ మార్పించాడు
మహాబలిపురం మహాబలిపురం మహాబలిపురం..
పాండవుల రథాలనీ పేరు పడ్డవి
ఏకాండీ శిలలనుండి మలచబడ్డవి ॥పాండవుల॥
వీటిమీద బొమ్మలన్నీ వాటమైనవి ॥వీటి॥
తాము సాటిలేని వాటిమంటూ చాటుతున్నవి ॥తాము॥
మహాబలిపురం మహాబలిపురం మహాబలిపురం
మహిషాసుర మర్దనం, గోవర్ధన మెత్తడం ॥మహిషా॥
మహావిష్ణు వరాహంగ అవతారం దాల్చడం ॥మహా॥
పురాణాల ఘట్టాలు పొందుపర్చిరి ॥పురాణాల॥
ముచ్చటగా కన్నులకు విందు నిచ్చిరి
మహాబలిపురం మహాబలిపురం మహాబలిపురం
పాశుపతం కోరెను పార్థుని మనసు
పరమశివుని కోసము చేసెను తపసు ॥పాశు॥
సృష్టంతా కదలివచ్చి చూడసాగెను ॥సృష్టంతా॥
ప్రతిసృష్టి ఈ శిల్పమని పేరువచ్చెను ॥ప్రతి॥
మహాబలిపురం మహాబలిపురం మహాబలిపురం


లక్ష్మీ ఎంటర్‌ప్రైజెస్
బాలరాజు కథ
రమణ కెమెరా సెల్వరాజ్ సంగీతం మహదేవన్ నిర్మాత నిడుమర్తి పద్మాక్షి
లక్ష్మీ ఫిలింస్

**సంద్రంలో కలిసినవి కలసిపోయెను**
**ఒంటరిగా ఈ కోవెల... మిగిలిపోయెను..** **॥సంద్రం॥**
**దేవుని పాదాలను కెరటాలు కడుగును నిత్యం** **॥పాదా॥**
**మనుషుల పాపాలు ఇవి చూడ**
**తొలగును సత్యం సత్యం** **॥పాపాలు॥**
**॥మహాబలిపురం॥**

**మహాబలిపురం మహాబలిపురం మహాబలిపురం.**

వాక్కు నాలుగు రకాలు- పరా, పశ్యన్తి, మధ్యమా, వైఖరీ. పరా-రాళ్లు, పశ్యన్తి-వృక్షాలు, మధ్యమా-పశువులు-చివరగా నాలుగవదైన వైఖరీ - మనుషులు మాట్లాడే వాక్కు - రాళ్లు మాట్లాడుతాయా? అంటే అవును హృదయానికి చెవులుంటే జగతిలోని ప్రతిశబ్దం వినిపిస్తుంది. రాళ్లల్లో కప్పలు నివసించటం, రాళ్లు నోళ్లు విప్పి రమణీయంగా పలకటం సహజమే - విధాత విచిత్రజగతిలో అన్నీ అద్భుతాలే. మహాబలిపురం శిల్పసౌందర్యం అంతా రాళ్లు నోళ్లు విప్పిచెప్తే ఆరుద్రకే వినిపించాయి ఈ పాటలో. సుందరశిల్పాల పదాలన్నీ అందమైనప్రాసలలో ఒదిగినతీరు చూడండి - బలిపురం - గోపురం, పల్లవరాజు- బాలరాజు, కంచి-మంచి, వీటిమీద-వాటమైన, పొందుపర్చిరి-విందునిచ్చిరి, మనసు-తపసు, చూడసాగెను-పేరువచ్చెను...శిలలు పదాలుగా మారితే ఇలాగే ఉంటుంది.

ఇలాంటి పదాల భాష కె.వి.మహాదేవన్‌కు చాలా చక్కగా తెలుసు.పదాలలో ఉన్న వాడి, వాసి, నాణ్యత, రంగు, మన్నిక అన్నింటినీ గీతశిల్పంగా చేసి క్షేత్రానికున్న విలువను పెంచారు. కాలగర్భంలో కలిసిన శిలలన్నీ శిథిలాలై ఒంటరిగా యీ కోవెల మిగిలిందని చెప్పడంలో స్వరకల్పనాచాతుర్యం చక్కగా ఒదిగిపోయింది. 'మహాబలిపురం...' అని ముచ్చటగా మూడుసార్లు చెప్పించడంలో ఒక గతిగమనం, వేగం అన్నీ పాటను పతాకస్థాయి రీతిలో పలికాయి. నటభైరవిరాగం యీ పాటకు ఆధారం.

ఆరుద్ర కలంలో పలికిన శిల్ప వీణల రవళి, కఠినశిలల కారుణ్య వేణుగాన ధ్వనులు సుశీల గొంతులో సుస్పష్టంగా వినిపించాయి. ఈ పాట వింటుంటే శిల్పుల హృదయాలు గాత్రంలో ఆవిష్కరించినట్లుంటుంది. దృశ్యకావ్యంగా కళ్లెదుట కనిపించి హృదయానందం కలుగుతుంది. నటభైరవి సుస్వరాలు శిల్పవీణలను మీటి తలకట్టున్న పదాలన్నీ తలెత్తుకుని మురిసిపోయాయనే స్థాయిలో సుశీల గాత్రం పలికింది. చిన్నపిల్లవాడు పాడడానికి అన్ని విధాల తగినట్లు కలం, స్వరం, స్వనం మూడూ యీ పాటలో కలిసివచ్చాయి.

# అమాయకురాలు (1971)

❖ దాశరథి ❖ ఎస్.రాజేశ్వరరావు

**పాడెద నీనామమే గోపాలా! ॥పాడెద॥**
**హృదయములోనే పదిలముగా నే**
**నిలిపెద నీ రూపమేరా ॥పాడెద॥**
**మమతలతోనే మాలికలల్లి నిలిచితి నీ కోసమేరా ॥మమత॥**
**ఆశలతోనే హారతి చేసీ పదములు పూజింతురారా ॥పాడెద॥**
**నీ మురళీగానమే పిలిచెరా**
**కన్నుల నీ మోము కదలెను లేరా ॥నీ మురళీ॥**
**పొన్నలు పూచే బృందావనిలో**
**వెన్నెలకురిసే యమునాతటిపై ... ॥పొన్న॥**
**నీ సన్నిధిలో జీవితమంతా**
**కానుక చేసేను రారా ॥పాడెద॥**

ఆనాటి తెలుగు సినిమాలను పరిశీలిస్తే మనకెన్నో ముచ్చటైన దృశ్యాలు కన్పిస్తాయి. అందుల్లోనూ అన్నపూర్ణావారి చిత్రాలైతే ఇక చెప్పక్కర్లేదు. ఆ సంస్థ నిర్మించిన చిత్రాల్లోని పాటలన్నీ కథకు ఒకింత సంబంధం లేకపోయినా ప్రేక్షకులకు ఆహ్లాదం కలిగించడంలో నూటికినూరుపాళ్లూ విజయం సాధించిన పాటలవి. అలాంటివాటిలో యీ వీణపాట ఒకటి.

అసలు ఒక అందమైన యువతి తనకంటే అందమైన తంజావూరు వీణను చేతబట్టుకుని చక్కగా, శ్రావ్యంగా పాట పాడుతుంటే ఆ దృశ్యం ఎంతో కన్నులపండువగా ఉంటుంది. ఈ విషయం గుర్తెరిగే స్వర్ణయుగపు దర్శకనిర్మాతలు, అవకాశం ఉన్నా లేకపోయినా తమ చిత్రాల్లో వీణపాటల్ని చొప్పించేవారు.

ఇక వీణపాటలకు కథానాయకుడు ఎవరు? ఇంకెవరు... మధురానగరి మర్మమెరిగిన మాధవుడే. ఈ వేణుగోపాలుని వీణపాటలన్నీ 'లైట్ క్లాసికల్' పద్ధతిలో లలితంగానూ, గంభీరంగానూ ప్రేక్షకశ్రోతల్ని అలరించేపద్ధతిలో చిత్రీకరించేవారు. ఈ పద్ధతిలోనిదే ఈ వీణపాట కూడా!

సాహితీవనంలో చిలిపి కోయిలలు చెట్లశాఖల మాటునదాగి ఏవో కుహుకుహుగానాలు చేస్తుంటాయి. వాటి మనసు తెలుసుకున్న కవులు వాటిని ఎంపిక

చేసుకుని గీతంగా అనువదిస్తుంటారు. ఈ శుకపాళీవిలాసప్రకటనలను స్వరకర్తలు అందుకుని, సప్తస్వరార్చన చేసి ప్రతిపదానికి స్వరసుగంధాలను అద్ది రాగార్చితంగా ముస్తాబుచేసి మరలా శుకపికనాదాల కోసం ఎదురుచూసి పాటను వసంతకోకిలలా ఎగురవేస్తారు. ఇంత జరిగితేగానీ శ్రోతల హృదయాలను ఈ నవ వసంత రసవంత మాధురులు పులకరింపజేయవు. ఇలాంటి తరుణంలో పాట గౌరవాన్ని, సందర్భ ఔచిత్యాన్ని కరగించి, రంగరించి దాశరథి అందించారు.



లలితసంగీత నిర్వచనానికి నిలువెత్తు స్వరసంతకం ఎస్.రాజేశ్వరరావు. ఈపాటను నాలుగు రాగాల మిశ్రమం అయినా ఒకే రాగంలో పలుకుతున్నదా?అనేంత సుకుమారంగా స్వరపరచారు. సుశీల పాడిన పాటల్లో ఇదొక మహత్తర మధురగీతమని అశేష శ్రోతల ముక్తకంఠ అభిప్రాయం. పాటపల్లవి హంసధ్వనిరాగంలో, మొదటిచరణం మోహన, శంకరాభరణ రాగాలను స్పృశించి, రెండోచరణం సింధుభైరవి రాగంలో తన్మయంచెంది సుశీల గళంలో రాగనిగళ గీతహారంగా వెల్లివిరిసింది. పేరుకు సినిమాలో పెళ్లిచూపుల పాటే అయినా, విడిగా ఇదొక భక్తిగీతంగా బహుళప్రచారంలో ఉండిపోయింది. ఆరోజుల్లో అమ్మాయిల నోళ్లలోనూ మారుమ్రోగిందీపాట. తెరమీద అభినయం "ఊర్వశి" శారద.

# సతీ అనసూయ (1971)

❖ సి.నారాయణరెడ్డి ❖ పి.ఆదినారాయణరావు


**ఆలయమేలా? అర్చనలేలా? ఆరాధనలేలా?**
**పతిదేవుని పదసన్నిధి మించినది వేరే కలదా?**
**అదే సతి పెన్నిధి కాదా? అదే పరమార్థము కాదా? ॥పతి॥ ॥ఆలయ॥**
**ఏ కొండ కొమ్ముపైనో**
**ఏ రాతి బొమ్మలోనో**
**దైవమ్ము దాగెనంటూ తపియించనేలా ॥ఏ కొండ॥**
**ఆ దైవము నిజముగ వుంటే – అడుగడుగున**
**తానై వుంటే గుడులేల యాత్రలేలా? ॥పతి॥ ॥ఆలయ॥**
**పైపైని మెరుగుల కోసం భ్రమ చెందు గ్రుడ్డిలోకం**
**మదిలోన వెలిగే అందం గమనించునా? ॥పైపైని॥**
**ఈ లోకులతో పనియేమి–పలుగాకులు**
**ఏమంటేమి – నా స్వామితోడు రాగా ॥పతి॥ ॥ఆలయ॥**
**ఆరాధనలేలా? ఆరాధనలేలా?**

సుమతి భర్త కుష్ఠువ్యాధిపీడితుడు. ఆమె మాత్రం పతిసమర్పిత సమస్తజీవన. 'పతియేదైవం' అన్నది అనాదిగా ఉన్న మనవారి సంప్రదాయిక విశ్వాసం. భర్త–దేవుడు ఇద్దరిలో ఎవరుగొప్ప? అన్నప్పుడు భర్తదే ఆధిక్యమని సుమతి అభిమతం. పతియే దేవుడైనప్పుడు అతనిసన్నిధి ఆలయమే అవుతుంది.

ఈ పాట పల్లవిలో మొదటివాక్యం లయరీతి లేని ఆలాపనశైలిలో ఉంటుంది. సతీసుమతి ఆత్మప్రత్యయాన్ని ఘోషించేట్టుగా ఉంటుంది. దర్బారీకానడరాగంలో ఆదినారాయణరావు కూర్చిన బాణీకి సి.నారాయణరెడ్డి రాసిన పాట ఇది.

అసలు పల్లవి "పతిదేవుని" అనే పదంతోనే ప్రారంభమౌతుంది. చరణంలో దైవం ఎక్కడో లేదు, ఆత్మేశ్వరుని సాన్నిధ్యంలోనే ఉంది, అలా ఉన్నప్పుడు యాత్రలు సాగించడం, మందిరాలను దర్శించడం ఎందుకని సుమతి సూటిగా ప్రశ్నిస్తుందీ పాటలో.

దేవుని ఉనికిని కనుక్కోవడానికి కొండశిఖరాల నెక్కుతారెందుకు? చెక్కినరాతి బొమ్మలను మొక్కుతారెందుకు? ఆ దైవమే అడుగడుగునా ఉంటే ఆ గుళ్లూ, యాత్రలూ




ఎందుకు? – ఇలా నిశితంగా ప్రశ్నించే సుమతి మాటలను చూస్తే నాస్తికత్వం అనిపించవచ్చు. కానీ అదినిజం కాదు. ఆమె జీవితంలో స్మరణీయ పరణీయదైవం పతిదేవుడు మాత్రమే. ఆ పతినిమించిన దేవుడేడీ? అంటూ ఆమె ప్రశ్నించడంలో అభివ్యక్తమయ్యేది ఆమె పతినిష్ఠిత ప్రవృత్తే. తన భర్త వికృతాంగుడు అది లోకం దృష్టిలో. నిజానికి అందం ఆకృతిలో లేదు. బాహిరరూపంలో లేదు. అంతరంగంలో ఉంది. అనుభవించేవారి ఆలోకనంలో ఉంది.

ఈ పాటను అందుకున్న సుశీల పైన చెప్పిన భావాలన్నీ పాత్రద్వారా పొంది కవి భావాలకు న్యాయం చేస్తూ దర్బారీ కానడరాగ స్వరాలను అత్యంత ఆర్ద్రంగా గొంతులో పలికించారు. పాటలోని అన్ని ప్రశ్నలను గొంతులో ప్రశ్నిస్తూ చివరగా తన పతి తోడు ఉండడమే భగవంతుని ఉనికిగా ప్రకటించినతీరు ప్రశంసనీయం. 'ఈలోకులతో పని యేమి – పలుగాకులు ఏమంటేమి?... అని నిలదీసి చెప్పిన సమాధానంగా పాట ముగుస్తుంది. ఇదొక నిరసన స్థితి పతాకస్థాయికి అత్యుత్తమభావన. ఈ గాత్రంలో ఒక హెచ్చరిక, నిజాన్ని చాటే సందేశం, సందేహం పటాపంచలయ్యే మోక్షమార్గం ప్రస్ఫుటమయ్యాయి.

# సతీ అనసూయ (1971)

❖ సి.నారాయణరెడ్డి ❖ పి.ఆదినారాయణరావు

ఎన్నిజన్మల ఎన్నినోముల
పుణ్యమో ఈ నాడు కంటిని
జగములూపే ముగురుమూర్తులె
చంటిపాపలు కాగా! మా
యింట ఊయల లూగ
బృందం : లాలీ!లాలీ!లాలీ!లాలీ! ॥ఎన్ని॥ ॥లాలీలాలీ॥
నొసటి వ్రాతలు వ్రాసి వ్రాసీ
విసిగినావో నిదురపో
బృందం : బ్రహ్మయ్య తాతా నిదురపో
అసురకోటుల దునిమి దునిమీ
అలసినావో నిదురపో
బృందం : నారయ్యనాన్నా నిదురపో
ప్రళయతాండవమాడి ఆడీ
సొలసినావో నిదురపో
బృందం : శివయ్యబాబూ నిదురపో ॥ఎన్ని॥ ॥లాలీలాలీ॥
లలితకళలకు నిలయమైన
వాణియే నా కోడలాయె
బృందం : లాలీ జయలాలీ
లాలితముగా సిరుల నొసగే
లక్ష్మియే నా కోడలాయె
బృందం : లాలీ శుభలాలీ!
పతిని కొలిచిన భాగ్యమేమో
పార్వతియె నాకోడలాయె
బృందం : లాలీ ప్రియలాలీ ॥ఎన్ని॥ ॥లాలీలాలీ॥

మన పురాణగాథలతో అంతంతమాత్రం పరిచయం ఉన్నవాళ్లకు కూడా 'సతీఅనసూయ' కథ తెలుసు. ఒక ఋషిపత్ని తన పాతివ్రత్యగరిమతో త్రిమూర్తులను కూడా చంటిపాపలుగా మార్చేసిన ఉదంతం ఆ కథకు ఆయువుపట్టు. ఆ మూర్తిత్రయాన్ని పసిపాపలుగా మార్చిన తరువాత అనసూయ వారిని లాలిస్తూ

లాలిపాట పాడే సన్నివేశమిది.

ఈ లాలిపాటను పాడుతున్నది ఓ తల్లిమనసు పాపలనుద్దేశించి, అక్కడ ఆశ్రమవాతావరణంతో, ఆ దేవతామూర్తులతో ఉండాల్సిన ప్రసక్తికంటే మాతృత్వ మాధుర్యానికే అగ్రస్థానం. ఆ దృష్టితోనే 'భీంప్లాస్' రాగంలో మూడు+నాలుగు మాత్రల గణాలతో నడిచే మిశ్రగతిలో బాణీని రూపొందించారు ఆదినారాయణరావు. ముందే బాణీ సిద్ధమయ్యాక ఆ బాణీకి రాయబడ్డ రచన ఇది.

త్రిమూర్తులు త్రిలోకాలనే ఊపేవారు. అంటే నడిపేవారు. ఊపేవారే ఆ కుటీరంలో చంటిపాపలై ఉయ్యాలలో ఊగుతున్నారు. అదీ గమ్మత్తు. చరణంలో ఒక్కొక్కరి భావాన్ని చమత్కారంగా ప్రతిపాదించారు సి.నా.రె. చమత్కారంగా అని ఎందుకనుకోవాలంటే, ఆక్షణంలో ఆ దేవుళ్లు పసివాళ్లై ఉన్నారు కాబట్టి. అమ్మస్థానంలో ఉన్న అనసూయ ఒక్కొక్కరిని ఉద్దేశించి పాడుతుంది.

వారిలో బ్రహ్మ సృష్టికారకుడు. జీవకోటుల ఆయుర్దాయాన్ని, కర్మాచరణ విధానాన్ని విధించేవాడు. విధి అతడే, విధాత అతడే. "లలాట లిఖితం" అనే అభిప్రాయాన్ని తల్లినోట అలా అనిపించారు గీతరచయిత. బ్రహ్మ విధాత మాత్రమే కాదు. తాతలాంటివాడు కూడా... తాత ఇప్పుడు యీ సన్నివేశంలో పాలుగారే లేతవాడయ్యాడు. అందుకే బ్రహ్మయ్య తాత అనిపించారు కవి. ఆ తరువాతి వంతు విష్ణుమూర్తిది. దైత్యసంహారం చేసిచేసి అలసిపోయిన ఆ నారయ్యను ''నాన్నా'' అని సంబోధించడంలో మాతృత్వం తొణికిసలాడింది. మరి శంకరుని సంగతి – ఆయన భోళాశంకరుడు మాత్రమే కాదు, తాండవ ఖేలావశంకరుడు కూడా. తాండవం చేసి చేసి సొలసిపోయిన శివయ్యను 'బాబూ" అని ఆ తల్లి సంబోధించడంలోని ఔచిత్యం గమనించదగ్గది.

చివరి చరణంలో సరస్వతి తన కోడలైందని 'జయలాలి', లక్ష్మీదేవి కోడలైందని 'శుభలాలి', పార్వతీమాత కోడలైందని 'ప్రియలాలి' ని ఆలపిస్తుంది ఆ మహాపతివ్రత అనసూయ.

ఈ ఇతివృత్తంలో ఉన్న వైశిష్ట్యమేమిటంటే ప్రధానపాత్ర పేరే అనసూయ. అంటే అసూయలేనిది. అంతటి త్రిమూర్తుల భార్యలూ అసూయతో మసకబారిపోయారు. ఎంతటి వారికైనా అసూయ మంచిదికాదని ఈ కథ మనకు హితబోధ చేస్తుంది.

ఇక యీ పాటలో సుశీల తన గాత్రప్రతిభను ఒడిసిపట్టి త్రిమూర్తులకు లాలిపాట పాడి జోకొడుతూ మేల్కొల్పారు. అనసూయాదేవి పవిత్ర పాతివ్రత్యభావనలన్నింటినీ ఆమె గాత్రంలో మేళవింపు చేసుకుని మురిసిపోయారు. ముగ్గురమ్మలను మురిపింపజేసి కోడళ్లుగా చేసుకున్న అనసూయ హృదయానందమంతా సుశీల గళంలో నిండుగా పండాయి. పరీక్షించదలచిన జగన్మాతలను ముప్పురినీ, పసిపాపలైన త్రిమూర్తులను పరవశింపజేసిన ఘనత సతీఅనసూయదైతే, ఆ మహాఇల్లాలికే గాత్రదానం చేసిన గొప్పదనం, ధన్యత్వం సుశీలది.

# సంపూర్ణరామాయణం (1972)

❖ దేవులపల్లి ❖ కె.వి.మహాదేవన్

ఊరికే కొలను నీరు ఉలికి ఉలికి పడుతుంది
ఓరగా నెమలిపింఛ మారవేసుకుంటుంది!
ఎందుకో ఎందుకో ప్రతి పులుగు ఏదో చెప్పబోతుంది!
వనములో చెట్టు చెట్టు కనులు విప్పి చూస్తుంది!
ఉండుండీ నా ఒళ్లు ఊగి ఊగి పోతుంది
అదిగో! రామయ్యే! ఆ అడుగులు నా తండ్రివే!
"ఇదిగో శబరీ శబరీ" వస్తున్నా నంటున్నవి!
కదలలేదు వెట్టిశబరి, ఎదురు చూడలేదని
నాకోసమె నాకోసమె నడచి నడచి నడచీ
నాకన్నా నిరుపేద నా మహరాజు! పాపం అదుగో
అసలే ఆనదు చూపు!
ఆపయి ఈ కన్నీరు
తీరా దయచేసిన నీ రూపు తోచ దయ్యయ్యో!
ఏలాగో నా రామా! ఏదీ? ఏదీ? ఏదీ?
నీలమేఘమోహనము నీ మంగళరూపము!
కొలను నడిగీ తేటనీరు
కొమ్మనడిగీ పూలచేరు
పట్టునడిగీ చెట్టునడిగీ
పట్టుకొచ్చిన ఫలాలు పుట్టతేనె రసాలు
దోరవేవో – కాయలేవో!
ఆరమొగ్గిన వేవో గాని,
ముందుగా రవ్వంత చూసి
విందుగా అందియ్యనా? విందుగా అందియ్యనా?

ప్రకృతిలోని అణువునూ, స్థాణువునూ అతిదగ్గరగా అంతరంగంలో చూడగలిగిన దార్శనికులు దేవులపల్లి. సంగీతం 'నాదం' ద్వారా సాధించేది, కవిత్వం శబ్దం ద్వారా

సాధించేది. నాద, శబ్దాలు రెండింటిని సమతూకంలో మేళవించి ప్రకృతిలో మమేకవటమే కృష్ణశాస్త్రి శుక్లపక్ష సాహిత్యం.




ఈయన సినిమాపాటల్లో శబరి కోసం రాసిన పాటలు మూడు కన్పిస్తాయి. 'నిన్ను జూచునందాక, (భక్తశబరి, 1960) 'ఊరికే కొలను నీరు' (సంపూర్ణరామాయణం, 1972), 'ప్రతికొండ నాతో కలసి' (శ్రీరామపట్టాభిషేకం, 1978). ఒకే పాత్రకు ఒకే సన్నివేశంలో ఒకే కవి రాయడమనేది అపూర్వగౌరవం. అది ఒక్క దేవులపల్లికే దక్కింది. అయితే మూడుపాటల్లోనూ మూడువస్తువుల్ని వేర్వేరుగా తీసుకుని వైవిధ్యం ప్రదర్శించారాయన. ''భక్తశబరి'' పాటలో శబరి స్వగతముంటుంది. రెండోపాట (ప్రస్తుతం ఇక్కడ విశ్లేషించుకుంటున్నపాట) లో శబరి ఆశ్రమానికి రాముడిరాక ఉంది. మూడోపాట 'ప్రతికొండ' పాటలో రామునికోసం శబరి పండ్లను ఏరడం వస్తువు.

ఈ మూడు పాటలూ శబరిపాత్ర ఉద్వేగంతో, భక్త్యావేశంతో, ఆర్తితో, తన్మయత్వంతో పాడేవే. దేవులపల్లి శబరిని దర్శించి ఆ దర్శనం మనకు కలిగించేలా అద్భుతరచన చేశారు. వి.ఏ.కె. అన్నట్లు దేవులపల్లిలాగా భక్తిలో ఆర్తిని రాయగల వారెవ్వరూ లేరు. దేవులపల్లి కవితలో ఈక్ష ఉండదు. కేవలం ఉత్ప్రేక్ష మాత్రమే. అంటే బాహ్యనేత్రాల చూపు ఉండదు. కేవలం మనోనేత్రాల దర్శనంతో తాను చూసింది చెప్పగలిగే నేర్పు.

ఈ పాటలో 'ఊగి ఊగి పోతుంది', 'శబరీ శబరీ', 'ఉలికి ఉలికి పడుతుంది', 'నడిచీ నడిచీ నడిచీ', 'ఏది ఏది ఏదీ'.. పద ప్రయోగాల్లో శబరిలోని రామగమనాభిలాష తీవ్రత రెట్టింపుగా ప్రదర్శితమౌతోందే తప్ప పునరుక్తి దోషమనుకోవడానికి వీల్లేదు.

బాగా గమనిస్తే ఈపాటలో పల్లవి, అనుపల్లవి, చరణాలు అంటూ పాటరచనా సంప్రదాయం ప్రత్యేకంగా కన్పించదు. ఇంత అందమైన ఆర్తిగీతాన్ని, మహాదేవన్ ప్రతిశబ్దంతోనూ మమేకమై పాటను ప్రాణదీపంలా స్వరపరిచారు. శబరి నిర్మలహృదయాన్ని బాణీగా మలచి, స్వరాలుపొదిగి అందించారు. ఈ అద్భుతమైనపాటను సంప్రదాయరాగమైన శహనా రాగంలో ద్రాక్షాపాకంలో మలిచి శబరి రాముడికి అర్పించిన తియ్యనిపళ్లలా మనకీపాటను అందించారు. ఈ రాగంతోపాటు ఆనందభైరవి, మోహనరాగాలు కూడా యీ పాట స్వర రచనలో కన్పిస్తాయి.




వెండితెరపై చిత్రీకరించిన నాలుగు 'శబరి' గీతాలకూ సుశీలగారే తన విమలగాంధర్వగాత్రంతో ప్రాణప్రతిష్ఠ చేయడం గమనార్హం. పైన చెప్పుకున్న మూడు 'శబరి' గీతాలతో పాటు 'వస్తున్నాడమ్మా రాముడొస్తున్నాడమ్మా' (సీతారామ వనవాసం,1977) పాటనూ ఆమే ఆలపించి ఘనత కెక్కారు. ఈ పాట విషయానికొస్తే సుశీల – శబరి పాత్రలో మమేకమైపోయి, ప్రకృతిలోని కొలను, నెమలిఫించం, చెట్టు, పుట్ట, కొమ్మ, పండు, పువ్వు ప్రతివస్తువులో గాత్రమాధుర్యాన్ని పొదివి మంజులగాన ప్రతిభను చూపారు. ముఖ్యంగా 'అసలే ఆనదు చూపు, ఆపయి కన్నీరు' అన్న చోట సుశీల పాటను సజలనేత్రాలతో పాడారా? గాద్గద్యమైన గొంతుతో పాడారా? అనే సందేహం రాకమానదు. పసిపిల్లలకు, నవయువతులకు, నడివయస్సు మహిళలకే గాక ముదివగ్గులకు కూడా అతికినట్లు అవలీలగా పాడగలగడం ఆమెప్రతిభ. సాహితీకర్త, స్వరబ్రహ్మల భావనలు తానూ అంతరంగంతో అనుసంధానం చేసుకోగల ప్రజ్ఞాపాటవాలు ఆమె సొమ్ము.

ఈ పాటనొక పరిపూర్ణమైన పాటగా చెప్పుకోవచ్చు. అక్షరం, స్వరం, గాత్రంతో పాడిన పద్ధతి, తెరమీద పండరీబాయి అభినయం అన్నీ కళ్లకు కన్పించేటట్టు ఒక పెయింటింగ్ వేసినట్టు తీశారు బాపు.

# నీతి నిజాయితీ (1972)

❖ సి.నారాయణరెడ్డి ❖ యస్.రాజేశ్వరరావు

మాటలకందని భావాలు
మంచిమనసులు చెబుతాయి
కవితల కందని భావాలు
కంటిపాపలే చెబుతాయి
వెన్నెల మాటాడునా? వెదజల్లును చల్లదనాలు
మల్లిక మాటాడునా? కురిపించును పరిమళాలు
బాసరాని పాపాయి బోసినవ్వు చాలదా?
ఏనాడూ పలకని దైవం ఈ లోకము లేలదా? ॥మాటల॥
పిల్లగాలి పరుగులలో వెల్లివిరియు గీతికలూ
కొండవాగు తరగలలో కోటిరాగమాలికలూ
హృదయానికి చెవులుంటే జగమంతా నాదమయం
కనగలిగిన మనసుంటే బ్రతుకే అనురాగమయం ॥మాటల॥

మంచిమనసులోనుండే మంచిభావనలు వస్తాయి. అవును నిజమే కదా! కవి భావనలు ఎంత నిజాయితీగా జాలువారాయి యీ పాటలో. Face is the index of mind అనే దానిలో రెండు ప్రధానభూమిక లున్నాయి. ముఖంలో కనిపించేవి రెండే. ఒకటి కళ్లు, రెండవది పెదవులు. అంటే చిరునవ్వు. ఈ రెండింటి తర్వాత హృదయం. దీనికి చెవులుంటే జగమంతా నాదమయం.. ఇక తర్వాత ప్రకృతి.. అందులోని ప్రతీది శబ్దసౌందర్యమే... వినసొంపైన వినోదమే-ఈ అంశాలన్నింటినీ గీతంగా మార్చారు సి.నా.రె. ఆయన కలంలోని బహుముఖీన ప్రావీణ్యం, మాటల్లోని మర్మం మనోజ్ఞంగా హృదయనాడులను స్పందింపచేస్తాయనడంలో సందేహం లేదు.

ఒకే వీణలో వేయిరాగాలు.. ఒకే గొంతులో అనేక కోకిల స్వరాలు. ఆమే మన ప్రియతమ గాయని సుశీల. ఈ పాటలో కొన్ని చోట్ల పతాకస్థాయి మధురిమల ఉచ్ఛారణలు ఎంత కోమలంగా వినిపిస్తాయో .. అని వాటిని పరికిస్తుంటే ఇంతలోనే మరో రమణీయపదం చెవిసోకుతుంది.. ఇలా పదం, పదం గొలుసుకట్టుగా వింటుంటే కవిభావనలోని మర్మాలు అవగతం అవుతుంటాయి. చాలా చక్కనిపాట ఇది. ప్రతి పలుకులో చల్లదనం, పరీమళం, సుస్పష్ట శబ్దసౌందర్యరాశిగా, వాసిగా వినిపిస్తాయి. ఇది తెలుగుపాటకు శాశ్వతత్త్వం కల్పించిన సుశీల ఘనత.

# మేనకోడలు (1972)

❖ దాశరథి ❖ ఘంటసాల

పల్లవి : తిరుమల మందిర సుందర
సుమధుర కరుణా సాగరా
యే పేరున నిను పిలిచేనురా
యే రూపముగా కొలిచేనురా ॥తిరుమల॥

చరణం : పాలకడలిలో శేషశయ్యపై
పవళించిన శ్రీపతివో
వెండికొండపై నిండుమనము తో
వెలిగే గౌరీపతివో
ముగురమ్మలకే మూలపుటమ్మగ
భువిలో వెలసిన ఆదిశక్తివో ॥ తిరుమల॥


తిరుమలమందిర సుందర
సుమధుర కరుణా సాగరా

చరణం : కాంతులు చిందే నీ ముఖబింబము
కాంచిన చాలును ఘడియైనా
నీ గుడి వాకిట దివ్వెను నేనై
వెలిగిన చాలొక రేయైనా
నీ పదములపై కుసుమము నేనై
నిలిచిన చాలును క్షణమైనా ॥తిరుమల॥

తిరుమల మందిర సుందర
సుమధురకరుణా...... సాగరా...

శ్రీ వేంకటేశ్వరునిపై భక్తిని అన్నమయ్యబాటలో దాశరథి వర్ణించగా, ఘంటసాల ఆ అందాలను తన స్వరాలలో బందీని చేయగా, ఆ బందీని పకడ్బందీగా సుశీల మూర్తీభవించి పాడగా ప్రభవించిన పాట ఇది. ప్రతిరోజూ ఉదయమో, సాయంత్రమో ప్రతి ఊళ్లోని గుళ్లోనూ విన్పించే భక్తిగీతమిది. పాటలో ఒదిగిన భక్తిభావనలు అన్నమయ్య వంటి వాగ్గేయకారులు, కులశేఖరుల వంటి ఆళ్వారుల మనోధర్మాలకు అద్దం పట్టినట్లు

రాశారు దాశరథి. చాలా సులువైన తెలుగుమాటలే యీ పాట. అత్యంత సన్నిహితంగా పామరుడు కూడా భగవంతునితో సంభాషించే తేలికైన పదాల తేటతెనుగుపాట ఇది.




ఇక ఘంటసాల స్వరకల్పనలో ఇదొక మోహన భక్తిగీతం. పరమాత్మ పరవశించి వరాలిచ్చేపాట, కోరికలు తీర్చే పదచింతామణి. పంచదార, పాలు లేకుండా క్షీరాన్నం తయారుకాదు. ఈ క్షీరాన్నప్రసాదం లేని పండుగ పండుగే కాదు. అలాగే మోహనరాగం ప్రస్తావించని లలిత, సినీగీతాలుండవు. సరిగపదస–అనే అయిదుస్వరాలను పంచామృతస్థాయిలో పలికించిన ఘంటసాల 'మోహన' రాగప్రస్తారం చిరస్మరణీయం, ప్రాతఃస్మరణీయం.

ఘంటసాల, సుశీల వేరువేరుగా పాడటం వల్ల ఇది అందరూ పాడుకునే తెలుగింటి భక్తిపాటగా నేటికీ బహుళప్రచారంలో ఉంది. ఈ చిత్రంలో యీ పాట తప్ప తక్కిన పాటలేవీ ప్రజల్ని ఆకట్టుకోలేదు. ఈ పాటలో విలంబితంగా మొదలైన పదాలు పోనుపోను ఒకస్థాయికి పెరిగి 'భువిలో వెలిసిన ఆదిశక్తివో' అనే రసమయ గమకంతో మరల యధాస్థితికి రావటం సుశీల గొంతులో సుస్పష్టం. పాటచివరలో తాళంతో సమన్వయం చేసుకుంటూ 'క్షణమైనా' అన్న సుశీల గొంతులోని మార్ధవం, మాధుర్యం, భక్తిరస ప్రకటనలకు చక్కని నిర్వచనం. పాట ముగింపులో సుమధుర కరుణాసాగరా...' లోని గమక విన్యాసాలు గణనీయమైన భక్తిభావాలను కల్గిస్తాయనడంలో సందేహం లేదు. ఇక యీ పాటవిన్నాక ఆ ఏడుకొండలస్వామీ క్రిందికి దిగిరాక తప్పదు.... ఎంతైనా శ్రీపతి నాదగానప్రియుడు కదా!

# తాత-మనవడు (1973)

❖ సి.నారాయణరెడ్డి ❖ రమేష్ నాయుడు

పల్లవి: ఈనాడే బాబూ నీ పుట్టిన రోజు
ఈ........ ఇంటికే....
ఈ ఇంటికే కొత్తవెలుగు వచ్చినరోజు
ఈనాడే బాబూ నీ పుట్టినరోజు

చరణం : చిన్నిబాబు ఎదిగితే కన్నవారి కానందం
నెలవంక పెరిగితే నింగికే ఒక అందం
చుక్కలు వేయెందుకు ఒక్క చంద్రుడే చాలు ॥చుక్కలు॥
తనవంశం వెలిగించే తనయుడొకడె పదివేలు ॥ఈనాడే॥

చరణం : కన్నవారి కలలు తెలుసుకోవాలి – ఆ
కలలు కంటనీరు పెడితె తుడవాలి ॥కన్న॥
తనకు తాను సుఖపడితే తప్పుగాకున్నా
తనవారిని సుఖపెడితే ధన్యత ఓ నాన్నా ॥ఈనాడే॥

చరణం : తండ్రి మాటకై కానకు తరలిపోయె రాఘవుడు
అందుకె ఆ మానవుడు ఐనాడు దేవుడు
తల్లి చెరను విడిపించగ తలపడె ఆ గరుడుడు
అందుకె ఆ పక్షీంద్రుడు అంతటి మహనీయుడు
ఓ బాబూ నువ్వు ఆ బాట నడవాలి ॥ఓ బాబూ॥
భువిలోన నీపేరు ధ్రువతారగ వెలగాలి...
ధ్రువతారగ వెలగాలి ॥ఈనాడే॥



కథాపరంగా అత్యంత సామాన్యకుటుంబీకులైన తల్లిదండ్రులు చెమటను రక్తంగా ధారపోసి కొడుకును పెంచి పెద్దజేస్తారు. ఎదిగిన ఆ కొడుకు భార్యచేతిలో కీలుబొమ్మగా మారి దయనీయస్థితిలో ఉన్న

కన్నవారినే విస్మరిస్తాడు. తల్లి తన ఇంట్లోనే పనిమనిషిగా ఉంటుంది. ఈ నేపథ్యంలో కొడుకు కొడుకు పుట్టినరోజు పండుగనాడు పనిమనిషిగా లోకానికి పరిచయమైన ఆ పిల్లవాడి నాన్నమ్మ పాడే పాట ఇది.




ఈపాట సాహిత్యాన్ని పరిశీలిస్తే ఇదొక ప్రామాణిక సిద్ధాంతాల ఉపనిషద్వాక్య సారాంశంగా కన్పిస్తుంది. ''KNOW THY SELF'' – ''నిన్ను నీవు తెలుసుకో'' "PURPOSE OF BIRTH ON THIS EARTH" అనే నేపథ్యసందేశం ఇందులో ఇమిడి ఉంది. దానికి నరేంద్రుడైన రాముణ్ణి, పక్షీంద్రుడైన గరుడుణ్ణి ప్రతీకలుగా తీసుకుని వారి జన్మసార్థక్యాలను అన్యాపదేశంగా కొడుకు నుద్దేశించి అతిచిన్నపదాలలో అవలీలగా అందించారు డా॥సి. నారాయణరెడ్డి. 'ఆకాశంలో చుక్కలు ఎన్ని ఉన్నా పెరిగే చంద్రుడు ఒక్కడు చాలు' అనటంలో ఆదికవి నన్నయ 'సుతజల పూరితంబులగు' పద్య ప్రభావం కన్పిస్తుంది. 'పుట్టినరోజు' కు పరమార్థగీతంలా ఇది నిలిచిపోయింది.

రమేష్‌నాయుడు స్వరకర్తగా ఎన్నో అద్భుతప్రయోగాలు చేశారు. ఆయన స్వరరచనలో చల్లని పరిశుభ్రమైన నీరూ ఉంటుంది. మధువును స్వరాలలో పరచి అందించే ప్రతిభామృతమూ ఉంటుంది.

సవర్ణదీర్ఘసంధి, గుణసంధిని, ఆ పదవిభజనలను కూడా లయాత్మకంగా, రసాత్మకంగా పలికించగల ప్రజ్ఞాశాలి సుశీల. మిశ్రకాఫీ స్వరాలను అందుకుని అతిమధురంగా యీ ప్రబోధగీతం పాడారామె. 'అందుకె ఆ పక్షీంద్రుడు' అన్నచోట ఆమె గొంతులో పలికిన సుస్వర షడ్జమాలు, రిషభాలు పంచామృతసేవనంలా అనిపిస్తాయి.

# బడిపంతులు (1972)

❖ ఆత్రేయ ❖ కె.వి.మహాదేవన్

పల్లవి : మీ నగుమోము నా కనులారా కడదాకా, కన నిండూ
॥2సార్లు॥
ఈ సూత్రముతో ఈ కుంకుమతో నను కడతేరీ పోనిండూ
॥2 సార్లు॥

చర.1 : ఉపచారాలే చేసితినో ఎరగక
అపచారాలే చేసితినో
ఒడుదుడుకులలో తోడై వుంటినీ
మీ అడుగున అడుగై నడిచితినీ ॥మీ నగు॥

చర.2 : రెక్కలు వచ్చి పిల్లలు వెళ్లారూ
రెక్కలు అలిసి మీరున్నారూ
పండుటాకులము మిగిలితిమీ
ఇంకెన్ని పండుగలు చూడనుంటిమీ ॥మీ నగు॥

చర.3 : ఏ నోములు నే నోచితినో
ఈ దేవుని పతిగా పొందితినీ
ప్రతిజన్మా మీ సన్నిధిలోనా
ప్రమిదగ వెలిగే వరమడిగితినీ ॥మీ నగు॥


ఆలుమగల దాంపత్యబంధంలోని మధురిమలు, జీవిత చరమాంకదశలో కోరుకునే ఆత్మానుసంధాన నివేదనలు, జన్మసాఫల్య విలువలు అన్నిటిని ప్రోదిచేసిన జీవన సంగీతం ఈ పాట.

విశేష సాహితీజ్ఞానంతోపాటు అపార జీవన అనుభవసారాలను ఆకళింపు చేసుకున్న మనసుకవి ఆత్రేయ కలంలో ఊపిరి పోసుకున్న అపురూపగీతిమిది. ఇందులోని 'సూత్రము', 'కుంకుమ', 'పండుటాకులు', 'పండుగలు', 'ఉపచారాలు-అపచారాలు', 'ఒడుదుడుకులు- అడుగులు', 'ప్రమిదగ వెలగడం'... వంటి తేటతెనుగు తేలికపదాలు బరువైన సన్నివేశాన్ని చాలా ఆర్ద్రంగా పండించాయి.

భర్తకన్నా ముందుగా పసుపు కుంకుమలతో, ముత్తయిదువగా తనువు చాలించాలని ప్రతి భారతీయ మహిళ ఆకాంక్ష. చేసిన నోములకు మంచిభర్త లభించినందుకు



కృతజ్ఞతలు, ప్రతి జన్మలోనూ ఆయనే భర్తగా రావాలనే అపారప్రేమ యీ పాటలోని సారాంశం.




కె.వి.మహాదేవన్ స్వరాలు తెలుగింటి ఆడపడుచులకు, తెలుగువారి సంప్రదాయాలకు అతిచేరువగా ఉండి హృదయాలను పులకరింపజేస్తాయి. రాసిన పాటకు 'ఏమాత్రం' ''ఏ మాత్రా'' దోషం లేకుండా వచనాన్ని స్వరాలలో బంధించగల పాటల నేస్తం, స్వరాల చెలికాడు మహాదేవన్.

పాత్రలోని పరిణితిని, తన స్వీయగాత్ర పరిణితిని సమపాళ్లలో పంచి తానే పాత్రలో జీవించి గానాలాపన చేశారు సుశీల. ఇన్నేళ్ల సంసారంలో భార్యగా ఎంతో తృప్తిని, హాయిని పొందాననే భావనను ఎంతో సున్నితంగా, కృతజ్ఞతాపూర్వకంగా పదాలు గాత్రంలో ఒదిగిపోవటం వెనుక ఎంతటి కఠోరశ్రమ, సాధన ఉన్నాయో, ఉంటాయో కదా? అన్పిస్తుందీపాటలో ఆమె గాత్రం వింటే. అందుకే నేటికీ ఆమెపాటలు అజరామరం, అనితరసాధ్యం, అనుభవాల స్వీయానందం.

అప్పట్లో మహిళలు తెరపై యీ పాటను చూస్తూ చలించిపోయారు. అప్పటివరకూ నిజజీవితంలో భర్తతో సామరస్యంగా లేని మహిళలు కూడా యీ పాట చూసిన తర్వాత సంసారంలో సర్దుబాటు తత్త్వం అలవరచుకున్నారని అనుకునే వారారోజుల్లో ఒకే చిత్రంలో మూడు తరాలకు నాన్నమ్మ (అంజలి). అమ్మ (విజయలలిత), కూతురు (శ్రీదేవి) లకు ఒకే గాయని పాడడం యీ చిత్రంలో విశేషం.

# ధనమా? దైవమా? (1973)

❖ సి.నారాయణరెడ్డి ❖ టి.వి.రాజు

నీ మది చల్లగా
స్వామీ నిదురపో
దేవుని నీడలో
వేదన మరచిపో
నీ మది చల్లగా...
ఏ సిరులెందుకు?
ఏ నిధులెందుకు?
ఏ సౌఖ్యము లెందుకు?
ఆత్మశాంతి లేనిదే
మనిషి బ్రతుకు నరకమౌను
మనసు తనది కానిదే ॥నీ మది॥
నీ మది చల్లగా...
చీకటి ముసిరినా
వేకువ ఆగునా!
ఏ విధి మారినా
దైవం మారునా?
కలిమిలోన లేమిలోన
పరమాత్ముని తలచుకో ॥నీ మది॥
నీ మది చల్లగా....



ఈపాట ఎప్పుడు విన్నా, మన హృదయాల్ని తాకుతూనే ఉంటుంది. దానికి రెండు కారణాలు... చెవులకు చేరడానికి కారణం సుశీల మాధుర్యమైన స్వనం, హృదయాన్ని తాకడానికి సి.నా.రె సాహిత్యం, టి.వి.రాజు సంగీతం. సుశీల గాత్రంలో స్పష్టత, పదోచ్చారణ విని మన

తెలుగువాళ్లంతా గర్వపడాలి. అంతటి భావప్రకటన. కవి హృదయాన్ని, ఆంతర్యాన్ని ఆవిష్కరించడం ఎలాగో సుశీలనుంచి ఈతరం గాయనీగాయకులు నేర్చుకోవాలి.

ఈపాటలో వ్యక్తిత్వవికాసం ప్రస్ఫుటంగా ప్రతిబింబిస్తుంది. ఇది భారతీయ జీవనవిధానం, ధార్మికచింతన, ఆధ్యాత్మికవర్తనల గురించి, పెద్ద పెద్ద పదాల్లో కాకుండా సరళమైన పదాలను ఉపయోగించి అంటే చిన్న చిన్న అవిభక్తులతో సి.నా.రె రచించిన తీరు అనితరసాధ్యం.

పాట గురించి చెబితే... పాశ్చాత్త్యుల జీవనం పైకి ... ఆడంబరంగా, అట్టహాసంగా, అందంగా, ఆకర్షణీయంగా కనిపించినా... లోలోపల మాత్రం చాలా అలజడితో కూడి ఉంటుంది. భారతీయులు పైపైన బాధలతో, ఇబ్బందులతో, సమస్యలతో సతమతమౌతూ కన్పిస్తారు. కానీ లోలోపల మూలాల్లో అంతులేని ప్రశాంతత, అనిర్వచనీయమైన నిశ్చలత, సంతృప్తి ఉందంటారు స్వామి వివేకానంద. దానిని నారాయణరెడ్డి సూక్ష్మంగా ఈపాటలో తెలియజేశారు.

ఈ పాటలో మూడు స్థాయి లున్నాయి. మొదటి చరణంలో మనిషి తన మనసును మనలో ఉంచుకోవాలి. వేరే విషయాల వైపు వెళ్లకుండా మనసును నియంత్రించుకోవాలి. మన ఆలోచనలు పరిపరివిధాలుగా మరలకుండా మన అధీనంలో ఉండాలి. ఆత్మశాంతి లేకపోతే సిరులు, నిధులు, సంపదలు ఎన్నున్నా జీవితమంతా అశాంతితో ఉంటుంది.

రెండోచరణంలో చీకటి వస్తే వెలుగు దాని వెనుకనే వస్తుంది. ఏ విధిమారుతున్నా మన దైవం మారదు. అలాగే సంపద ఉన్నప్పుడు, లేనప్పుడు దైవాన్ని తలచుకోవాలి..... అని చెప్పడం ఎంతో అందంగా ఉంటుంది. ఈ రెండోస్థాయిలో మొదటిస్థాయిలో నియంత్రించుకున్న  మనసులో పరమాత్మను ప్రతిష్ఠించుకోవాలి.

చిత్రంలో సన్నివేశపరంగా ఈ పాట రెండు సార్లు వస్తుంది. రెండోసారి వచ్చే పాటలో మరొక చరణం అదనంగా ఉంటుంది. ఆ చరణం ఇది –

**జానకి సహనము**
**రాముని సుగుణము**
**ఏ యుగమైనను**
**ఇలకే ఆదర్శము**
**వారి దారిలోన నడుచు**
**వారి జన్మ ధన్యము ॥నీ మది॥**
**నీ మది చల్లగా...**




ఈ చరణం మూడవస్థాయి. ఈ స్థాయిలో మనసులో ప్రతిష్ఠించుకున్న దైవాలు బోధించిన ధర్మమార్గంలో పయనిస్తే జీవితం ధన్యమవుతుంది. భ్రమరకీటకన్యాయంలో తుమ్మెద చుట్టూ ఒక కీటకం తిరిగినట్లయితే, ఆ కీటకం కూడా తుమ్మెదలా మారుతుంది. అలాగే అయస్కాంతక్షేత్రంలో ఇనుమును ఉంచితే అదికూడా అయస్కాంతీకరణం చెంది అయస్కాంతంలా మారుతుంది. కాబట్టి మనం మనసులో వాళ్లను తలచుకుని, వారి మార్గంలో మన నడవడికను కొనసాగిస్తే వాళ్లలాగే మనం కూడా అంతే పవిత్రులుగా మారుతాం. దైవత్వానికి దగ్గరగా వెళతాం. ఏ కులమైనా, ఏ మతమైనా పైవిధంగా మనసులో దేవుడిని స్మరించుకుని ప్రార్థిస్తే, మంచి ప్రవర్తనను అవలంబిస్తే మంచిమనిషిగా మారుతాం. మానవత్వం ఇనుమడిస్తుంది. ఇనుమడించిన మానవత్వమే ఇలలో దైవత్వానికి దగ్గరదారి చూపుతుంది.

ఈ పాటకు టి.వి.రాజు ఆనాడు హిందీలో బహుళప్రచారం పొందిన, "షర్మీలి" చిత్రంలోని 'ఖిల్తే హై గుల్ యహర్' పాట ఆధారంగా యీ ట్యూన్ సిద్ధం చేసినా, ఎక్కడా తెలుగుదనం రవ్వంతైనా చెదరకుండా చక్కగా ఒదిగిపోయేలా స్వరపరిచారు. భీంప్లాస్ రాగంలో యీ పాట స్వరరచన జరిగింది. టి.వి.రాజు మరణానంతరం యీ చిత్రం విడుదలైంది.

ఈ పాట వింటుంటే భౌతికంగా జోలపాటలా అన్పించినా, సుశీల గాత్రమాధుర్యంలో అంతరంగంలో ఇదొక మేలుకొలుపు గీతంలా విన్పిస్తుంది. విధిమారినా దైవంలో మార్పు ఉండదనే భావనను సుశీల పలికిన తీరు కమనీయం. పాట ఎత్తుగడలోనే 'నీ' అనే చోట గాత్రం నిల్పిన విధం, 'చల్లగా', 'దేవుని నీడలో' అనే చోట పలికిన సుకుమార గమకాలు విన్నవారికి వేదనను మరచిపోయేలా చేస్తాయి. మధ్యలో 'వారి దారిలోన నడుచు వారి జన్మధన్యము' అనే చోట స్థాయిభేదాలను ఎంత లలితంగా సుశీల గొంతు పలికిందో పరికిస్తే జన్మధన్యతను పొందిన భావనలే కలుగుతాయి. ఈ చిత్రం పేరులోనే ఒక ప్రశ్న, దానికి చక్కటి సమాధానం యీ పాట.

# మీనా (1973)

❖ ఆరుద్ర ❖ రమేష్‌నాయుడు

శ్రీరామ నామాలు శతకోటి
ఒక్కొక్క పేరు బహుతీపి - బహుతీపి ॥శ్రీరామ॥
తండ్రి ఆనతి తలదాల్చు తనయుడు
దశరథరామయ్య స్తవనీయుడు ॥తండ్రి॥
కడుమేటి విలువిరచి కలికిని చేపట్టు
కల్యాణరామయ్య కమనీయుడు - కమనీయుడు ॥శ్రీరామ॥
సుదతి జానకితోడ శుభసరస మాడేటి
సుందరరామయ్య సుకుమారుడు ॥సుదతి॥
కోతిమూకలతో....
కోతిమూకలతో లంకపై దండెత్తు
కోదండరామయ్య రణధీరుడు-రణధీరుడు ॥శ్రీరామ॥
పవమానసుతుడు పాదాలు పట్టగా
పట్టాభిరామయ్య పరంధాముడు ॥పవమాన॥
అవనిలో సేవించు ఆశ్రితుల పాలించు
అచ్యుతరామయ్య అఖిలాత్ముడు - అఖిలాత్ముడు ॥శ్రీరామ॥



శ్రీరామచంద్రుని పేరు వింటే పరవళ్లు తొక్కుతుంది తెలుగు హృదయం. సీతమ్మ పేరు వింటే పాలకడలిలాగా ఉప్పొంగుతుంది తెలుగుతల్లుల మనస్సు. అలాగే ఆరుద్ర, సుశీల, రమేష్ నాయుడు..... ఈ ముగ్గురి పేర్లూ తలచుకోగానే లలితకళారాధకులందరూ ఈనాటికీ తన్మయులౌతూనే ఉంటారు.

'శ్రీరామనామాలు శతకోటి' అని ఆ పల్లవిని ప్రస్తావించి ఊరుకోలేదు ఆరుద్ర. ఏ శ్రీరామనామం ఎంతగొప్పదో, ఆ నామానికున్నటువంటి ఔచిత్యమేమిటో చాలా వివరంగా చెప్పారు. ఇవన్నీ ఆరు ఋతువుల కోకిలగానంలా, అరిషడ్వర్గనివారణమంత్రంలా



రమేష్‌నాయుడు




అనిపిస్తుంటాయి. సన్నివేశపరంగా ఇదొక పెళ్లిచూపులపాట. తర్వాత ప్రతి ఇంటా నడయాడిన భక్తిపాట. పాటలో దశరథ, కల్యాణ, సుందర, కోదండ, పట్టాభి, అచ్యుతరామయ్య ఇలా ఆరు రకాలుగా రాముడు మనకు కన్పిస్తాడు. రమేష్‌నాయుడు స్వరపరచిన ఈ శ్రీరామభక్తిగీతం ఆరుద్ర శ్రీరామభక్తి సాహిత్యానికి ప్రతీక. శతకోటినామాల్లోని కొన్ని నామాల మాధుర్యాన్ని అందించిన గాయని సుశీల.

ప్రతి ఇంటికి గడప ఉన్నట్లే శ్రీరాముని తెలియని ఇల్లు ఉండదు లోకంలో... ఇలాంటి దివ్యనామాన్ని తన గాత్రంలో, ఎన్నో రీతులలో ఎంతో రమణీయంగా పలికిన ధన్యురాలు సుశీల. 'సుదతి', 'శుభ సరసం', 'సుందర', 'సుకుమారుడు' అనే పదాలు పలికేటప్పుడు 'పవమానసుతుడు పాదాలుపట్టగా' అని ఉచ్చరించినపుడు గాత్ర శుద్ధత్వం, కోమలత్వం, నిర్మలభక్తి తత్త్వాలు సుశ్రావ్యంగా వినిపిస్తాయి. ఇందులోని ప్రతిపదంలో భక్తిరసం నూటికి నూరుశాతం ప్రతిఫలించి గాత్రంలో పాట ధన్యత్వం పొందింది. నటి చంద్రకళపై చిత్రీకరించిన యీ పాట మధురశాంతరసాన్ని వెదజల్లుతూ ఆచంద్రతారార్కమూ నిలిచిపోయింది.

# దేశోద్ధారకులు (1973)

❖ ఆత్రేయ ❖ కె.వి.మహాదేవన్

ఈ వీణకు శ్రుతిలేదు
ఎందరికో హృదయం లేదు
నాపాటకు పల్లవి లేదు
ఈ బ్రతుకెందులకో అర్థం కాదు ॥ఈవీణకు॥ 2సార్లు॥
అందాన్ని వెలకట్టే వాళ్లకు
అనురాగం వెలివేసిన వాళ్లకు
తెగిపోయిన తీగలు మీటే వాళ్లకు
నేనేమని చెప్పేదీ ఏ పాటలు పాడేదీ
అని కన్నీరొలికాను ఆ కన్నీరంతం కాదు ॥నాపాటకు॥ ॥ఈ వీణకు॥
అందరిలా పుట్టిన నేను
కొందరి ఆశకు బలియైనాను ॥అందరి॥
నా వలె ఎందరో వున్నారని తెలిసి-యిది
ఎవరు చేసిందీ... ఏ దేవుడు రాసిందీ
అని ఎలుగెత్తడిగాను
నా ప్రశ్నకు బదులే లేదు ॥2సార్లు॥
॥ఈ బ్రతుకె॥ ॥ఈ వీణకు॥

ఎన్నో వీణపాటలు సినీకవుల కలాల్లో శుకపికపదాలై ఎందరి గళసీమలలోనో స్వరవిన్యాసం చేశాయి. శ్రుతి, గతి లేని వీణలుండవచ్చు కానీ పల్లవి లేని పాట ఉండదు.కానీ కవిసమయాలు చిత్రంగా విన్పిస్తుంటాయి. అయితే ఆచార్య ఆత్రేయ తప్ప మరొకరు ఈపాట రాయరు, రాయలేరు కూడా. ఇది ఆయన 'మార్కు' పాట. పాత్ర మనోభావాలను తనలోకి పరకాయప్రవేశం చేసుకుంటేనే ఇలాంటి పాటలొస్తాయి.

విషాదగీతాలకు శుభపంతువరాళి, శివరంజని వంటి రాగాలున్నప్పటికీ 'నాట' రాగంలో మహాదేవన్ ఒక గొప్ప ప్రయోగం చేసినట్లుంటుందీపాట. వేదాంతం రాఘవయ్య కుమార్తె శుభ యీ పాటకు తెరమీద అభినయం.

ఎన్నో నవరసగీతాలను అలవోకగా ఆలపించిన పి.సుశీల గాత్రభాండాగారంలో ఇదొక మంచిపాట. సినిమాపరంగా ఈపాట కథాగమనంలో ఎంతో ప్రభావాన్ని




చూపుతుంది. బయట అంతగా ఎవరూ పాడుకోకపోయినా పాత్రకు సానుభూతినిచ్చిన గీతంగా అందరూ ప్రశంసించే గీతం ఇది. అయినా ఈ పాటలో సుశీల రాగతాళభావజ్ఞానాలు, గాత్రపరిణితులు స్పష్టంగా వినిపించి ఇదొక మంచిపాటగా అందరూ అంగీకరించారనుకోవచ్చు.

ఈ పాట అప్పట్లో 'బెంచి క్లాస్' వాళ్లకు ఎక్కకపోయినా, 'క్లాస్‌వన్' శ్రోతల్ని బాగా ఆకర్షించింది. అంతెందుకు, 'యువచిత్ర' అధినేత కాట్రగడ్డ మురారి ఆత్రేయ వీణపాటల్లో ఇది తన అభిమానగీతమని చెప్తుంటారు. తన "గోరింటాకు", చిత్రంలోని 'పాడితే శిలలైన కరగాలి' పాటకు ప్రేరణ, ఈ వీణపాటేనట.

# భక్త తుకారాం (1973)

❖ సి.నారాయణరెడ్డి ❖ పి.ఆదినారాయణరావు

సరిసరీ...వగలు తెలిసెర గడసరీ!
చిగురు సొగసులు నీవే లేరా! ॥సరి॥
చెంతకు రమ్మన చేరనంటినా!
చెక్కిలినొక్కిన కూడదంటినా! ॥చెంతకు॥
తొలి జామైన కానిదే ॥తొలి॥
తొందర ఎందుకు ఎందుకంటిరా! ॥సరి॥
ఆ...మంచి గంధం పూయకముందే
మల్లెమొగ్గలు చల్లకముందే ॥మంచి॥
కులుకుటందెలు మోగకముందే
కొత్త జావళి పాడకముందే
గరిస నిపమప, ససనిససని సని
నినిప నినిప నిప, మగ పమ నిప సని
ప పాని పమగమ, గపామగ సనిస అఅఅ... ॥కొత్త॥
కంటి గిలుపుల, జంట తలుపుల
కొంటె చేతల, కవ్వింత లింకేల చాలించవేర ॥సరి॥
పండువెన్నెల పానుపుచేసి
పైటకొంగున వీవన వీచి
వేడిముద్దులు కానుక చేసి
విడని కౌగిట బందీ చేసి
ఎన్నడెరుగని వన్నె తరగని
కన్నెవలపుల అందాలు అందించి చిందింతులేరా
॥సరి॥

రక్తికైనా, భక్తికైనా అంతస్సూత్రం ఆకర్షణే. స్త్రీ పురుషుల మధ్య ఏర్పడిన ఆకర్షణ రక్తికి దారితీస్తుంది. మనిషికి దేవుని పట్ల కలిగిన ఆకర్షణ భక్తికి పాదువేస్తుంది. రక్తికీ, భక్తికీ మధ్య ఉన్న అంతరాన్ని చిత్రించింది "భక్త తుకారాం".

భక్తి చిత్రంలో శృంగారగీతం... కథాంశం అటువంటి సందర్భాన్ని కోరుకుంది.






ఏ సందర్భానికైనా ఇటువంటివి కవిగాయకులకు, దర్శక నిర్మాతలకు, స్వరకర్తలకు సవాల్ విసురుతుంటాయి. శృంగార రసభావం అమలినం కాకుండా, పాత్ర సన్నివేశాల ఔచిత్యం చెడిపోకుండా రసావిష్కరణ చేయాలి. ఈ పాటలో అందరూ తమ పాత్రలను సమర్థవంతంగా నిర్వహించారని చెప్పవచ్చును.

ఒక నర్తకి, తన నాట్యానికి మరులుకొన్న నిత్యనూతన రసికుల ముందు జావళీ పాడుతూ నర్తించేపాట ఇది.

గీత రచయిత సి.నా.రె కు సంగీతపరిజ్ఞానం కూడా ఉండడం వల్ల 'సరిసరి' అంటూ సరిజేసి పదాలను లయాత్మకంగా, మిశ్రగతిలో యీ పాటను రాశారు. కవిత్వానికే గాదు, సంగీతానికి లయప్రధానం అని తెలిసిన సాహితీమూర్తి ఆయన. ఈరచన మామూలుగా చదువుతుంటేనే తెలీని లయ మదిలో మెదిలి కవిభావనలకు సహజంగానే దగ్గరగా చేరువవుతారు రసజ్ఞులు.

ఇక సందర్భాన్ని ఒడిసిపట్టిన ఆదినారాయణరావు అద్భుత 'అభేరి' రాగంలో జావళీ బాణీలోనే హిందుస్తానీ నృత్యగీతాల శైలిని మేళవించి స్వరపరచి మిగిలిన పాటలన్నిటితో సమానగౌరవాన్ని ఈపాటకు ఇచ్చారు. సన్నివేశానికి, పాత్రకు ఒక ఉదాత్తతను కల్పించారు.

సుశీల యీ పాటను 'పతాకస్థాయి' ప్రకటనగా ఆలపించారు. పాటలోని ఆలాపనలు, సంగతులు, పదాలు శ్రోతల్ని మంత్రముగ్ధుల్ని చేసేలా పలికారు. ఆటవెలది కోసం యీ పాటను కవి లయాత్మకంగా రాస్తే, సుశీల శృంగార రసాత్మకంగా గాత్రంలో జీవం పోశారు. గతంలో ఎన్నో జావళీలు పాడిన అపార అనుభవంతో ఈపాటను అతిసునాయాసంగా, అద్భుతంగా పాడడం ఆమెకే సాధ్యం. ఇదే చిత్రంలోని 'పూజకు వేళాయెరా' చిత్రానికే వన్నెతెచ్చిన సుందరగీతం. ఈరెండు పాటలూ ఒకేసారి వింటే సుశీల గాత్ర వైవిధ్యం, విలక్షణత సుస్పష్టంగా కన్పిస్తాయి.

# మాయదారి మల్లిగాడు (1973)

❖ ఆత్రేయ ❖ కె.వి.మహాదేవన్

మల్లెపందిరి నీడలోన జాబిల్లీ
మంచమేసి ఉంచినాను జాబిల్లీ ॥మల్లెపందిరి॥

మా అన్నకు – మా చెంద్రికి ఇది తొలిరేయి
నాకిది వరమోయీ
కళ్లుకుట్టి వెళ్లకోయి జాబిల్లీ
తెల్లవారనీయకోయి ఈరేయి ॥మల్లెపందిరి॥

గడుసుపిల్లకు వయసునేడే గురుతుకొచ్చింది
మొరటువాని మనసు దానికి పులకరించిందీ ॥గడుసు॥
ఇద్దరికి ఈనాడు నువ్వే ముద్దు నేర్పాలి
ఆ ముద్దు చూసి చుక్కలే నిను వెక్కిరించాలి ॥కళ్లు॥

పెళ్లి సంబరమన్నదెరుగని ఇల్లు నాదీ
పసుపుతాడే నోచుకోని బ్రతుకు నాదీ ॥పెళ్లి॥
ఈ పెళ్లి చేసి నేను కూడా ముత్తయిదువయ్యాను
ఈ పున్నెమె పైజన్మలో నను ఇల్లాలిని చేయాలి ॥మల్లె॥
కళ్లు కుట్టి వెళ్లకోయి జాబిల్లీ...

సన్నివేశపరంగా ఆమె విధివంచిత. లోకం దృష్టిలో పతిత. ఆమెకు ఊర్లో రౌడీగా పేరున్న మల్లిగాడు అండ. ఆమె, అతణ్ణి అన్నగా భావిస్తుంటుంది. అతనూ అంతే. వారి అన్నాచెల్లెళ్ల బంధం చాలా పవిత్రమైంది. అది అందరికీ అర్థమయ్యేది గాదు.

గలగలపారే సెలయేరులాంటి చంద్రికి, మల్లిగాడికి దగ్గరుండి ఆమె పెళ్లి చేసింది. ఆరోజు వాళ్లకు మొదటిరాత్రి. ఇక్కడి వరకూ సన్నివేశం బాగానే ఉంది – సాధారణంగా మన సినిమాల్లో, శోభనం రోజున వధూవరుల మధ్య సంయోగగీతాలు చిత్రీకరించడం రివాజు. ఇందుకు భిన్నంగా నాయికానాయకుల శోభనాన్ని యీ విధివంచిత భావాల్లో మలచాలి. ఇదీ సందర్భం.

ఈ సన్నివేశానికి ఆత్రేయ ఎంతో లోతైన చక్కటి పాట అందించారు. మల్లెపందిరి శోభనం గది అని, అక్కడే ఒక మంచమేసి ఉంచానని చెబుతూ, వారిరువురూ చంద్రుడికైనా

కళ్లుకుట్టే జంట గనుక, అలా ఈర్ష్యపడి వెళ్లిపోకని, వెళ్లిపోతే తెల్లవారిపోతుందని జాబిల్లిని ప్రాధేయపడుతుందామె. నిజానికి కొత్తజంట తమకంలో చంద్రుణ్ణి కోరాల్సిన కోరిక ఇది. ఈమె కోరింది. ఇక్కడ వరకూ బాగానే ఉంది. ఎక్కడో ఒకచోట ఆత్రేయే 'కాపురానికి కొత్తవాళ్లం' అని రాశారు. అలాగే ఇక్కడ కూడా యీ జంటకు 'ముద్దు' నేర్పాలట చంద్రుడు. ఆ ముద్దు చూసి చుక్కలన్నీ వెక్కిరించాలట. చంద్రుడి భార్యలే తారకలు గనుక ఆత్రేయ ఇలా రాశారు.

ఈ చరణం వరకూ శృంగారభావాల పులకరింతలతో సాగిన ఈ గీతం చివరి చరణానికొచ్చేసరికి కథాపరంగా ఆమెపై మనకొక జాలి, సానుభూతి ఏర్పడిపోతాయి. వారిరువురి తొలిరేయి తనకెందుకు వరమంటే ఇందుకే– ఆమె ఇంట్లో పెళ్లి ఊసే లేదు. పసుపుతాడు పరిచయమేలేని వాళ్లు వారు. కానీ ఈమెకేమో పవిత్రమైన జీవనం గడపాలని, ముత్తైదువ అనిపించుకోవాలని ప్రగాఢవాంఛ. ఆ వాంఛ తీర్చుకునే అవకాశం వైయక్తికంగా తనకు లేదు గనుక, పెళ్లిపెద్దగా నిలబడి అన్నకు పెళ్లిచేసి ముత్తయిదవయింది. అలా చేయడం వల్ల వచ్చేజన్మలోనైనా ఇల్లాలవుతానేమోనని చిన్న ఆశ. ఇంత బరువైన సన్నివేశానికి తేలికైన మాటలతో లోతైన భావాలను ప్రదర్శించిన మనసుకవి గొప్పదనం ఎంత చెప్పుకున్నా తక్కువే.

ఆత్రేయ, మహాదేవన్, ఆదుర్తి కలిసి చేసే ప్రయోగాలు ఏ గాయనీగాయకుల గాత్రాలలో వస్తాయా? ఏ నాయికానాయకుల మధ్య ఉంటాయా? అని తెలుగు ప్రేక్షకులు, శ్రోతలు ఆవురావురుమని ఎదురు చూసేవారు. సినిమా, కథాంశం ఎలా ఉన్నా పాటలంటే ప్రాణాలిచ్చే అభిమానులందరికీ వీరి ప్రయోగాలు మనసుకు, చెవులకు, కళ్లకు ఏకకాలంలో విందు చేకూర్చేవి. ఈ పాట చక్కని సితార్ పాట. జాబిల్లి పాట, తొలిరాత్రి పాట. ఆత్మానుభూతి ప్రధానంగా సాగిన పాట.

స్వరాలను పూలదండలా అల్లడంలో 'మామ' బాణీ దారి బహుపసందుగా ఉంటుంది. మోహనరాగంలో, సుశీల గాత్రంలో ముగ్ధమోహనంగా పలికించిన పాట ఇది.

సన్నివేశ సందర్భాలకు నూటికి నూరుపాళ్లూ న్యాయం చేయడం సుశీలకు తెలిసిన విద్య. అందుకే ఈ పాటలో అన్నకు, చెంద్రికి, తొలిరేయి, వరమోయి అనే చోట్ల పరికిస్తే ఆమెలో ఎంత శబ్దగాత్ర మాధుర్యమో తెలుస్తుంది. 'పెళ్లి సంబరమన్నదెరుగని ఇల్లు నాది' అని పాత్ర మదిలో కించిత్తు వేదనను పొందడం కూడా గొంతులో స్పష్టంగా విన్పించారు ఆమె. వెంటనే 'మరుజన్మలో ఇల్లాలవుతాననే ఆశాజనకమైన భావనను ఆనందంతో పలకటం సుశీలకే చెల్లు. కొన్ని పాటలు కొందరి గాత్రాలలో కోమలంగా కొలువైపోతాయి. అలాంటి పాటల్లో ఇదొకటి. తెరపై యీ పాటకు జయంతి ప్రాణం పోశారు.

# చక్రవాకం (1974)

❖ ఆత్రేయ ❖ కె.వి.మహదేవన్

వీణలోనా
తీగలోనా
ఎక్కడున్నది నాదము - అది
ఎలాగైనది రాగము ॥వీణలోనా॥

వీణలోన...తీగలోన...
మాటలోనా
మనసులోనా
ఎక్కడున్నదీ భావము - అది
ఎప్పుడవును గానము ॥మాటలోనా॥

నాదమునకు స్వరమే రాగము
మనసులోని మాటే భావము
రాగభావము లేకమైనది
రమ్యమైన గానము ॥వీణలోనా॥

గతజన్మ శ్రుతి చేసుకున్నది - అది
ఈ జన్మ సంగీతమైనది ॥గత॥
సరిగమ పదనిసా నిదపమ గరిసా
రాగాల ఆరోహణవరోహణైనది
అనురాగ హృదయాల అన్వేషణైనది
వీణలోనా... తీగలోనా...

గుండెలోనా
గొంతులోనా
ఎక్కడున్నది ఆవేదన - అది
ఎలాగవునూ సాధన ॥గుండెలోనా॥
గీతమునకు బలమే వేదన
రాగమునకు మెరుగే సాధన


గుండె గొంతుక లేకమైనది
నిండు రాగాలాపన ॥వీణలోనా॥
వీణలోన ... తీగలోన



ఆరికెపూడి (కోడూరి) కౌసల్యాదేవి 'చక్రవాకం' నవల ఆధారంగా నిర్మించిన చిత్రమిది. సురేష్ ప్రొడక్షన్సులో వి.మధుసూదనరావు దర్శకత్వం వహించిన ఏకైక చిత్రం. ఎస్వీరంగారావు నటించిన ఆఖరుచిత్రం. అలాగే కెమెరా మాంత్రికుడు మార్కస్ బార్ట్లే ఛాయాగ్రాహకత్వంలో వచ్చిన చివరిచిత్రమూ ఇదే.

ఈ చిత్రంలో ఉన్న అద్భుతమైన వీణపాటల్లో ఇది మొదటిది. 'బ్రతుకంతా పలు ప్రశ్నలమయమై బ్రతుకును జనసముదాయం' అని ఒక సినీ కవి, 'మబ్బులో ఏముంది?' అని మరోకవి .. ఇలా ఎందరో మహానుభావులు తమ తమ భావానుభూతుల్ని ప్రశ్నిస్తూ వందల గీతాలను రాశారు. 'ఉన్నావా? అసలున్నావా?' అని దైవాన్నే ప్రశ్నించిన ఆచార్య ఆత్రేయ కలం 'వీణలోనా? తీగలోనా? ఎక్కడున్నది రాగము అని, అది మాటలోనా? మనసులోనా?' అని గుండెగొంతుకను ప్రశ్నించిన పాట ఇది.

ఇలా ప్రశ్నిస్తూనే, వెనువెంటనే సమాధానం ఆయనే ఇవ్వడం గొప్ప విషయం. 'గతజన్మ శ్రుతి చేసుకుని' – 'రాగభావాలు ఏకమవ్వడమే రమ్యమైన గానం' అని ముక్తాయింపు నివ్వడంలోనే ఆత్రేయ మార్క్ కన్పిస్తుంది. సినిమాచూడకుండా




కళ్లుమూసుకుని యీ పాట వింటున్నా, ఇది ఆత్రేయ పాట అని టక్కున చెప్పేయొచ్చు, అదీ ఆత్రేయపాట తీరు. తెలుగులో ఎక్కువ వీణ పాటలు రాసింది ఆత్రేయే. అయితే ఖ్యాతి వచ్చింది మాత్రం దాశరథికి. ఆత్రేయ రాసిన పది వీణ పాటల్లో ఎనిమిది సుశీలే పాడటం విశేషం.

పదాల మర్మం, స్వరాల ధర్మం తెలిసిన విన్నాణి మహాదేవన్ సినిమా టైటిల్‌నే రాగంగా పలికించి కవి భావనను, సన్నివేశాన్ని సమపాళ్లలో వేసి పాటకు ప్రాణం పోశారాయన. చక్రవాకరాగం భక్తి, కరుణ విషాద సన్నివేశాలకు చక్కగా అమరిపోతుంది. స్వరబ్రహ్మ ప్రతిభాపాటవాలకు, రసరంజిత రాగపరిజ్ఞానానికి ఇదొక చక్కని నిర్వచనగీతం.

ఈ పాటను సుశీల గాత్రంలో విన్నాక ప్రశ్నలన్నింటికీ సరైన స్వరమాధుర్యంతో సమాధానం చెప్తునట్లనిపిస్తుంది. కవిభావన నిజమే అన్నట్లుగా గతజన్మ శ్రుతి చేసుకున్నది. అది యీ జన్మ సుశీలగా రూపుదిద్దుకున్నదేమోనన్నట్లు ఆ చక్రవాకరాగ ఆరోహణావరోహణలు లలితంగా, ఆర్ద్రంగా వినిపిస్తాయి యీ పాటలో. గుండె గొంతులో పలికే సున్నిత స్వరాలు శుద్ధ రిషభ, అంతర గాంధార, శుద్ధ మధ్యమ, చతుశ్రుతి దైవతాలై సాధన చేసిన ప్రావీణ్యం గుండె గొంతుక లేకమైనట్లుగా పలికిన విధం రమణీయం, అనితరసాధ్యం. మనసులోని భావాలను కవి పలికిస్తే, నాదంలోని స్వరాలను గాయని పలికించారు. సంగీతం, సాహిత్యం, గాత్రం ముప్పేటగా అల్లిన అతి చక్కటి వీణపాట ఇది. కవి, స్వరకర్త, గాయని కళాభినేత్రి వాణిశ్రీ ముఖతః ముగ్గురూ యీ పాటను పతాకస్థాయికి తీసుకెళ్లి చరితార్థులైనారు.

ఎన్నో వేలపాటలు పాడిన సుశీల తనుపాడిన పాటల్లో తనకు అత్యంత ఇష్టమైన పాటగా యీ పాటనే చెబుతుంటారు.

ఇదే పాటను విషాద సన్నివేశంలో 'వీణలోనా? తీగలోనా? ఎక్కడున్నది అపశ్రుతి' అని మార్చి మరో వీణ పాట రాశారు ఆత్రేయ. సుశీల పాడిన యీ రెండుపాటలకు ముగ్ధులైన డి.రామానాయుడు యీ చిత్రాన్ని ఇంగ్లీషు సబ్ టైటిల్సుతో "మ్యూజిక్ ఆఫ్ లవ్' అనే పేరుతో విదేశాల్లో విడుదలచేసి ప్రశంసలు పొందారు.

# అల్లూరి సీతారామరాజు (1974)

❖ సి.నారాయణరెడ్డి ❖ పి.ఆదినారాయణరావు

పల్లవి : వస్తాడు నారాజు ఈ రోజు
రానే వస్తాడు నెలరాజు ఈ రోజు
కార్తీకపున్నమి వేళలోన
కలికి వెన్నెల కెరటాలపైన ॥కార్తీక॥
తేలివస్తాడు నారాజు ఈ రోజు

చరణం : వేల తారకల నయనాలతో
నీలాకాశం తిలకించేను ॥వేల॥
అతని చల్లని అడుగుల సవ్వడి
వీచే గాలి వినిపించేను
ఆతని పావన పాదధూళికై
అవని అణువణువు కలవరించేను
అతని రాకకై అంతరంగమే
పాలసంద్రమై పరవశించేను ॥పాల॥ ॥వస్తాడు॥

చరణం : వెన్నెల లెంతగా విరిసిన గానీ
చంద్రుణ్ణి విడిపోలేవూ
కెరటాలెంతగా పొంగిన గానీ
కడలిని విడిపోలేవూ
కలసిన ఆత్మల అనుబంధాలు
ఏ జన్మకు విడిపోలేవులే
తనువులు వేరైనా, దారులు వేరైనా ॥తనువు॥
ఆ బంధాలే నిలిచేనులే ॥ఆ బంధాలే॥ ॥వస్తాడు॥

'అల్లూరి సీతారామరాజు'ను తలచుకుంటే ఒళ్లు పులకరిస్తుంది. నిద్రాణ చైతన్యం జాగృతమై గోడకు వేలాడే విల్లంబు లెక్కుపెడుతుంది. స్వాతంత్ర్య సంగ్రామచరిత్రలో తెలుగుగడ్డను అగ్రేసరపంక్తిలో నిలిపిన స్వరాజ్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు. ఆ త్యాగధనుని జీవితాన్ని చలనచిత్రంగా తీయాలని సంకల్పించడం కథానాయకుడుగా కీర్తిశిఖరాల నధిరోహించిన కృష్ణ సాహసోపేత నిర్ణయం. అంతకు ముందు చాలా



సంవత్సరాల క్రితమే ఎన్.టి.రామారావు ఆ చిత్రానికి సంబంధించిన స్క్రిప్టు సిద్ధంచేసి ఉంచారు. ఒక దశలో షూటింగ్‌కు కావాల్సిన సన్నాహాలన్నీ చేసుకున్నారు. కానీ ఎందుకో అది కార్యరూపం దాల్చలేదు.

"అల్లూరి సీతారామరాజు"పాత్ర కృష్ణ ధరిస్తున్నాడనే వార్త ఆరోజుల్లో సినీరంగంలో సంచలనం. అంతటి బృహత్తర పాత్రను అతడు ఎలా మెప్పిస్తాడని కనుబొమలు ఎక్కుపెట్టడం కూడా జరిగింది. సాహసానికి కృష్ణ రూపాంతరం. అడుగు ముందుకు వేశాడు అంతే, ఆపై తిరుగులేదనుకున్నాడు. తన సోదరులు జి. హనుమంతరావు, జి.ఆదిశేషగిరిరావు నిర్మాతలుగా, వి.రామచంద్రరావు దర్శకత్వంలో "అల్లూరి సీతారామరాజు" నిర్మించాడు. ఈ చిత్రానికి చిక్కని కథాసంవిధానాన్ని, కత్తి అంచుల్లాంటి పదునైనసంభాషణల్ని రచించారు మహారథి. చిత్రంలోని సంగీతంకూడా ఉదాత్తంగా ఉండాలనే దృష్టితో అంజలీ పిక్చర్స్ అధినేత, సంగీత దర్శకులు ఆదినారాయణరావును సంగీతదర్శకునిగా తీసుకున్నారు నిర్మాతలు.

చిత్రకథ ప్రకారం 'సీత' అనే అమ్మాయి అల్లూరి రామరాజును ప్రేమిస్తుంది. అప్పటికే స్వాతంత్ర్యసంగ్రామ రంగంలో సాగిపోతున్న రామరాజుకు సీతపట్ల ఆప్యాయత ఏర్పడింది. ఆ ఇరువురి అనురాగబంధం వివాహబంధంగా పర్యవసించే తరుణం ఏర్పడుతున్నది. తనని కలుసుకోవడానికి తన రాజు వస్తాడని ఎదురుచూస్తున్న సీత కళ్లలో కమ్మనికల లాంటి వాతావరణం. ఈ సన్నివేశానికి సి.నా.రె అద్భుతమైన పాట రాశారు. దీనికి 'శ్రీరాగం'లో ఆదినారాయణరావు బాణీ కట్టారు. "అనార్కలి", "సువర్ణసుందరి" చిత్రాలలో రసనిర్భర సంగీతాన్ని అందించిన ఆదినారాయణరావు యీ పాటలో కూడా తమ ప్రత్యేకముద్రను ప్రస్ఫుటం చేసుకున్నారు.

సాహిత్యపరంగా సి.నా.రె యీ పాటలో తమ రచనాప్రాభవాన్ని చూపించారు.

సీత, పున్నమిరేయి తన రాజు రాకకు నిరీక్షిస్తున్నది. 'రాజు' అంటే ప్రభువు. 'రాజు' అంటే 'చంద్రుడు'. చరణంలో రాజు లక్షణాన్ని, నెలరాజు గుణాన్ని కలగలిపి ఇలా చెప్పారు.

వేల తారకలు నయనాలతో – నీలాకాశం తిలకించేను
అతని చల్లని అడుగులసవ్వడి – వీచే గాలి వినిపించేను

జాబిలి వస్తున్నాడంటే ముందు చుక్కల కళ్లతో ఆకాశం ఎదురుచూస్తుంది. నెలరేడు నింగిలో ప్రవేశించగానే, అతని కిరణాలు నేలమీద సోకగానే, ఆ కిరణాలే చరణాలని భావించి ఆ రాక గురించి వీచే గాలి చెబుతుంది. అప్పుడు–

"అతని పావన పాదధూళికై – అవని అణువణువు కలవరించేను
అతని రాకకై అంతరంగమే – పాలసంద్రమై పరవశించేను"

చంద్రాగమనంతో సంద్రం పొంగడం ప్రసిద్ధ కవిసమయం. ఆమె అంతరంగం పాలసంద్రంలా ఉంది. తన ప్రియుడు జనప్రియుడు. అతని పాదస్పర్శకోసం అవని కలవరిస్తోంది. నిజమే. మాతృదేశ దాస్యవిముక్తికి బద్ధకంకణుడైన ఆ రాజు తనవాడుగా మాత్రమే ఉండిపోతాడా? నిజలక్ష్యసిద్ధి కోసం తనను విడిచి వెళ్లిపోతాడా? ఆత్మలు కలసిన అనుబంధాలు అవిచ్ఛిన్నమైనవని ఆ ముగ్ధ దృఢనిశ్చయం. అంతటి అంకితభావం ఆమెది. ఆ భావనకే చివరిచరణంలో కవి తొడిగిన శబ్దాలివి:

'వెన్నెల లెంతగా విరిసినగాని/చంద్రుణ్ణి విడిపోలేవులే/కెరటాలెంతగా పొంగిన గాని/కడలిని విడిపోలేవులే/కలిసిన ఆత్మల అనుబంధాలు/ఏ జన్మకు విడిపోలేవులే/తనువులు వేరైనా దారులు వేరైనా/ఆ బంధాలే నిలిచేనులే.' తుడిచిన అద్దంలాంటి మనసున్న ఆ ముద్దరాలి అనురాగప్రతిఫలనం అది. కథ ఇక్కడ అనుకోని మలుపు తిరుగుతుంది. పరిణయమా? ఉద్యమమా? ఆ కర్మవీరుని మొగ్గు ఉద్యమం వైపే. రామరాజు లక్ష్యశుద్ధికి పరవశించి, ఆత్మార్పణం చేసుకుని పంచభూతాల్లో కలిసిపోతుంది సీత. అంతేకాదు రామరాజు పేరులో పూర్వపదంగా తాను మిగిలిపోతుంది. రామరాజు 'సీతారామరాజు' అయ్యాడని యీ చిత్రకథ ఎంతో ఆత్మీయంగా చాటుతుంది. వీరరస ప్రధానంగా ఉప్పొంగే యీ కథలో ఈపాట ఒక లలిత ప్రణయగీతమే అయినా అది కథానాయకునితో అంతగా అనుబంధించి ఉండడం విశేషాంశం.

కవుల భావాలకు జీవంపోసిన సుమధుర గళాలు ఎన్నెన్నో తెలుగు సినీరంగానికి పరిచయమయ్యాయి. వాటిలో విలక్షణ మధురగాత్రం, గానకౌశల్యం సుశీల సొంతం. ఆ గాత్రం శ్రోతల హృదయతంత్రుల నిగళం. పుష్ప పరాగ సుమరాగ పరీమళం. ఈమెపాట విన్నాక పాట పాడటం ఇంత తేలికా అన్పిస్తుంది. దానికి సమాధానం ఏమిటని సుశీలనే అడిగితే ఆ గాత్రం పాడి వినిపించడమేగానీ మరో బదులు రాదు. దీనికి కారణం ఆమెపాట నాభి, హృదయ, రస, కంఠ, నాసాదులనుండి ప్రభవించే తీరులో ఒక కొత్తదనం, మాధుర్యం సమపాళ్లలో ఉంటాయి. అందుకే వేలాదిగీతాలు పాడినా వన్నెతరగని లాలిత్యం ఆ గాత్రంలో విన్పిస్తుంది. కోకిల వసంతానికే గొంతువిప్పి సంవత్సరమంతా తన పంచమస్వరాన్ని పరిచి ప్రకృతిని రసభరితం చేస్తుంది. మావిచిగురులు రుచిచూసి ఆ కోకిల అలా చేస్తే మరి యీ నైటింగేల్ ఆఫ్ సౌత్‌కు నిత్యం వసంతమే. పదపల్లవుల్ని, స్వర కిసలయలను నిత్యం తాంబూలసేవనం చేస్తుందేమో... అన్ని ఋతువులలో ఆ గాత్రం మధురం.

# తులాభారం (1974)

❖ రాజశ్రీ ❖ సత్యం

రాధకు నీవేర ప్రాణం
ఈ రాధకు నీవేర ప్రాణం
రాధాహృదయం మాధవ నిలయం ॥రాధా॥
ప్రేమకు దేవాలయం ॥ఈ రాధకు॥
నీ ప్రియవదనం వికసిత జలజం
నీ దరహాసం జాబిలి కిరణం ॥నీ ప్రియ॥
నీ శుభచరణం ఈ రాధకు శరణం ॥రాధకు॥
బృందావనికి అందము నీవే
రాసక్రీడకు సారథి నీవే ॥బృందావని॥
యమునాతీరం... రాగాల సారం ॥రాధకు॥

సప్తస్వరాలు, సరళీస్వరాలు, జంట స్వరాలు, చిట్టస్వరాలు, గమకాలు, జనక జన్యరాగాలు, మూర్ఛనలు... వెరసి సంగీత శబ్దరత్నాకరాన్ని ఒకవైపు పెట్టి తులాభారం తూచితే రెండోవైపు సుశీల ఒక్కరు చాలు... సరిసమానంగా తూగి, కళాసరస్వతిని మెప్పించగల స్వరశీల ఆమె.

అనువాదగీతాలలో అందెవేసినచేయి రాజశ్రీ. క్లిష్ట పదప్రయోగాలేకాదు, లలిత సరళీపదాలను కూడా అవలీలగా, పొందికగా అందించగల రచయిత రాజశ్రీ. రాధామాధవ ప్రణయం ఎంతతీయగా, అందంగా ఉంటుందో. మాధవుని హృదయం, వదనం, దరహాసం, శుభచరణం వంటి పదాలలో రాధ ఎలా ఇమిడిపోయిందో! ఒకసారి వినండి ఈపాటలోని పదాలన్నీ సుస్పష్టంగా హృదయాన్ని తాకుతాయి.

పాట మొత్తం ముప్పైమూడుపదాల చిన్నపాట. ఇందులో రాధామాధవుల ఏకత్వాన్ని, ప్రకృతిలోని అందాలతో జోడించి రాసిన రచయిత రమణీయ ప్రయోగాల్ని స్వరకర్త సత్యం చక్కని చక్రవాకరాగంలో స్వరపరచారు.

ఈ రాగంలోని జీవస్వరాలను (రి,ని) సుశీల ఒడిసిపట్టి సాహిత్యంలోని ఆర్తిని, ఔన్నత్యాన్ని, మధురభక్తిని, రాధకుగల సఖ్యతను మధురంగా పలికి అక్షరసేవ చేసారా? స్వరార్చన చేసారా? పాటను పంచామృతాలతో అభిషేకించారా అనిపిస్తుంది. భగవంతుణ్ణి ప్రసన్నం చేసుకోగలిగినంత ఆర్తిగల రాగాన్ని అనురక్తితో తానొక నివేదనాధోరణిలో నిమగ్న మనస్కురాలై... యమునాతీరాల రాగాలసారంగా పలికించిన తీరు ప్రశంసనీయం.

# చదువు - సంస్కారం (1974)

❖ సి.నారాయణరెడ్డి ❖ రమేశ్‌నాయుడు

ఆ...

పల్లవి : దీపానికి కిరణం ఆభరణం
రూపానికి హృదయం ఆభరణం
హృదయానికీ - ఏనాటికీ
తరగని సుగుణం ఆభరణం
తరగని సుగుణం ఆభరణం ॥దీపానికి॥

చరణం : నిండుగపారే యేరూ
తన నీటిని తానే తాగదు
జగతిని చూపే కన్ను
తన ఉనికిని తానే చూడదు
పరులకోసం బ్రతికే మనిషి ॥పరుల॥
తన బాగు తానే కోరదు ॥తన॥
దీపానికి కిరణం ఆభరణం
రూపానికి హృదయం ఆభరణం

చరణం : తాజమహలులో కురిసే వెన్నెల
పూరిగుడిసె పై కురియదా;
బృందావనిలో విరిసే మల్లియ,
పేద ముంగిట విరియదా,
మంచితనమూ - పంచేవారికీ ॥మంచి॥
అంతరాలతో పనివుందా ॥అంత॥
దీపానికి కిరణం ఆభరణం
రూపానికి హృదయం ఆభరణం

చరణం : వెలుగున ఉన్నంత వరకే
నీ నీడ తోడుగా ఉంటుంది,
చీకటిలో నీవు సాగితే

అది నీకు దూరమౌతుంది
ఈ పరమార్థం తెలిసిననాడే
బ్రతుకు సార్థకమవుతుంది ॥బ్రతుకు॥ దీపానికి ॥



సౌశీల్యం, దాతృత్వం, సౌహార్థం, స్వపరిజ్ఞానం అనే నాలుగు అంశాలను దివిటీలుగా పైకెత్తిన గీతమిది. అచ్చమైన రుబాయీ ఛందస్సులోకి వచ్చే పాట ఇది. ఎత్తుగడే చాలా కొత్తగా ఉందీపాటలో. 'దీపానికి కిరణం ఆభరణం' అన్నారు కవి. ఆ ఆభరణం ఎలాంటిది? పైపై తళుకులదేనా? కాదు. అంతస్సౌందర్యం కలది. అందమైన రూపానికి స్వచ్ఛమైన హృదయం లాంటిది అది. ఆ హృదయానికి ఏది ఆభరణం? తరగని సుగుణం. ఆ సుగుణదృష్టి ఉన్న వ్యక్తి ఆలోచనా విధానమేమిటో రెండు చరణాల్లో నివేదించారు గీతకర్త.

మొదటి చరణంలోని రెండు ప్రకటనల్లో ఒకటి ప్రకృతికి సంబంధించింది. ఇంకొకటి శరీరంలోని అవయవానికి సంబంధించింది. జీవనది తన నీటిని పొలాలకూ, జనాలకూ పంచుతూ పోతుంటుంది. ఆ గమనం స్వార్థరహితం. కన్ను ఎదుట ఉన్నలోకాన్ని చూపుతుంది. తాను ఎలా ఉన్నానోనని చూసుకోదు. ఇక్కడ ఉన్నది కూడా స్వార్థరాహిత్యమే. ఈ రెండు ప్రకటనలను ఆధారంగా చేసుకుని ఇచ్చిన తీర్పు రెండో చరణంలో ఉంటుంది.

కురిసే వెన్నెలకు అది తాజమహలా లేక పూరిల్లా అనే తరతమభేదం ఉండదు. విరిసేపువ్వుకు అది బృందావనమా లేక నిరుపేద ప్రాంగణమా అనే తేడా ఉండదు. ప్రకృతిగతమైన యీ ధర్మాలను పేర్కొని మానవపరంగా అనువర్తింపజేశారు కవి. చివరి చరణంలో మౌలిక తాత్త్వికఛాయ ఆవిష్కరణ జరిగింది.

రమేశ్‌నాయుడు యీ గీతానికి 'కల్యాణి' రాగంలో చిత్తరంజకంగా బాణీకూర్చి సుశీలచేత ఆర్ద్రరమ్యంగా పాడించారు. సాహిత్యపరంగానూ, సంగీతపరంగానూ, గాత్రపరంగానూ నాలుగుకాలాలపాటు నిలిచిపోయే మంచిపాట ఇది.

# ముత్యాలముగ్గు (1975)

❖ ఆరుద్ర ❖ కె.వి.మహాదేవన్

ముత్యమంతా పసుపు ముఖమెంతొ చాయ
ముత్తయిదు కుంకుమ బతుకంత చాయ ॥ముత్య॥

ముద్దుమురిపాలొలుకు ముంగిళ్ల లోన
మూడుపువ్వులు ఆరుకాయల్లు కాయ ॥ముత్య॥

ఆరనయిదోతనము ఏ చోట నుండు
అరుగులలికే వారి అరచేతనుండు ॥ఆరనయిదో॥
తీరైన సంపద ఎవరింట నుండు
దినదినము ముగ్గున్న లోగిళ్ల నుండు ॥ముత్య॥

కోటలో తులిసెమ్మ కొలువున్న తీరు
కోరి కొలిచేవారి కొంగుబంగారు ॥కోట॥
గోవు మాలక్ష్మికి కోటిదండాలు
కోరినంతా పాడి నిండు కడవల్లు ॥ముత్య॥

మగడు మెచ్చిన చాన కాపురంలోన
మొగలిపూలా గాలి ముత్యాలవాన ॥మగడు॥
ఇంటి యిల్లాలికి ఎంత సౌభాగ్యం
ఇంటిల్లిపాదికి అంత వైభోగం ॥ముత్య॥

పందొమ్మిది వందల డెబ్భైలలో మొదలైన ప్రక్రియ – సాంఘికచిత్రాలలో పౌరాణిక ప్రతీకలను అన్వయించి కథను 'Mythicalise' చెయ్యటం. దీనికి ఆద్యుడు బాపు కాదుగానీ, ఒక ఒరవడిని దిద్దినవారుగా ఆయనను చెప్పుకోవచ్చు. "ముత్యాలముగ్గు" లో, చిత్రీకరణలో ప్రకృతిని ఎలా జీవింపజెయ్యాలో ఆయన నిరూపించారు. ఆదర్శంగా ఉన్న దంపతుల నడుమ చిన్న అపార్థం రావటం, భార్యశీలాన్ని శంకించి భర్త దూరమవటం, పిల్లలద్వారా (హనుమంతుడి పాత్రద్వారా) ఆ భార్యాభర్తలు కలుసుకోవడం కథలోని సారాంశం.

తెల్లని పాదాలపై చిటికెడంత పసుపు చాలదా?
పారాణిగా మారిపోయి పాదాలు మురిసిపోవటానికి
పచ్చని సస్యకేదారాలపై రవంత మలయపవనం చాలదా?

మాగాణి పులకించి మనసు మురిసిపోవటానికి
చల్లని స్వచ్ఛమైన ఒక్క వానచినుకు చాలదా?
ముత్యమై తన జన్మ సొగసు మురిసి మెరిసి పోవటానికి
సుశీల పాటలోని ఒక్క పల్లవి చాలదా?
నేను తలకట్టు ఉన్న 'తెలుగుభాష'ను అని మురిసిపోవటానికి.

ముగ్గులేని ముంగిలి ఉండదు. నీడలేని వెలుగు లేదు. తెలుగు సినీప్రపంచంలో పి. సుశీల పేరుతెలియని ప్రేక్షక, శ్రోతలుండరు.

ఆరుద్రకలం లోని తేటతెలుగు, ముత్యంలా మెరిసి తెలుగింటి వాకిట సప్తస్వర విన్యాసంగా మహాదేవన్ ప్రతిభలా సుశీల వినిపించిన సంగతి తెలిసిందే. దక్షిణభారతదేశ సంప్రదాయాలు యీ గీతంలో రంగవల్లి వేసినట్లు ప్రతీచరణంలోనూ కన్పిస్తాయి. 'పసుపు–కుంకుమ', 'మూడు పూవులు – ఆరు కాయలు', 'అయిదోతనం – ఆరోతనం', 'కోటలో తులసమ్మ– గోవుమాలక్ష్మి', 'నిండు కడవల్లు' – 'చాన కాపురం – మొగలిపూల గాలి', ముత్యాలవాన, ఇంటిల్లిపాది... ఇలా ఆరుద్ర అందించిన పదాలను మాధురీభరితంగా పలికిన సుశీల తెలుగింటి పెద్ద ఆడపడుచు. మోహనరాగం మురిసిపోయేలా స్వరపరచిన మహాదేవన్ తెలుగింటి "మామ".

అయితే అభ్యుదయభావాలున్న ఆరుద్ర ఇలాంటి పేరంటాళ్ల పాట రాయడమేమిటని ఆయన అభిమానులు మాత్రం చిన్నబుచ్చుకున్నారు.

ఇంటిపనులు చేస్తూ నాయిక (సంగీత) తిరగడానికి అవసరమైన విరామాలు ఉన్న సంగీతం అమర్చాడు సంగీత దర్శకుడు. చరణాలు చివర్లో వచ్చే.. ఆ.. ఆ...ఆ... అన్న ముగింపు గమనిస్తే ఇదొక పేరంటాలపాట నమూనాగా కన్పిస్తుంది. ఈ పాటతో యావదాంధ్రదేశంలోని వనితాలోకం మురిసిపోయింది. సుశీల ఇలాంటిపాటల గుత్తాధికారం ఎప్పటికీ తనదేనని నిరూపించారు. దీనికి తగ్గట్టు సంగీతంలోని గ్రామీణ లావణ్యం, బాపులోని కళాత్మక స్పందనత్వం, నాయిక సంగీతలోని ముఖ ఆకర్షణ యీ 'టైటిల్‌సాంగ్'ను అర్థవంతం చేసాయి. ఆ నూతనవధువు ముంగిలిలో ముగ్గులేస్తూ ఈపాట పాడుతుంది. సతీపతుల బాంధవ్యానికి సంకేతంగా 'ముగ్గు'ను బాపు అద్భుతంగా ప్రతిబింబించారు.

ఆరుద్ర, పెండ్యాల, తిలక్ సమష్టికృషి ఎలా నిసర్గరమ్య సినిమాసంగీతం సృష్టించిందో బాపు, రమణ, మహాదేవన్‌ల కలయికా అలాగే మరపురాని మధురగీతాల నెన్నెంటినో సృష్టించింది. తెలుగుముంగిళ్లలో ముత్యాలముగ్గు లేయించింది. సంగీత నటిగా బ్రతుకులో వెలుగులు చూచింది 'మామ' కురిపించిన స్వరవెన్నెల లోనే!

# ముత్యాలముగ్గు (1975)

❖ గుంటూరు శేషేంద్రశర్మ ❖ కె.వి.మహాదేవన్

నిదురించే తోటలోకి పాట ఒకటి వచ్చింది
కన్నుల్లో నీరు తుడిచి కమ్మటి కల ఇచ్చింది ॥నిదురించే॥
రమ్యంగా కుటీరాన రంగవల్లు లల్లింది
దీనురాలి గూటిలోన దీపంగా వెలిగింది ॥రమ్యంగా॥
శూన్యమైన వేణువులో ఒక స్వరం కలిపి నిలిపింది ॥శూన్య॥
ఆకురాలు అడవికి ఒక ఆమని దయచేసింది ॥నిదురించే॥
విఫలమైన నా కోర్కెలు వేలాడే గుమ్మంలో
ఆశల అడుగులు వినబడి అంతలో పోయాయి ॥విఫల॥
కొమ్మల్లో పక్షుల్లారా గగనంలో మబ్బుల్లారా
నది దోచుకుపోతున్న నావను ఆపండి
రేవు బావురు మంటోందని నావకు చెప్పండి, నావకు చెప్పండి ...



''ముత్యాలముగ్గు'' చిత్రంలోని కళాత్మకగేయ మిది. గుంటూరు శేషేంద్రశర్మ రాసిన ఒకే ఒక్క సినిమాపాట ఇది. నాయిక (సీత నమూనాలోని సంగీత) ఒక నది ఒడ్డున పర్ణశాలలో ఉంటుంది. అప్పుడు హనుమంతుడు పిల్లలతో అక్కడికివచ్చి భర్త వార్తను తెల్పుతాడు. కథ సుఖాంతం కావటానికి ముందుటి పతాకస్థాన మిది.

యుగకవి శేషేంద్ర ప్రతీకల్లో మాట్లాడడానికి అలవాటైనవారు. ఎమర్సన్, ఇలియట్, షేక్స్పియర్ ఆయన చుట్టాలు. కాళిదాసు అతని పూర్వీకుడు. తూర్పు, పశ్చిమ సముద్రాలు ఆయన ఎరిగిన ఎల్లలు. ఇక్కడ తోట సీత– ఇల్లాలు. కన్నీరు తుడిచి కమ్మటికల యిచ్చిన పాట హనుమంతుడి 'సందేశం'. ఇది రామాయణాన్ని తాకే మాట. శేషేంద్రశర్మ రామాయణాంతరార్థాల్ని క్షుణ్ణంగా మదించినవారవడం వల్ల యీ అద్భుతగీతాన్ని సృష్టించారు.




ఈ చిత్రంలోని పాటలన్నీ రంగవల్లులే, హరివిల్లులే. కథాబలం, దర్శకత్వప్రతిభ, సుమధుర సంగీతం... అన్నీ పుష్కలంగా, పరిపుష్టంగా ఉన్న యీ చిత్రం తెలుగింట ముత్యాలముగ్గే. పాటలోని మౌన మూగవేదన పాత్ర మనోరథానికి అద్దంపట్టేలా ఉంటుంది. ఈపాట సాహిత్యం ఎంత సుతిమెత్తగా ఉంటుందో, మామ స్వరరచన అంత సుకుమారంగా ఉండి పాటను అజరామరం చేసింది! శేషేంద్రశర్మ మహాదేవన్ సంగీతాన్ని ఇలా ప్రశంసించారు ఒకచోట – "ఏమీ ఎరుగని నగ్నశాఖనుంచి ఎట్లా ఆకులు పుట్టుకొస్తాయో అట్లా ఆయన స్పర్శ తగిలితే తీగెల్లో, వేణువుల్లో నిదురిస్తున్న స్వరాల అప్సరసలు మేల్కొంటాయి. గాలిలోకి ఎగిరిపోతాయి. మన అంతర్లోకాల్లో గుంపులు గుంపులుగా ముసురుకుని పూలపండుగలు చేస్తాయి. ఏవో అనిర్వచనీయమైన అందాల అడవులు అల్లుకుంటాయి. ఆ అడవులు ఎంత అందంగా ఉంటాయంటే అక్కడ పడి ఉన్న శిల కూడా కలగంటున్న ప్రాణే. ఇలా ఉంటాయి ఆయన శ్రోతల అనుభూతులు!". ఈ పాట వింటున్నప్పుడు మహాదేవన్ తెలుగువారు కారంటే అసలు నమ్మలేం. పాత్ర మనోభావానికి సుశీల గాత్రం ఒక దర్పణం. పాత్ర పొందిన అనుభవాలు ఆమెగొంతు పలికిన తీరులో ఒక తీయనివేదన రమణీయంగా పలికింది.

# జమీందారు గారి అమ్మాయి (1975)

❖ దాశరథి ❖ జి.కె.వెంకటేశ్

మ్రోగింది వీణా - పదే పదే
హృదయాలలోన - ఆ దివ్యరాగం
అనురాగమై - సాగిందిలే ॥మ్రోగింది॥

అధరాలమీద - ఆడింది నామం ॥అధరాల॥
కనుపాప లందే - కదిలింది రూపం ॥కనుపాప॥
ఆ రూపమే - మరీ మరీ - నిలిచిందిలే ॥మ్రోగింది॥

సిరిమల్లెపువ్వు - కురిసింది నవ్వు
నెలరాజు అందం - వేసింది బంధం ॥నెలరాజు॥
ఆ బంధమే - మరీ మరీ - ఆనందమే ॥మ్రోగింది॥

వీణ పాటలు చాలా చేయకపోయినా చేసిన రెండు, మూడూ గుర్తుండిపోయే పాటలు చేశారు జి.కె.వెంకటేశ్. ముందు ఒక తమిళసినిమా కోసం ఎస్.జానకి, ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం చేత ఇలాంటి పాటనే రికార్డు చేయించారు. అది బాగా పేరు తెచ్చుకుంది. ఇదే పాటను మళ్లీ తెలుగుసినిమాకు వాడడం జరిగింది. దాశరథి లలితమైన సాహిత్యానికి యమన్‌కల్యాణిలో జి.కె.కట్టినవరస మలయమారుతంలా హాయిగా సాగిపోయింది. చిత్రంలో సుశీల, ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం వేరు వేరు సందర్భాల్లో పాడిన గొప్పపాట ఇది.

మెలోడీ అంటే వెంకటేశ్‌కు ప్రాణం. తనకు ఇష్టమైనరీతిలో స్వరాలు కూర్చుకుని, తనకు నచ్చేవిధంగా గాయనీగాయకులచేత పాడించుకునే వారాయన. సన్నివేశం అనుమతిస్తే సాధ్యమైనంతవరకూ శాస్త్రీయసంగీత ఆలంబనతోనే పాట చేయడానికి ఆయన ఇష్టపడేవారు. అలాంటి స్వరకర్త మేథోమథనం నుండి వెలువడ్డ అమృతగీతిక ఇది.

ప్రాణంలేని వీణాతంత్రి షడ్జమమైన గాత్రానికి సరిసమాన మౌతుందా? అంటే అవును.. హృదయాలలో దివ్యరాగాలు ప్రభవిస్తే అవి గళసీమను సవరించుకుంటే.. వీణారవం గాత్రం అవుతుంది. ఇదెలా సాధ్యం అనిపాట రాసిన దాశరథిని అడిగితే... జి.కె.వెంకటేశ్‌కు తెలుసంటారు... మరి ఆయన్ని అడిగితే నాదేముంది? గాయని సుశీల




ఋజువు చేశారుగా... ఆమెనే అడగండి" అంటారు. ఆమెనడిగితే "అంతా సరస్వతీ కటాక్షం" అంటారు.

కవి కలం నుండి జాలువారిన కుసుమపదాలు కోమలంగా సుశీల అధరాలను స్పృశించి, ఏదో స్వరాకృతి మదిలో మెదిలి, కళ్లెదుట ప్రత్యక్షమైనట్లుంటుంది ఈపాట వింటుంటే. పాట మధ్యలో 'కనుపాపలందే' అనే చోట రెండోసారి ఆమె పలకడంలో గాత్ర పరిణతి, శ్రావ్యత చాలా స్పష్టంగా కన్పిస్తాయి.



జి.కె.వెంకటేశ్

ఒకప్పుడు సుశీల ఎక్కడ సంగీతకచేరీ చేసినా తప్పక యీ పాట ఉండాల్సిందే.

# తూర్పు - పడమర (1976)

❖ సి.నారాయణరెడ్డి ❖ రమేష్‌నాయుడు

ఆ.. ఆ..
స్వరములు ఏడైనా..... రాగాలెన్నో ॥స్వరములు॥
హృదయం ఒకటైనా ... భావాలెన్నో
స్వరములు ఏడైనా ... రాగాలెన్నో ॥స్వరములు॥

చరణం : అడుగులు రెండైనా నాట్యాలెన్నో ॥అడుగులు॥
అక్షరాలు కొన్నైనా కావ్యాలెన్నెన్నో ॥స్వరములు॥

చరణం : జననంలోన కలదు వేదన
మరణంలోను కలదు వేదన ॥జననం॥
ఆ వేదనలోన ఉదయించే
నవవేదాలెన్నో, నాదా లెన్నెన్నో, నాదా లెన్నెన్నో॥స్వరములు॥

చరణం : నేటికి రేపొక తీరనిప్రశ్న
రేపటికి మరునాడొక ప్రశ్న
కాలమనే గాలానికి చిక్కి... ॥కాల॥
తేలని ప్రశ్నలు ఎన్నెన్నో, ఎన్నెన్నో ॥స్వరములు॥

చరణం : కనులున్నందుకు కలలు తప్పవు
కలలున్నప్పుడు పీడకలలు తప్పవు ॥కనులు॥
కలల వెలుగులో కన్నీరొలికే ॥కలల॥
కలతల నీడలు ఎన్నెన్నో, ఎన్నెన్నో ॥స్వరములు॥

ఘంటసాల సంగీతోత్సవాల్లో ఏర్పాటుచేసిన వేదికపైన శ్రీవిద్య పాడే శాస్త్రీయ రాగభరిత గీతంతో యీ చిత్రం ప్రారంభమౌతుంది. నిండువిగ్రహంతో, నిర్మలవదనంతో కూర్చుని పాడుతున్న శ్రీవిద్య రసార్ద్రగాత్రంలో అవ్యక్త విషాదరాగిణి వినిపిస్తుంది. ఉత్సవాల్లో ఉత్సాహం ఉరకలెత్తించేగీతం కాదిది. శ్రోతలను ఆలోచనల లోతుల్లోకి తీసుకువెళ్లేది. మూల తమిళచిత్రంలోని గీతసన్నివేశమూ ఇలాంటిదే. అయితే మూలంలోని పల్లవి ఎత్తుగడను మాత్రమే తీసుకుని యీ గీతాన్ని రచించాల్సిందిగా చిత్రదర్శకుడు దాసరి నారాయణరావు, సి.నారాయణరెడ్డిని కోరారు. సన్నివేశపరంగా తరుణయవ్వనంలో శ్రీవిద్య, రాగ నిపుణుడూ, రసహృదయుడూ అయిన మోహన్‌బాబు పరస్పరం ప్రగాఢంగా

ప్రేమించుకుంటారు. కల్యాణం కాకముందే ఆవిడ కడుపు పండుతుంది. కథాగతంగా తిరిగిన అనివార్యమైన మలుపులవల్ల మోహన్‌బాబు ఆమె సాంగత్యపరిధిలోంచి అదృశ్యమౌతాడు. కూతురు పుడుతుంది. ఆ అమ్మాయే మాధవి. తండ్రి ఎవరోతెలీని తల్లితో కలిసి ఉండలేనిస్థితిలో ఇల్లు విడిచి వెళ్లిపోతుంది మాధవి. శ్రీవిద్య ఒంటరిగా ఉంటూ పాటకచేరీలు చేసుకుంటూ వ్యధితజీవితాన్ని కొనసాగిస్తూ ఉంటుంది. ఆ నేపథ్యంలో పాడుతున్న పాట కాబట్టి సాహిత్యంలో ఆమె ఆందోళిత స్వాంతాన్ని ఆవిష్కరించారు సి.నా.రె.

ఈ పాట పల్లవిలో అన్నీ ప్రశ్నలే. ఏకం నుంచి అనేకంలోకి. కొన్నిటినుంచి ఎన్నో సంఖ్యల్లోకి. విడిచివెళ్లిన తన ప్రియుడు ఎప్పటికైనా తిరిగొస్తాడా అనేదే ఆ పరిణత నాయికలో సుళ్లు తిరుగుతున్న ప్రశ్న. ఆ సుడులలో అసంఖ్యాక ప్రశ్నలు. తన బతుకే ప్రశ్నార్థకం. ఈ పల్లవి, స్థూలదృష్టికి సంగీత నాట్య కవిత్వాలకు సంబంధించినట్టు అగుపడినా దానిలోని మౌలిక జిజ్ఞాసవేరు. ఆ జిజ్ఞాస చరణాల్లో మరింత తాత్త్వికంగా తీగ సాగుతుంది. ఆమె శాస్త్రీయగాయని కాబట్టి ఈ పాటను రమేష్‌నాయుడు, మూలచిత్రంలోని బాణీ లేవీ ముట్టుకోకుండా స్వతంత్రంగా స్వరాలు సమకూర్చారు. ఈ పాటనొక రాగమాలికగా తీర్చిదిద్దారు. ఈ పాట పల్లవిని అచ్చమైన 'కామవర్ధిని' రాగంలో స్వరపరిచారు.

మనిషి జీవితానికి జనన మరణాలు రెండుతీరాలు. ఆ తీరంలో ఉదయం, యీ తీరంలో అస్తమయం. నడుమసాగే ప్రవాహం వివిధానుభూతుల వాహిక. మానవుడు జన్మించినప్పుడు కెవ్వున ఏడుస్తూ వస్తాడు. మరణించేటప్పుడు గిజగిజలాడుతూ వెళ్లిపోతాడు. నా అన్నవారిని ఏడిపిస్తాడు. ఉభయదశల్లోనూ వేదన ఉంది. అయినా అది కేవలం కన్నీరు కార్పించేదిగా ఉండదు. ఒక్కోసారి వేదనలోంచి వేదాలు ఉదయిస్తాయి. నాదాలు ప్రభవిస్తాయి. సృష్ట్యాదిలో అది ఋషుల మనోమథనఫలితంగానే వేదమంత్రాలు నినదించాయి. శోకంలో నుంచి వెలువడిన శ్లోకమే వాల్మీకి రామాయణానికి నాంది. పాడుతున్న ఆ పాత్ర సంస్కారగాఢతను, దుఃఖ నిగూఢతను ఆవిష్కరించడమే "చక్రవాక" రాగంలో స్వరపరచిన మొదటి చరణం లక్ష్యం.

రెండోచరణంలో వర్తమాన భవిష్యత్తులను ప్రశ్న అనే కొలమానంతో కొలిచి చూశారు కవి. వర్తమానం ఆర్తిమయంగా ఉన్నా భవితవ్యం ఆశాజనకంగా ఉండక పోతుందా? అనే ప్రశ్నతోనే ఆమె జీవిస్తున్నది. 'హిందోళ' రాగంలో రెండో చరణం స్వరపరచబడింది.

నిజానికి ఎవరి జీవితానికి వారే కర్తలు. నిన్నటి గమనంలో తగిలిన దెబ్బలను తలచుకుని నేటి నడకను సాగించాలని అందరి ప్రయత్నం. ప్రయత్నానికేమి? అందరూ

చేస్తారు. పర్యవసానం అనూహ్యంగా ఉంటుంది. ఇప్పుడు ఇలా ఉన్నా మరి రేపో. తప్పక ఇలాగే ఉంటుంది అని చెప్పేదెలా? దానికో రూపం ఏర్పడలేదింకా. ఎలామరి? అదొక ప్రశ్న. రేపట్లోకి వెళ్ళిపోతాం. ఆపైన ఏం జరుగుతుందో తెలీదు. మళ్లీ ప్రశ్నే. ఈ ప్రశ్నలకు సమాధానాలు ఎందుకు దొరకడం లేదు. ఎందుకా? అందరిపైన కాలమనేది ఉన్నందుకు మనిషి తన అసహాయతను, అనిశ్చితిని కప్పిపుచ్చుకోవడానికి పరాశ్రయుడౌతాడు. ఆ ఆశ్రయానికి, ఆ ఉపాధికి దైవమని, కాలమని, అదృష్టమని, నొసటిరాత అని పేర్లు పెట్టుకుంటాడు. వీటిలో అదృష్టమనే పదం అన్నిటికీ వర్తిస్తుంది. కాలం కలిసిరాలేదని అంటారు. కాలమంటే కనబడిన పరిస్థితే. అదృష్టం అంటే చూడబడనిదని అర్థం. దైవమూ అదృశ్యశక్తే కదా. మనస్సులో చెలరేగే ప్రశ్నలన్నీ కాలమనే గాలానికి చిక్కుకుని తేలకుండా ఉన్నాయి. ఆ పాత్ర తాత్త్వికదృష్టికి యీ రెండో చరణం నిదర్శనం.

దుఃఖమున్నప్పుడు దాన్ని అనుభవించక తప్పదు. కలలను ఇతివృత్తంగా తీసుకుని మూడోచరణాన్ని రచించారు సి.నా.రె. రమేష్‌నాయుడు యీ చరణాన్ని 'సింధుభైరవి' రాగంలో స్వరపరిచారు.

అగుపించిన సంఘటనలు, అసంపూర్ణ కాంక్షలు కలలుగా కదలాడుతాయి. మనిషికున్న పంచేంద్రియాల్లో కలలు పుట్టేది కళ్లలోనే. జీవితం సుఖదుఃఖ మిశ్రితమైనప్పుడు కనేకలలు కూడా దానికి ప్రతిబింబాలుగానే ఉంటాయి. తీపికలలకు పులకరించే ప్రాణులు పీడకలలకు జలదరించి పోరాదని మూడోచరణం చెబుతుంది. ఉజ్జ్వలంగా వెలిగే స్వప్నాల్లో కూడా అట్టడుగున కలతల నీడలూ ఉంటాయి. ఈ చేదునిజం గమనించిన వారికి విషాదవరణం అసాధ్యం కాదు. ఇప్పుడు ఆ కథానాయిక ఆ సమస్థితిలో ఉంది. ఈ పాటలో పల్లవిలో ప్రయోగించిన "ఎన్నో" ప్రతి చరణం చివర "ఎన్నెన్నో" లుగా మారుతుంది. బతుకులో ఏర్పడే ప్రశ్నల అతిబాహుళ్యాన్ని సూచించడానికి చేసిన ప్రయత్నమిది.

నాలుగురాగాల్లో ప్రతిపాదిత భావోచితంగా స్వరకల్పన చేసిన యీ గీతాన్ని సుశీల సురుచిరకంఠంతో పాడి గీతవ్యాప్తికి దోహదం చేశారు. గాంధర్వసంగీత గమక మధురిమలను సుశీల మంజులగాత్రంలో పలికించిన తీరు రమణీయం. ముఖ్యంగా జీవస్వరాలైన శుద్ధ రిషభ, కైశిక నిషాదాలను కోమలంగా పలికించారామె. ప్రతి అక్షరంలోనూ, స్వరంలోనూ నిమగ్నమై భావవేదనలో నాదాలు పలికినతీరులో ఒక నిర్మల శుద్ధచైతన్యం వినిపిస్తుంది. ఉదాహరణకు 'జననంలోన కలదు వేదన...' నుండి'...నవ వేదాలెన్నో నాదాలెన్నెన్నో....' వరకు కరుణరసం ఒక్కటే... అన్ని రసాలసారం అని ఋజువు చేసేంత ఆర్ద్రంగా పాడారు సుశీల.

# ముత్యాల పల్లకి (1976)

❖ మల్లెమాల ❖ సత్యం

తెల్లవారకముందే పల్లె లేచింది
తన వారినందరినీ తట్టీ లేపింది
ఆదమరచి నిద్రపోతున్న తొలికోడి
అదిరిపడి మేల్కొంది అదేపనిగ కూసింది ॥తెల్లవారక॥

వెలుగుదుస్తు లేసుకుని సూరీడు
తూర్పు తలుపుతోసుకొని వచ్చాడు
పాడుచీకటి కెంత భయమేసిందో
పక్కదులుపుకొని ఒకే పరుగుతీసింది
అది చూచి లతలన్నీ ఫక్కున నవ్వాయి ఆ
నవ్వులే ఇంటింటా పువ్వులైనాయి ॥తెల్లవారక॥

పాలవెల్లీ లాంటి మనుషులు
పండూ వెన్నెల వంటి మనసులు
మల్లెపూలరాసి వంటి మమతలు
పల్లెసీమలో కోకొల్లలు
అనురాగం అభిమానం ॥అను॥
కవలపిల్లలు ఆ
పిల్లలకు పల్లెటూళ్లు కన్నతల్లులు ॥తెల్లవారక॥

భారతదేశానికి భౌగోళిక అస్తిత్వం హిమాలయాలవల్ల ఏర్పడితే, సామాజిక, సాంస్కృతిక ఔన్నత్యం పల్లెసీమల వల్లే అలవడింది, పల్లె ఆకలి తీర్చే తల్లిలాంటిది. పల్లె.... అవసరాలు తీర్చి అండగా నిలిచే తండ్రి లాంటిది.

శరవేగంగా విస్తరిస్తున్న ప్రపంచీకరణ వల్ల, కమ్ముకొస్తున్న కాలుష్యభూతాలవల్ల కనుమరుగయ్యేలా, మాసిపోతున్న 'పల్లె' ముఖచిత్రం ఒకప్పుడు ఎంతో వైభవంగా ఉండేదనడానికి యీ పాటే సాక్షిగా నిలబడుతుంది.

సహజకవి మల్లెమాల రాసిన యీ గీతం సూర్యోదయవేళల్లో గ్రామసీమల్లో కనువిందుచేసే వర్ణచిత్ర దృశ్యమాలికలను మనోహరంగా ఆవిష్కరించింది. సూర్యుని




సత్యం

రాకతోనే తెల్లవారటం జరుగుతుంది. కానీ శ్రామికజీవనసంస్కృతికి ఊపిరిపోసే పల్లెసీమ మాత్రం తాను అంతకుముందే నిద్రలేచి తనవారందరినీ తట్టిలేపింది అనడంతో అక్కడ, అందరూ తనవారే అంటూ కలిసిపోయే ఆ అన్యోన్యత ముచ్చటగొలుపుతుంది. కోడికూత పల్లెను నిద్రలేపుతుంది. కానీ మల్లెమాలగారి పల్లె ముందుగానే లేవటం వల్ల ఆదమరచి నిద్రపోతున్న తొలికోడి అదిరిపడి మేల్కొంది. అదే పనిగా కూసింది. ఇలా కోడిమేల్కొల్పుతో పల్లవి పల్లవించింది.

పల్లెల్లో పేదరికం ఏనాటినుండో సుఖంగా స్థిరనివాసం ఏర్పరచుకుంది. అక్కడ బంగళాలు, అపార్టుమెంట్లు ఉండవు. ఉండేవి గర్భగుడి పరిమాణంలో కనిపించే గుడిసెలు, తాటాకులతో కప్పుకున్న పూరిళ్లే. అక్కడ తడికలే తలుపులు. వాటిని తోసుకుని లోపలికి రావాలి. అందుకే ఆ పల్లెలో తూర్పుతలుపు కూడా తడికెకు ప్రతీక కనుకనే సూరీడు కూడా తోసుకుని వచ్చాడు. కండువాలే దుస్తులుగా కట్టుకుని లేదా తలకు చుట్టుకుని, పల్లెవాసులు పొలాలబాట పడుతుంటే, సూరీడు వెలుగుదుస్తులు వేసుకుని ఎదురొస్తున్నాడు. ఇక ఆ తర్వాత పల్లె మొత్తం చైతన్యానికి స్వాగతం పలకడంతో భయపడిన చీకటి పక్క దులుపుకొని పారిపోయిందనడంలో రూపకాలంకారయుత సహజత్వం పులకింతలు రేపుతుంది. పల్లవిలో ఉన్నది శబ్దచిత్రమే. ఎందుకంటే అప్పటికింకా చీకటిదుప్పటిలోనే పల్లె ముడుచుకుంది. వెలుతురు చొరబడింది చరణాల్లోనే. కనుక ముంగిటిలో అల్లుకునే లతలు ఇప్పుడే కనిపించాయి. ఇక పల్లెపడతుల దైనందినకృత్యాలు మొదలవుతాయి. పొద్దుపొడవగానే ఇంటిముందు కళ్లాపిచల్లి ముగ్గులు వేయడం, ఆ ముగ్గులనిండా రంగురంగుల పూలు నింపడం లాంటి అందాలు పల్లెల్లో చిందులు తొక్కుతాయి.

పల్లెసీమ విశ్వరూపాన్నంత రెండోచరణంలో నిక్షిప్తం చేశారు కవి. అందుకే అక్కడ ప్రతిపదంలో గీతామకరందం గుబాళిస్తుంది. మనసులు, మమతలకు శాశ్వతచిరునామా

పల్లెసీమ... అనే మల్లెమాల విశ్వాసం కాదనలేని విశ్వసత్యమే. ఇక్కడ మరో శ్లేష, స్వభావోక్తి అంతర్లీనంగా ఉన్నాయి. పాలవెల్లిలో 'పాలు', పండువెన్నెల్లో 'పండు' ఉన్నాయి. వీటికి తోడు మల్లెపూల రాసులు సరేసరి. ఇవన్నీ ఉత్పత్తి చేసేది మళ్లీ ఆ పల్లెసీమలే.



మల్లెమాల

మనుషుల మధ్య పెనవేసుకునే అనురాగం; నేలతల్లిమీద, పశుపక్ష్యాదుల మీద, చెట్లమీద, పుట్లమీద, పొలంగట్ల మీద, వ్యవసాయపనిముట్ల మీద చూపించే అభిమానం, యీ రెండూ కవలపిల్లలుగా భావించడం కవిత్వంలో ఋషిత్వం నిండినపుడే సాధ్యమౌతుంది. ఇంత అందంగా పాటరాసి పల్లెసీమ గొప్పతనాన్ని తన కలంతో పొగిడిన మహనీయుడు మల్లెమాల.

పల్లెటూరి వాతావరణాన్ని తేటతెలుగుమాటలతో కవితాభరితంగా మల్లెమాల వ్యక్తం చేస్తే సంగీతదర్శకులు సత్యం స్వచ్ఛమైన, నిర్మలమైన శంకరాభరణం రాగంలో స్వరాలు అమర్చి మసి అంటని మనస్తత్వాల్ని అమృతప్రాయంగా మనకందించారు.

ఇక సుశీల తన కలవాటైనపద్ధతిలో అవలీలగా, హాయిగా పాడారీపాటను. గొడవపాటలు, గల్లంతుగీతాలు వేలకొద్దీవిన్న తరువాత ఇటువంటిది ఒక్కపాట వింటే చాలు వడదెబ్బ తగిలిన వాడికి మజ్జిగచుక్క పోసినంత చల్లగా ఉంటుంది. శుచీ, శుభ్రతా ఉన్న ప్రకృతి గీతమిది.

తెలుగుదనం తొణికిసలాడిన యీ తొలిపొద్దుగీతాన్ని తూర్పుగోదావరిజిల్లా, గోపాలపురం లో డా॥సోమసుందర్ రెడ్డి ఇంటి ముందు చిత్రీకరించారు. జమున తర్వాత సుశీల గాత్రం ఎక్కువగా సరిపోయింది సహజనటి జయసుధకే. వీరిరువురి కలయికలో చాలా మంచిపాటలొచ్చాయి.

# అమెరికా అమ్మాయి (1976)

❖ దేవులపల్లి ❖ జి.కె.వెంకటేశ్

పాడనా తెనుగుపాట ॥పాడనా॥
పరవశనై .... మీ ఎదుట మీపాట ॥పాడనా॥


కోవెల గంటల గణగణలో
గోదావరి తరగల గలగలలో ॥కోవెల॥
మావుల తోపుల, మూపులపైన
మసలే గాలుల గుసగుసలో
మంచిముత్యాల పేట...మధురామృతాలతేట.. ఒక పాట
॥పాడనా॥

త్యాగయ, క్షేత్రయ, రామదాసులు ॥త్యాగయ॥
తనివితీర వినిపించినదీ....
నాడునాడుల కదిలించేది
వాడవాడలా కరిగించేదీ
చక్కెరమాటల మూట
చిక్కని తేనెల ఊట... ఒకపాట ॥పాడనా॥

ఒళ్లంత ఒయ్యారి కోక–
కళ్లకు కాటుకరేఖ ॥ఒళ్లంత॥
మెళ్లో తాళి – కాళ్లకు పారాణి
మెరిసే కుంకుమ బొట్టు
ఘల్లుఘల్లున కడియాలందెల
అల్లనల్లన నడయాడే
తెనుగుతల్లి పెట్టనికోట
తెనుగునాట ప్రతిచోట ఒకపాట ॥పాడనా॥

ఈ పాటలో శ్రుతి, రమ్యత, భావసౌకుమార్యం, లలితమైన తెలుగు పదాలు, నుడికారపు సోయగాలు, ఆచార సంప్రదాయధోరణులు, ప్రకృతి పరమాత్మతో అనుసంధానమైన మన ఇంటిపాట, మన ఒంటికి వంటబట్టే పాటగా తెలుగువాళ్లందరికీ

సుపరిచితమే. తలకట్టు ఉన్న అక్షరంలా తలఎత్తుకు తిరిగేలా 'ఇదీ నా పాట', 'ఇదే నా పాట' అని గొంతెత్తి చెప్పిన పాట.




ఇప్పటి సినిమాలలో అప్పుడప్పుడూ తెలుగుమాటలు విన్పిస్తున్నాయి. ఒకప్పుడైతే అంతా తెలుగే వినిపించేది అని చెప్పుకోవడానికి యీ పాటను ఉదాహరణగా చూపించవచ్చు.

అతి తక్కువ సినిమాలకు స్వరసారథ్యం వహించినా తనదైన బాణీలో అద్భుతగీతాలు స్వరపరిచారు జి.కె.వెంకటేశ్. వీణ, వేణువు, హార్మోనియం మూడింటిపైన అతిచిన్నవయసులోనే సంగీతప్రదర్శనలు ఇచ్చిన ప్రతిభాశాలి. సినిమాలు ఆర్థికంగా అంతగా సాధించక పోయి ఉండవచ్చు గానీ, ఆయాచిత్రాల్లో యీయన స్వరపరచిన పాటలన్నీ సూపర్ హిట్సే. వాద్యపరికరాలు, గాయనీగాయకుల గళమాధుర్యం, పాత్రల హావభావాలు బాగా తెలిసినవారు కావడంతో, రాగాలమీద సశాస్త్రీయ సాధికారం ఉండడంతో ఈపాటను శుద్ధసావేరి రాగంలో స్వరపరచి, ఆంధ్రదేశమంతా ఈపాట మార్మోగిపోయేలా చేశారు. శంకరాభరణ రాగజన్యమైన ఈ రాగంలోని మధుర శుద్ధ మధ్యమాలు, చతుశ్రుతి రిషభ, దైవతాలు సమ్మోహనంగా వినిపించేలా సుశీలకు ఈ పాట దక్కింది. ఇరువురూ అభినందనీయులే.

కథాపరంగా అమెరికానుంచి వచ్చిన ఒక అమ్మాయి తెలుగింటి కోడలిగా మారి, ఇక్కడి వేషభాషలకు గౌరవం ఇచ్చి, ఇక్కడి తెలుగుకు విలువ ఇచ్చి ఇక్కడి వాళ్ల భేషజాన్ని దూరం చేస్తుందీ పాటతో. ఈ పాటను సుశీల పాడుతుంటే శరీరం రోమాంచితం అవుతుంది. ఆమె యీ పాటను జాతి పులకించేలా, పరవశించేలా గొంతెత్తి పాడారు. తేటతెలుగు పదాలన్నీ ముత్యాలపేటలై, గుళ్లోగంటలై, గోదారి ప్రవాహతీరాలై వాడవాడలా విస్తరించిన పాట ఇది.

# శ్రీరాజేశ్వరీవిలాస్ కాఫీక్లబ్ (1976)

❖ దాశరథి ❖ పెండ్యాల

ఆకాశపందిరిలో నీకు నాకు పెళ్లంట
అప్సరలే పేరంటాళ్లు – దేవతలే పురోహితులంట
దీవనలు ఇస్తారంట ॥ఆకాశ॥
తళుకుబెళుకు నక్షత్రాలు
తలంబ్రాలు తెస్తారంట ॥తళుకు॥
మెరుపుతీగె తోరణాలు
మెరిసి మురిసి పోయేనంట
మరపురాని వేడుకలంట ॥ఆకాశ॥
పిల్లగాలి మేళగాళ్లు
పెళ్లిపాట పాడేరంట ॥పిల్ల॥
రాజహంస జంట చేరీ
రత్నహారతిచ్చేనంట
రాసకేళి జరిపేరంట ॥ఆకాశ॥
వన్నెచిన్నెల ఇంద్రధనుసుపై
వెన్నెల పానుపు వేసేనంట ॥వన్నె చిన్నెల॥
మబ్బులు తలుపులు మూసేనంట ॥మబ్బు॥
మగువలు తొంగి చూసేరంట
మనలను గేలి చేసేరంట



తన తనువును, మనసును అర్పించుకోబోతున్న తన హదయేశ్వరుని రస స్వరూపుడిగా భావించుకున్న ఒక మహోన్నత కల్యాణతత్త్వం యీ గీతంలో అభివ్యక్తమైంది.

రసోవైసః అతడు రసస్వరూపుడు, అంటే దేవుడు. ఇక్కడ తన పరిణయం ప్రియునితోటి జరుగనున్న రాసక్రీడ. ఆ ప్రణయ విరాట్స్వరూపానికి ఆకాశం నీలాల పందిరి. అప్సరసలు పేరంటాళ్లు. దేవతలు పురోహితులు. వెలుగుతున్న నక్షత్రాలన్నీ

మొక్కవోనిఅక్షతలై తలమీదనుండి జాలువారుతున్నాయి. ఈ తలంబ్రాలు వధువు హృదయంలోని మధురభావాలకు ప్రతీకలుగా మిలమిలలాడుతున్నాయి. మరపురాని మధురోహాలు ఆగిపోని మెరుపుతీగలై తళతళలాడుతున్నాయి, యీ పిల్లగాలులు ఎల్లవేళలా మంగళవాద్యాలుగా మధురధ్వనుల్ని విన్పిస్తున్నాయి. రాజహంసలు తమ అభిమానానికి కానుకలుగా రత్నాల హారతులు ఇస్తున్నాయి. ప్రకృతిలో ఎటుచూసినా రాసకేళి పరవళ్లు తొక్కుతోంది. యద్భావం తద్భవతి అన్నట్లు నవవధువు తన ఎదముంగిట రూపుదిద్దుకున్న పెండ్లిసందడిని ప్రకృతిలో



పెండ్యాల

దర్శిస్తూ, తన ఆత్మార్పణ శోభన శుభఘడియ, మబ్బుల తలుపుల మాటున, ఇంధ్రధనుసుతల్పంమీద, వెన్నెలపాన్పుపైన వస్తుందని ఆమె ఊహించుకుంటోంది. ఈ కల్యాణగీతంలో ప్రేమ విశ్వరూపాన్ని పెళ్లిరూపంలో చూపిస్తూ కవి కన్నెమనసును దర్పణంలో ప్రతిబింబించారు.

పాటను పరవశించేలా మలచడంలో పెండ్యాల రసజ్ఞులు. కవి భావనలకు, పాత్రౌచిత్యాలకు పెద్దపీటవేసి స్థిరస్థాయిలో చిరకాలం మన్నేలా స్వరపరచటం ఆయన నైజం.

ఈ పాటలోని పదాలు మంద్ర, తీవ్రస్థాయిలో సాగుతూ ఒకదానికొకటి పోటీపడతాయి. సాహిత్యం అంతా అధివాస్తవధోరణిలో సాగినా సుశీల గాత్రంలో ఇది వాస్తవమే, ఇలలో ఇలాగే జరుగుతుందనే ఆశాలోకాల అంచులుదాటి యీ గీతం సాగుతుంది. పెళ్లికానిఅమ్మాయి లందరూ ముచ్చటపడి పాడుకునే తెలుగింటిపాటగా యిది ప్రాచుర్యం పొందింది. శ్రావ్యమైనతీగ సాగి తీవ్రస్థాయిలో కోమలంగా పలికిందా? అనిపిస్తుంది. కవి అక్షరశిల్పి అయితే సంగీతదర్శకుడు స్వరశిల్పి. ఇక సుశీల శ్రావ్య గాత్రశిల్పి... ఇలా సాగింది యీ పాట. ఇందులో ప్రకృతి సౌందర్యం, ప్రతిపదంలో పలుకరించి సాహితీసుందరి తన పెళ్లికి ఆహ్వానించినట్లు సుశీల గాత్రం వినిపిస్తుంది. ప్రకృతికాంత నవవధువు అయితే ఇలాగే ఉంటుంది పాట.

జగన్మోహనరూపంలో తెరపై కనిపించే జయప్రదకు, సుశీల జగన్మోహనరంగా పాడిన పాట ఇది.

# దానవీరశూరకర్ణ (1977)

❖ సి.నారాయణరెడ్డి ❖ ఎస్.రాజేశ్వరరావు

ఏ తల్లి నినుగన్నదో నేను నీ తల్లినైనానురా
ఆ... ఆ... నీతల్లి నైనానురా
నా వరాల తొలిపంటగా ॥నా వరాల॥
నీవు నా ఇంట వెలశావురా ॥నాఇంట॥ ॥ఏతల్లి॥

చ॥ లలితలలిత జల లహరుల ఊయల లూగినావు అలనాడే
తరుణతరుణ రవికిరణ పథమ్ముల సాగినావు తొలినాడే
అజస్ర సహస్ర నిజప్రభలతో అజేయుడవు కావలెరా
నీ శౌర్యముగని వీర కర్ణుడని ॥నీ శౌర్యము॥
నిఖిల జగమ్ములు వినుతించ వలెరా

చ॥ మచ్చ యెరుంగని శీలసంపదకు స్వచ్ఛమైన ప్రతిరూపమై
బలి, శిబి, దధీచి వదాన్యవరులను తలదన్ను మహాదాతవై
అడిగిన దానిని లేదన్నది ఏనాడు నీనోట రానిదై
నీ నామము విని దానకర్ణుడని ॥నీ నామము॥
యుగయుగాలు నిను స్మరియించ వలెరా



ఎన్.టి.ఆర్.ది ఆస్తికత్వం మూర్తీభవించిన వ్యక్తిత్వం. ఆలోచనలో, ఆచరణలో ఆయనకున్న దైవభక్తి అతణ్ణి గురించి సన్నిహితంగా తెలిసిన వారందరికీ బాగా తెలిసిన విషయమే. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు లాంటి దివ్యపురుషుల పాత్రలను ధరించి ఆయన అసంఖ్యాక జనహృదయాల్లో ఆరాధనీయుడయ్యారు. నందమూరి తారకరామమూర్తికి ఇదొక పార్శ్వం. మరో పార్శ్వాన్ని నిశితంగా పరిశీలిస్తే తెలుస్తుంది, ఆయనకు రావణ, దుర్యోధన, కర్ణుల పట్ల ప్రత్యేకాభిమానముండేదని. ఆ ముగ్గురిలో ఉన్న స్వాభిమానం, రాజసగుణం అతణ్ణి అమితంగా ఆకర్షించాయి. ఎన్.ఏ.టి. సంస్థ తరపున తాను నిర్మించిన "సీతారామకల్యాణం" (1961) లో రావణపాత్ర, "శ్రీకృష్ణపాండవీయం" (1964)



చిత్రంలో దుర్యోధన పాత్రల్ని అనితరసాధ్యంగా నటించిన తర్వాత ఇక మిగిలిన కర్ణుణ్ణి కథానాయకుడిగా మలచి "దానవీరశూరకర్ణ" నిర్మించి తానే దర్శకత్వం వహించి దానవీరుడుగా, రణశూరుడుగా ఇతిహాస సంస్తుతుడైన కర్ణుని సితకీర్తిని మిన్నులకెత్తారు.

సూర్యవరప్రసాదంవల్ల కుంతీకన్య తానుకన్న శిశువును లోకాపవాదభీతితో పెట్టెలోపెట్టి ఏటిలో ఒదిలిపెడుతుంది. అది సూతదంపతులకు దొరకుతుంది. అల్లారుముద్దుగా ఆ బిడ్డను పెంచుకుంటున్న సూతపత్ని రాధ పాడే లాలిపాట ఇది.

వేలకొద్దీ పాటలు రాస్తున్నప్పటికీ కొన్నిసందర్భాల్లో కవి ఏవో గొప్ప భావాలను ఒక్కోసారి చెప్పలేక మూసగా పాటలు ముగుస్తుంటాయి. కానీ కథాశిల్పం – సందర్భంలో చక్కని భావుకత ఉంటే పుట్టే పాటలో ఏదో నూతనత్వం తప్పక కన్పిస్తుంది. అందుకే మూలాలు చెదరకుండా కొత్త ఆకులను పాటకు తగిలించాలి. ఇది కవి కాల్పనికధోరణికి సవాలుగా మారుతుంది. అది భక్తి, దేశభక్తి, బాలలగీతాలు లేదా శృంగార, కరుణ రసాకృతులు కావచ్చు. కథాశిల్పం ఇది కావాలని కోరుకున్న పదాలు కవి మదిలో ఉప్పొంగి వస్తుంటాయి. ఇక కవి కమనీయ కలం కావ్యాలంకార సొబగుల్ని దిద్దుకుని పాటగా బయటకు వస్తుంది. సందర్భానికి తగిన పదాలు సమకూర్చి సన్నివేశాన్ని రక్తి కట్టించడానికి నూటికి నూరుపాళ్లు న్యాయంచేసే గీతరచయితల్లో సి.నా.రె ఒక విద్వన్మణి. పాట పల్లవిని మనోహరంగా మొదలుపెట్టడం, చరణాలలో తనదైన పదప్రయోగాలు చేయడం వీరి ప్రతిభ.

ఇక యీ పాటపరంగా – కన్నది కుంతి అని మనకు తెలుసు. ఆ బిడ్డకు తెలీదు. ఆ తల్లికీ తెలీదు. అంతవరకు ఆమెకు సంతానం కలగలేదు. ఆ ఇంటికి అందిన

తొలిపంట ఆ పాపడు... సంగీతదర్శకులు ఎస్.రాజేశ్వరరావు యీ గీతాన్ని 'కానడ', 'మధ్యమావతి', 'మోహన'రాగాల ఛాయల్లో నడుపుతూ అక్కడక్కడ 'పీలు' రాగరేఖను కూడా అద్దిచూపారు.

పుట్టగానే నీటి ఉయ్యాలలూగడం, ఉదయకిరణాల్లో సాగిపోవడం అందరికీ జరుగుతుందా? పుట్టిన పాపను ఇంట్లో ఉయ్యాలలో పెట్టి ఊపుతారు. ఎండసోకకుండా జాగ్రత్తపడతారు. ఆ బాబు జాతకం వేరు కదా! ఏటి నీటి ఉయ్యాల లూగాడు. జన్మదాత (సూర్యుడు) చూస్తుండగానే – అంటే కర్మసాక్షి సాక్షిగా అలా పదిలంగా తరలిపోయాడు.

సూర్యుడు సహస్రకిరణుడు. ఆ దుర్నిరీక్ష్యతేజం పాపనికి అలవడాలని, వీరకర్ణుడని లోకాలు వినుతించాలని ఆ జనని ఆకాంక్ష. మొదటిచరణంలో 'లలిత లలిత జల లహరుల', 'తరుణ తరుణ రవికిరణ పథమ్ముల', 'అజస్ర సహస్ర నిజప్రభల', లాంటి ధీర్ఘ సంస్కృతసమాసాలు జాలుగా సాగే లాలిపాటలో ఉండాల్సినవికావు. ఇది నిద్రపుచ్చడానికి పాడే జోలపాటకాదుగదా. పసిపాపడుగా ఉన్నప్పుడే ఆ భావి కథానాయకునికి మాతృమూర్తి చేసే ఉద్బోధ ఇందులో ఉంది. అందువల్లే సి.నా.రె చేత యీ గీతాన్ని అంత ఓజోవంతంగా రాయించుకున్నారు ఎన్.టి.రామారావు.

రెండో చరణంలో వర్ణనీయవస్తువు దాతృత్వం. ఆ దాతృత్వం కూడా నిష్కళంకశీలం లోంచి ఉదయించిందే కావాలి. మొదటి చరణం లాగే ద్రుతగతిలో ప్రబోధాత్మగీతంలా సాగిపోయిందీ చరణం కూడా. కర్ణునిలోని దానవీరాన్ని, శౌర్యాన్ని ఉపలక్షించిన భావబీజాలు పై చరణాల్లో ఉన్నాయి. "దానవీరశూరకర్ణ" అనే చిత్రశీర్షికకు కూడా ప్రోద్బలకంగా ఉండే పంక్తులు యీ పాటలో ఉన్నాయి.

ఈ చిత్రానికి తొలిదశలో ఎస్.రాజేశ్వరరావు గారే సంగీతదర్శకులు. టైటిల్స్ మీద వచ్చే యీ పాటకు స్వరకర్త సాలూరివారే. అలాగే పద్యాలు కూడా ఆయన సమకూర్చారు గానీ రికార్డులదాకా రాలేదు. కారణాంతరాల వల్ల తర్వాత పెండ్యాల యీ చిత్ర సంగీతదర్శకులయ్యారు.

ఎప్పుడో "భీష్మ" (1962) చిత్రంలో జమునారాణి కంఠం సహాయంతో 'హైలో హైలెస్సా' అంటూ నాటి యువతరాన్ని మత్తెక్కించిన తెలుగుసినీ మత్స్యగంధి 'భీష్మ' సుజాతపై చాలా ఏళ్ల తర్వాత చిత్రీకరించబడ్డ పాట ఇది.

అటు వాత్సల్యం, ఇటు ఉత్సాహం మేళవించుకున్న యీ గీతాన్ని సుశీల రాగభావ రమ్యంగా గానం చేశారు. ఈపాట యీ మహాగాయని గాత్రంతో విజయభేరి మ్రోగించింది.

# ఈనాటిబంధం ఏనాటిదో (1977)

❖ దేవులపల్లి ❖ ఎస్.రాజేశ్వరరావు

ఎవరు నేర్పేరమ్మ ఈ కొమ్మకూ
పూలిమ్మనీ రెమ్మ రెమ్మకూ ॥ఎవరు॥
ఎంత తొందరలే హరిపూజకూ
ప్రొద్దు పొడవక ముందె పూలిమ్మనీ ॥ఎవరు॥
కొలువైతివా దేవి నా కోసమూ... తులసీ...
తులసీ దయాపూర్ణ కలసీ
మల్లెలివి నాతల్లి వరలక్ష్మికీ...
మొల్లలివి నన్నేలు నా స్వామికీ ॥ఎవరు॥
ఏ లీల సేవింతు
ఏమనుచు కీర్తింతు ॥ఏ లీల॥
సీత మనసే నీకు సింహాసనం
ఒక పువ్వు పాదాల
ఒక దివ్వె నీ మ్రోల ॥ఒక॥
ఒదిగి నీ ఎదుట ఇదె వందనం
ఇదె వందనం.....



నిజమే, కొన్ని ప్రశ్నలు ఇలా వస్తుంటాయి భావకవులకు... అందుకే ఈ బంధాలు ఏనాటివో? అని మరో ప్రశ్న వస్తుంది. దానికి సమాధానంగా దేవునిపాదాల ముంగిట



ఒక వందనం చేయాలి. అపుడే ఇలాంటి పాటలు వస్తాయి. దేవులపల్లి కవితాజీవితం అంతా ప్రకృతిలోని అణువణువులో పరమాత్మను దర్శించడమే. ఏ పుష్పాలు ఏ స్వామి పాదాల వ్రాలి జన్మధన్యతను చేసుకుంటాయో? విధాత ముందుగానే నిర్ణయిస్తాడు. ఈ పాటలోని భావుకతకు కళ్లు చెమరుస్తాయి. తెలియని భక్తిభావాలు కలిగి పలికిన పాట జన్మధన్యమే.

ఎస్.రాజేశ్వరరావు, ఈపాటను వాగ్గేయకారుల కీర్తనలకు సరిసమానంగా బిలహరి రాగంలో స్వరపరచారు. తెలుగింట ఇది పుట్టింటి తులసికోట పాట, మెట్టింట మనసులు దోచే పాట.

సుశీల గొంతులో 'ఏ లీల సేవింతు' అంటూ మొదలై పాటకు, స్వామి పాదాలకు వందనసమర్పణ చేసినట్లయింది. రెమ్మరెమ్మకు పూవులివ్వడం కొమ్మకు తెలుసు. పద పదానికి స్వరాలు పలికించటం సుశీలకు తెలుసు.

ఈ పాట వింటూంటే, 'ఎవరు నేర్పేరమ్మా సుశీలకూ ... పాటపాటకూ ఇంత మాధుర్యం మనకు పంచమనీ...' అనే సందేహం వస్తుంది. ఆ పాటల్ని మళ్లీ మళ్లీ ఏళ్ల తరబడి వినడమే అందుకు సమాధానమౌతుంది.

# గోరంతదీపం (1978)

❖ ఆరుద్ర ❖ కె.వి.మహాదేవన్


రాయినైనా కాకపోతిని రామపాదము సోకగా
బోయనైనా కాకపోతిని పుణ్యచరితము పాడగా
పడవనైనా కాకపోతిని స్వామికార్యము తీర్చగా
పాదుకైనా కాకపోతిని భక్తిరాజ్యము నేలగా
అడవిలోపల పక్షినైతే అతివసీతను కాంచనా
అందువలనా రామచంద్రుని అమితకరుణను నోచనా
కడలిగట్టున ఉడతనైతే బుడతసాయము చేయనా
కాలమెల్లా రామభద్రుని వేలిగురుతులు మోయనా ॥రాయి॥

కాకినైనా కాకపోతిని ఘాతుకమ్మును చేయుచూ
గడ్డిపోచను శరముచేసే ఘనత రాముడు చూపగా
మహిని అల్పజీవులే యీ మహిమలన్నీ నోచగా
మనిషినై జన్మించినా నే మత్సరమ్ములు రేపగా
మద మత్సరమ్ములు రేపగా ॥రాయి॥



ఇవాళ్టి సినిమాలలో మనం కోల్పోయిన మధ్యతరగతి తెలుగుప్రజల సంస్కృతి, జీవనవిధానం "గోరంతదీపం"లో మనకు పుష్కలంగా కన్పిస్తాయి.

"గోరంతదీపం కొండంత వెలుగు – చిగురంత ఆశ బతుకంత వెలుగు! ... " మానవాళికి స్ఫూర్తిదాయకమైన యీ సూక్తికే అధికప్రాధాన్యతనిస్తూ నేరెళ్ల రామలక్ష్మి 'ఒకదీపం వెలిగింది' అని నవల రాశారు. ఈ నవల మధ్యతరగతి పాఠకులను అందునా మహిళల్ని విశేషంగా ఆకట్టుకుంది. ఇది గమనించిన బాపు, రమణలు ఆ నవల హక్కుల్ని కొని "గోరంతదీపం" సినిమా తీశారు. మనసుకు సరిపడే మాటలకూ, కథారీతులకూ ముళ్లపూడీ, కంటికి సరిపడే దృశ్యకల్పనకు బాపు ప్రతిలేని ప్రతినిధులు. ఈ ఇద్దరి సమ్మేళనం కమనీయ చిత్రసృష్టికి దోహదం.




"గోరంతదీపం" బాపు దర్శకత్వంలో స్వర్ణరేఖలు సంతరించుకుంది.

ఈపాటను ఆరుద్ర ఎప్పుడో రేడియోకోసం రాశారు. అది విని ముగ్ధులైన బాపురమణలు "గోరంతదీపం"లో వాడుకున్నారు.

శ్రీరాముని దయాస్పర్శకు నోచుకున్న స్థాణువులు, పశుపక్ష్యాదుల్ని ఆరుద్ర యీ పాటలో ప్రస్తావించి అన్యాపదేశంగా ప్రస్తుతించిన తీరు రామబాణమంత అమోఘమంటే అది అతిశయోక్తి కాదు. రాయి–బోయ, అడవి–అతివ, పడవ–పాదుకలు, ఉడత–బుడత... ఇవి ప్రయత్నపూర్వకంగా చేసిన ప్రాసక్రీడలు కావు. అలవోకగా వెలికురికినటువంటి నుడికారపుసొంపులు. మరో విషయమేమంటే యీ పాటను విన్న డా॥సి.నారాయణరెడ్డి, అప్పటికి అర్ధరాత్రయిందన్న సంగతినే చూసుకోకుండా, గుండె తడిని తుడుచుకోకుండానే ఆరుద్రకు ఫోను చేసి ప్రశంసల వర్షం కురిపించారు. అంత ఆర్ద్రమైన శ్రీరామభక్తి గీతమిది. కె.వి.మహాదేవన్ మిశ్రమ శివరంజని రాగచ్ఛాయలలో దీన్ని స్వరపరచి పాటను అజరామరం చేశారు.

ఈ గీతంలోని ప్రతి పదాన్ని అన్వయించుకుని అనుభూతులను పాత్రకంటే అధికంగా మదిలో ప్రోదిచేసుకుని పాడారు సుశీల. రాయి (అహల్య), బోయ (వాల్మీకి), పడవ (గుహుడు), పాదుక (భరతుడు) పక్షి (జటాయువు) ఉడత, కాకి, శరము, గడ్డిపోచ... ఇలా అన్నింటినీ తానుగానే ఊహించుకుని ప్రతిపదాన్ని వైవిధ్యంతో పలికినతీరు అనితరసాధ్యం. పైవన్నీ రామచంద్రుని కరుణకు నోచుకుంటే, యీ భావాలన్నీ ఒక్క గొంతులోనే పలికించిన సుశీల ఇంకెంత ధన్యతను పొందారోననిపిస్తుంటుందీ పాట వింటే.

రామాయణంలో సీతాదేవి శీలపరీక్ష, యీ చిత్రంలో కథానాయిక పద్మ (వాణిశ్రీ)కు శీలపరీక్ష... వస్తువు ఒకటే గనుక యీ శ్రీరామగీతం ఎంతో ఔచిత్యవంతంగా కథలో ఒదిగిపోయింది.

# శివరంజని (1978)

❖ దాసం గోపాలకృష్ణ ❖ రమేశ్‌నాయుడు


జోరు మీదున్నావు తుమ్మెదా
నీ జోరెవరి కోసమే తుమ్మెదా ॥జోరు॥

ఇల్లిల్లు తిరిగేవు తుమ్మెదా
నీ ఒళ్లు జాగరతె తుమ్మెదా ॥ఇల్లిల్లు॥
ముస్తాబు అయ్యావు తుమ్మెదా
కస్తూరి రాసావు తుమ్మెదా
మసక యెన్నెల్లోన తుమ్మెదా
మల్లెమందిరి కాడ తుమ్మెదా
మాల కడుతున్నావు తుమ్మెదా
ఆ ..... మాలెవరి కోసమే తుమ్మెదా ॥జోరు॥

మెత్తన్ని పరుపూలు తుమ్మెదా
గుత్తంగ కుట్టావు తుమ్మెదా
వత్తైన పరుపుపై తుమ్మెదా
అత్తర్లు చల్లావు తుమ్మెదా
పక్క వేసుంచావు తుమ్మెదా
ఆ పక్కెవరి కోసమే తుమ్మెదా
జోరుమీదున్నావు తుమ్మెదా
నీ జోరెవరి కోసమే తుమ్మెదా
ఇల్లిల్లు తిరిగేవు తుమ్మెదా
నీ ఒళ్లు జాగరతె తుమ్మెదా ॥జోరు॥

సినిమావాళ్ల మీద సినిమాలు తీయడం తమిళంలో ఎక్కువ. తెలుగులో హీరో హీరోగా మారడం హీరోయిన్ హీరోయిన్‌గా మారడం కథలో భాగంగా చూపించినా అసలు కథే ఒక హీరోయిన్ జీవితాన్ని చర్చించడం "శివరంజని"లో కన్పిస్తుంది. ఆ తర్వాత వంశీ "సితార" (1984) వచ్చింది. గాత్రం, లావణ్యం ఉన్న పల్లెటూరి అమ్మాయి మోసగాడి వలలో చిక్కి మద్రాసు చేరి సినీతారగా గొప్పస్థానం సంపాదించినా బంధువుల చేతిలో నానాబాధలు పడుతూ భర్త చేతిలో కష్టాలు పడుతూ ఓదార్పుగా ఒక స్నేహితుణ్ణి





దాసం గోపాలకృష్ణ

వెతుక్కుందామనుకుంటే అక్కడా అడ్డంకులు ఏర్పడి - తెరమీద కష్టాలు ఎదుర్కోవడం చేతకాక ప్రాణాలు విడిచే దురదృష్టవంతురాలి కథ ఇది.

దాసరి నారాయణరావు నిర్మాతగా 'తారకప్రభు ఫిలింస్' బానర్‌పై నిర్మించిన తొలిచిత్రమిది.

ఫ్లాష్‌బాక్‌లో ఏక్‌తారా వాయిస్తూ, ఆ వాయిద్యాల్ని అమ్ముకుంటూ వీధి వీధి తిరిగే నాయిక తనకే అన్వయించుకుంటూ పాడే యీ పాట అప్పట్లో బాగా ప్రజల్ని ఆకర్షించింది. ఇంకా చెప్పాలంటే ఈపాట జోరు ఇప్పటికీ తగ్గలేదు. రచన దాసం గోపాలకృష్ణ. ఈయన 'చిల్లరకొట్టు చిట్టెమ్మ' నాటకరచయితగా ప్రసిద్ధులు.

దాసం రాసిన పల్లెపదాన్ని మోహనకల్యాణిలో స్వరపరచి అజరామరం చేశారు రమేశ్‌నాయుడు. కేవలం మూడంటే మూడు సంగీత వాయిద్యాలను వినియోగించి కూర్చిన విలక్షణమైన పాట ఇది. సాహిత్యపరంగా ఒక తత్త్వంలాగా ఆత్మప్రబోధం చేస్తుంటుందీపాట.

తెలుగు చలనచిత్రసంగీతం ఉన్నన్నాళ్లూ ఉంటుందీపాట. "దొంగరాముడు" (1955) లో 'ఓ రేరాజా' అన్న తీరు ఇరవైమూడేళ్ల తర్వాత అంతే మృదువుగా ఈపాటలో కూడా మధురగానశీల సుశీల గాత్రంలో ముగ్ధమోహనంగా విన్పిస్తుంది. సుశీల గానంలో క్రాఫ్ట్ తెలియాలంటే ఈపాట వినాల్సిందే. ఎన్నోమారులెందరికో పాడిన సుశీల కంఠంలో ఒక కొత్తరుచి, ఒక మెత్తని ద్యుతి రమేశ్‌నాయుడి సంగీతంలో తెలుస్తుంది.

సంగీతంలో సిద్ధహస్తుడూ, స్వయంగా గాయకుడూ అయిన సంగీతకర్త ఒక్కో కంఠంలో ఉన్న సంగీతసాగరం చిలికి అందుకున్న మాధుర్యం వెలికితీసి దాన్ని నలుగురికీ పంచుదామన్న సదుద్దేశం సానపడితేగాని, ఇటువంటి పాటలు సిద్ధించవు. తొలికారు మబ్బులకు నీరెండల నగిషీలు రమేశ్‌నాయుడివైతే, భాష యెరగని వారినీ గారడీచేసే విమలగాంధర్వం సుశీలది.

# గోరింటాకు (1979)

❖ దేవులపల్లి ❖ కె.వి.మహాదేవన్

గోరింట పూచింది కొమ్మలేకుండా
మురిపాల అరచేత మొగ్గ తొడిగింది ॥గోరింట॥
ఎంచక్క పండిన ఎర్రన్ని చుక్క ॥ఎంచక్క॥
చిట్టీ పేరంటాలికి శ్రీరామరక్ష
కన్నె పేరంటాలికి కలకాలం రక్ష ॥గోరింట॥
మామిడీ చిగురెరుపు మంకెన పువ్వెరుపు
మణులన్నింటిలోన మాణిక్యం ఎరుపు ॥మామిడి॥
సందే వన్నెల్లోన సాగే మబ్బెరుపు
తానెరుపు అమ్మాయి తన వారిలోన ॥గోరింట॥
మందారంలా పూస్తే మంచి మొగుడొస్తాడు
గన్నేరులా పూస్తే కలవా డొస్తాడు ॥మందారం॥
సిందూరంలా పూస్తే చిట్టిచేయంతా ॥సిందూరం॥
అందాల చందమామ అతనే దిగివస్తాడు ॥గోరింట॥
పడకూడదమ్మ పాపాయి మీద
పాపిష్టి కళ్ళు, కోపిష్ఠి కళ్ళు ॥పద॥
పాపిష్ఠికళ్ళల్లో పచ్చాకామెర్లు ॥పాపిష్టి॥
కోపిష్ఠి కళ్ళల్లో కొరివీ మంటల్లు ॥గోరింట॥

లలితకళారాధనలో చిరుదివ్వెలుగా వెలిగి జన్మసాఫల్యం చేసుకున్న ధన్యులెందరో ఉన్నారు. నిశ్శబ్దం నుండి నాదాన్ని పుట్టించి అణువును, రేణువును, స్థాణువును, వేణువును చివరగా కళలరాణి వాణిని కదిలించి ప్రకృతిని పులకింపచేయడమే వారి వృత్తి, ప్రవృత్తి.

దేవులపల్లి కృష్ణశాస్త్రిగారెంతటివారో మనం చెప్పనక్కరలేదు. సాహిత్య అభిలాషులకు వారి సృష్టి ఎండవేళ ఎలనీరు. కేవలం సినిమాతోనే పరిచయం ఉన్నవారికి వారి పాటలు ప్రతిరాత్రినీ వసంతరాత్రిగా మార్చే సడిసేయని గాలులు. రెండూ అందే రసికులకు వారి రచనలు పూవుకు పూవంటనీయక అల్లిన సుతారపు సుమమాలలు. వారిపై ఇంగ్లీషుకవుల ప్రకాశమూ, రవీంద్రకిరణ ప్రసారమూ, పారశీక కవిత్వపు ప్రభావమూ ఉందని విమర్శకులు అంటారు. అయితే కీట్సునీ, షెల్లీనీ, కవీంద్రునీ ఔపోశన పట్టిన

వీరి కలం నుండి జాలువారిన మణిపూసల్లాంటి ఎన్నో పాటల్లో ఈపాట ఒకటి. పదహారణాల అచ్చతెలుగుపాట ఇది. ప్రతి ఇంట్లో గోరింటలా పూసి, గోరువంకలా కూసింది. పచ్చని ఆకులు ఎర్రగా మారటం ప్రకృతి ఇచ్చిన వరం. అందునా గోరింట, తమలపాకు ఇలాంటి మార్పులు చెందుతాయి. అయితే తమలపాకులకు సున్నం తగలాలి, కానీ గోరింట స్వయంప్రతిభతో రాలిపోగానే రంగు మారుతుంది. కొమ్మకుపూసే పూలు చేతులలో పూయటం, అరచేతులలో మొగ్గతొడగడంవంటి సునిశిత భావాలు యీ పాట సాహిత్యంలో కన్పిస్తాయి. కొమ్మలేకుండా పూలు పూస్తాయా? ఏమో? మల్లెలకు వేళ, వెన్నెలకు మాసం ఉందన్న కృష్ణశాస్త్రిగారి పూలు కొమ్మల్లేకుండా కూడా పూస్తాయి మరి! అంతటి భావకవితాచక్రవర్తి కోరితే కొమ్మలతో ఏం పని? పూలు వాటంతట అవే పూస్తాయి మరి. దేవులపల్లి పాటలన్నీ సంకలనాలుగా గుదిగుచ్చినపుడు రెండోసంకలనానికి పెట్టినపేరు "గోరింట". ఈ చిత్రం నూటయిరవైఅయిదురోజుల వేడుకలు జరిగిన రోజే కృష్ణశాస్త్రి గంధర్వలోకం చేరుకున్నారు.

పదంలో స్వరం, స్వరంలో పదం ప్రకృతీపురుషుల్లాగ, వాగర్థాలులాగ మిళితమై ఉంటాయని పాటకు ఒక నాణ్యత, మన్నిక, రుచి, అనుభూతి, స్పర్శ ఉంటాయని స్వరకల్పనలో మనకు తెలియజేసిన స్వరబ్రహ్మ మహాదేవన్.

'యువచిత్ర' సంస్థ సారథి కాట్రగడ్డ మురారికి మహాదేవన్ సంగీతమంటే మాటల్లో పొదగలేనంత ప్రీతి. అది ఎంతలా అంటే, ఆయన ఎనిమిది చిత్రాలు తీస్తే, ఎనిమిదిమంది దర్శకులు మారారు గానీ, సంగీతదర్శకుడైన మహాదేవన్ మారలేదు. "గోరింటాకు" సినిమాకు మొదట దర్శకుడు సేతుమాధవన్. ఆయన మ్యూజిక్ డైరెక్టరుగా మహాదేవన్ వద్దంటే, మురారి సేతుమాధవన్‌నే మార్చి దాసరిని దర్శకునిగా పెట్టుకున్నారు తప్ప 'మామ'ను వదల్లేదు. మురారి మామపై పెట్టుకున్న నమ్మకం వమ్ముకాలేదు. 'యువచిత్ర' పాటలంటే సంగీత, సాహిత్యాల మేలుకలయిక అనే పేరు యీ నాటికీ వెండితెరపై చెరగని గోరింటాకు. సాధారణంగా విశ్వవిద్యాలయాల్లో సినిమాపాటలపై సిద్ధాంతగ్రంథాలు వచ్చాయి. సంస్థాగతంగా ఎం.ఫిల్., పిహెచ్.డి,లు రాలేదు. కానీ శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం (తిరుపతి) తెలుగుఅధ్యయనశాఖలో 'యువచిత్ర' పాటలు – సాహిత్యపు విలువలు' అనే అంశంతో లఘుసిద్దాంతవ్యాసం రావడం చెప్పుకోదగ్గ అంశం. అలా ఒక సినిమా సంస్థపై వచ్చిన మొదటి ఎం.ఫిల్., అదే.

ఏదైనా పాడాలంటే హృదయం కదలాలి. ఆ కదలిక కవ్వింతలో భావం ప్రేరణపొంది గాత్రం ద్వారా ప్రకటితమవ్వాలి. ఆ ప్రకటనలు నాభి హృదయ కంఠ రసనాసాదుల



నుండి స్వయంగా, స్వచ్ఛంగా, మాధుర్యంతో రావాలి. చంటిపాప నిద్రలో నవ్విన అనుభూతులను అనువాదం చేయగలగాలి. పువ్వులు కలలో పొందిన లలితభావ రసస్ఫూర్తులను అవగతం చేసుకోగల మనఃస్థితి ఉండాలి.

పైన చెప్పిన విషయాలన్నింటికీ నూటికి నూరుపాళ్లు న్యాయం చేయడంలో సుశీల గాత్రం అందెవేసిన చేయి. తెలుగు పాపాయిల అరచేతులలో పాటగా కన్పించి, గొంతులలో కూనిరాగాలు తీస్తూనే ఉందీ పాట. గోరింట ఉన్నంతవరకూ ఈపాట పండుతూనే ఉంటుంది.

మహానటి సావిత్రికి లావణ్యంలో సొంపు తగ్గినా, అభినయంలో ప్రావీణ్యత తగ్గలేదని నిరూపించిన పాట ఇది. మురారికి సావిత్రి అంటే ఎంతో ఇష్టం. సాధారణంగా సినిమా టైటిల్సులో హీరోపేరు, వెంటనే హీరోయిన్ పేరు, తర్వాత కారెక్టరు ఆర్టిస్టు పేరు వేస్తారు. కానీ "గోరింటాకు"లో శోభన్‌బాబు పేరు పడిన వెంటనే కథానాయిక సుజాత పేరు కాకుండా, సావిత్రి పేరే టైటిల్సులో వస్తుంది. అంతలా ఆ మహానటిపై తనకున్న ఆరాధన, గౌరవభావాల్ని చాటుకున్నారాయన.

ఈ చిత్రం ప్రివ్యూకొచ్చిన దుక్కిపాటి మధుసూదనరావు ఇది గమనించి మురారిని ఎంతో అభినందించారు. లక్ష్మీరాజ్యం గారైతే కన్నీటిపర్యంతమైపోయి మురారి దగ్గరికొచ్చి "సీనియర్స్‌ను ఎంత బాగా గౌరవించావు నాయనా!" అని ఆశీర్వదించారు.

ఏది ఏమైనా కృష్ణశాస్త్రి, మహదేవన్, సుశీల ముగ్గురూ కలిసి చిత్రాన్ని శతదినోత్సవ చిత్రం చేశారు. మురారి అంటే సుశీలకు ఎంతో ఇష్టం. ఆ రోజు ఎన్ని స్టూడియోల్లో ఎన్ని పాటలు పాడాల్సి ఉన్నా, 'యువచిత్ర' రికార్డింగ్ ఉంటే మొదట యీ సంస్థకు పాడేసే తక్కిన వాటికి వెళ్లేవారామె.

# మేఘసందేశం (1982)

❖ దేవులపల్లి ❖ రమేశ్‌నాయుడు

ఆ... ఆ.... ఆ....
ఆకులో ఆకునై పూవులో పూవునై
కొమ్మలో కొమ్మనై నునులేత రెమ్మనై
ఈ యడవి దాగిపోనా
ఎటులైన ఇచటనే ఆగిపోన ॥ఆకులో॥
గలగలని వీచు చిరుగాలిలో కెరటమై ॥గలగల॥
జలజలని పారు సెలపాటలో తేటనై
పగడాల చిగురాకు తెరచాటు తేటినై
పరువంపు విరిచేడె చిన్నారి సిగ్గునై ॥ఈయడవి॥ ॥2సార్లు॥
తరులెక్కి యలనీలిగిరి నెక్కి మెలమెల్ల ॥తరులెక్కి॥
చదలెక్కి జలదంపు నీలంపు నిగ్గునై
ఆకలా? దాహమా? చింతలా? వంతలా?
ఈ తరణి వెర్రినై ఏకతమ తిరుగాడ ॥ఈయడవి॥ 2సార్లు॥
॥ఆకులో॥

ఈనాడు సామాజికజీవితంలో ప్రధానంగా విన్పిస్తున్న 'సహజీవనం' ప్రధానంగా చేసుకుని తీసిన చిత్రమిది. నటసమ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు నటించిన రెండువందల చిత్రమిది.

ఈ చిత్రంలో గొప్పదనమేమిటి? దర్శకుని నేర్పు, దానివలనే తక్కిన వాటికి రాణింపూ, వాటి హవణింపూ. రమేష్‌నాయుడు సంగీతం తనకూ, పాడిన వారికీ పరిశ్రమలో పేరు, ప్రజల ప్రేమా, ప్రభుత్వపు బహుమతులూ ఆర్జించి జ్ఞాపకాలలో నిలిచిపోయింది. దాసరి, రమేష్ కలయిక సత్యం శివం సుందరమని నిరూపించిన చిత్రాలలో ఒకటి "మేఘసందేశం".

ఈ చిత్రంలోని పాటలన్నీ బహుళ ప్రజాదరణ పొందాయి. వాటిలో ఒకటి యీ భావగీతం.

తెలుగు సాహితీనందనంలో పారిజాతకుసుమంలా పల్లవించి, వికసించి భావకవితాపరీమళాల్ని నలుదెసలా వెదజల్లిన మృదుపదాలమేస్త్రి, దేవులపల్లి కృష్ణశాస్త్రి. ఆయన 1920 సం॥లో బెజవాడ నుండి బళ్లారి వెళుతుండగా రైలునడకలోని సమాన లయకు స్పందించి చుట్టూ ఉన్నటువంటి నల్లమల అడవుల సోయగానికి పరవశించి

ఆకులో ఆకునై... అని పలవరించారట. ఆయన భావకవిత్వానికి అది మొదటిశ్రుతి. అక్కడినుంచి 'కృష్ణపక్షం', 'ప్రవాసం', 'పల్లకీ' ఇత్యాదులు వెలవడ్డాయి.

'కృష్ణపక్షం' ఖండకావ్యంలో యీ 'ఆకులో ఆకునై' శారదచంద్రికలా ఆకర్షించే అద్భుతగీతం. ప్రకృతితో తాదాత్మ్యం పొందాలన్న తపన ప్రతిఫలించే కవిహృదయానికి కమనీయ దర్పణం. ఐదుమాత్రల నియతితో ఖండగతిలో సాగే ఈ గీతం శాస్త్రిగారికి అఖండకీర్తిని ఆర్జించి పెట్టింది. ఈ లలితగీతంలో పగడాలవంటి పదాల్ని కూర్చారాయన. ముత్యాలవంటి తేటతెల్లమయ్యే భావాల్ని పేర్చారు. అక్షర రమ్యత, భావసామ్యత భద్రంగా ఒదిగిన భావగీతమిది.

ఈ గీతాన్ని మొట్టమొదట ఆలిండియారేడియోలో వింజమూరి సోదరీమణులు లలిత సంగీతధోరణిలో, ఏ.పి.కోమల శాస్త్రీయపద్ధతిలో ట్యూన్ చేసుకుని పాడేవారు. దీన్ని రమేష్‌నాయుడు సినిమాలో వినియోగించుకుని ట్యూన్ సరళం చేశారు. రమేష్‌నాయుడి స్వరకల్పనలు నవమినాటి వెన్నెల అయితే దేవులపల్లి పాటలు దశమినాటి జాబిలి. ఇది మేటికలయిక. అక్షరదీపాలకు స్వరలక్షణ హారతులు పట్టిన ఘనత రమేశ్‌నాయుడిది. అందరికీ తెలిసిన రాగాలనే వివిధకోణాలలో పలికించగల రాగరాగిణి ఆయన. మాధుర్యానికి, లలిత రమణీయతకు యీ సంగీతంలో ఎప్పుడూ అగ్రపీఠమే. నిజానికి ఈ చిత్రానికి నిజమైన హీరో రమేశ్‌నాయుడే.

ఇంత గొప్ప సంగీతదర్శకుని చేతిలో తయారైన అక్షరశిల్పం, నవపారిజాతం పి.సుశీల గాత్రంలో రవళించిన సంగీత సంచిక యీ పాట. ఒక గానలహరి, స్వరలాహిరిగా శ్రోతల ప్రశంసలందుకుందీపాట. తెలుగుసీమ పుణ్యాలపంటగా ఏడుస్వరాల దారి పట్టి, సప్తస్వర విహంగమై వచ్చి సుధాలాపనా వేణువులను, పారశీ వీణలను గాత్రంలో పలికించిన కీరవాణి కల్యాణి సుశీల.

శంకరాభరణరాగంలో ఈపాటను నాదశరీరునికి ఆభరణంగా నిలిచేలా సుశీల – రమేశ్‌నాయుడు చేశారు.

ఈ చిత్రానికి గాను రమేష్‌నాయుడు ఉత్తమ సంగీతదర్శకుడిగా, సుశీల యీ పాటకుగాను ఉత్తమగాయనిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అవార్డులను అందుకున్నారు. దేవులపల్లి కృష్ణశాస్త్రి ఉత్తమగీతరచయితగా రాష్ట్రప్రభుత్వ నంది అవార్డుకు ఎంపికయ్యారు గానీ, ఆయన అప్పటికి దివంగతులు. యీ చిత్రాన్ని కృష్ణశాస్త్రికే అంకితమిచ్చారు దాసరి.


ఈ చిత్రం అవార్డులకు సంబంధించి మరో విశేషం –"మేఘసందేశం" కు అవార్డులు వచ్చిన ఏడాదే ఎన్.టి.రామారావు ముఖ్యమంత్రిగా పదవీబాధ్యతలు స్వీకరించారు. ఆయన ముఖ్యమంత్రి హోదాలో పాల్గొన్న తొలి సినిమావేడుక ఇదే కావడం యాదృచ్ఛికం. నాలుగు జాతీయ అవార్డులు, ఎనిమిది రాష్ట్రప్రభుత్వ అవార్డులు పొందిన యీ చిత్రంలో అప్పటికి బాగా గాయకునిగా తారాపథంలో ఉన్న ఎస్.పి.బాలసుబ్రహ్మణం చేత ఒక్కపాట కూడా పాడించకపోవడం వింతగా తోస్తుంది.

# మేఘసందేశం (1982)

❖ వేటూరి ❖ రమేశ్‌నాయుడు

నిన్నటిదాకా శిలనైన
నీ పదముసోకి నే గౌతమినైనా
నిన్నటిదాకా శిలనైనా
నీ మమతావేశపు వెల్లువలో
గోదారి గంగనై పొంగుతు ఉన్నా...
నిన్నటిదాకా శిలనైనా
నీ పదము సోకి నే గౌతమినైనా
నిన్నటిదాకా శిలనైనా....
సరసా సరాగాల సుమరాణిని
స్వరసా సంగీతాల సారంగిని ॥సరసా॥
మువ్వ మువ్వకు ముద్దు మురిపాలు పలుక ॥మువ్వ॥
మవ్వంపు నటనల మాతంగిని
కైలాస శిఖరాగ్ర శైలూషికా నాట్యడోల లూగేవేళ
రావేల నన్నేల
నిన్నటిదాకా శిలనైనా
నీ పదము సోకి నే గౌతమినైనా
నిన్నటిదాకా శిలనైనా.. ॥నీ మమతా॥ ॥నిన్నటి॥
నిన్నే ఆరాధించు నీ దాసిని
ప్రేమ ప్రాణాలైన ప్రియురాలిని ॥నిన్నే॥
పువ్వు పువ్వుకు నవ్వు నవకాలు తెలిపే ॥పువ్వు॥
చిరునవ్వులో నేను సిరిమల్లిని
స్వప్న ప్రపంచాల సౌందర్య దీపాలు
చెంత వెలిగే వేళ
ఈ చింత నీకేల ॥నిన్నటి॥

తలకు నూనె రాసుకున్నంత అవలీలగా, అతి చక్కగా, సునిశితంగా పాటలు రాయగల అపారమేధాసంపత్తి కల్గిన రచయిత వేటూరి సుందరరామమూర్తి. అత్యంత




క్లిష్టమైన సుదీర్ఘసమాసాలను రాసి పండితులచేతే కాదు పామరుల చేత యధాతథంగా పలికేటట్లు.. అదే విధంగా అలతిఅలతి పదాలతో లతలకు మారాకులల్లగల సాహితీచక్రవర్తి వేటూరి. "ఓసీతకథ" (1973) తో అపరవాల్మీకిలా సినీరంగప్రవేశం చేసిన యీ 'రామ' మూర్తి తెలుగునాట లబ్ధప్రతిష్ఠులైన పండితవంశం నుండి వచ్చారు. తన విశేష పాండిత్యాన్ని, అపార జీవితానుభవాన్ని మేళవించి, రసహృదయంతో రంగరించి వెండితెరపై సువర్ణగీతాల వర్షం కురిపించారు.

వేటూరి సృజించిన మణిపూసలనదగ్గ ఎన్నో చిత్రగీతాల్లో యీ పాట ఒకటి. దాసరి నారాయణరావు కోరిక మేరకు రాశారో లేక దేవులపల్లి సాహిత్యానికి సరితూగేలా ఉండాలనుకుని రాశారో గానీ యీ చిత్రంలో వేటూరి పాటలన్నీ దేవులపల్లి పాటలకు సమఉజ్జీలే!

"మేఘసందేశం" చిత్రాన్ని అపురూపరాగాల అనాఘ్రాత సౌరభాలతో ప్రేక్షక, శ్రోతలను సమ్మోహనం చేసిన గంధర్వుడు రమేశ్‌నాయుడు. ఈపాటను ద్వాదశభైరవి అని పిలిచే 'సింధుభైరవి' రాగంలోని వర్ణసప్తకాన్ని అంటే ఏడుస్వరాలను ఏడురంగుల హరివిల్లులా మలచి గోదారి, గంగ, గౌతమి నీటిధారల మాధుర్యాలను శిలలు కరిగేలా, 'కలలు' పండేలా స్వరపరచిన స్వరకర్త ఆయన. కవులు పదాలతో కవిత్వం రాస్తే, ఈయన స్వరాలతో కవనం కదిలించగల ప్రతిభాశాలి. ఇలాంటి మేధావుల పద, స్వర మైత్రీబంధాలలో సుశీల గాత్రచెలిమి త్రివేణీసంగమతీర్థంలా మురిసిపోతుంది. ఏడుస్వరాలు పరవశించిపోతాయి. ఏడేడు జన్మలలో ఎపుడూ గుర్తుండిపోతాయి. సుశీల తొలినాళ్ల కంఠలాలిత్యంతో మనోహరంగా ఈ పాట పాడడానికి రమేశ్‌నాయుడి స్వరసౌకుమార్యమే కారణం.

నిజానికి కవి, స్వరకర్త ఒక రసానుభూతికి లోనై సన్నివేశానికి పాట రాస్తారు,



వేటూరి

బాణీలు కడతారు. వీరిద్దరితోపాటు తెరపై ఆ పాటకు అభినయించే నటీమణుల హృదయాలలోకి వరకాయంప్రవేశంలాగా 'స్వర'కాయం ప్రవేశం చేయకపోతే ఆపాటకు సార్థకత చేకూరదు. ఈ విషయాలను చాలా లోతుగా, సంపూర్ణంగా అవగతం చేసుకోగల గాయని సుశీల. పాట అంటే పంచప్రాణాలు పణంగా పెట్టి కృతకృత్యురాలయ్యే సుశీల గాత్రంలోని మాధుర్యం యీ పాటలోని పదాలపై ఎలా నర్తించాయో పాట వింటే తెలుస్తుంది. ముఖ్యంగా పాట మధ్యలో 'కైలాస శిఖరాన శైలూషిక నాట్య డోలలూగే వేళ... రావేల నన్నేల...' యీ సుదీర్ఘ వాక్ఝురిని ఒకే శ్వాసతో పలికిన తీరు గమనిస్తే, ఇలా పాడడం సుశీల తన అదృష్టం అని మురిసిపోతే, కాదు కాదు ఇలాంటి గాయనిని కలిగి ఉన్న తెలుగునేల చేసుకున్న పుణ్యం అని శ్రోతలు పరవశించి పోతారు.

పాట చిత్రీకరణలో కొంత లోపం కన్పిస్తుంది. అదేమంటే, ఇంత అందమైన పాట, హృద్యంగమైన పాట, వరస చేసేటప్పుడు వాద్యగోష్ఠి అమర్చేటప్పుడు మామూలు మూవ్‌మెంట్‌సాంగ్‌గా చూపి, చిత్రీకరణలో శాస్త్రీయమనిపించే కదలికలు దానికతికించడం. కానీ సుశీల పాటలో, ఆ తేటలో, ఆ తెలివెన్నెల మూటలో, ఆ రాగాలపేటలో అన్నీ మరచిపోవచ్చు.

# స్వాతిముత్యం (1986)

❖ సి.నారాయణరెడ్డి ❖ ఇళయరాజా

లాలీ లాలీ లాలీ లాలీ ॥లాలీ॥
వటపత్రశాయికి వరహాల లాలి
రాజీవనేత్రునికి రతనాల లాలి ॥వటపత్ర॥
మురిపాల కృష్ణునికి .... ఆ... ఆ..
మురిపాల కృష్ణునికి ముత్యాల లాలి...
జగమేలు స్వామికి పగడాల లాలి ॥వటపత్ర॥
లాలీ లాలీ లాలీ లాలీ ॥లాలీ॥
కల్యాణరామునికి కౌసల్య లాలి ॥కల్యాణ॥
యదువంశవిభునికి యశోద లాలి ॥యదు॥
కరిరాజముఖునికి....
కరిరాజముఖునికి గిరితనయ లాలి ॥కరిరాజ॥
పరమాంశభవునికి పరమాత్మ లాలి ॥వటపత్ర॥
జో జో జో జో ॥జో జో॥
అలమేలుపతికి అన్నమయ్య లాలి ॥అలమేలు॥
కోదండరామునికి గోపయ్య లాలి ॥కోదండ॥
శ్యామలాంగునికి శ్యామయ్య లాలి ॥శ్యామ॥
ఆగమనుతునికి త్యాగయ్య లాలి ॥వటపత్ర॥



భర్తను పోగొట్టుకున్న కథానాయిక తన బాబును నిద్ర పుచ్చడానికి పాడే లాలిపాట ఇది. పాడుతున్నది నిర్భాగ్యురాలైన ఒక సాధారణ స్త్రీయైనా దొడ్డ మనసున్నది. కాబట్టి పద ప్రయోగంలో దివ్యవాతావరణ స్ఫూర్తి కలిగించారు సి.నా.రె. విష్ణుమూర్తికీ, రామునికీ, కృష్ణునికీ పాడే లాలి అది... వెరసి జగమేలేస్వామికి జోల అది. ఆ లాలి ఎలాంటిది? చిన్నారిలాలి, పొన్నారిలాలి కాదు. వరహాల, రతనాల,



ఇళయరాజా

ముత్యాల, పగడాల లాలి. మొదటి చరణంలో తల్లులు తనయులకు పాడే లాలి ప్రస్తావన వుంది. రామునికి కౌసల్య, కృష్ణునికి యశోద, వినాయకునికి పార్వతి పాడే లాలి అది.


ఈ అందరూ దివ్యాంశసంభూతులే. మరి అంతటి వారికి లాలి పాడేది ఎవరు? మాతృరూపంలో ఉన్న జీవాత్మ కాదు. పరమాత్మే పాడుతుంది. రెండోచరణంలో ప్రముఖ సంకీర్తనకారులు ఇష్టదేవతలకు లాలి పాడినట్లుగా అభివర్ణించారు గేయకర్త. ఎందరో పాటలయ్యలు అయ్యలకే అయ్యయైన ఆ ఆదిదేవునికి జోలపాడడం యీ చరణంలోని ఆత్మీయాంశం.

పదార్థానికి భక్తిని కలిపితే 'ప్రసాదం' అవుతుంది. నీటికి భక్తిని కలిపితే 'తీర్థం', క్షేత్రానికి భక్తి కలిపితే 'పుణ్యక్షేత్రం', పదానికి, స్వరానికి భక్తి కలిపితే శ్రుతిలయల సంగీతం అవుతుంది. చివరగా సినీసంగీతం అంటే సుశీల గుర్తుకు వస్తారు. అదే భక్తి, శ్రద్ధలు కవులకు సంక్రమిస్తే అక్షరమే 'అమ్మవారి' రూపంలో వచ్చి పదాలుగా అల్లుకుని సాహిత్యంగా సాక్షాత్కరిస్తుంది. సంగీతదర్శకులు అదే భక్తిభావనలు తీసుకుని పాటకు అర్చన చేస్తారు. గాయనీగాయకులు మరింత పవిత్రంగా గొంతులో పలికిస్తారు. అపుడే పాట పంచామృతతుల్యం అవుతుంది.

లయాత్మక కవితలు, గుణాత్మక సాహిత్యం, రసాత్మక హృదయంతో కలం కదిలించే కవిశ్రేష్ఠులు సి.నా.రె. కవితాదృష్టిలో ద్రష్ట అన్నట్లు ఏ రసాన్నైనా అవలీలగా రాయగల ప్రబంధకావ్యచతురత తెలిసిన అక్షరశిల్పి... ఆకట్టుకునే అతిసుందరపదాలను అవలీలగా అందించగల అసమాన అమరభాషానిష్ణాతులు ఆయన.

ఇళయరాజా సంగీతస్వరార్చన గురించి చెప్పాలంటే మహాగ్రంథమే అవుతుంది. ఉచ్ఛ్వాశ నిచ్ఛ్వాసాలకు స్వరలిపి రాసి స్వరపరచగల ప్రతిభాశాలి ఆయన. ఇలాంటి

లాలిపాటలు, జోలపాటలకే నీలాంబరిరాగాన్ని తీసుకుంటారు. కానీ ఇళయరాజా పీలూ రాగచ్ఛాయలను లలితంగా తీసుకుని పల్లవి, చరణాన్ని స్వరపరచారు. రెండోచరణంలో నాట, నీలాంబరి రాగాలచ్ఛాయలను స్పష్టంగా వినిపించేలా పాటను కొత్తదారులలోకి తీసుకెళ్లారు. ఇదొక రసమయప్రయోగం. ముఖ్యంగా 'జగమేలుస్వామికి పగడాల లాలి' అన్నప్పుడు ఇళయరాజా కూర్చిన స్వరాల విరుపులు సంగీతప్రియులకు పసిడిమెరుపులు. ఇళయరాజా స్వరరచనా




మాంత్రికత వల్ల, ఈ పాట ఎంత ప్రౌఢంగా ఉన్నా ప్రజాదరణ పొందింది.

పెండ్యాలనుండి ఏ.ఆర్.రెహమాన్ వరకు ఎందరో సంగీతదర్శకుల స్వరకల్పనలో వేలాదిగీతాలు సుశీల గాత్రంలో ఊపిరిపోసుకున్న సంగతి శ్రోతలకు విదితమే.

కవి, స్వరకర్త స్థాయిలకు ఏమాత్రం తగ్గకుండా సుశీల కంఠంలో ఈపాట దేవతామూర్తులకే కాదు, వాగ్గేయకారులకు కూడా పాడే అరుదైన లాలిపాటగా, జోలపాటగా మనకందించారు. పాటలో సాకీలా మొదలయ్యే 'లాలీ లాలీ లాలీ … ' లో ఒక విలంబితస్థాయి శ్రోతల హృదయాలను ఒక చోట కుదుటపడేలా చేసి అనంతరం పల్లవి అందుకుంటూ ప్రతిపదంలో తాను పొందిన నాదానుభూతులు మనకు పంచినతీరు నవనవోన్మేషంగా ఉంటుంది. అనిమేషులు, రెప్పపాటులేని దేవతలను నిద్రపొమ్మని అడగటం ఔచిత్యం కాకున్నా సుశీల గాత్రంలో తన్మయమై… భక్తుల మాటలు భగవంతుడు వినితీరాలి అని భక్తితో, అనురక్తితో నాదోపాసన చేసిన తీరు అభినందనీయం. వాగ్గేయకారులు పవళింపుసేవలు, మేలుకొలుపులు చేసి నాదోపాసనతో తరించిన తీరు మనకు తెలుసుగా! ఇక్కడా అదే జరిగిందని అనుకోవాలి. కరిరాజముఖునికి అని రెండోసారి చేసే రాగాలాపనలో ఎంత గాత్రమాధుర్యమో! లాలిపాటల్లో ఇది వాణిముత్యంగా సుశీలకు దొరికి, ఆమె ద్వారా మనకు అందిన స్వాతిముత్యంగా యీ పాటను చెప్పుకోవచ్చు. తెలుగువారికి దొరికిన అపురూప లాలిపాట యీ పాట. రాధిక శాంతరమ్యంగా అభినయించారీ పాటలో.



గతంలో (దాదాపు 65 సం॥ క్రితం) సినిమా విడుదలైనప్పుడు, పాటలపుస్తకాలు సినిమాహాళ్లలో అమ్మేవారు. అందులో పాటలసాహిత్యం, కవి, సంగీతదర్శకుల వివరాలు సంక్షిప్తంగా సినిమాకథ, సినిమాలోని కొన్ని ఛాయాచిత్రాలు పొందుపరచేవారు. ఆ పుస్తకాలను పొదువుకొని గర్వంగా దాచుకున్న వారెందరో. కొన్ని రైల్వేస్టేషన్లలో పాటల పుస్తకాలు అమ్మేవారు. అన్నీ తప్పులే – అవి అలాగే ఆ తప్పులతోనే పాడబడేవి దురదృష్టవశాత్తూ. ఇహ ఇప్పుడు ఏ పాటకోసమైనా 'గూగుల్' లో వెదికితే, ఎవరో వారికి తెలిసిన సాహిత్యం అందులో పొందుపరచడం, ఆధునిక గాయనీగాయకులు వాటినే సెల్‌ఫోన్లలో చూస్తూ ఆ తప్పులతోనే పాడటం జరుగుతోంది. నేనుసైతం 'పాడుతాతీయగా'లో కొన్ని సందర్భాల్లో చేసిన తప్పిదాలను సరిదిద్ది, నేను తరువాతి కార్యక్రమ సంచికలో దిద్దుబాటు చేసుకోడానికి ఎంతోమంది సినీగీతపరిశోధక మిత్రులు దోహదపడుతున్నారు. కానీ ఈ సన్మిత్రులు ఎంతమందికి తెలుసు? ఎవరికి వీరిని సంప్రదించి వివరాలు తెలుసుకోవాలనే ఓపిక ఉంది? ఈ సందర్భంలో, పి.సుశీలగారు ఆలపించిన 'సోలో' పాటలను వ్యాఖ్యానిస్తూ సన్మిత్రులు డా॥ కంపల్లె రవిచంద్రన్ 'పాడనా తెనుగుపాట' అన్న ఒక అద్భుతమైన పుస్తకాన్ని తీసుకొచ్చారు. పి.సుశీలగారు ప్రతిభకు మారుపేరు. అనర్ఘమైన ఆమె స్వరం దైవదత్తమైన వరం. ఆమె పాటలోలేని సొగసు లేదు. ఆమె పాటను మెచ్చుకోని మనసులేదు. ఆమె గానం సర్వసౌభాగ్యసంపన్నం. మధుర సంగీతచరిత్రలో ఆమెది అగ్రగణ్యమైన శాశ్వతస్థానం.

ఈ పుస్తకంలో సాధ్యమైనన్ని పి.సుశీల పాడిన మంచిపాటల (1954–1984) ను పొందుపరిచారు. కేవలం సాహిత్యం మాత్రమే కాదు, పాట గురించిన విశ్లేషణ, పాటవెనుక సంగీతదర్శకుల, సాహిత్యస్రష్టల తపన, కొన్ని సందర్భాల్లో దర్శకులు పాటను చిత్రీకరించిన తీరు, గాయనీగాయకుల అంకితభావం, నిర్మాణసంస్థల వివరాలు, కొన్ని అద్భుతమైన ఛాయాచిత్రాలు వీటన్నిటి సమాహారం 'పాడనా తెనుగుపాట'. పాటకై ప్రాణంపెట్టే రవిచంద్రన్‌లాంటి వారేఈ సంకలనం చేయగలరు. వీరి కృషి తరతరాలకూ ఉపయోగపడుతుంది. పాటకు వీరు చేసిన విశ్లేషణ చదివాక, మళ్లీ ఆ దృష్టితో పాటను చూడాలి, వినాలి అన్న పిపాసను కలిగించి ధన్యులయ్యారు కంపల్లె రవిచంద్రన్.

శుభంభూయాత్

**ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం**



**డా॥కంపల్లె రవిచంద్రన్....** తెలుగు సినీ అభిమానులకు చాలా ఇష్టమైన పేరు. ఈయన రచనలు చదవడమంటే షడ్రసోపేతమైన విందు ఆరగించినట్లే. తనకంటూ ఓ పాఠక వర్గాన్ని సృష్టించుకున్న రచయిత ఈయన. 2015 సం॥లో ఉత్తమ సినీ విమర్శకుడిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ నంది పురస్కారం, 2016 సం॥లో 'నంది' అవార్డుల న్యాయనిర్ణేతలలో ఒకరిగా నంది పురస్కారం. 2016 సం॥లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నుండి అత్యున్నత 'తెలుగుభాషా దినోత్సవ పురస్కారం' అందుకున్న ఈ ప్రతిభాశాలి కలం నుండి వెలువడ్డ తాజా పుస్తకం **'పాడనా తెనుగు పాట'**.

a **Creative Links Publication,** 2018

**₹ 200/-**